ఆర్షవిద్యా తరంగిణి

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**


# MANDUKYOPANISHAD

## with Gaudapada Karikas

# మాండూక్యోపనిషత్

## గౌడపాద కారికల సహితం

స్వామి పరమార్థానంద



అయమాత్మా బ్రహ్మ

స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో

వారి ఆశీస్సులతో

తెలుగు సేత – మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ

First edition - Year 2023 Gita Jayanthi day 1000 copies

For Copies
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368

Email: raghavkasturi@gmail.com
for softcopy http://telugubhakti.com/telugupages/main.htm

Title - MANDUKYOPANISHAD

Sanskrit Support – Sri Desu Chaitanya Krishna
DTP – Sri S Rajendra Kumar 98661 15622

Printed at
Sai Sri Printers
8-3-945 # 21 Pancom Business Centre,
Ameerpet Hyderabad --500073
e-mail : saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222

Price Rs. 800

# బ్రహ్మయజ్ఞం

ఆర్ష ఆనందకుటీర్ సభ్యులు మావద్ద ఆత్మవిద్యను అధ్యయనం చేస్తూ, సాయంకాలం ఒకరింట్లో కూర్చుని మననం చేస్తూ, తాము నేర్చుకున్న జ్ఞానాన్ని నిదిధ్యాసనద్వారా జీవితంలో రంగరించుకుంటూ జ్ఞాననిష్ఠలో నిలుస్తున్నారు. వీరు ప్రతి ఏకాదశికి గీతా పారాయణం చేస్తారు. వీరంతా బ్రహ్మవిద్యమీద ఎంతో మక్కువ చూపుతూ అతిరహస్యవిద్యను బోధించే ప్రస్థాన త్రయాన్ని చక్కగా అందుకుంటున్నారు.

మాండూక్యోపనిషత్ (గౌడపాద కారికల సహితం) ప్రచురణ అనే
ఈ బ్రహ్మయజ్ఞానికి ఇతోధికంగా సహకరించిన వారు –

01 కీ॥శే॥ కావలిపురపు సూర్యకుమారి గారు
02 శ్రీ పి వి యస్ యస్ శాస్త్రి గారు
03 శ్రీమతి మల్లాది శిరీష గారు
04 శ్రీమతి ఉయ్యూరు శాయిలక్ష్మి గారు
05 శ్రీమతి రావులపర్తి రాజేశ్వరి గారు
06 శ్రీమతి ఆగేపాటి రమాదేవి గారు
07 శ్రీమతి వడ్లమాని గిరిజ గారు
08 శ్రీమతి వేములపల్లి చూడామణి గారు
09 శ్రీమతి నల్లూరి కోటేశ్వరమ్మ గారు
10 శ్రీమతి మూల ఈశ్వరి గారు
11 శ్రీ కే యస్ ఆర్ కృష్ణశాస్త్రి గారు
12 శ్రీమతి పి సీతామహాలక్ష్మి గారు
13 శ్రీమతి వల్లంకొండ ఉమారాణి గారు
14 శ్రీమతి పొదిల యమున గారు
15 శ్రీమతి గుంటక విష్ణుప్రియ గారు
16 శ్రీమతి జవ్వాజి విజయలక్ష్మి గారు
17 శ్రీమతి వాసా వరలక్ష్మి గారు
18 శ్రీ దాట్ల నారాయణ రాజు గారు
19 శ్రీమతి దాట్ల జానకి గారు
20 శ్రీమతి తురగా పద్మావతి గారు
21 శ్రీమతి తాతా కామేశ్వరి గారు
22 కుమారి తాతా భవాని గారు
23 శ్రీమతి వలిపే వరలక్ష్మి గారు
24 శ్రీమతి జె సీతామహాలక్ష్మి గారు
25 శ్రీమతి గోనెళ్ళ భారతి గారు
26 శ్రీమతి మెట్టు గంగాయమ్మ గారు
27 శ్రీమతి వి యస్ శోభావతి గారు
28 శ్రీమతి మానేపల్లి మీనాక్షి గారు
29 శ్రీమతి వెన్నం నరసమ్మ గారు
30 శ్రీమతి చక్కా వసుంధర గారు
31 శ్రీమతి ఇందిరా స్వామి గారు
32 శ్రీమతి సరళ గారు
33 శ్రీమతి కృష్ణప్రియ శ్రీనివాస్ గారు
34 శ్రీ ఎన్ ఎ పి రామమూర్తి గారు

35 శ్రీ పిరాట్ల కృష్ణకాంత్ గారు
36 శ్రీమతి కె రాధ గారు
37 శ్రీమతి ప్రాతూరి సత్యవాణి గారు
38 శ్రీ అంబటి సుబ్రహ్మణ్యం గారు
39 శ్రీమతి అంబటి ప్రసన్న లక్ష్మి గారు
40 శ్రీమతి లమ్మట ఆశారాణి గారు
41 శ్రీమతి అక్షయ శ్రీకాంత్ గారు
42 శ్రీమతి శోభ గారు
43 శ్రీమతి కొల్లి హారిక గారు
44 శ్రీమతి కొల్లి పావని గారు
45 శ్రీమతి రాధామూర్తి గారు
46 శ్రీమతి చెన్నా నిర్మల గారు
47 శ్రీమతి కందేటి రాజ్యలక్ష్మి గారు
48 శ్రీమతి ప్రజావతి రెడ్డి గారు
49 శ్రీమతి పసుమర్తి వాణి గారు
50 శ్రీమతి వై విజయలక్ష్మి గారు
51 శ్రీమతి కె కమల గారు
52 శ్రీ కైపా సుబ్రహ్మణ్య శాస్త్రి గారు
53 డా॥ బోయినేపల్లి యాదగిరి రావు గారు
54 శ్రీమతి కానాల సుమంగళి గారు
55 శ్రీ పి వి బి యన్ మూర్తి గారు
56 శ్రీ కె యల్ యన్ మూర్తి గారు
57 శ్రీమతి సుధామూర్తి గారు

కీ॥శే॥ కావలిపురపు సూర్యకుమారి గారు ఆర్ష విద్యా తరంగిణికి ఎనలేని సేవ చేశారు. సభ్యులకు స్ఫూర్తినిచ్చి స్థితప్రజ్ఞురాలిగా, ఆదర్శంగా నిలిచారు. వారు ఈ మధ్యనే సిద్ధి పొందారు. వారి లేని లోటు ఆర్ష విద్యా తరంగిణిలో మనకు స్పష్టంగా తెలుస్తోంది. వారు నెలకొల్పిన క్రమశిక్షణను పాటిస్తూ వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు పోదాం. వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, జ్ఞానప్రాప్తినివ్వమని మనసా, వాచా కోరుకుంటున్నాము.

**ఆర్ష ఆనందకుటీర్ సభ్యులు** సదా బ్రహ్మనిష్ఠలో నిలవాలని, వారి పిల్లలకూ, మనవళ్ళకూ, మనవరాళ్ళకూ ఆయురారోగ్య ఐశ్వర్యాలను, ఆధ్యాత్మిక చింతనను వైదికజీవనాన్ని మరింత సమృద్ధిగా ఇవ్వమని ఆ భగవంతుణ్ణి మరీ మరీ వేదుకుంటున్నాము.

**– రాఘవరావు, రాజ్యశ్రీ**

Swami Paramarthananda

Sriram Apartments,
80, St. Mary's Road,
Chennai - 600 018.
Phone : 2499 7459

Date : 14-10-23

Dear Raghava Rao & Rajya Sri,

Received your letter of 10-10-23. I am very happy to know that you are printing Mandukyopanishad with commentary based on my discourses. And it is all the more gratifying to know that commentaries on "Prasthanatrayam" will be completed with that.

May these books reach more and more seekers and help them discover fulfilment in life.

With Blessings
Paramarthananda

## హరిః ఓమ్

పరమ పూజనీయులైనటువంటి, మా గురువర్యులైన శ్రీశ్రీశ్రీ స్వామి పరమార్థానంద సరస్వతి వారి పాదారవిందములకు శతకోటి ప్రణామములు. స్వామివారి వేదంత బోధనలు, ప్రస్థానత్రయమైన భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు మరియు అనేక ప్రకరణ గ్రంథములపై వారి ఉపన్యాసములు ప్రపంచ విఖ్యాతి గాంచినవి. దేశవిదేశాలలో వారి ఉపన్యాసములు విని ఎందరో జిజ్ఞాసువులు, ముముక్షువులై, శాస్త్రముమీద అత్యంత భక్తిశ్రద్ధలు పెంచుకుని శ్రవణము చేయుచున్నారు, మోక్షప్రయోజనము కూడా పొందుచున్నారు.

అటువంటి మహనీయులైన స్వామివారి పలుకులను అత్యంత శ్రద్ధాభక్తితో ఆంగ్లమునుండి యథాతథంగా తెలుగుభాషలో అందించినటువంటి శ్రీ కస్తూరి రాఘవ రావు గారికి, వారి శ్రీమతి కస్తూరి రాజ్యశ్రీ గారికి హృదయపూర్వక అభినందనలు.

స్వామివారి మాండూక్యోపనిషత్తుపై అనువాదన ప్రచురించటంతో ఈ బృహత్ యజ్ఞము పరిపూర్ణతను సంతరించుకున్నది.

వారికి ఆయురారోగ్యములను ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ–

నారాయణ స్మృతులతో –

స్వామిని సత్యవ్రతానంద సరస్వతి


**అక్షర విద్యా ట్రస్ట్**

New No.15, (Old No.7/1)

**మహాలక్ష్మి వీథి, టి.నగర్, చెన్నై** - 600 017 .

# అలమ్

శ్రీమతి & శ్రీ రాజ్యశ్రీ, రాఘవరావు గార్ల దంపతుల సత్సంకల్పం, వారి బృందంయొక్క అవిరళ కృషితో ఇప్పటికే వీరు ప్రస్థానత్రయంలో భగవద్గీతను, బ్రహ్మసూత్రాల చతుస్సూత్రీని, దశోపనిషత్తులలో తొమ్మిదింటిని ఎంతో శ్రద్ధతో, శ్రమయనక సరళ తెలుగులో చూడచక్కగా ప్రచురించి, శ్రద్ధాళువులకు ఉచితముగా వితరణ గావించారు. వీరు ఇలా చేశారు అంటే... వీరిపై వేదమాత కృప, భగవాన్ వేదవ్యాసులవారి అనుగ్రహము, స్వామి పరమార్థానందగారి ఆశీర్వాదాలు పుష్కలంగా ఉన్నట్లే.

ప్రస్థానత్రయముపై చెన్నై నగరవాసియైన స్వామి పరమార్థానందగారు ఆంగ్లములో అరటిపండు వలిచిపెట్టినట్లుగా, ఒక పాఠశాల విద్యార్థి తరగతిగదిలో వ్రాసుకున్న నోటుపుస్తకంలా చేసిన ఆంగ్ల ప్రవచనాలను తెలుగువారికి పంచారు హైదరాబాదు బృందసభ్యులు. ఈ బృందానికి, వీరికి వివిధరకాలుగా సహకరించినవారికి, దాతలకు నా హృదయపూర్వక అభినందనలు.

నిత్యమూ పరుగులమీద నడిచే విశ్వనగరంలో ఉంటూ, వారివారి వృత్తి ఉద్యోగాలను చేసుకుంటూ, బరువు బాధ్యతలను మోస్తూ... తమకున్న శక్తి సామర్థ్యాలతోనే ప్రస్థానత్రయానికి ఇంత అభినందన పూర్వక సేవ చేశారంటే, అది వీరి పూర్వజన్మ సంస్కారం, సరస్వతీమాత కృపావీక్షణం.

దశోపనిషత్తులలో మాండూక్యోపనిషత్తు అన్నిటికంటే చాలా చిన్నది. కానీ చాలా నిగూఢమైనది. మంత్రాలు 12 మాత్రమే ఉన్నప్పటికీ అందులోనే ఒక వాక్యాన్ని ఇమిడ్చారు మండూకఋషి. అదే... **'అయమాత్మా బ్రహ్మ'**. ఈ మహావాక్యమే అథర్వణ వేదసారామృతం.

మాండూక్యోపనిషత్తును **అలం** అంటారు. అగ్నిని **అనలం** అంటారు. ఎందుకంటే అగ్నిలోనికి ఎంత వేసినా ఇక చాలు అనదు. అదేవిధముగా ఈ మానవుడు లౌకిక విషయాలు ఎన్ని తెలుసుకున్నా అతనికి తృప్తి ఉండదు. మానవునికి ఒక్క ఉపనిషత్తు జ్ఞానంవల్లనే పరమతృప్తి కలిగి ఇక ఈ ప్రపంచము వద్దు అంటాడు.

మౌక్తికోపనిషత్తులో సీతాదేవి హనుమంతునికి ఈ మాండూక్యోపనిషత్తును గురించి వివరిస్తూ... “108 ఉపనిషత్తులలో ఈ మాండూక్యోపనిషత్తును అర్థం చేసుకుంటే (**అలమ్**) చాలు, అంతా అర్థమైనట్లే. ఈ ఉపనిషత్తు సరిగ్గా అర్థం కాకపోతే మొదటి పది ఉపనిషత్తులను

అధ్యయనం చేయాలి, అప్పటికీ బ్రహ్మతత్త్వం సరిగ్గా అర్థం కాకపోతే మొదటి ముప్పై ఉపనిషత్తులను అధ్యయనం చేయాలి, అప్పటికీ అర్థం కాకపోతే 108 ఉపనిషత్తులను అధ్యయనం చేయాలి" అని చెప్పారు.

అందుకే త్రిమతాచార్యులైన శంకర, రామానుజ, మధ్వాచార్యులు దశోపనిషత్తులకు తమతమ సిద్ధాంతానుసారం భాష్యాలను వ్రాశారు.

12 మంత్రాలను కలిగిన మాండూక్యోపనిషత్తును మరింత బాగా అర్థం చేసుకోవడానికిగాను, శంకరాచార్యుల గురువుగారైన గోవిందపాదాచార్యులవారి గురువుగారు **'గౌడపాదాచార్యులవారు'** ఈ మాండూక్యోపనిషత్తునకు 4 అధ్యాయాలుగా 218 కారికలను రచించారు. అందరూ వీనిని **మాండూక్య కారికలు** అంటారు.

శ్రద్ధాళువులు ఈ గ్రంథములోని మహావాక్యాన్ని అర్థం చేసుకుని, మననంచేసి, కనిపించే ఈ ప్రపంచం మిథ్య అని దృఢపరచుకుని, ధ్యానాభ్యాసం చేసి, ఆత్మానుభవాన్ని సదా గుర్తుంచుకుంటారని ఆశిస్తూ...

**స్వామి సత్యాత్మానంద**
చిన్మయ మిషన్, ఒంగోలు సేవకులు

# శుభసమ్మతి

స్వామీ పరమార్థానందగారు ఇచ్చిన ప్రస్థానత్రయ ప్రసంగాలను రాజ్యశ్రీగారు తెలుగు గ్రంథరూపములో అనువదించారు. వారి ఆంగ్లేయ ప్రసంగాలు అతి సరళముగా మరియు తేలికగా హృదయానికి హత్తుకునేటట్లు ఉంటాయి. వాటిని తెలుగు వారి సౌలభ్యమునకు రాజ్యశ్రీగారు అనువదించారు. వాటిని ముద్రణ గూడ వారి భర్తగారు చేయించారు.

వీటిలో ఆఖరిది మాండూక్యకారిక. దీనిలో పన్నెండు మంత్రాలే ఉన్నాయి కాని వీటి వ్యాఖ్య గౌడపాదాచార్యులవారు కారిక రూపములో వ్రాసినారు. జ్ఞానము దాని ద్వారా ముక్తికి ఈ మాండుక్యకారిక ఒకటే చాలు.

**"మాండూక్యమేవాలం ముముక్షూణాం విముక్తయే"**

కప్పుగంతులుగా జాగ్రత్తునుండి స్వప్నమునకు అచటినుండి సుషుప్తికి అక్కడ నుండి తురీయ ఆత్మని చేరుట దీనిలోని ముఖ్యసారము. ఈ విధముగా అవస్థల చింతన చేసి తురీయ ఆత్మను బ్రహ్మముగా అనుభవించనివారికి క్రమముక్తి కలుగును. కాని ఈ అవస్థలు అధిష్ఠాన ఆత్మయందు కల్పించబడినవి, జగత్తు మిథ్య. ఈ సంపూర్ణ జగత్తునకు నేనే ఆత్మరూపముగా అధిష్ఠానమును అని తెలుసుకొనిన వారికి సద్యోముక్తి. ఇచటనే ఈ శరీరములో ఉండగనే జీవన్ముక్తి కలుగును. ఈ అర్థమునే ఈ క్రింది **"అయమాత్మా బ్రహ్మ"** అను మహావాక్యము ద్వారా చెప్పిరి.

ఒక వస్తువును చూసిన దాని సంస్కారము మనసులో ఏర్పడును. తరువాత దాని స్మృతి కలుగును. ఈ రెండిటికి ద్రష్టయే ఆత్మ. అదే మన అనుభవములో నున్న మూడు అవస్థలకు సాక్షిచైతన్యము. ఈ ఉపనిషత్తు చింతన ద్వారా మనలో బ్రహ్మాకారవృత్తి ఏర్పడి జ్ఞానము కలుగును.

శ్రీ పరమార్థానందస్వామివారికి ఆయురారోగ్యములు ప్రసాదించుమని ఈశ్వరుని ప్రార్థించుచున్నాను. ఈ పుస్తకమును తెలుగువారికి అందించిన శ్రీ కే వి ఆర్ రావు గారికి, వారి భార్య శ్రీమతి రాజ్యశ్రీ గారికి ఆయురారోగ్యములు ఇచ్చి ఇలాంటి సత్కార్యములు ఇంకా వారిచే చేయించాలని పరమాత్మను ప్రార్థిస్తూ –

మీ స్వామి
**మేధానంద పురి**
**కైలాస ఆశ్రమము**
**ఋషీకేశ్**

# శాస్త్రమే ఆయన ఊపిరి

అభ్యసించారు వేదాంతవిద్యను మూడు వత్సరాలు సాందీపనిలో
బోధించారు తిరిగి సంస్కృతంలో కూడా అటువంటి మరొక కోర్సులో
కొనియాడారు పూజ్యస్వామీజీని దయానందరూపం మదాచార్యమీడేగా
స్తుతించారు గురువైన చిన్మయానంద స్వామిని ఆచార్య దేవోభవగా
కురిపిస్తూనే ఉన్నారు అద్వైతామృతవర్షిణిని చెన్నైలో నాలుగు దశాబ్దాలుగా
ఖ్యాతి పొందుతున్నారు దిగదిగంతాలలో అద్వైతగురువుగా తనదైన ప్రత్యేక శైలిలో
నిలుస్తున్నారు శాస్త్రానికి ప్రతీకగా శాస్త్రమే ఆయన ఊపిరిగా చేసుకుని

**– అనన్య గురువు, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ, స్వామి పరమార్థానందజీ.**

**బోధన వివరాలు –**

వేదాంత విద్యార్థి సంఘ ట్రస్ట్‌ను స్థాపించి, తద్వారా చెన్నై నగరంలో గత నాలుగు దశాబ్దాలుగా నిరాటంకంగా, నిర్విరామంగా, అలుపెరుగకుండా అద్వైతబోధను ఆంగ్లంలో చేస్తూనే ఉన్నారు.

భగవద్గీతను, ఉపనిషత్తులను, బ్రహ్మసూత్రములను, అనేక ప్రకరణ గ్రంథాలను ఒకసారి కాదు, రెండు మూడుసార్లు బోధిస్తూనే ఉన్నారు. అద్వైత వేదాంతాన్ని ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాలు, సమర్థవంతమైన గురువు దగ్గర శ్రవణం చేయాలి అని పదేపదే చెబుతారు. అలా ఒక క్రమపద్ధతిలో అద్వైత వేదాంతాన్ని బోధించుకు వస్తున్నారు. ముందు అద్వైత వేదాంత పరిచయం, తత్త్వబోధ బోధించి, భగవద్గీత బోధించి, దశ ఉపనిషత్తులను (ఉపనిషత్తుల బోధకు కూడా ఒక వరుసక్రమం ఉంది) బోధించి, మొత్తం 555 బ్రహ్మసూత్రములనూ బోధించారు. ఇంత చేస్తున్నా చాలా నిగర్వి, నిరాడంబరజీవి. సోషల్ మీడియాకి రావటానికి సుతరామూ ఇష్టపడరు.

**గురువులమీద భక్తి శ్రద్ధలు –**

పరమార్థానంద స్వామీజీ తమ ఆశ్రమ జీవన విధానాన్ని వర్ణిస్తున్నప్పుడు చిన్మయానంద స్వామీజీ వారిని తండ్రిలా చూసుకుంటే, పూజ్యస్వామీజీ వారి అవసరాలను, వారి ఆలనాపాలనలను తల్లిలా చూసుకునేవారు అని చెబుతారు. అక్కడి విద్యార్థులకు అన్ని రంగాలనుంచీ వైద్యులను పిలిపించి, వారి ఆరోగ్య పరిరక్షణ చేయిస్తూ కూడా, సైకియాట్రిస్ట్‌ను పిలవలేదు. ఎందుకంటే ఆ అంశాన్ని పూజ్య స్వామీజీయే స్వయంగా చూసుకునేవారు. అదే విధంగా చిన్మయానంద స్వామీజీ ఏంచేసినా చాలా శ్రద్ధగా, ఒక తపస్సుగా చేస్తారని స్వామీజీ చెబుతుంటారు. చిన్మయానంద స్వామీజీ ఏదైనా పని చేసేటప్పుడు చూసితీరాలి.

అలా వారి ఆచరణలతో ప్రభావితులైతే, ఆ గురువులిద్దరి బోధను స్వామీజీ తన బోధలో ఎంతగా మలుచుకున్నారో చెప్పలేము. తమ గురువుల ప్రస్తావన రాకుండా ఉండదు ఆయన బోధలో. ఇద్దరు గురువులు చెప్పిన దృష్టాంతాలను, కథలను, హాస్యగుళికలను, వారి ప్రత్యేక వాక్యాలను నొక్కివక్కాణిస్తూనే ఉంటారు.

**బోధనా శైలి –**

1. ఉపనిషత్తు గురుశిష్యుల సంవాదంగా సాగుతుంది. స్వామీజీ కూడా అడుగడుగునా ప్రశ్నలు వేస్తూ, దీనికి జవాబులు చెబుతూ వస్తారు.

2. అలా ప్రశ్నలు వేస్తున్నప్పుడు, మనలో రేగే సంశయాలను ఆయనే ఊహించుకుని చెబుతారు. ఒక్కోసారి ఇక్కడ మీకు అనుమానం రావాలి. రాకపోతే నేనే మీకు సంశయం కలిగిస్తా అని చెప్పి మరీ ప్రశ్నలు వేస్తారు.

3. ఒక విషయం చెబుతున్నప్పుడు, అది ఇలా చెప్పాలి, అలా చెప్పకూడదు అని చెబుతారు. కార్యం లేకపోతే కారణత్వం లేదు (కారణం లేదు అనకూడదు).

4. ఏవిద్య నేర్చుకోవాలన్నా కూడా శిష్యుడు నాకు తెలుసు అనుకోకూడదు. అలాగే గురువు శిష్యునికి తెలుసు అనుకోకూడదు. పరమార్థానంద స్వామీజీ ఈ సూత్రానికి ప్రతీక. ఏదీ మనకు తెలుసులే అనుకుని వదిలేయరు.

5. కొన్ని కాన్సెప్టులు మనలో జీర్ణించుకుపోయేలా చూస్తారు. అధ్యారోప అపవాదం, కార్యకారణ సంబంధం, పంచకోశ వివేకం, అవస్థాత్రయ సాక్షీ, శరీరత్రయ విలక్షణం లాంటి కాన్సెప్టులు చక్కగా స్పష్టంగా అర్థమయిపోతాయి. అలాగే బంగారం, మట్టి, నీరు, కాంతుల తత్త్వాలను వివరించటం ద్వారా ఆత్మతత్త్వం గురించిన సంశయరహిత జ్ఞానం కలుగజేస్తారు.

6. ఒక విషయం గురించి 5, 6 అంశాలు చెప్పాల్సి ఉంటే ముందు వాటి పేర్లు చెప్పేసి, నేను మళ్ళీ వివరంగా చెప్తాను, ఖంగారు పడకండి అంటారు. మళ్ళీ ఆ అంశాలను విడమర్చి చెప్పేటప్పుడు మూడు అంశాలు చెప్పి, మళ్ళీ వెనక్కి వెళ్ళి మళ్ళీ ముందుకొచ్చి, అంతా అయ్యాక మళ్ళీ ఒకసారి చెబుతారు.

7. ముందు రోజు చెప్పిన పాఠాన్ని సరిగ్గా పదినిముషాల్లో మళ్ళీ టూకీగా చెబుతారు.

8. తన బోధ నుంచి కొంచెం కూడా పక్కకు వెళ్ళరు. విషయం మర్చిపోయి, అప్రస్తుతమైన విషయాల గురించి మాట్లాడరు. కాని కాన్సెప్ట అర్థమవటానికి మర్చిపోలేని, మరపురాని, మహా గొప్ప ఉదాహరణలను ఇస్తారు.

**వ్యక్తిత్వ వికాశం–**

స్వామీజీ చెన్నైలో బోధిస్తున్నప్పుడు నిశ్శబ్దంగా ఒకవైపునుంచి వచ్చి, క్లాసు అయ్యాక, అంతే నిశ్శబ్దంగా వెళ్ళిపోయేవారు. చుట్టూ మనుష్యులు గుమిగూడటంలాంటి ఆర్భాటాలు ఏమీ లేవు. అది ఎంతో నచ్చింది మాకు. స్వామీజీ ఇంటి దగ్గర కూడా మనుష్యుల తాకిడి లేదు. మేము స్వామీజీ ఇంటికి వెళ్ళినప్పుడు స్వామీజీయే స్వయంగా వచ్చి తలుపు తీశారు. తన గదిలోకి తీసుకువెళ్ళారు. ఒక చెక్కమంచంమీద సన్నపరుపు వేసి ఉంది అంతే. దానిమీద ల్యాప్‌టాప్ పెట్టుకుని తన బోధనలను ఎడిట్ చేసుకుంటున్నారు. ఆయన తన మంచంమీద కూర్చుని, కింద చాపమీద కూర్చోగలరా, లేకపోతే హాల్లో కుర్చీ ఉంది, కుర్చీ తెచ్చుకుంటారా అన్నారు. ఎంతో ఆదరంగా మాట్లాడారు మాతో.

**ప్రస్థానత్రయం –**

స్వామీజీ చెప్పినది ఏది విన్నా దానికి అక్షరరూపం ఇవ్వాలని ఉత్సాహం ఉరకలు వేస్తుండేది. స్వామీజీని కలిసిన కొత్తల్లో, 'స్వామీజీ,ఈ చిన్ని మెదడులో ఎన్నో పెద్ద ప్రణాళికలు ఉన్నాయి, భగవద్గీత వింటే అది రాయాలనిపిస్తుంది; బ్రహ్మసూత్రాలు వింటే అవి రాయాలనిపిస్తుంది; మీరు విడమర్చి చెప్పే ఉపనిషత్తులు వింటే అవి రాయాలనిపిస్తుంది,' అంటే రెండుచేతులూ పైకెత్తి మనసారా దీవించారు. 'అన్నీ రాస్తావు, అన్నీ అక్షరరూపం దాలుస్తాయి,' అన్నారు.

సత్యవ్రతానంద సరస్వతి స్వామినితో స్వామీజీ మమల్ని ఇలా దీవించారంటే, 'స్వామీజీ దీవించారంటే అక్షరాలా జరిగితీరుతుంది,' అన్నారు. స్వామీజీ ఆశీస్సులు ఫలించాయి. **ప్రస్థానత్రయ గ్రంథరాజాలు తెటతెనుగులో ప్రచురించగలిగాము.**

**శాస్త్రమే ఆయన ఊపిరి–**

**జీవితపరమార్థం పరమార్థానందస్వామి శాస్త్రంలోంచి రంగరించి పోశారు.** అదీ ఆయన గొప్పతనం. ఆయనే ఒకసారి చెప్పారు గురువు తలమీద మీట నొక్కితే శాస్త్రం వస్తుందని. అది పరమార్థానంద స్వామి విషయంలో అక్షరసత్యం. ఆయన ప్రమేయం లేకుండానే శాస్త్రం దూసుకు వచ్చేస్తుంది. అందువల్లనే మేము మాకేదైనా సందేశమివ్వండి అంటే **"ఫాలో ది శాస్త్ర"** అన్నారు.

**అహెూ శాస్త్రమహెూ శాస్త్రమహెూ గురురహెూ గురుః**
**అహెూ జ్ఞానమహెూ జ్ఞానమహెూ సుఖమహెూ సుఖమ్–పంచదశీ 7–297**

**– మద్దూరి రాజ్యశ్రీ**

# అజాతివాదము సత్యము

**నాస్త్యసద్ధేతుకమసత్సదసద్ధేతుకం తథా ।**
**సచ్చ సద్ధేతుకం నాస్తి సద్ధేతుకమసత్కుతః ॥ –** కారిక 4.40

ఈ కారికల్లో గౌడపాదాచార్యులవారు నిరూపించదలుచుకున్న విషయం – **అహం సత్యం, జగత్ మిథ్యా.** ఈ జ్ఞానం పొందితే మిథ్యా జగత్తులో ఏం జరిగినా, సత్య అధిష్ఠానమైన నన్ను బాధించదు. దీన్నే జీవన్ముక్తి అంటారు.

**గౌడపాదాచార్యులవారిది అజాతివాదము.** జాగ్రత్, స్వప్నప్రపంచాలు రెండూ మిథ్య. ఇంకో విధంగా చెప్పాలంటే, జగత్తు ఆత్యంతిక సత్యం కాదు, ఆపేక్షిక సత్యం మాత్రమే. జగత్తు ఆపేక్షిక సత్యం అంటే నిజం జగత్తు బ్రహ్మనుంచి రాలేదని అర్థం.

**మిథ్యాజగత్తు పుట్టింది అన్నా, నిజం జగత్తు పుట్టలేదు అన్నా ఒకటే**

మిథ్యాజగత్తు పుట్టింది అంటే అది మిథ్యా సృష్టివాదము అవుతుంది. నిజం జగత్తు పుట్టలేదు అంటే అది అజాతివాదము అవుతుంది. పేరేదైనా అర్థం ఒకటే.

బ్రహ్మ నిజం జగత్తును పుట్టించలేదు కాబట్టి బ్రహ్మకూ–జగత్తుకూ మధ్య కారణ–కార్య సంబంధం గురించి మాట్లాడలేము. కాని గౌడపాదాచార్యులవారు తనదైన బాణీలో ఈ విషయాన్ని చెబుతున్నారు.

ఎ) అసత్ వస్తువు అసత్ వస్తువును పుట్టించలేదు
బి) అసత్ వస్తువు సత్ వస్తువును పుట్టించలేదు
సి) సత్ వస్తువు సత్ వస్తువును పుట్టించలేదు
డి) సత్ వస్తువు అసత్ వస్తువును పుట్టించలేదు

ఈ వాదనలను ఒక్కొక్కటిగా చూద్దాము.

ఎ) **అసత్ వస్తువు అసత్ వస్తువును పుట్టించలేదు** – ఉనికిలేని వస్తువు, ఉనికిలేని వస్తువును పుట్టించలేదు. మనిషి కొమ్ము, కుందేటికొమ్మును పుట్టించలేదు. కుందేటికొమ్ముదాకా ఎందుకు, మనిషి కొమ్ము అసలు దేన్నీ పుట్టించలేదు. ఉనికిలేని వస్తువు ఇంకొక ఉనికిలేని వస్తువును ఎలా పుట్టిస్తుంది?

బి) **అసత్ వస్తువు సత్ వస్తువును పుట్టించలేదు** – ఉనికి లేని వస్తువు ఉనికి ఉన్న వస్తువును పుట్టించలేదు. అలా ఉనికి లేని వస్తువునుంచి కొత్త వస్తువులు వస్తాయంటే ఎంత బాగుంటుంది? ముడిసరుకులు లేకుండా ఇల్లు కట్టేయవచ్చు; కూరలు లేకుండా వంట చేసేయవచ్చు. అలా కుదరదు కాబట్టి, ఈ మార్గం కూడా సాధ్యం కాదు.

సి) **సత్ వస్తువు సత్ వస్తువును పుట్టించలేదు** – ఉనికి ఉన్న వస్తువు ఉనికి ఉన్న వస్తువును పుట్టించలేదు. ఈ వాదనను అంత తేలికగా ఒప్పుకోలేము. ఎందుకంటే ఉనికి ఉన్న మట్టినుంచి, ఉనికి ఉన్న కుండ పుడుతుంది కదా అనుకుంటాము. వాటి మధ్య కారణ–కార్య సంబంధాన్ని కూడా చూస్తాము.

కాని కుండ–మట్టిని లోతుగా విశ్లేషిస్తే నిజంగా వాటి మధ్య అటువంటి సంబంధం లేదని తెలుస్తుంది. కుండ–మట్టిల మధ్య కారణ–కార్య సంబంధం ఉండాలి అంటే అవి రెండు భిన్నవస్తువులై ఉండాలి. కాని లోతుగా ఆలోచిస్తే అవి రెండు భిన్నవస్తువులు కావు. ఒకటే పదార్థానికి ఇచ్చిన రెండు భిన్న పేర్లు. వాటిమధ్య కాలభేదం, రూపభేదం, అవస్థాభేదం ఉన్నాయి కాని, నిజానికి వస్తుభేదం లేదు. అందువల్ల గౌడపాదాచార్యులవారు సత్ వస్తువు సత్ వస్తువును పుట్టించలేదు అంటారు.

డి) **సత్ వస్తువు అసత్ వస్తువును పుట్టించలేదు** – ఉనికి ఉన్న వస్తువు, ఉనికి లేని వస్తువును పుట్టించలేదు. అసత్ వస్తువు పుట్టిందని వ్యాకరణపరంగా నిరూపించలేము. పుట్టింది అనే క్రియా పదానికి ఏం పుట్టింది అనే ప్రశ్నవేస్తే జవాబు లేదు. అందువల్ల సత్ వస్తువు అసత్ వస్తువును పుట్టిస్తుంది అని కూడా చెప్పలేము.

ఈ వాదనల సారాంశం – అసలు ఏదీ పుట్టలేదు. సృష్టే నిజంగా జరగలేదు. మరయితే మన కళ్ళ ఎదురుగా కనిపిస్తున్న ఈ జగత్తు మాటేమిటి? అంతకుముందు, ఇప్పుడు, ఇకముందూ కూడా ఉన్నది బ్రహ్మ మాత్రమే. అజ్ఞానంవల్ల జగత్తు అనుకుంటున్నాము అంతే.

అజ్ఞానికి ఏదైతే పాముగా కనబడుతుందో, అదే జ్ఞానికి తాడుగా అర్థమవుతుంది. అదే విధంగా అజ్ఞానికి ఏదైతే జగత్తుగా కనబడుతుందో, అదే జ్ఞానికి బ్రహ్మగా అర్థమవుతుంది. అంటే ఇక్కడ రెండు దృష్టులు ఉన్నాయి – జ్ఞానదృష్టి, అజ్ఞానదృష్టి. అంతేకాని నిజంగా జగత్తు లేదు. మరయితే 'నేనేం చేయాలి?' అని మీరడిగితే, మీ దృష్టిని మార్చుకోవాలి. 'దృష్టిని ఎలా మార్చుకోవాలి?' మాండూక్యోపనిషత్తును చివరిదాకా నేర్చుకోవాలి.

**అజాతివాదము సత్యము.** అలా ఎలా చెప్పగలరు అని గౌడపాదాచార్యులవారిని అడిగితే, 'ఇది నా స్వంతం కాదు, మాండూక్యోపనిషత్తు చేస్తున్న బోధే ఇది. కావాలంటే ప్రపంచోపశమమ్ పదం చూడండి,' అంటారు. ఎందుకంటే ఆయన కారికలకు మూలమే ఆ పదం.

**– మద్దూరి రాజ్యశ్రీ**

# ప్రస్థానత్రయం - ఒక విహంగ వీక్షణం

**1. భగవద్గీత** - స్మృతి ప్రస్థానం
**2. ఉపనిషత్తులు** - శ్రుతి ప్రస్థానం
**3. బ్రహ్మసూత్రములు** - న్యాయ ప్రస్థానం

### 1. భగవద్గీత - స్మృతి ప్రస్థానం

భగవద్గీతను ప్రధానంగా మూడు షట్కాలుగా విభజించవచ్చు.

1. **మొదటి షట్కము - అధ్యాయాలు 01-06 - కర్మయోగసాధన**
2. **రెండవ షట్కము - అధ్యాయాలు 07-12 - ఉపాసనయోగసాధన**
3. **మూడవ షట్కము - అధ్యాయాలు 13-18 - జ్ఞానయోగము**

### 1. మొదటి షట్కము - అధ్యాయాలు 01-06 - కర్మయోగసాధన

ఎ) జీవస్వరూపం = జీవుడు = ఆత్మ+అనాత్మ. అనాత్మతో మమేకం చెందకుండా తను ఆత్మ అని అర్థం చేసుకోవాలి.

బి) కర్మయోగం = ఈశ్వరార్పణబుద్ధితో కర్మ + ఈశ్వరప్రసాదబుద్ధితో కర్మఫలం

సి) పురుషప్రయత్నం = ఫ్రీవిల్ ఉపయోగించి మోక్షాన్ని ఎన్నుకోవాలి. భగవంతునిమీద పూర్తి భారం వేయకూడదు.

### 2. రెండవ షట్కము - అధ్యాయాలు 07-12 - ఉపాసనయోగసాధన

ఎ) ఈశ్వర స్వరూపం= ఈశ్వరుడు = సగుణబ్రహ్మ+ నిర్గుణబ్రహ్మ
సగుణబ్రహ్మతో మమేకం చెందకుండా నిర్గుణబ్రహ్మ జ్ఞానం పొందాలి.

బి) ఉపాసన యోగం= సగుణబ్రహ్మ ఉపాసన చేస్తే క్రమముక్తి.
నిర్గుణబ్రహ్మ జ్ఞానం పొందాలి.

సి) ఈశ్వరకృప = అంతా నేనే చేస్తున్నాను అనుకోకూడదు.
విజయరహస్యం = ఈశ్వరుని కృప + ఫ్రీవిల్

### 3. మూడవ షట్కము - అధ్యాయాలు 13-18 - జ్ఞానయోగము

ఎ) జీవేశ్వర ఐక్యం = అధిష్ఠానమైన చైతన్యం దృష్ట్యా జీవ ఈశ్వర ఐక్య బోధ

బి) జ్ఞానయోగసాధన = శాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు - సమర్థుడైన గురువు ద్వారా

సి) విలువలు = ధార్మిక జీవనం లేకపోతే మనస్సు సిద్ధంగా ఉండదు.
అందువల్ల అమానిత్వం, అదంభిత్వం, అహింస విలువలను పెంపొందించుకోవాలి.

## 2. ఉపనిషత్తులు – శ్రుతి ప్రస్థానం

**ఏకాదశ ఉపనిషత్తుల సారం** – అన్ని ఉపనిషత్తుల సారం ఒకటే! **బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా, జీవో బ్రహ్మైవ నాపరః.** దీన్ని గతి సామాన్యదర్శనం అంటారు. అంటే భిన్నత్వంలో ఏకత్వం చూస్తాము. ఏకాదశ ఉపనిషత్తుల సారం లోతులు కొలిచిన కొద్దీ, ఏకత్వంలో భిన్నత్వం కూడా తెలుస్తుంది. అన్ని ఉపనిషత్తులూ నేర్పించేది ఒకటే అయినా, దేని ప్రత్యేకత దానిదే!

| | | |
|---|---|---|
| ముండకోపనిషత్ | – | ఏకం, నిత్యం, సారం, సత్యం – కారణబ్రహ్మ<br>అనేకం, అనిత్యం, అసారం, అసత్యం – కార్యబ్రహ్మ |
| కఠోపనిషత్ | – | ఆత్మ నిర్వచనాలు ఎన్నో వస్తాయి – ఆత్మ నిత్యం, సత్యం, సర్వవ్యాపకం, అకర్తా, అభోక్తా, నిర్వికారం, అసంగం |
| కేనోపనిషత్ | – | పదాల గారడీలతో ఆత్మ అర్థం అయిందంటే అర్థం కాలేదని అర్థం, ఎందుకంటే ఆత్మ ఆబ్జెక్టు కాదు అని బోధిస్తుంది. |
| కైవల్యోపనిషత్ | – | ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి నేనే సృష్టి, స్థితి, లయ కారకుడనని చెప్పగలుగుతాడు. |
| ప్రశ్నోపనిషత్ | – | సూక్ష్మశరీరంలోని 19 అంగాల విశ్లేషణ, షోడశకళా పురుషుని వివరణ |
| మాండూక్యోపనిషత్ | – | **అజాతి వాదము సత్యము** – నిజంగా సృష్టి జరగలేదు. అయమాత్మా బ్రహ్మ ద్వారా చతుష్పాద ఆత్మను చతుర్మాత్ర ఓంకారంతో పోల్చి చెబుతుంది. |
| ఐతరేయోపనిషత్ | – | ప్రజ్ఞానం బ్రహ్మ మహావాక్యం ద్వారా సర్వం బ్రహ్మమయం జగత్ అని నిరూపిస్తుంది. |
| తైత్తిరీయోపనిషత్ | – | సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ – స్వరూపలక్షణం.<br>ఈ జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కారణం బ్రహ్మ – తటస్థలక్షణం. |
| ఛాందోగ్యోపనిషత్ | – | త్రీణిరూపాణిత్యేవ సత్యం ద్వారా కార్యంనుంచి కారణానికి ఎలా వెళ్ళాలో నేర్పిస్తుంది. తత్త్వమసిలో నిలబడటానికి అనేక దృష్టాంతాలను ఇస్తుంది. |
| బృహదారణ్యకోపనిషత్ | – | బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా ఎలాగో అనేక కోణాల్లో చూపించి, అహం బ్రహ్మ అస్మిలో నిలబెడుతుంది. |
| ఈశావాస్యోపనిషత్ | – | పరస్పర విరుద్ధపదాలతో సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ వర్ణనలను చేస్తుంది. |

## 3. బ్రహ్మసూత్రములు – న్యాయ ప్రస్థానం

### చతుస్సూత్రీ సారం

బ్రహ్మసూత్రములలోని మొదటి నాలుగు సూత్రములను చతుస్సూత్రీ అంటారు.

**సూత్రం 1 – అథాతో బ్రహ్మజిజ్ఞాసా**

సాధన చతుష్టయ సంపత్తి పొందాక, జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది కాని కర్మవల్ల రాదు కాబట్టి, బ్రహ్మజ్ఞానం పొందటంకోసం వేదాంతశాస్త్ర శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి తీరాలి.

**సూత్రం 2 – జన్మాద్యస్య యతః**

ఏ అభిన్న నిమిత్త ఉపాదాన కారణంనుంచి, ఆనందస్వరూపంనుంచి, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడునుంచి ఈ ప్రపంచంయొక్క సృష్టి స్థితి లయ జరిగిందో, ఆయన బ్రహ్మ.

**సూత్రం 3 – శాస్త్రయోనిత్వాత్ – పూర్తి అర్థం – 1**

శాస్త్రంయొక్క సృష్టికర్త కాబట్టి బ్రహ్మ సర్వజ్ఞుడు.

శాస్త్రస్య యోనిః కర్తా బ్రహ్మ – తత్పురుష సమాసం

బ్రహ్మ శాస్త్రంయొక్క కర్త

శాస్త్రయోనిత్వాత్ – పూర్తి అర్థం – 2

బ్రహ్మ న అనుమానవిషయః శాస్త్రవిషయత్వాత్

బ్రహ్మను అనుమాన ప్రమాణంద్వారా తెలుసుకోలేము.

శాస్త్రంద్వారానే తెలుసుకోగలము.

శాస్త్రం యోనిః ప్రమాణం యస్య – బహువ్రీహి సమాసం

శాస్త్రమును ప్రమాణంగా కలవాడు బ్రహ్మ

**సూత్రం 4 – తత్తు సమన్వయాత్**

బ్రహ్మ వేదాంతశాస్త్రానికి చెందిన జ్ఞానభాగంయొక్క విషయవస్తువు అని సమన్వయంవల్ల చెప్పగలము.

తత్ – తత్ బ్రహ్మ శాస్త్రయోని = ఆ బ్రహ్మ శాస్త్రంయొక్క తాత్పర్య విషయం. తు = బ్రహ్మ మాత్రమే వేదాంతంయొక్క తాత్పర్యవిషయం. కర్మ, ఉపాసన ఏవీకావు.

# రాజీ జీవితంలో ఒక మైలు రాయి

నిజంగా ఎన్ని జన్మల పుణ్యఫలమో స్వామి పరమార్థానందవారు మనకు గురువుగా లభించడం. స్వామీజీ **మోక్షం ఇక్కడే ఇప్పుడే** అని మాటిమాటికి చాటి చెప్పడమే కాకుండా అక్షరాలా నిశ్చయజ్ఞానాన్ని కలుగజేసి జీవన్ముక్తిని చవిచూపిస్తారు. పరమార్థానంద స్వామీజీ బోధించని వేదాంత గ్రంథము లేదనే చెప్పవచ్చు. వీరి ప్రసంగాలు అన్నీ పరిగణిస్తే వేలకొలది గంటలు ఉన్నాయి. బహుశః ఈ అంశము గిన్నీస్ బుక్‌లో రికార్డు చేయదగినది.

అలనాటి పుస్తకప్రచురణ సంస్థ ఎమెస్కో వ్యవస్థాపకులు, ఎం ఎస్ రావ్ గారి ముద్దు బిడ్డ **మద్దూరి రాజ్యశ్రీ**. బి.ఏ.లో తెలుగులో గోల్డు మెడల్ గ్రహీత, దానికి తోడు ఎమ్మే ఇంగ్లీషు ప్రెసిడెన్సీ కాలేజీ చెన్నై నుంచి. అటు ఇంగ్లీషులో, ఇటు తెలుగులో సవ్యసాచిలా అనువాదాలు, స్వంత రచనలు 65 పైనే చేసింది. వారి సంస్థలో వందలాది నవలలకు బ్యాక్‌కవర్ పేజీమేటర్ రాసింది. www.telugubhakti.com, https://arshaavinash.in, కౌముదిలో, ఎన్నో రచనలు ప్రచురించబడ్డాయి.

మంతెన సత్యనారాయణరాజుగారి నాచురోపతి పుస్తకాలు ఇంగ్లీషులోకి అనువదించింది. వారు **అనువాద సరస్వతి** బిరుదుతో మొమెంటో బహుకరించారు. పుస్తకప్రపంచములో, శ్రీపీఠములో, ఆంధ్రభూమి వార్తాపత్రికలో, అనేక శీర్షికలు నిర్వహించింది. అందులో కొన్ని ముఖ్యమైనవి – ఎక్కాలే అక్కరలేని లెక్కలు, ఆలిస్ ఇన్ వండర్ లాండ్, మానవీయ విలువలు, యువగీత, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ త్రూ గీత, ఆధ్యాత్మిక కథలు.

రాజీ అనువాదాలు చాలా సరళమైన రీతిలో, అందరికీ అర్థమయ్యే భాషలో, తెలుగు నానుడితో, ఒరిజనల్‌కు ధీటుగా ఉంటూ ఇంకా ఇంకా చదివింపచేస్తాయి. జైకో పబ్లిషింగ్ హౌస్ వారికి, మంజుల్ పబ్లిషింగ్ హౌస్ వారికి 23 పుస్తకాలు ఇంగ్లీషునుంచి తెలుగుకు అనువాదాలు చేసింది. రాబిన్ శర్మ సెల్ఫ్ హెల్ప్ మెనేజ్‌మెంటు పుస్తకాలు, వేదగణితం, రామాయణం, చాణక్య అర్థశాస్త్రం, షేక్స్‌పియర్ కథలు, పాజిటివ్ థింకింగ్ ఇలా ఎన్నో పుస్తకాలు అనువదించింది. ఇంటరు విద్యార్థులకు వీలుగా వినూత్న పద్ధతులతో **ఏప్ట్ ఇంగ్లీషు గ్రామర్** అని ఆమె పుస్తకం ప్రచురితమైంది.

ముందు ఎస్పీ ఎమ్ హెచ్ కళాశాల, మచిలీపట్నంలో లెక్చరర్‌గా; తరువాత నాగార్జునా జూనియర్ కాలేజీ హైదరాబాద్‌లో ముప్పయి సంవత్సరాలు ఇంగ్లీషు హెడ్‌గా పనిచేసింది. ఇంటర్వ్యూలో యూనివర్సిటీనుంచి వచ్చిన సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ ఈమె మీకు మంచి ఎస్సెట్ అవుతుందన్నారుట. అక్షరాలా అది నిజమని వారి కరస్పాండెంట్ కమ్ ప్రిన్స్‌పాల్ జగన్మోహన

రెడ్డిగారు తరచూ చెప్పేవారు. కాలేజీలో అజాతశత్రువుగా అందరికీ తలలో నాలుకలా వ్యవహరించింది.

ఇక టీచింగ్‌లో తనదైన నవ్యతతో, ఛలోక్తులతో, భాషమీద మంచి పట్టుతో విద్యార్థులను ఆకట్టుకునే విధంగా పాఠం చెప్పేది. ఒక మంచి లెక్చరర్‌గా విద్యార్థుల మనసులలో నిలిచిపోయింది. దానికి తార్కాణం ఎం ఎస్ టీమ్స్‌లో బోధించిన మాండూక్యోపనిషత్, బ్రహ్మసూత్రాలు కూడా. ఇంతవరకు అపజయం చవిచూడని తను మాండూక్యోపనిషత్, బ్రహ్మసూత్రాలు చెప్పడంలో, అపజయాన్ని ఎదురుచూడాల్సి వస్తుందేమోనని శంకించాను. తన సామర్థం శంకించికాదు. వీటిని అర్థం చేసుకోవటానికి చాలా తార్కికమైన సూక్ష్మబుద్ధి ఉండాలి. కాని మాండూక్యోపనిషత్తును ఎన్నో పట్టికల ద్వారా వివరించి, తురీయానికి తొమ్మిది మెట్లు ఎక్కించేసింది.

బ్రహ్మసూత్రాల్లో అనేక వాదోపవాదాలు ఉంటాయి. చివరిరోజు 45 మంది సభ్యులతో, సూత్రధారి, పూర్వపక్షి, సిద్ధాంతుల పాత్రలతో నాటకీయంగా ఒక చిన్న ప్రదర్శన కూడ చేయించింది. రాజీకి అంత రసవత్తరంగా చెప్పగలిగిన సామర్థ్యం ఉంది. అలుపు సొలుపు లేకుండా, రోజంతా స్వామీజీ బోధల అనువాదాలతో మునిగి తేలుతూ ఉంటుంది.

దైవకృప, శాస్త్రకృప, గురుకృప, ఆత్మకృప ఉంటే సాధించలేనిది ఏమీ ఉండదు. మన ఆర్ష విద్యా తరంగిణి తరఫున మొత్తం ప్రస్థానత్రయం (భగవద్గీత, దశోపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు– చతుస్సూత్రీ) గ్రంథరూపంలో ముద్రించాము. ఇవే కాక అద్వైత వేదాంత పరిచయము (తత్త్వబోధ), దృగ్దృశ్యవివేకము, భజగోవిందము అనే ప్రకరణగ్రంథములు, వేదాంత జీవనవిధానము, కైవల్యోపనిషత్‌తో కలిపి పందొమ్మిది గ్రంథాలు వచ్చాయి. చివరిదైన మాండూక్యోపనిషత్ సర్వాంగ సుందరంగా అలంకరించుకుని, గీతా జయంతికి, మీముందుకు వచ్చింది. **నాకు తెలిసి తెలుగులో ఇంత సులభమైన శైలిలో, ఇంత వివరంగా అద్వైత గ్రంథాలు రాలేదు.**

సాధకుల విశేష ఆదరణతో వీటిలో చాలా గ్రంథాలు, భగవద్గీతతో సహా, పునర్ముద్రణకు నోచుకున్నాయి. ఈ అనువాదాలకు పాఠకులనుంచి మంచి స్పందన, స్వామీజీలనుంచి, స్వామినులనుంచి అమితమైన ప్రోత్సాహం, దీవెనలు అపారంగా లభిస్తున్నాయి.

**స్వామి పరమార్థానందవారు చెప్పిన పద్ధతిలోనే, అంటే ఎక్కడా స్వామీజీ బోధను పలుచన చేయకుండా, స్వంత భావాలు చొప్పించకుండా, యథాతథంగా పదిలంగా మనస్సుకు హత్తుకునేలా ప్రస్థానత్రయాన్ని రాజీ వివరించింది. నిజానికి స్వామీజీనే ఎదురుగా కూర్చుని తెలుగులో బోధిస్తున్నట్టు ఉంది అన్నారు ఎందరో. ఇది రాజీ జీవితంలో ఒక మైలు రాయి.**

ప్రణామములతో,

**మీ రాఘవరావు**

# విషయసూచిక


| | |
|---|---|
| 01 బ్రహ్మయజ్ఞం | 03 |
| 02 శ్రీ పరమార్థానంద స్వామీజీ ఆశీస్సులు | 05 |
| 03 హరిః ఓమ్ | 06 |
| 04 అలమ్ | 07 |
| 05 శుభసమ్మతి | 09 |
| 06 ముందు మాటలు | 10 |
| 07 ఉపోద్ఘాతం | 21 |
| 08 మాండూక్యోపనిషత్ ఉపోద్ఘాతం | 36 |
| 09 అధ్యాయం 1 – ఆగమప్రకరణం | 41 |
| 10 అధ్యాయం 1 – ఆగమ ప్రకరణం – సారాంశం | 143 |
| 11 అధ్యాయం 1 – ఆగమ ప్రకరణం – ముఖ్యాంశాలు | 153 |
| 12 అధ్యాయం 2 – వైతథ్య ప్రకరణం | 163 |
| 13 అధ్యాయం 2 – వైతథ్య ప్రకరణం – సారాంశం | 246 |
| 14 అధ్యాయం 2 – వైతథ్య ప్రకరణం – ముఖ్యాంశాలు | 254 |
| 15 అధ్యాయం 3 – అద్వైత ప్రకరణం | 258 |
| 16 అధ్యాయం 3 – అద్వైత ప్రకరణం – సారాంశం | 393 |
| 17 అధ్యాయం 3 – అద్వైత ప్రకరణం – ముఖ్యాంశాలు | 402 |
| 18 అధ్యాయం 4 – అలాతశాంతి ప్రకరణం | 407 |
| 19 అధ్యాయం 4 – అలాతశాంతి ప్రకరణం – సారాంశం | 626 |
| 20 అధ్యాయం 4 – అలాతశాంతి ప్రకరణం – ముఖ్యాంశాలు | 637 |

# ఉపోద్ఘాతం

**సదాశివసమారంభాం శంకరాచార్యమధ్యమామ్।**
**అస్మదాచార్యపర్యంతాం వందే గురుపరంపరామ్॥**

మాండూక్యోపనిషత్తు వేరు, ముండకోపనిషత్తు వేరు. మన ప్రాథమిక గ్రంథాలను వేదాలు అనీ, శ్రుతులు అనీ అంటారు.

**విద్యతే జ్ఞాయతే అనేన ఇతి వేదః।**

జ్ఞానాన్ని కలుగజేస్తాయి ఈ వేదాలు. వీటిలో మనిషియొక్క పురుషార్థాలు వస్తాయి. అంటే సాధ్య, సాధనల గురించి బోధిస్తాయి. వేదాలను శ్రుతులు అని కూడా ఎందుకంటారంటే, భగవంతుణ్ణుంచి ఋషులు, వారి సత్త్వబుద్ధిచేత, చెవుల ద్వారా విన్నారు.

వేదాలు సాక్షాత్తూ ఆ పరమాత్మనుంచే వచ్చాయి, మనిషి బుద్ధినుంచి వచ్చినవి కావు. అందువల్ల వేదాలను అపౌరుషేయాలు అంటారు. అవి కర్ణపరంపరగా, గురుపరంపరగా అందజేయబడ్డాయి. వ్రాతపూర్వకంగా లేవు. అందువల్ల కూడా వాటిని శ్రుతులు అంటారు.

ఈ వేదాలు నాలుగు ఉన్నాయి. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం. ఒక్కొక్క వేదాన్నీ మళ్ళీ రెండుగా విభజించవచ్చు. అవి వేదపూర్వభాగం, వేద అంతభాగం. వేదపూర్వభాగాన్ని కర్మకాండ అనీ, వేద అంతభాగాన్ని జ్ఞానకాండ అనీ అంటారు.

వేదపూర్వభాగంలో సాధ్యత్రయం, సాధనత్రయం, దోషత్రయం ఉన్నాయి.

**సాధ్యత్రయం – మూడు లక్ష్యాలు** – వేదపూర్వభాగం మూడు పురుషార్థాలకు ప్రాముఖ్యతను ఇస్తుంది.

**ఉపాధి** – ఈ కార్యకరణసంఘాతం లేదా బాడీమైండ్ సెన్స్ కాంప్లెక్స్‌ను మెరుగు పరచుకోవటం. ఇది వ్యక్తిగత సాధ్యం.

**విషయం** – ఆస్తిపాస్తులను పెంచుకోవటం; ఇది విషయవస్తువుల సాధ్యం.

**లోకం** – మన చుట్టూ ఉన్న వాతావరణాన్ని మెరుగుపరుచుకోవటం. సమాజం బాగుంటే, మనం బాగుంటాము. ఇది సమాజ సాధ్యం.

మనిషికి తన ఉపాధి, తనకున్న విషయాలు, తను ఉన్న లోకం బాగుంటేనే తనకు శాంతి, భద్రత, ఆనందాలు దొరుకుతాయని తెలుసు. ఏ ఒక్కటి లేకపోయినా, అతను వీటిని అనుభవించలేదు.

**సాధనత్రయం – మూడు మార్గాలు**

**కాయిక కర్మలు** – శరీరంతో చేసే పనులు. పూజలు, ప్రదక్షిణలు.

**వాచిక కర్మలు** – వాక్కు ప్రధానపాత్ర వహిస్తుంది. విష్ణుసహస్రనామ పారాయణం.

**మానస కర్మలు** – మనస్సు మాత్రం పనిచేస్తుంది. ధ్యానం.

**దోషత్రయం – మూడు దోషాలు**

ఈ సాధనల ద్వారా, ఈ సాధ్యాలను పొందినా కూడా, వాటిలో అంతర్లీనంగా మూడు దోషాలు ఉంటాయి.

**దుఃఖమిశ్రితత్వమ్** – అవి కేవలం ఆనందాన్ని మాత్రమే ఇవ్వవు. దుఃఖంతో మిళితమై ఉంటాయి. ఏదైనా కర్మఫలాన్ని పొందటానికి చాలా కష్టపడాలి; పొందిన ఫలాన్ని నిలబెట్టుకోవటానికి కూడా అంతగానూ కష్టపడాలి. ఎంత జాగ్రత్తపడ్డా, ఎప్పుడో అప్పుడు పోతుంది. వస్తువు పోతే ఇంకా బాధ వేస్తుంది. వస్తువు పొందటం దుఃఖం, దాన్ని నిలబెట్టుకోవటం దుఃఖతరం, పోగొట్టుకుంటే దుఃఖతమం. దీన్నే దుఃఖమిశ్రితత్వము అంటారు.

**అతృప్తికరత్వమ్** – ఎంత పొందినా తృప్తి కలుగదు. ఇంకా ఏదో కావాలనిపిస్తుంది. కోరికలు అనంతం అంటారు. వంద రూపాయలు ఉంటే చాలు అనుకునే స్థితినుంచీ కోటీశ్వరుణ్ణి అవాలి, చక్రవర్తిని అవాలి, ఇంద్రపదవి పొందాలి అని పెరుగుతూ పోతాయి కోరికలు.

**బంధకత్వమ్** – కర్మఫలం పొందినకొద్దీ, దానికి బందీలమవుతూ వస్తాము. అవి ఎన్నడూ స్వేచ్ఛ వైపుకు దారితీయవు. అందువల్ల మనం పరాధీనతనుంచి స్వతంత్రత వైపుకు పయనించే బదులు, పరాధీనతనుంచి మరింత పరాధీనతవైపు సాగుతాము. కాఫీ, సిగరెట్టు లౌకిక ఉదాహరణలు.

సాధారణంగా చాలామంది మనుష్యులు ఈ సాధన, సాధ్యాలలోనే పడి తిరుగుతుంటారు. వాటివల్ల దోషాలున్నా, అవి వారిని సతాయిస్తున్నా, బాధపెడుతున్నా, వాటినుంచి తప్పించుకోవాలని చూడరు. పైగా భగవద్గీతలో కూడా కృష్ణపరమాత్మ చెప్పాడు – మనిషి కర్మలను మానలేడు, మాని ప్రయోజనం లేదు, మానకూడదు కూడా. కర్మలు చేస్తే అవి దోషఫలాలను ఇస్తాయి. కర్మలను మానితే శూన్యంగా ఉంటుంది. అయితే ఏం చేయాలి?

కొందరు అరుదైనవారు మాత్రమే ఇలాంటి దోషాలు లేని లక్ష్యం ఏదైనా ఉందా అని వెతుకుతారు. అటువంటివారితో వేదాంతం చెబుతుంది, 'నిర్దోష సాధ్యం నా దగ్గర ఉంది; కర్మకాండను వదిలి జ్ఞానకాండకు రండి,' అంటుంది.

ఏమిటా నిర్దోష సాధ్యం? వేదాంతం దోషరహిత సాధ్యం బ్రహ్మ అంటుంది.

**నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్ బ్రహ్మణి తే స్థితాః** – గీత 5.19

కృష్ణపరమాత్మ బ్రహ్మను నిర్దోషబ్రహ్మగా నిర్వచించాడు. ఎక్కడ దొరుకుతుంది ఆ బ్రహ్మ అని సాధకుడు ఉత్సాహంగా అడిగితే, వేదాంతం 'అది నీకు ఎక్కడా దొరకదు. నువ్వు ఎంత వెదికినా లాభం లేదు. ఎందుకంటే ఆ నిర్దోషసాధ్యం నువ్వే. తత్ త్వమ్ అసి,' అని ఒక పిడుగులాంటి వార్త వేస్తుంది.

**గమనిక:** బ్రహ్మ అని దీర్ఘం ఇచ్చి రాస్తే, అది చతుర్ముఖబ్రహ్మ అని అర్థం. బ్రహ్మ అంటే నిర్గుణబ్రహ్మ; చైతన్యం; సచ్చిదానంద ఆత్మ.

ఈ వార్త వినగానే సాధకుడు నివ్వెరపోతాడు. ఎందుకు? ఇన్నాళ్ళూ తనను తాను సదోష జీవుడు అనుకుంటూ వచ్చాడు. ఒకవేళ తనేదో కొంచెం మంచివాడు అనుకున్నా, అతని చుట్టూ ఉన్నవారు, ఆ కాస్త మంచి అభిప్రాయాన్ని పారద్రోలుతారు. అందువల్ల ఇప్పుడు అతను సదోష జీవాత్మనా, నిర్దోష బ్రహ్మనా? ఎటూ తేల్చుకోలేడు.

వేదాంతాన్ని అంత తేలిగ్గా కొట్టివేయలేడు. అది సాక్షాత్తూ పరమాత్మనుంచే వచ్చింది, పైగా ఇన్నాళ్ళూ వేదపూర్వభాగంమీద నమ్మకం కొద్దీ, అది చెప్పిన కర్మలన్నీ శ్రద్ధగా చేస్తూ వచ్చాడు. అందువల్ల వేదాన్ని తప్పు పట్టకూడదు. వాటిని అదుష్టప్రమాణం (అదృష్టప్రమాణం కాదు) అంటారు. మనిషి వాడే ప్రమాణాలన్నీ సదుష్ట ప్రమాణాలు. అలాగని వేదాంతాన్ని పూర్తిగానూ నమ్మలేకపోతున్నాడు. ఎందుకు? అతని అనుభవప్రమాణం దానికి భిన్నంగా ఉంది. అతను ఇన్నాళ్ళూ తను పరిమితి ఉన్న జీవి అనీ, తనకు జననమరణాలు ఉన్నాయనీ అనుకుంటూ వచ్చాడు. ఇప్పుడేమో వేదాంతం దానికి పూర్తి భిన్నంగా చెబుతున్నది – నువ్వు నిత్య, శుద్ధ, ముక్త, బుద్ధ బ్రహ్మవు అంటుంది. అతనికి తెలిసినది సత్యమా? వేదాంతం చెప్పేది సత్యమా?

అది తెలుసుకోవాలంటే ఆత్మవిచారణ చేయాలి. ఆత్మఅజ్ఞానం పోవాలంటే, ఆత్మజ్ఞానం పొందాలి. ఆత్మజ్ఞానం పొందాలని తెలిసింది సరే, కాని దాన్ని ఎలా పొందాలి? ఏ జ్ఞానం పొందాలంటే దానికి అనువైన ప్రమాణాన్ని వాడాలి. ఉదాహరణకు రంగు, రూపు తెలుసుకోవాలంటే కన్నుని వాడాలి; శబ్దం గురించి తెలుసుకోవాలంటే చెవిని వాడాలి. అలా ఆ జ్ఞానాన్ని కలుగజేసే కన్నుని, చెవిని ప్రమాణం అంటారు.

మనకు లౌకికంగా తెలిసినది ఐదు ప్రమాణాలు. అవి ప్రత్యక్షప్రమాణం, అనుమాన ప్రమాణం, అర్థాపత్తి ప్రమాణం, ఉపమాన ప్రమాణం, అనుపలబ్ధిప్రమాణం. ఇవన్నీ బాహ్యవస్తువులను తెలుసుకోవటానికి తోడ్పడతాయి. అంటే ప్రమేయాన్ని గురించిన జ్ఞానాన్ని ఇస్తాయి. వాటిని బహిర్ముఖప్రమాణాలు అంటారు. అవి నా గురించి తెలుపలేవు. ప్రపంచాన్నంతటినీ తేరిపారచూసే నా కళ్ళు, నా మొహాన్ని చూడలేవు. ఇది కంటికి ఉన్న

పరిధి. అదే విధంగా ప్రమేయం గురించి చెప్పే ఐదు ప్రమాణాలూ ప్రమాత అయిన నా గురించిన జ్ఞానాన్ని ఇవ్వలేవు.

వీటిని దాటి ఇంకొక ప్రమాణం ఉంది. దాన్ని శాస్త్రప్రమాణం; వేదాంత ప్రమాణం లేదా శబ్దప్రమాణం అంటారు. నా మొహాన్ని నా కళ్ళు చూపించలేనప్పుడు, దాన్ని ఎలా చూడాలి? దర్పణంలో (అద్దంలో) చూడాలి. అలాగే నా స్వరూపం గురించి తక్కిన ప్రమాణాలు చెప్పలేనప్పుడు, శాస్త్రమనే దర్పణాన్ని వాడాలి. సూక్ష్మక్రిములను చూడటానికి మైక్రోస్కోప్ వాడతాము; పెద్ద నక్షత్రాల గురించి తెలుసుకోవటానికి టెలిస్కోప్ వాడతాము. ఆత్మ గురించి తెలుసుకోవటానికి అలాంటి ఆత్మోస్కోప్ ఏదైనా ఉందా అంటే ఉందంటోంది శాస్త్రం. అదే వేదాంత దర్పణం. అందువల్ల బ్రహ్మజ్ఞానం పొందాలంటే, వేదాంత ప్రమాణం ద్వారా పొందాలి.

వేదాంత ప్రమాణం వాడాలి సరే, కాని దాన్ని మనంతట మనం వాడకూడదు. ఇప్పటి లౌకిక విషయవస్తువులకు కూడా, వాటిని ఎలా వాడాలో సూచించే మాన్యువల్ చదివి గాని వాడకూడదు. అలాగే శాస్త్రాన్ని మనమే స్వయంగా అధ్యయనం చేయటానికి ప్రయత్నించకూడదు. అలా అధ్యయనం చేస్తే అది అర్థం కాదు సరికదా, దాన్ని పొరపాటుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది. అది శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు ద్వారానే నేర్చుకోవాలి. అంటే గురువు శాస్త్రంనుంచి చెప్పాలి కాని, తనకు తోచింది చెప్పకూడదు. కాబట్టి గురువు ఆవశ్యకత తెలుసుకోవాలి.

గురువు దగ్గర శాస్త్రాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. శాస్త్రం లోతులు కొలిచినకొద్దీ, మన గురించి మనకు లోతుగా, స్పష్టంగా తెలుస్తుంది; అద్దంలో పరిశీలనగా చూసినకొద్దీ, మన మొహం స్పష్టంగా తెలిసినట్టుగా. తెలుసుకునేది నా గురించి కదా, శాస్త్రం బాహ్యంగా ఉంది కదా, శాస్త్రంలో ఎలా తెలుస్తుంది అంటారు కొందరు. శాస్త్రం బాహ్యంగా ఉన్నట్టు కనబడినా, అది మనను అంతర్ముఖులను చేస్తుంది. అద్దం బాహ్యంగా ఉన్నా, మన మొహాన్ని చూపించటం లేదూ? అలాగే శాస్త్రం కూడా నిన్ను నువ్వు తెలుసుకో అంటుంది.

**శ్రవణం** – శ్రవణం స్థాయిలో వేదాంతశాస్త్రంయొక్క సారాంశం ఏమిటో తెలుసుకోవటానికి, ఒక క్రమపద్ధతిలో విచారణ చేస్తుంది. ఆ విచారణను షడ్లింగ విచారణ అంటారు.

**ఉపక్రమోపసంహారౌ అభ్యాసోఽపూర్వతా ఫలమ్।**
**అర్థవాదోపపత్తీ చ లింగం తాత్పర్యనిర్ణయేత్॥**

**శ్రవణం నిర్వచనం** – ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు వేదాంతాన్ని శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువువద్ద అధ్యయనం చేయాలి. ఇందులో ప్రతి

ఒక్క పదమూ ముఖ్యమే. ఈ శ్రవణం ఆత్మజ్ఞానాన్ని కలిగిస్తుంది. అంటే నేను సదోష జీవుణ్ణి కాను, నేను నిర్దోషబ్రహ్మను అనే జ్ఞానాన్ని కలిగిస్తుంది. ఇంకో విధంగా చెప్పాలంటే అహం బ్రహ్మ అస్మి జ్ఞానాన్ని కలిగిస్తుంది. ఆ విధంగా శ్రవణం అంటే **అజ్ఞాననివృత్తి**.

**మననం** – వేదాంతం నేర్చుకుంటే అజ్ఞాననివృత్తి కలుగుతుంది నిజమే కాని కొన్ని సందేహాలు మిగిలిపోతాయి. వేదాంత సారాంశాన్ని మూడు వాక్యాల్లో చెప్పాలంటే –

**బ్రహ్మసత్యం, జగన్మిథ్యా, జీవో బ్రహ్మైవ నాఽ పరః॥**

బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య, జీవుడు బ్రహ్మ తప్ప వేరే ఏదీ కాదు. ఈ మూడు వాక్యాల్నే అంత తేలిగ్గా జీర్ణించుకోలేము. కనబడే జగత్తు ఎలా మిథ్య? కనబడని బ్రహ్మ ఎలా సత్యం? నేను ఆ బ్రహ్మను ఎలా అవుతాను? ఇదేదో హాస్యాస్పదంగా అనిపిస్తుంది. బుద్ధి దాన్ని అంత తేలిగ్గా స్వీకరించలేదు. ఇటువంటి సందేహాలు రాజ్యమేలుతున్నంత కాలం, జ్ఞానం పొందినా అది అజ్ఞానం కిందికే వస్తుంది. అందువల్ల మననం స్థాయిలో ఈ సందేహాలను తొలగించుకోవాలి. తోటి శిష్యులను అడిగో, మీరు రాసుకున్న నోట్సును చూసో, లేదంటే గురువునే ప్రత్యక్షంగా అడిగో తెలుసుకుని సంశయాలను పోగొట్టుకొని, నిశ్చయజ్ఞానం పొందాలి. మననం అంటే **సంశయనివృత్తి**.

**నిదిధ్యాసనం** – ఈ నిదిధ్యాసనాన్ని వేదాంతిక్ మెడిటేషన్ అంటారు. ఉపాసన వేరు, నిదిధ్యాసనం వేరు. ఉపాసన జ్ఞానం పొందకముందు చేస్తే, నిదిధ్యాసనం జ్ఞానం పొందాక, ఆ జ్ఞానాన్ని జీర్ణించుకోవటానికి చేస్తారు. జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకోవటానికి చేస్తారు. ఈ నిదిధ్యాసనాన్ని అనేక విధాలుగా చేయవచ్చు. మీరు రాసుకున్న నోట్సును పదేపదే చదువుకోవచ్చు; గురువు చేసిన బోధను రాసుకోవచ్చు; గురువు చేసిన బోధను పదేపదే వినవచ్చు; తోటివారితో చర్చించవచ్చు; మీరే ఎవరికైనా బోధ చేయవచ్చు. ఇవన్నీకాక శాస్త్రం చెప్పే నిదిధ్యాసనం వేరే ఉంది. దాన్ని బ్రహ్మ అభ్యాస నిదిధ్యాసనం అంటారు. అందులో మీరు శాస్త్రంలో నేర్చుకున్న వాక్యాలను ప్రయత్నపూర్వకంగా గుర్తు తెచ్చుకుని, వాటిమీద ధ్యానంలో నిలబడతారు.

ఈ నిదిధ్యాసనం ఎందుకు చేయాలి? మనలో కొన్ని భావనలు కొన్ని సంవత్సరాలుగా లోతుగా పాతుకుపోయాయి. వాటిని విపర్యయభావనలు అంటారు. మనం శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యవస్తువుల్లో దొరుకుతాయనుకుని బహిర్ముఖంగా పరుగులు తీస్తాము. దానికి తగ్గట్టుగా మన జీవనవిధానాన్ని మలుచుకుంటాము. కాని మన ఆలోచన సరైనదో కాదో ఎన్నడూ పరిశీలించుకోము. మంచికాలం రాకపోతుందా అని ఆశగా ఎదురుచూస్తాము. నిదిధ్యాసన ఆ విపర్యయభావనలను పారద్రోలటానికి తోడ్పడుతుంది. దానికి నిర్వాణషట్కమ్ మంచి మందు.

**మనోబుద్ధ్యహంకార చిత్తాని నాహం**
**న చ శ్రోత్ర జిహ్వే న చ ఘ్రాణనేత్రే।**
**న చ వ్యోమ భూమిర్న తేజో న వాయుః**
**చిదానందరూపశ్శివోఽహం శివోఽహమ్॥**

కైవల్యోపనిత్తులో జ్ఞానం పొందాక జ్ఞాని చెప్పే మాటలు వస్తాయి. అవి కూడా పదేపదే మననం చేసుకోవాలి.

**మయ్యేవ సకలం జాతం, మయి సర్వం ప్రతిష్ఠితం, మయి సర్వం లయం యాతి।**

నానుంచే సృష్టి వచ్చింది; నేనే స్థితి కారణాన్ని; నాలోనే అన్నీ లయమవుతాయి.

ఈ జ్ఞాననిష్ఠలో నిలబడగలిగితే, సంసారం బాధించదు. సంసారం అంటే మనుష్యులు మనతో ఉంటే భారంగా అనిపిస్తుంది; వారు మననుంచి వెళ్ళిపోతే శూన్యంగా అనిపిస్తుంది. కాని మోక్షంలో అలా ఉండదు; మనుష్యులు ఉన్నా భారం అనిపించదు, వెళ్ళిపోయినా శూన్యం అనిపించదు. అలా మనం భావించగలిగితే, మనం వేదాంతాన్ని జీర్ణించుకున్నట్టుగా భావించుకోవచ్చు.

ఇంతవరకూ ఉపోద్ఘాతం చూశాము. ఇప్పుడు కొన్ని సందేహాలకు జవాబులు చూద్దాము.

**సందేహం 1** – బ్రహ్మను పదాల ద్వారా నిర్వచించలేమని వేదాంతమే చెబుతుంది.

**యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ** – తైత్తిరీయమ్

**న తత్ర చక్షుర్గచ్ఛతి నా వాగ్గచ్ఛతి** – కేన

వాక్కు, మనస్సు బ్రహ్మ దగ్గరకు వెళ్ళలేవు, అవి తిరిగివస్తాయి అని తైత్తిరీయం అంటే; కన్ను, వాక్కు బ్రహ్మ గురించి చెప్పలేవు అని కేనోపనిషత్తు అంటుంది.

యుక్తి ప్రమాణం కూడా బ్రహ్మను పదాల ద్వారా నిర్వచించలేమని చెప్పింది. పదాలు ఒక వస్తువును నిర్వచించాలంటే, అది కొన్ని నియమాలకు కట్టుబడి ఉండాలి. దాన్ని శబ్దప్రవృత్తి నిమిత్తాని అంటారు. ప్రవృత్తి అంటే లక్షణం; శబ్దం అంటే పదాలు; నిమిత్తం అంటే నియమాలు. అందువల్ల శబ్దప్రవృత్తి నిమిత్తాని అంటే పదాల లక్షణంయొక్క నియమాలు. శాస్త్రం పదాలను క్షుణ్ణంగా విశ్లేషించి, ఐదు నియమాలను విధించింది. దురదృష్టవశాత్తు బ్రహ్మ ఈ ఐదు నియమాలలో దేనికీ సరిపోదు.

**శబ్దప్రవృత్తి నిమిత్త రహితం బ్రహ్మ**

అలాంటప్పుడు వేదాంతశాస్త్రం ఎలా బ్రహ్మ గురించి బోధిస్తుంది? వేదాంతాన్ని శబ్దప్రమాణం అంటారనీ, శ్రవణంలో పదాల విశ్లేషణ వస్తుందనీ చూశాము. కాని అది ఎలా సరిపోతుంది?

ముందు ఆ **శబ్దప్రవృత్తి నిమిత్తాని** చూద్దాము.

ఎ) **రూఢి** – ప్రత్యక్ష విషయం – రూఢిగా తెలుసు. కంటికి కనబడుతుంది. సూర్యుడు అనే పదం కంటికి కనపడే సూర్యుణ్ణి చూపిస్తుంది.

బి) **జాతి** – తెగ – ఒకచోట ఒక కొత్త చెట్టును చూశారు. ఆ చెట్టు గురించి ప్రత్యేకంగా తెలియకపోయినా, చెట్టు జాతి ఎలా ఉంటుందో తెలుసు. అందువల్ల దానిని చూడగానే, ఇది చెట్టు అని ఎవరూ చెప్పకుండానే మీరే చెప్పగలరు. స్వర్గలోకంలో పారిజాతవృక్షం ఉందని ఎవరైనా చెబితే, 'నేను స్వర్గలోకానికి వెళ్ళలేదు, నాకు తెలియదు,' అనరు మీరు. స్వర్గలోకానికి వెళ్ళకపోయినా ఆ చెట్టును ఊహించుకోగలరు.

సి) **గుణం** – లక్షణం – ఒక వస్తువు గురించి మీకు ప్రత్యక్షంగా తెలియకపోయినా, దాని లక్షణంబట్టి ఆ వస్తువును గుర్తుపట్టగలరు. ఆ లక్షణం వస్తువును అంటిపెట్టుకుని ఉంటుంది. అందువల్ల ఎవరైనా, 'అదుగో ఆ నీలం వస్తువును తీసుకురా,' అంటే మీరు వెంటనే ఆ వస్తువును గుర్తుపట్టగలరు.

డి) **క్రియ** – పని – ఒకవేళ పై మూడు నియమాల్లో ఏదీ తెలియకపోయినా, ఎవరైనా వచ్చి, 'ఆ డ్రైవర్‌ను పిలుచుకు రా,' అని చెబితే, వెంటనే పిలుచుకు రాగలుగుతారు. అతను చేసే పనివల్ల గుర్తుపట్టగలుగుతారు. ఎవరైనా గాలి అంటే ఏమిటి అని అడిగితే, ఏది వీస్తే ఆకులు సన్నగా కదులుతాయో అది గాలి అంటారు. చలించేది వాయువు.

ఇ) **సంబంధం** – అనుబంధం – ఒక వ్యక్తిని అతనికి మరొక వ్యక్తితో ఉన్న అనుబంధంవల్ల కూడా గుర్తు పట్టవచ్చు. ఒక వ్యక్తిని కొత్తవారికి పరిచయం చేసేటప్పుడు మీరు, 'మా నాన్న,' అనో 'మా అన్నయ్య' అనో పరిచయం చేస్తారు. దీన్ని ఆధార–ఆధేయ సంబంధం అంటారు. 'బల్లమీద ఉన్న పుస్తకం తీసుకురా,' అని ఎవరైనా అంటే, బల్ల–ఆధారం; పుస్తకం–ఆధేయం అవుతుంది.

కాని బ్రహ్మ ఈ ఐదు లక్షణాల్లో ఏ లక్షణానికీ అందదు. అలాంటప్పుడు బ్రహ్మను శ్రుతి ద్వారా ఎలా చెబుతాము?

ఎ) **రూఢి** – ప్రత్యక్ష అగోచరం – బ్రహ్మను రూఢిగా చెప్పలేరు. ఎందుకంటే బ్రహ్మ సూర్యునిలాగా కాదు. బ్రహ్మ ప్రత్యక్ష అగోచరం. **ప్రత్యక్ష అగోచరత్వాత్ రూఢిః నాస్తి.**

బి) **జాతి** – ఏకం – వృక్షజాతి ఉన్నట్టుగా బ్రహ్మజాతి లేదు. బ్రహ్మ సజాతీయ, విజాతీయ, స్వగతభేదరహితమ్. సూర్యుడు ఏకం, ఆకాశం ఏకం. వాటికి జాతి లేదు. అలాగే బ్రహ్మ కూడా ఏకం, అద్వితీయం. **ఏకత్వాత్ జాతిః నాస్తి.**

సి) **గుణం** – నిర్గుణం – బ్రహ్మకు గుణాలు లేవు. బ్రహ్మ నిర్గుణం బ్రహ్మ. **నిర్గుణత్వాత్ గుణః నాస్తి.**

డి) **క్రియ** – నిష్క్రియం – బ్రహ్మ చేసే పనినిబట్టి చెప్పలేరు. ఎందుకంటే బ్రహ్మ పనిచేయదు. అవ్యవహారి. **నిష్క్రియత్వాత్ క్రియా నాస్తి.**

ఇ) **సంబంధం** – అద్వితీయం – సంబంధం గురించి మాట్లాడాలంటే రెండు ఉండాలి. కాని బ్రహ్మ ఏకమ్ ఏవ అద్వితీయం. ఉన్నదొకటే బ్రహ్మ, ఇంకొకటి లేదు. **అద్వితీయత్వాత్ సంబంధః నాస్తి.**

అందువల్ల బ్రహ్మను పదాల ద్వారా నిర్వచించలేము; అందువల్ల వేదాంతప్రమాణాన్ని ఉపయోగించలేము. ఇదీ సందేహం. ఈ సందేహాన్ని శంకరులవారే చూపించి, దానికి జవాబును తన మాండూక్యభాష్యంలో ఇచ్చారు. దాని సారాంశం చూద్దాము.

**జవాబు** – నిజమే, బ్రహ్మను పదాలు నిర్వచించలేవు. కాని, నర్మగర్భంగా, అంతర్లీనంగా, ప్రత్యేకమైన పద్ధతుల ద్వారా నిర్వచించవచ్చు. అందువల్లనే ఉపనిషత్తులను స్వంతంగా నేర్చుకోవటానికి ప్రయత్నించకూడదు; గురువు ద్వారానే నేర్చుకోవాలని పదేపదే చెప్పేది.

ఉపనిషత్తు అలా నర్మగర్భంగా నాలుగు పద్ధతులను వాడుతుంది. అవి –

ఎ) **మిథ్యా లక్షణం** – బ్రహ్మ నిర్గుణమే అయినా, బ్రహ్మను మిథ్యా లక్షణాలతో వర్ణించవచ్చు. అంటే నిజంగా ఆ లక్షణాలు ఉండవు కాని, నిజంగా లేకపోయినా, కొన్ని లక్షణాలను ఆపాదించవచ్చు.

ఉదాహరణకు ఆకాశాన్ని నీలాకాశం అంటాము. నీలం రూపంలోకి వస్తుంది కాని ఆకాశానికి శబ్దస్పర్శరూపరసగంధాలలో శబ్దగుణం మాత్రమే ఉంది. అలాగే నీలిసముద్రం అంటాము. సముద్రానికీ నిజంగా నీలిగుణం లేదు. సూర్యోదయం, సూర్యాస్తమయం పదాలు వాడతాము కాని, నిజానికి సూర్యుడు ఉదయించడు, అస్తమించడు. అదేవిధంగా ఆత్మకు లేదా బ్రహ్మకు కూడా లేని ఒక గుణాన్ని ఆపాదిస్తాము. దాన్ని సాక్షిత్వమ్ అంటారు. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూస్తుంది ఆత్మ అంటాము. కాని నిజానికి అద్వైతం స్థాయికి ఎదిగితే, సాక్షీ లేదు, సాక్ష్యమూ లేదు. ఈ సాక్షిచైతన్యం మాటను వ్యావహారిక స్థాయిలోనే వాడతాము.

బి) **ఆగంతుక లక్షణం** – దీన్ని తటస్థ లక్షణం అని కూడా అంటారు. అంటే ఒక వస్తువును నిర్వచించేటప్పుడు దాని స్వరూపలక్షణాన్ని కాకుండా తాత్కాలిక లక్షణంతో నిర్వచిస్తాము. శాస్త్రం ఇచ్చే ఉదాహరణ –

**కాకవత్ గృహం దేవదత్త గృహమ్**

'దేవదత్తుని ఇల్లు ఎక్కడ?' అని ఎవరైనా అడిగితే ఆ ఇంటి స్వరూపలక్షణం చెప్పవచ్చు. 'ఇంటికి పసుపురంగు వేసి ఉంటుంది. వీధిలోకి తొంగిచూస్తూ రెండు పెద్ద కిటికీలు ఉంటాయి.' ఇలా ఏవైనా చెప్పవచ్చు. కాని ఆ వీధిలో అన్ని ఇళ్ళకూ పసుపురంగు, పెద్ద కిటికీలు ఉంటే ఎలా చెబుతారు? అప్పుడు ఈ తటస్థలక్షణాన్ని తీసుకుంటారు. కాకి వాలిన ఇల్లు దేవదత్తుని ఇల్లు. మీరు చెప్పింది తటస్థలక్షణం అని విన్నవ్యక్తికీ తెలుసు. ఎందుకంటే అతను మర్నాడు మళ్ళీ వస్తే, కాకికోసం చూడడు.

అదే విధంగా చైతన్యం గురించి చెప్పాలంటే, దాన్ని శరీరంతో పోల్చి, అది శరీరానికి భిన్నంగా ఎలా ఉందో చెబుతాము. అలా చైతన్యానికి ఐదు లక్షణాలు చెబుతాము. అవి –

- చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి చెందిన వస్తువు కాని కాదు.
- చైతన్యం స్వతంత్ర వస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.
- చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
- చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు. శరీర పతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.
- చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఆ విధంగా చైతన్యం, శరీరం శాశ్వతంగా కలిసి లేకపోయినా కూడా, తాత్కాలిక శరీరం ద్వారా, అందులో ఉన్న శాశ్వతమైన శరీరీ గురించి బోధిస్తుంది ఉపనిషత్తు.

సి) **లక్షణ అభావ** – ఏ లక్షణమూ లేదని చెప్పటం ఒక పద్ధతి. ఉదాహరణకు అక్కడ కొన్ని గ్లాసులు ఉన్నాయి, వాటిల్లో భిన్నద్రవపదార్థాలు ఉన్నాయి. నీరు, కోకోకోలా, కొబ్బరినీరు, చెరుకురసం, పాలు ఉన్నాయి ఆ గ్లాసుల్లో. కాని వాటిల్లో ఒక గ్లాసులో ఏమీ లేదు. మీరు, 'ఆ ఖాళీగ్లాసును తీసుకురా,' అంటారు. ఖాళీగ్లాసు అంటే అందులో ఏమీ లేదు.

ఏమీ లేనిదానికి ఏ రంగు ఉందని చెబుతారు? కోకోకోలా రంగు చెప్పగలరు కాని, ఖాళీగా ఉన్నదానికి ఏ రంగు అని చెబుతారు? కాని ఫలానా గ్లాసు తీసుకురా అని చెప్పటానికి ఏ లక్షణమూ లేకపోవటం తోడ్పడుతుంది. అక్కడ ఉన్న పదిమందిలో ఒక్కరికి కళ్ళజోడు లేకపోతే, 'అదుగో, ఆ కళ్ళజోడు లేని వ్యక్తిని పిలువు,' అని చెప్పవచ్చు. అక్కడ ఏ లక్షణం చెప్పారు? లక్షణం లేకపోవటం చెప్పారు. అలాగే 'ఆ బట్టతల వ్యక్తిని పిలువు,' అంటే ఏ లక్షణం చెప్పారు? జుట్టు లేకపోవటం చెప్పారు.

అనంతం బ్రహ్మ అంటే అది లక్షణాన్ని వివరించటం కాదు. పరిమితి అనే లక్షణం లేని బ్రహ్మ అని అర్థం. అది లక్షణం చెప్పినట్టు అవుతుంది. అటువంటి పదాలు – నిర్గుణబ్రహ్మ, నిరాకారబ్రహ్మ. ఇవి లక్షణ అభావాన్ని సూచిస్తాయి. గుణాలు లేని, ఆకారం లేని బ్రహ్మ.

డి) **నేతి–నేతి పద్ధతి** – ఇందులో కూడా బ్రహ్మ గురించి ప్రత్యక్షంగా నిర్వచించదు ఉపనిషత్తు. వేరే దేని గురించో చెబుతుంది. అంటే చెప్పకనే చెప్పినట్టు అవుతుంది. అలా మీరు మీ నిజజీవితంలో చేసే సంభాషణలో కూడా చేసారు.

ఇద్దరు అబ్బాయిలు ఉంటే, 'మా పెద్దబ్బాయి చాలా తెలివైనవాడండీ,' అంటారు. రెండవ అబ్బాయి గురించి ఒక్కమాట కూడా అనలేదు. అయినా అతను చాలా బాధపడతాడు. ఎందుకు? పెద్దబ్బాయి తెలివైనవాడంటే, చిన్నబ్బాయి మొద్దు అని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది. ఇంకొక సందర్భంలో ఒక గదిలో ముగ్గురు మనుష్యులు కూర్చుని ఉన్నారు. వారి ముందు ఒక గ్లాసులో నీరు ఉంది. వారిలో ఒకరు కాసేపు బయటకు వెళ్ళి వచ్చేసరికి, ఆ గ్లాసు ఖాళీ అయిపోయింది. 'నీళ్ళు ఎవరు తాగారు?' అని అతను జనాంతికంగా అడిగితే, 'నేను తాగలేదు,' అని ఒకతను వెంటనే జవాబు చెబుతాడు. అంటే నేను తాగలేదు, ఈ రెండోవ్యక్తి తాగాడని అతను చెప్పకనే చెప్పినట్టు అయింది. దీన్నే మౌనవ్యాఖ్యానం అంటారు. మౌనవ్యాఖ్యానం అంటే అసలేమీ చెప్పకుండా మౌనంగా ఉండటం అనుకుంటారు చాలామంది. కాని మౌనవ్యాఖ్యానం అంటే చెప్పకనే చెప్పటం.

ఇంటికి ఎవరో వచ్చి వదలకుండా కబుర్లు చెబుతున్నారు. మీకు విసుగుపుడుతున్నది కాని, పొమ్మని చెప్పలేరు. అప్పుడేం చేస్తారు? 'నేను 5.30కి ఒక మీటింగ్‌కి వెళ్ళాలి,' అంటారు. అంటే తెలివైనవాడైతే వెంటనే గ్రహించుకుని, 'వెళ్ళొస్తాను,' అని లేస్తాడు. నిజానికి మీరు చెప్పింది వేరు, కాని చెప్పాలనుకున్నది అందజేశారు. అలాగే మీరు కార్లో ఎటో వెళుతుంటే, పక్కింటాయన పరుగెత్తుకువచ్చి, 'మీరు ఎటువైపు వెళుతున్నారు?' అని అడుగుతాడు. 'మీకెందుకు?' అని మీరు మండిపడకుండా, ఆయన ఉద్దేశ్యం అర్థమయినట్టుగా, 'రండి, నేను మిమ్మల్ని దింపుతాను,' అంటారు. అతను లిఫ్ట్ కావాలని ప్రత్యక్షంగా అడగకపోయినా, మీకు అర్థమయింది.

ఉపనిషత్తు కూడా ఇటువంటి పద్ధతినే ఉపయోగిస్తుంది. దీన్ని నేతి–నేతి పద్ధతి అంటారు. అది ప్రత్యక్షంగా ఇది ఆత్మ అని చెప్పదు. కాని ఇది ఆత్మ కాదు, ఇది ఆత్మ కాదు అని పరోక్షంగా ఒక్కొక్కదాన్ని ఖండిస్తూ వస్తుంది. అలా ఆబ్జెక్టులు అన్నింటినీ ఖండించుకుంటూ వస్తే, మిగిలేది ఖండించలేని సబ్జెక్టు మాత్రమే.

**స ఏష నేతి నేత్యాత్మా** . నేతి అంటే న+ఇతి. ఇది కాదు అని అర్థం.

**అన్యదేవ తత్ విదితాత్, అథో అవిదితాత్ అధి** – కేన

ఆత్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువు కాదు అంటే ఏమిటి అర్థం? ఆత్మ అసలు ఆబ్జెక్టే కాదు, ఆత్మ సబ్జెక్టు.

బృహదారణ్యకంలో ఈ నేతి–నేతి పద్ధతిలో ఆత్మ గురించి చాలా నిర్వచనాలు వస్తాయి. అవి అస్థూలమ్, అనణు, అహ్రస్వమ్, అదీర్ఘమ్, అలోహితమ్, అస్నేహమ్ (ద్రవం), అచ్ఛాయమ్, అతమః, అవాయుః, అనాకాశమ్, అసంగమ్, అరసమ్, అగంధమ్, అచక్షుష్కమ్, అగోత్రమ్, అవాక్, అమనః, అతేజస్కమ్, అప్రాణమ్, అముఖమ్, అమాత్రమ్, అనంతరమ్, అబాహ్యమ్, నతదశ్నాతి కించన, నదశశ్నాతి కశ్చన. చివరి పదాల అర్థం ఆత్మ తినదు, తినబడదు.

ఈ నాలుగు పద్ధతులలో ఏదో ఒక పద్ధతి ఉపయోగించి, బ్రహ్మ నిర్వచనం ఇస్తుంది ఉపనిషత్తు. ఇలా లక్షణాల ద్వారా చెప్పటాన్ని లక్షణవృత్తి అంటారు.

**సందేహం 2** – వేదాంతజ్ఞానం ఎలా సంపూర్ణజ్ఞానం అవుతుంది?

ఒక విషయం గురించిన జ్ఞానం పొందితే చాలదు; ఆ విషయం గురించిన అనుభవం పొందాలి. లౌకికవిద్యలో ఇదీ పద్ధతి. గంగోత్రి గురించి ఎవరి ద్వారానో జ్ఞానం పొందుతాము, లేదా చాలా వివరంగా ఒక రచయిత రాసిన అనుభవాన్ని చదువుతాము. కాని ఆ జ్ఞానం అసంపూర్ణమే. మనం స్వయంగా గంగోత్రి వెళ్ళి ఆ అనుభవాన్ని పొందాలి. పదాలు జ్ఞానాన్ని కలుగజేస్తాయి కాని, అనుభవాన్ని ఇవ్వవు. అనుభవం లేని జ్ఞానం అసంపూర్ణం.

వేదాంతం కూడా పదాలరూపంలోనే ఉంది. అలాంటప్పుడు వేదాంతం కూడా జ్ఞానమే ఇవ్వగలదు కాని, అనుభవాన్ని ఇవ్వలేదు. అనుభవం ఇవ్వని జ్ఞానం అసంపూర్ణం. అందువల్ల వేదాంతం నేర్చుకున్నాక, కొన్ని సాధనలు చేయాలి. బ్రహ్మజ్ఞానం వేరు, బ్రహ్మ అనుభవం వేరు. అలాగే ఆత్మజ్ఞానం వేరు, ఆత్మ అనుభూతి వేరు. వేదాంతబోధ వింటే అనుభవం ఎలా కలుగుతుంది? ధ్యానం చేస్తే కలుగుతుంది. శ్రవణం జ్ఞానం పొందటానికి, ధ్యానం అనుభవం పొందటానికి. అందువల్ల జ్ఞానం, అనుభవాల మధ్య భేదం ఉంది.

జ్ఞానం + అనుభవం = ఫలం

**జవాబు** – వేదాంతాన్ని శ్రద్ధగా నేర్చుకోవాలనుకుంటే, మీరు ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. నిజమే, పదాలు జ్ఞానాన్ని మాత్రమే ఇస్తాయి, అనుభవాన్ని ఇవ్వవు అని మేమూ ఒప్పుకుంటాము. వేదాంతం ఏ అనుభవమూ ఇవ్వదు సరికదా, వేదాంతానికి అనుభవాన్ని ఇచ్చే ఉద్దేశ్యం కూడా లేదు. ఎందుకంటే మనకు కొత్త అనుభవం ఏమీ అవసరం లేదు అంటుంది. మన సమస్య అనుభవం లేకపోవటంలో లేదు; మన సమస్య జ్ఞానం లేకపోవటంలో ఉంది.

మనకు జీవితంలో కలుగుతున్న అనుభవాలన్నింటినీ రెండు రకాలుగా విభజించవచ్చు. అవి ద్వైత అనుభవం, అద్వైత అనుభవం. ఈ రెండు అనుభవాలనూ అందరం ప్రతిరోజూ పొందుతూనే ఉన్నాము అంటుంది వేదాంతం. ఎలా చెప్పగలదు?

మీ జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ ద్వైత అనుభవాన్ని పొందుతారు. ఈ రెండు అవస్థల్లోనూ మీరు వేరు, మీరు అనుభవిస్తున్న ప్రమేయం వేరు. దీన్ని సవికల్ప అనుభవం అంటారు. ఇందులో ప్రమాత–ప్రమేయం విభజన ఉంటుంది; దేశకాలవస్తు పరిమితులు ఉంటాయి. దీన్ని **ద్వైత అనుభవం** అంటారు.

సుషుప్తి అవస్థలో మీరు గాఢనిద్ర పోతారు. అప్పుడు ప్రమాత–ప్రమేయం విభజన ఉండదు. మనస్సు కూడా శరీరం, ఇంద్రియాలతో పాటు పడుకుంటుంది. దేశకాలవస్తు పరిమితులు ఉండవు. దీన్ని **అద్వైత అనుభవం** అంటారు. ఇది సవికల్ప అనుభవం కాదు, నిర్వికల్ప అనుభవం.

ఈ రెండు అనుభవాలు కాకుండా, మూడవ అనుభవం ఇంకొకటి లేదు. ఇంకొక అద్వైత అనుభవం ఉంది అనటానికి లేదు. ద్వైత అనుభవంలో అనేక రకాల అనుభవాలు ఉంటాయి కాని, అద్వైత అనుభవంలో ఉండవు. అందువల్ల వేదాంతం మీకు కొత్తగా ఏ అనుభవాన్నీ ఇవ్వనవసరం లేదు. అవస్థాత్రయంలో మీరు ఈ రెండూ అనుభవిస్తూనే ఉన్నారు.

మరయితే ఏమిటి సమస్య? ద్వైత అనుభవంలో మీరు పరిమితి ఉన్న నేనును అనుభవిస్తే, అద్వైత అనుభవంలో పరిమితి లేని నేనును అనుభవిస్తున్నారు. ఇప్పుడు సమస్య – ఏది నా అసలు స్వరూపం? పరిమితి ఉన్న జీవినా? పరిమితి లేని జీవినా? ఇదీ మీ సందేహం. రెండూ నా స్వరూపం అనలేరు. ఎందుకంటే, అవి రెండూ రెండు భిన్న అనుభవాలు. మీరు పరిమితిని, అనంతాన్ని ఒకేసారి అనుభవించలేరు. అది ఎప్పుడు సాధ్యం అంటే, అందులో ఒకటి మీ స్వరూపలక్షణం అయి, ఇంకొకటి ఆగంతుక ధర్మం అయివుండాలి. అనంతమైన మీరు, పరిమితి ఉన్న జీవిగా కనిపిస్తున్నారా? పరిమితి ఉన్న మీరు అనంతంగా కనిపిస్తున్నారా? ఏది సత్యం, ఏది మిథ్య?

దురదృష్టవశాత్తూ మీరు వేదానికి రాకముందు పరిమితి ఉన్న జీవే మీ అసలు స్వరూపమనీ, అనంతం మీ ఆగంతుక లక్షణం అనీ విజయవంతంగా నిశ్చయించేసుకున్నారు. అందువల్ల ఇప్పుడు సమస్య ఎక్కడుందో చూశారా? సమస్య అనుభవం లేకపోవటంలో లేదు, ఆ అనుభవం గురించిన పొరపాటు అవగాహనలో ఉంది. అనుభవాన్ని ఆధారం చేసుకుని వచ్చిన పొరపాటు మీ సమస్య. వేదాంతం పని ఇంకొక కొత్త అనుభవాన్ని కలుగజేయటం కాదు; వేదాంతం పని ఆ పొరపాటుని విశ్లేషించి, దాన్ని సరిదిద్దటం.

వేదాంతం మీ పొరపాటుని పారద్రోలి, మీకు ఇచ్చే జ్ఞానం ఏమిటి? మీరు అనంతం బ్రహ్మ. అది మీ స్వస్వరూపం. 'నేను పరిమితి ఉన్న జీవిని,' అనేది మీరు వేసుకునే ఆగంతుక వేషం. 'నువ్వు ఆధ్యాత్మిక అనుభవం పొందాల్సిన మనిషివి కాదు, తాత్కాలికంగా మనుష్య అనుభవం పొందుతున్న ఆధ్యాత్మిక జీవివి,' అన్నారొక మహానుభావుడు. కాని దీనికి భిన్నంగా మీరు ఆలోచిస్తారు. మీరు పరిమితి ఉన్న జీవులనీ, ఆధ్యాత్మిక అనుభవం పొందాలనీ ఆశిస్తారు.

మీరు మనిషిగా వేసుకున్నది తాత్కాలిక వేషం, మీరు ఆధ్యాత్మిక జీవులు అని వేదాంతబోధ అంటుంది. అందువల్ల వేదాంతం కొత్త అనుభవాన్ని ఇవ్వదు, ఇచ్చే ఉద్దేశ్యం కూడా లేదు, ఉన్న అనుభవం గురించిన పొరపాటును సరిదిద్దుతుంది.

ఆ బోధలో ఒక భాగంగానే మాండూక్యోపనిషత్తు మీకు తెలిసిన అవస్థాత్రయాన్ని తీసుకుని, మీకు అనుభవంలోకి వచ్చినవాటిని విశ్లేషిస్తూ బోధ చేస్తుంది. ఈ బోధను కూడా జాగ్రదావస్థలోనే చేయగలదు; స్వప్నావస్థలోనూ, సుషుప్తి అవస్థలోనూ గురువు బోధ చేయలేడు. అందువల్ల మీకు బాగా మెలకువగా ఉన్న జాగ్రదావస్థలోనే బోధ చేయాలి. తమాషా ఏమిటంటే అంత బాగా మేలుకుని ఉన్నానని మీరు అనుకుంటున్నది జాగ్రదావస్థ కాదని, అది స్వప్నం-2 అనీ; దాన్నుంచి కూడా నిద్ర లేవండని బోధిస్తుంది.

అందువల్ల ఇక్కడ సమస్యను మళ్ళీ చూస్తే, మీ సమస్య అజ్ఞానం; అజ్ఞానం తొలిగి, జ్ఞానం కలిగితే చాలు ఫలం వస్తుంది. కర్మకాండలో అయితే, జ్ఞానం+కర్మ=ఫలం. కాని జ్ఞానకాండలో అలాకాదు, జ్ఞానం=ఫలం. దానికి రజ్జుసర్పభ్రాంతే ఉదాహరణ. తాడును చూసి పాము అనుకుని, పొరపాటు పడ్డారు. ఎవరో వచ్చి లైటు వేసి చూపించారు. అది పాము కాదు, తాడు అని మీకు తెలిసింది. దాని తర్వాత ఏ కర్మ చేశారు? పాము జపం చేశారా? ఏమీ చేయలేదు. అందువల్ల వేదాంత ప్రమాణం జ్ఞానాన్ని ఇస్తుంది, దానితోనే ఫలం వెంటనే వస్తుంది. ఫలం మోక్షం.

ఇక్కడితో సందేహాలు, వాటికి జవాబులు అయిపోయాయి.

**వేదాంతం** – వేదాంతానికి అనేక పేర్లు ఉన్నాయి. అవి వేదాంతం, జ్ఞానకాండ, ఆత్మవిద్య, బ్రహ్మవిద్య, ఉపనిషత్తు.

వేద అంతభాగంలో వస్తుంది కాబట్టి వేదాంతం అంటారు; వేదాంతం అంటే జ్ఞానంయొక్క అంతం అని తీసుకోకూడదు. వేదాంతం అంటే వేదాలయొక్క అంతభాగం అని అర్థం.

వేదపూర్వభాగంలో కర్మప్రధానంగా ఉంటుంది కాబట్టి దాన్ని కర్మకాండ అనీ, వేద అంతభాగంలో జ్ఞానం ప్రధానంగా ఉంటుంది కాబట్టి దాన్ని జ్ఞానకాండ అనీ అంటారు.

వేదాంతం బోధించేది నా స్వరూపాన్ని కాబట్టి, నేను అంటే సంస్కృతంలో ఆత్మ అని అర్థం కాబట్టి, వేదాంతాన్ని ఆత్మవిద్య అని కూడా అంటారు.

వేదాంతం నా స్వస్వరూపం బోధించేటప్పుడు, నేను పరిమితి ఉన్న జీవిని కాదు, అనంతమైన బ్రహ్మను అంటుంది. నేను = ఆత్మ = బ్రహ్మ. అలా బ్రహ్మజ్ఞానం బోధిస్తుంది కాబట్టి దీన్ని బ్రహ్మవిద్య అని కూడా అంటారు.

**ఉపనిషత్తు**

వేదాంతానికి ఇంకొక పేరు ఉపనిషత్తు. ఉపనిషత్తు అంటే ఉప+ని+షద్.

**ఉప – గురు ఉపసదనేన ప్రాప్తవ్యా విద్యా**

జ్ఞానాన్ని స్వంతంగా పొందటానికి ప్రయత్నించకూడదు. జ్ఞానాన్ని ఇంట్యూషన్ (intuition) ద్వారా పొందకూడదు, ఇన్ ట్యూషన్ (in tuition) పొందాలి అంటారు స్వామీజీ. అంటే గురువు సమీపంలో కూర్చుని, గురువు ద్వారా పొందాలి. ట్యూషన్‌లో ఒక క్రమపద్ధతిలో, గురువు సమీపంలో జ్ఞానం పొందుతారు. ఉప అంటే గురు **ఉపసదనం.**

ని – నిశ్చయజ్ఞానం. సంశయవిపర్యయరహిత జ్ఞానం పొందాలి. నిశ్చయజ్ఞానం పొందేదాకా నేర్చుకోవాలి.

అందువల్ల ఉపని అంటే గురువు ద్వారా నిశ్చయజ్ఞానం (పొందాలి).

**షద్** – అంటే నాశనం చేసేది. బ్రహ్మను లేదా బ్రహ్మజ్ఞానాన్ని నాశనం చేసేది కాదు. సంసారాన్ని నాశనం చేసేది. అజ్ఞానంవల్ల ఏర్పడిన సంసారాన్ని నాశనం చేస్తుంది.

**అవసాదయతి నాశయతి ఇతి షద్**

ఈ షద్‌కు ఇంకొక అర్థం కూడా ఉంది.

**సాదయతి గమయతి ప్రాపయతి ఇతి షద్**

ఇక్కడ అర్థం నాశనం చేసేది అని రాదు, తీసుకువెళ్ళేది అని వస్తుంది. ఎక్కడికి తీసుకు వెళుతుంది? బ్రహ్మ దగ్గరకు తీసుకువెళ్ళి, జీవాత్మను పరమాత్మలో ఐక్యం చేయిస్తుంది.

ఇప్పుడు ఈ మూడూ కలిపితే, ఉపనిషత్తు అంటే గురువు సమీపంలో కూర్చుని, గురువు ద్వారా నిశ్చయజ్ఞానం పొందితే, ఆ నిశ్చయజ్ఞానం సంసారాన్ని నాశనం చేసి, జీవాత్మను పరమాత్మలో ఐక్యం చేయిస్తుంది.

కాని ఇక్కడ ఒక విషయాన్ని గ్రహించాలి. ఉపనిషత్తు జీవాత్మను పరమాత్మలో ఐక్యం చేయిస్తుంది అని చెబితే, పరమాత్మ ఎక్కడో దూరాన కైలాసంలోనో, వైకుంఠంలోనో ఉన్నాడు;

జీవాత్మ వెళ్ళి వెళ్ళి పరమాత్మలో ఐక్యం అవుతాడని పొరపాటు పడకూడదు. ఉపనిషత్తు జీవాత్మ, పరమాత్మ ఐక్యజ్ఞానాన్ని బోధిస్తుంది.

**జీవాత్మ = పరమాత్మ**

జీవాత్మ వేరు, పరమాత్మ వేరు అనే భేదబుద్ధిని పారద్రోలుతుంది.

**భేదబుద్ధి నాశః ఏవ ఐక్యభావః**

**సంవాదం** – ఉపనిషత్తు సాధారణంగా సంవాదరూపంలో ఉంటుంది. ముందు ఎన్నో వేల ఉపనిషత్తులు ఉన్నాయి. వాటిలో కొన్ని కరిగిపోయి 1180 మిగిలాయి; అవికూడా కాలగర్భంలో కరిగిపోయి, 108 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వాటిలో పది మాత్రమే పేరు పొందిన ఉపనిషత్తులు. ఎందుకంటే వాటికి మాత్రమే శంకరులవారు భాష్యం రాశారు. వాటిని తేలిగ్గా గుర్తు పెట్టుకోవటానికి ఒక శ్లోకరూపంలో చెబుతారు.

**ఈశకేనకఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః।**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా॥**

# మాండూక్యోపనిషత్ ఉపోద్ఘాతం

ఈ పది ఉపనిషత్తులన్నింటిలోకీ మాండూక్యోపనిషత్ అత్యంత చిన్నది. అందులో పన్నెండు మంత్రాలు మాత్రమే ఉన్నాయి. ఇది అథర్వణవేదానికి చెందినది. దీనికి మాండూక్యం అని పేరెందుకు వచ్చింది?

మామూలుగా మండూకము అంటే కప్ప అని అర్థం. కప్పగెంతులు గెంతినట్టు, ఇది వేదాంతజ్ఞానంలో మనను గెంతులు గెంతిస్తుంది అని కారణం చెబుతారు. కాని అసలు కారణం దీనిని మండూక ఋషి దర్శించారు. మాండూక్యం పదం మండ్ ధాతువునుంచి వచ్చింది. మండ్ అంటే మండయతి అంటే ఆనందంలో రమించటం. మండూకః అంటే ఎప్పుడూ ఆనందంలో ఉండే వ్యక్తి అని అర్థం. ఇది ఋషికి సరిగ్గా సరిపోతుంది. ఎందుకంటే ఋషి, తను పొందిన జ్ఞానంవల్ల ఎప్పుడూ ఆనందంలోనే రమిస్తాడు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః** – గీత 2.55

ఇది చిన్న ఉపనిషత్తే అయినా, ఇది ఒక సంపూర్ణ ఉపనిషత్తు. అందువల్ల చాలా ముఖ్యమైన ఉపనిషత్తు.

ముక్తికోపనిషత్తు అని ఇంకొక ఉపనిషత్తు ఉంది. అది ఈ పది ఉపనిషత్తుల్లోకి రాకపోయినా, పేరు పొందిన 108 ఉపనిషత్తుల్లోకి వస్తుంది. ఆ ఉపనిషత్తు రాముడు, ఆంజనేయుల మధ్య సంవాదరూపంలో వస్తుంది. అందులో అంతకుముందు ఎలా వేలకొద్దీ ఉపనిషత్తు ఉండేవో, ఎలా 108 మాత్రమే ప్రసిద్ధి పొందాయో అనే విషయాలు వస్తాయి. అంతేకాదు, ఏ వేదానికి ఎన్ని ఉపనిషత్తులు ఉన్నాయో కూడా వివరంగా వస్తుంది. ఇంతకీ, ఆ ఉపనిషత్తులో మాండూక్యోపనిషత్ ఒక్కటి అధ్యయనం చేసినా చాలు, మోక్షం పొందవచ్చు అని వస్తుంది.

**మాండూక్యమ్ ఏకమ్ ఏవ అలమ్। ముముక్షూనాం విముక్తయే**

కాని మాండూక్యం సరిగ్గా అర్థం కాకపోతే, 10 ఉపనిషత్తులు అధ్యయనం చేయాలి; అవి అధ్యయనం చేసినా అర్థం కాకపోతే, 32 ఉపనిషత్తులు అధ్యయనం చేయాలి. అప్పుడూ అర్థం కాకపోతే, 108 ఉపనిషత్తులు అధ్యయనం చేయాలి. దానికి కొసమెరుపుగా మనం ఇంకొక మాట కలుపుకోవచ్చు. 108 అధ్యయనం చేసినా అర్థం కాకపోతే, వచ్చే జన్మలో అదృష్టాన్ని పరీక్షించుకోవాలి.

మాండూక్యోపనిషత్ చాలా చిన్న ఉపనిషత్ అని చూశాము. కాని దానికి గౌడపాదాచార్యులవారు భాష్యం పద్యరూపంలో రాశారు. వాటిని కారికలు అంటారు. అందువల్ల కూడా ఈ ఉపనిషత్‌కు బాగా పేరు వచ్చింది.

అద్వైత గురుపరంపరలో గౌడపాదాచార్యులవారికి ఒక ముఖ్యమైన స్థానమే ఉంది. నిజానికి, ఈ శ్లోకాన్ని వేదాంతం నేర్చుకోవటానికి వచ్చిన ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి.

**నారాయణం పద్మభువం వసిష్ఠం శక్తిం చ తత్పుత్ర పరాశరం చ**
**వ్యాసం శుకం గౌడపదం మహాంతం గోవిందయోగీంద్ర మథాస్య శిష్యమ్**
**శ్రీశంకరాచార్యమథాస్య పద్మపాదం చ హస్తామలకం చ శిష్యమ్**
**తం తోటకం వార్తికకారమన్యాన్ అస్మద్గురూన్ సంతతమానతోస్మి॥**

ఆదిగురువు విష్ణుమూర్తి. తరువాత గురుపరంపర ఈ విధంగా వస్తుంది - బ్రహ్మ, వసిష్ఠుడు, శక్తి, పరాశరుడు, వ్యాసుడు, శుకుడు, గౌడపాదులు, గోవిందపాదులు, శంకరాచార్యులవారు; ఆయన నలుగురు శిష్యులైన పద్మపాదులు, హస్తామలకుడు, తోటకాచార్యుడు, వార్తికకారుడు, నా గురువు వరకూ వస్తారు. శుకమహర్షివరకూ ఈ గురువుల పేర్లను పురాణాల్లో చూస్తాము. అంతేకాదు, వారు ఋషిపరంపరకు చెందటమే కాక, గృహస్థ పరంపరకు కూడా చెందుతారు. ప్రతి శిష్యుడూ తన గురువుయొక్క పుత్రుడు. విష్ణుమూర్తి పుత్రుడు బ్రహ్మ; బ్రహ్మ తనయుడు వసిష్ఠుడు; వసిష్ఠుని పుత్రుడు శక్తి; శక్తి పుత్రుడు పరాశరుడు; పరాశరుని పుత్రుడు వ్యాసుడు; వ్యాసుని పుత్రుడు శుకమహర్షి.

**వ్యాసం వసిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్।**
**పరాశరాత్మజమ్ వందే శుకతాతం తపోనిధిమ్॥** - విష్ణుసహస్రనామం

వ్యాసమహర్షి వసిష్ఠుని మునిమనవడు, శక్తి మనవడు; పరాశరుని పుత్రుడు, శుకమహర్షి తండ్రి (తాత అంటే సంస్కృతంలో తండ్రి). అలా ఒక్క శ్లోకంలో ఐదుతరాల గురించి వచ్చింది.

శుకమహర్షి తర్వాత వచ్చిన గురువు గౌడపాదాచార్యులవారు. శుకమహర్షి ఋషుల్లోకి వస్తే, గౌడపాదాచార్యులవారు మనుష్యుల్లోకి వస్తారు. అంటే ఇక్కడనుంచి గురుపరంపర-ఋషిపరంపరనుంచి మనుష్య పరంపరలోకి వస్తుంది. వీరు చారిత్రాత్మక పురుషులు. అంతేకాదు, అంతకుముందు గురువులంతా గృహస్థులు అయితే, ఇక్కడనుంచి గురువులు అంతా సన్న్యాసులు.

ఆ విధంగా గురుపరంపరను ఇంకో దారి తొక్కించిన గౌడపాదాచార్యులవారు చాలా ముఖ్యమైన ఆచార్యులు. ఆయన భాష్యం చదువుతున్నామంటే మనం శంకరాచార్యుల వారి కాలం నాటికన్నా ఇంకా కొన్ని సంవత్సరాల ముందుకు వెళుతున్నాము. శంకరాచార్యుల వారే 1200 సంవత్సరాల ముందు కాలానికి చెందినవారు. ఆయన గురువుకు గురువు ఈయన. ఆ విధంగా గౌడపాదాచార్యులవారి కారికలు ఎంతో పురాతనమైనవి, ముఖ్యమైనవి.

గౌడపాదాచార్యులవారు గౌడ దేశానికి చెందిన ఆచార్యులు కావటంవల్ల గౌడపాదాచార్యులు అనే పేరు వచ్చింది. ఇప్పటి ఉత్తర బెంగాల్ ఆనాటి గౌడదేశం. ఆయన అసలు పేరు తెలియకపోవటంవల్ల ఆ పేరు స్థిరపడిపోయింది. పాదం అంటేనే గౌరవసూచకం సంస్కృతంలో. గురుపాదం అంటే గౌరవనీయమైన గురువు. అందువల్ల గౌడపాదాచార్యులు అంటే గౌడదేశానికి చెందిన గౌరవనీయమైన గురువు అని అర్థం.

గౌడపాదాచార్యులవారు వేదాంతంమీద మరికొన్ని గ్రంథాలు కూడా రచించారు. కాని వాటిల్లో పేరెన్నిక గలది మాండూక్య కారికలు. కారికలు అంటే పద్యభాగంలో భాష్యం. మాండూక్యోపనిషత్‌లో ఉన్న 12 మంత్రాలకు 215 కారికలు రచించారు. కారికలవల్ల, ఈ ఉపనిషత్తు సమగ్రంగా అర్థమవుతుంది కాబట్టి సాధారణంగా ఈ ఉపనిషత్తును కారికలతో పాటుగా అధ్యయనం చేస్తారు. ఇలా నిజానికి ముందు మొదలుపెట్టింది శంకరాచార్యుల వారే. ఆయన తన భాష్యాన్ని ఉపనిషత్తుమీదే కాకుండా, కారికలమీద కూడా రాశారు. శంకరాచార్యులవారి భాష్యాలన్నింటికీ ఆనందగిరి ఉపభాష్యం రాశారు.

ఉపనిషత్తులోని మంత్రాలు, కారికలు కలిపి (12+215) 227 అవుతాయి. వాటిని నాలుగు అధ్యాయాలుగా విభజించటం జరిగింది. ఇక్కడ అధ్యాయాన్ని ప్రకరణం అంటారు. అవి ఆగమ ప్రకరణం, వైతథ్య ప్రకరణం, అద్వైత ప్రకరణం, అలాతశాంతి ప్రకరణం.

మొదటి అధ్యాయంలో మొత్తం ఉపనిషత్తుయొక్క మంత్రాలు 12 , కారికలు 29 వస్తాయి. అంటే వెరసి 41 ఉన్నాయి. ఇందులోనే మొత్తం ఉపనిషత్తు వచ్చేసింది కాబట్టి, తర్వాత వచ్చే అధ్యాయాల్లో కారికలు మాత్రమే ఉంటాయి. మొదటి అధ్యాయంలో రెండూ ఉంటే, ఏది ఎక్కువ ముఖ్యమైనది అనే సందేహం రావచ్చు. కాని ఆ సందేహం అనవసరం. ఉపనిషత్తే ముఖ్యమైనది. ఎందుకంటే కారికలు ఉపనిషత్తుమీద వచ్చిన భాష్యం మాత్రమే.

## శాంతిపాఠం

మొదటి అధ్యాయంలో ఉపనిషత్తు ఉంది కాబట్టి, దానికొక శాంతిపాఠం ఉండాలి. ఈ ఉపనిషత్తు అథర్వణ వేదానికి చెందినది కాబట్టి దీని శాంతిపాఠం భద్రంకర్ణేభిః. అథర్వణ వేదానికి చెందిన ఉపనిషత్తులన్నింటికీ ఒకే శాంతిపాఠం ఉంటుంది. అందువల్ల ముండకోపనిషత్తుకు, ప్రశ్నోపనిషత్తుకు కూడా ఇదే శాంతిపాఠం.

**ఓం భద్రం కర్ణేభిఃశృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ం సస్తనూభిర్వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతు॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఈ శాంతిపాఠం ద్వారా శిష్యుడు నాలుగు విషయాలను కోరుతున్నాడు.

1. **ఆయుష్షు** – ఓ దేవా, నాకు దీర్ఘాయుష్షును మాండూక్యోపనిషత్తు, కారికలతో సహా నేర్చుకునేటంతవరకూ అయినా ఇవ్వు.

**వ్యశేమ దేవహితం యదాయుః** – అకాలమృత్యువు బారిన పడకుండా కాపాడు.

2. **ఆరోగ్యం** – మంచి ఆరోగ్యం కూడా ఉండేలా చేయి. దీర్ఘాయుష్షు ఉండి, ఆరోగ్యం సరిగా లేకపోతే, అది పెద్ద అవస్థ. ఆసుపత్రుల చుట్టూ తిరగటమే సరిపోతుంది.

ఆరోగ్యంలోకి నాలుగు అంశాలు వస్తాయి. శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి.

**భద్రంకర్ణేభిః శ్రుణుయామ దేవాః** – భద్రం అంటే సర్వమంగళస్వరూపం. అది బ్రహ్మ. ఓ దేవా! నా చెవులు బ్రహ్మ గురించి శ్రద్ధగా వినేలా చేయి. చెవులు పనిచేయకపోతే ఒకదానికొకటి వినబడుతుంది.

**భద్రం పశ్యేమ అక్షభిః యజత్రాః** – యజత్రా అన్నా కూడా దేవతే. కంటితో మంచి విషయాలు చూసేలాగా చేయి. అంటే కళ్ళు, చెవులు సహకరించాలి. కన్నుకన్నా బుద్ధి సూక్ష్మంగా, పదునుగా ఉండాలి.

**స్థిరైః అంగైః తుష్టువాగ్ం సస్తనూభిః** – సూక్తుల ద్వారా నిన్ను ప్రార్థన చేయటానికి మంచి అంగాలను సమకూర్చు.

ఆ విధంగా శారీరక ఆరోగ్యం, ఇంద్రియ ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, బుద్ధిబలం అన్నీ బాగుండాలి వేదాంతశ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయటానికి. ఏదైనా పని సాధించాలంటే మూడు అంశాలు తోడ్పడతాయి. అవి ప్రయత్నం, కాలం, దైవం; అంటే

వరుసగా అంకితభావం ఉండటం, కొంచెం సమయాన్ని వెచ్చించటం, ఈశ్వర అనుగ్రహం కలగటం. ఇప్పుడు ఈశ్వర అనుగ్రహాన్ని కోరుతున్నాడు.

3. **ఈశ్వర అనుగ్రహం** – అనేక దేవతలను కొలుస్తున్నాడు.

**స్వస్తి నః ఇంద్రో వృద్ధశ్రవాః** – పేరున్న దేవత అయిన ఇంద్రుడు మాకు మేలు చేయుగాక. నః అంటే మాకు.

**స్వస్తి నః పూషా విశ్వవేదాః** – సూర్యదేవత మేలు చేయుగాక.

**స్వస్తి నః తార్‌క్ష్యః అరిష్టనేమి** – తార్‌క్ష్య అంటే గరుత్మంతుడు. అరిష్టనేమి అంటే ఆయనను ఎవరూ ఆపలేరు. అటువంటి గరుత్మంతుడు మాకు మేలు చేయుగాక.

**స్వస్తి నః బృహస్పతిః దధాతు** – బృహస్పతి మాకు మేలు చేయుగాక.

4. **నిర్విఘ్నత్వం** – ఈ మాండూక్యోపనిషత్తు, కారికలతో పాటు నేర్చుకునేటంతవరకూ ఆటంకాలు లేకుండుగాక.

**ఓం శాంతిః శాంతిః శాంతిః** – అధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవిక ఆటంకాలు లేకుండుగాక.

ఈ ప్రార్థన ఎటువంటి ఆటంకాలనైనా తొలగించటానికి చేయవచ్చు కాని, ఇక్కడ ఉపనిషత్తు నేర్చుకునేముందు చేసే శాంతిపాఠం కాబట్టి, ప్రత్యేకించి ఉపనిషత్తు అధ్యయనం నిర్విఘ్నంగా కొనసాగాలని చేస్తున్నాడు. మనం కూడా ఆ ప్రార్థన చేసుకుని, ఉపనిషత్తులోకి అడుగుపెడదాము.

# అధ్యాయం 1 - ఆగమ ప్రకరణం

## విహంగవీక్షణం

ఈ ఆగమ ప్రకరణంలో ఉపనిషత్తులోని మొత్తం 12 మంత్రాలు, 29 కారికలు ఉంటాయి. రెండూ కలిపి 41 అవుతాయి. సంస్కృతంలో ఆగమః అంటే ఉపనిషత్తు. వేదాలు అపౌరుషేయాలు; సాక్షాత్తూ భగవంతుణ్ణుంచే వచ్చాయి. ఉపనిషత్తు అంటే వేద అంతభాగం అని చూశాము. అందువల్ల మొదటి అధ్యాయానికి **ఆగమ ప్రకరణం** అనే పేరు వచ్చింది.

ఆగమ ప్రకరణంలో ఉపనిషత్ మంత్రాలు, కారికలు కలిపి వస్తాయి కాని మనం వీలుకోసం వాటి విహంగవీక్షణ విడివిడిగా చేద్దాము.

### ఉపనిషత్ మంత్రాల విహంగవీక్షణ

| | | |
|---|---|---|
| 1. | ఉపోద్ఘాతం - ఓంకార విచారణ | - మంత్రం 1 |
| | ఆత్మ విచారణ | - మంత్రం 2 |
| 2. | చతుష్పాద ఆత్మ విచారణ | - మంత్రాలు 3-7 |
| 3. | చతుర్మాత్ర ఓంకార విచారణ | - మంత్రాలు 8-12 |

### కారికల విహంగవీక్షణం

| | | |
|---|---|---|
| 1. | మూడు పాదాల వివరణ | - కారికలు 1-9, మంత్రం 6 తరువాత |
| 2. | నాలుగు పాదాల సాధర్మ్యము-వైధర్మ్యము | - కారికలు 10-18,మంత్రం 7 తరువాత |
| 3. | ఓంకారం- ఆత్మ ఐక్య ఉపాసన | - కారికలు19-24,మంత్రం 11 తరువాత |
| 4. | నిదిధ్యాసనం, ఫలం | - కారికలు25-29,మంత్రం 12 తరువాత |

ఉపనిషత్తుయొక్క మంత్రాలు గద్యరూపంలో ఉంటే, కారికలు పద్యరూపంలో ఉంటాయి. మొదటి అధ్యాయంలో ఉపనిషత్ మంత్రాలు కొన్ని అయ్యాక, కొన్ని కారికలు వస్తాయి. అలా రెండూ మార్చిమార్చి వస్తాయి.

**మంత్రం 1**

**ఓమిత్యేతదక్షరమిదగ్ం సర్వం తస్యోపవ్యాఖ్యానం భూతం భవద్భవిష్యదితి సర్వమోంకార ఏవ । యచ్చాన్యత్త్రికాలాతీతం తదప్యోంకార ఏవ ॥**

1. **ఉపోద్ఘాతం – ఓంకార విచారణ – మంత్రం 1**

మొదటి మంత్రం ఓంకార విచారణను ప్రవేశపెడుతుంది.

**ఇదగ్ం సర్వమ్** – ఈ సృష్టి మొత్తం. పారాయణంలో గ్ శబ్దం కొన్ని అక్షరాల ముందు వస్తుంది. ఆ అక్షరాలు శ,ష,స,హ,ర. ఇక్కడ అర్థం చేసుకునేటప్పుడు ఇదగ్ం బదులు ఇదం అని తీసుకోవాలి. ఇదం సర్వం అంటే ఈ సృష్టిమొత్తం,

**ఓమిత్యేతదక్షరమ్** – ఓంకారం పవిత్రమంత్రం. అక్షరం అంటే ఏకాక్షరం. ఓంకారం గురించి అన్ని ఉపనిషత్తుల్లోనూ వస్తుంది.

**యశ్ఛందసామృషభో విశ్వరూపః** – తైత్తిరీయమ్

ఛాందోగ్యోపనిషత్తులో బ్రహ్మదేవుడు వేదాలను చిలికి చివరగా ఓంకారాన్ని తీశాడు అని వస్తుంది.

మూడు (భూ, భువ, సువః) లోకాల సారం – మూడు దేవతలు

మూడు (అగ్ని, వాయువు, ఆదిత్యుడు) దేవతల సారం – మూడు వేదాలు

మూడు (ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం) వేదాల సారం – గాయత్రీ మంత్ర మూడు పాదాలు

గాయత్రీ మంత్ర మూడు పాదాల సారం – మూడు వ్యాహృతులు

మూడు (భూ, భువ, సువః) వ్యాహృతుల సారం – మూడు మాత్రలు

మూడు (అ, ఉ, మ) మాత్రల సారం – ఓంకారం.

యజ్ఞాలు చేసేటప్పుడు, నిత్యకర్మల్లో, బ్రహ్మచారి అధ్యయనం చేసేటప్పుడు – అన్నింటిలోనూ ఓంకారం వస్తుంది.

**ఓమితి బ్రహ్మ। ఓమితీదగ్ం సర్వమ్। ఓమిత్యేతదనుకృతిః**
**హ స్మ వా అప్యోశ్రావయేత్యాశ్రావయన్తి। ఓమితి సామాని గాయన్తి।**
**ఓగ్ం శోమితి శస్త్రాణి శగ్ంసన్తి ।** – తైత్తిరీయమ్

యజ్ఞాలు చేసేటప్పుడు, మొదలుపెట్టటానికి, అనుమతి ఇవ్వటానికి, అలా అనేక సందర్భాలలో ఓం పలుకుతారు.

ఇక్కడ ఈ మాండూక్యోపనిషత్ ఓంకారాన్ని కీర్తిస్తున్నది. ఈ ఓంకారమే మొత్తం సృష్టి. ఓంకారమే సృష్టి కాబట్టి, సృష్టి గురించి తెలుసుకోవాలంటే, ఓంకారం గురించి తెలుసుకుంటే చాలు. ఎటువంటి సృష్టి?

**భూతం భవద్భవిష్యదితి** – భూత, వర్తమాన, భవిష్యత్తు అనే మూడు కాలాల్లోనూ ఉన్న సృష్టి.

**సర్వమోంకార ఏవ** – ఈ మూడు కాలాలూ ఓంకారమే. అంతేకాదు,

**యచ్చాన్యత్త్రికాలాతీతం తదప్యోంకార ఏవ** – ఈ భూత, వర్తమాన, భవిష్యత్తు కాలాల్లోకి రానిది ఏదైనా ఉంటే, అది కూడా ఓంకారమే. అంటే ఓంకారం కాలంలో ఉన్నదానికీ, కాలాతీతమైనదానికీ ప్రతీక. అంటే వ్యావహారిక ప్రపంచానికే కాదు పారమార్థిక సత్యానికి కూడా ప్రతీక. కాలాతీతంగా ఉన్నదేమిటి? చైతన్యం, మాయ, అవిద్య, బ్రహ్మ. ఇవన్నీ కూడా ఓంకారమే.

ఒక్కముక్కలో చెప్పాలంటే ఓం = సర్వం.

అందువల్ల ఓంకార విచారణ చేస్తే అన్నింటి గురించిన విచారణ చేసినట్టు అర్థం. అందువల్ల,

ఓంకార విచారణ = సృష్టి విచారణ

**తస్యోపవ్యాఖ్యానమ్** – అందువల్ల మనం ఓంకార విచారణ చేయబోతున్నాము. తస్య అంటే ఓంకారంయొక్క; ఉపవ్యాఖ్యానం అంటే విచారణ.

**ఓంకారస్య విచారః ఆరభ్యతే**

పురాణగాథలో వినాయకుణ్ణీ, సుబ్రహ్మణ్యస్వామినీ ప్రపంచం అంతా తిరిగి రమ్మంటే, వెంటనే తన నెమలి వాహనంమీద దూసుకువెళ్ళిపోయాడు సుబ్రహ్మణ్యస్వామి. వినాయకుడు తన తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణం చేశాడు. వారు జగత్తుకే మాతాపితలు కదా. వారికి ప్రదక్షిణ చేస్తే, జగత్తుకు ప్రదక్షిణం చేసినట్టు.

అదే విధంగా, మనకు కూడా సూక్ష్మమైన మార్గాన్ని సూచిస్తున్నది ఉపనిషత్తు. ఓంకార విచారణ ద్వారా జగత్తు విచారణ చూడబోతున్నాము. ఈ అంశాన్ని ఉపోద్ఘాతంగా మొదటి మంత్రంలో పరిచయం చేసింది ఉపనిషత్తు. కాని ఓంకార విచారణను 8–12 మంత్రాల్లోనే చూస్తాము. అంతవరకూ ఆగుదాము.

## మంత్రం 2

**సర్వగ్ం హ్యేతద్బ్రహ్మాయమాత్మా బ్రహ్మ సోఽ యమాత్మా చతుష్పాత్॥**

**ఉపోద్ఘాతం – ఆత్మవిచారణ – మంత్రం 2**

ఈ మంత్రంలో ఈ ఉపనిషత్తులోని రెండవ అంశమైన ఆత్మవిచారణయొక్క ఉపోద్ఘాతాన్ని చూస్తాము.

**ఏతత్ సర్వగ్ం బ్రహ్మ** – ఏతత్ సర్వం అంటే ఈ జగత్తు మొత్తం. కాలం గురించి వచ్చిన మాటలు మొదటి మంత్రంలోంచి ఇక్కడకు తెచ్చుకోవాలి.

**భూతం భవద్భవిత్యదితి** – భూత, వర్తమాన, భవిష్యత్తు అనే మూడు కాలాల్లోనూ ఉన్న సృష్టి మొత్తం బ్రహ్మ.

**యచ్చాన్యత్త్రికాలాతీతమ్** – ఈ భూత, వర్తమాన, భవిష్యత్తు కాలాల్లోకి రానిది ఏదైనా ఉంటే, అది కూడా బ్రహ్మే. అంటే కాల అంతర్గత, కాల బహిర్గత సర్వమూ బ్రహ్మే.

ముందు మంత్రంలో వచ్చిన ఈక్వేషన్ ఓం = సర్వం.

ఈ మంత్రంలో వచ్చిన ఈక్వేషన్ సర్వం = బ్రహ్మ.

అక్కడేమో ఓంకార విచారణ చేస్తే సర్వవిచారణ చేసినట్టు అని అర్థం వచ్చింది. ఇక్కడేమో బ్రహ్మవిచారణ చేస్తే సర్వవిచారణ చేసినట్టు అని అర్థం. ఎటువంటి బ్రహ్మ?

**అయమాత్మా బ్రహ్మ** – అయమ్ ఆత్మా బ్రహ్మ. బ్రహ్మ అంటే వేరే ఏమిటో కాదు, ఈ ఆత్మే. ఆత్మ అంటే నేను. అయం పదం 'నేను'ను సూచిస్తుంది. ఈ నేను దగ్గరగా, ఎప్పుడూ అందుబాటులో ఉంటాను. అది ఎన్నడూ పరోక్ష విషయం కాదు.

అయం = అపరోక్షతయా ఉపలభ్యమానః

అంటే ఎప్పుడూ అందుబాటులో ఉంటాను. ఈ మంత్రంలోనే మనకు రెండు ఈక్వేషన్లు వచ్చాయి.

సర్వం = బ్రహ్మ; బ్రహ్మ = ఆత్మ

అందువల్ల సర్వం = ఆత్మ.

ఎ = బి; బి = సి అయితే ఎ = సి అవాలి.

**తదభిన్నం తదభిన్నాభిన్నమ్ ఇతి న్యాయః॥**

అందువల్ల ఆత్మవిచారణ = సర్వవిచారణ.

మొదటి మంత్రంలో ఓంకార విచారణ గురించి వస్తే, ఇక్కడ ఆత్మవిచారణ గురించి వచ్చింది. చూడటానికి రెండు భిన్న విచారణలుగా ఉన్నాకూడా, ఈ రెండింటి గమ్యం ఒకటే. ఓంకార విచారణ ద్వారా సర్వవిచారణ చేస్తాము; ఆత్మవిచారణ ద్వారా కూడా సర్వవిచారణ చేస్తాము. అంటే ఒకటే జ్ఞానం పొందటానికి రెండు మార్గాలు ఉపయోగిస్తాము అంతే.

కస్మిన్ విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి?
ఓంకారజ్ఞః సర్వజ్ఞః భవతి
ఆత్మజ్ఞః సర్వజ్ఞః భవతి

ఇక్కడ ఇంకొక విషయం గమనించాలి మనం. అయమాత్మా బ్రహ్మ ఒక మహావాక్యం. జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని బోధించే ఏ వాక్యమైనా మహావాక్యమే. అలాంటి మహావాక్యాలు అనేకం ఉన్నాయి అన్ని ఉపనిషత్తుల్లోనూ. కాని మహావాక్యం అంటే ఏమిటో తెలియటానికి నాలుగు వేదాల్లోంచి నాలుగు మహావాక్యాలను ఉదాహరణగా తీసుకున్నారు. అవి –

| **వేదం** | **ఉపనిషత్తు** | **మహావాక్యం** |
|---|---|---|
| సామవేదం | ఛాందోగ్యోపనిషత్ | తత్త్వమసి |
| ఋగ్వేదం | ఐతరేయోపనిషత్ | ప్రజ్ఞానం బ్రహ్మ |
| యజుర్వేదం | బృహదారణ్యకోపనిషత్ | అహం బ్రహ్మాస్మి |
| అథర్వణవేదం | మాండూక్యోపనిషత్ | అయమాత్మా బ్రహ్మ |

ఈ మాండూక్యోపనిషత్‌లో మహావాక్యం ఉండటంవల్ల కూడా ఇది ముఖ్యమైన ఉపనిషత్తు.

ఈ మొదటి రెండు మంత్రాల్లోనూ, రెండు విచారణలనూ పరిచయం చేశాక, ఉపనిషత్తు వాటిని వివరించదలుచుకుంది కాని అది వివరించేటప్పుడు వరుస క్రమాన్ని మారుస్తున్నది. ముందు ఓంకార విచారణను పరిచయం చేశాక ఆత్మవిచారణను పరిచయం చేసింది. కాని ఇప్పుడేమో ముందు ఆత్మవిచారణను చేయబోతున్నది.

**సోఽయమాత్మా చతుష్పాత్** – రెండవ మంత్రంలోని ఈ వాక్యంతోనే ఆత్మవిచారణ మొదలవుతుంది. ఈ ఆత్మవిచారణ ఏడవ మంత్రం వరకూ కొనసాగుతుంది. ఈ ఆత్మ చతుష్పాద ఆత్మా అంటున్నది ఉపనిషత్తు. అంటే నాలుగు పాదాలు ఉన్న ఆత్మ అని అర్థం. పాదం అర్థం అక్షరాలా చూస్తే, కాలిపాదం. కాని ఇక్కడ లక్షణం లేదా అంశంగా లేదా విభాగంగా తీసుకోవాలి.

## చతుష్పాద ఆత్మా – విహంగ వీక్షణం

ఈ వాక్యం – సోఽ యమాత్మా చతుష్పాత్ – ఒక్క ఈ ఉపనిషత్తులోనే చూస్తాము. వేరే ఎక్కడా చూడము. అందువల్లనే మాండూక్యోపనిషత్ తక్కిన వాటికన్నా ప్రత్యేకమైనది, అద్భుతమైనది, లోతైనది, విలువైనది. అంతేకాదు, అర్థం చేసుకోవటానికి కొంచెం కష్టమైనది కూడా. అందువల్ల మనం దాన్ని వీలైనంత తేలికగా చేసుకుని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిద్దాము.

దేనికైనా ఉనికి ఉందని నిరూపించాలంటే, అది కొన్ని నియమాలకు లోబడి ఉండాలని వేదాంతం చెబుతున్నది.

1. **ప్రమేయత్వమ్** – ప్రమేయం అంటే ఆబ్జెక్టు. ఒక వస్తువు గురించి జ్ఞానం పొందాలంటే అది ప్రమేయం అయివుండాలి. అది ప్రమేయం కాకపోతే, దాని ఉనికి గురించి మాట్లాడలేము. అది ప్రమేయం అయివుండాలంటే,

ఎ) ఐదు ప్రమాణాల్లో ఏదైనా ఒక ప్రమాణానికి ప్రమేయం అయివుండాలి. ఐదు ప్రమాణాలు – ప్రత్యక్ష ప్రమాణం, అనుమాన ప్రమాణం, అర్థాపత్తి ప్రమాణం, అనుపలబ్ధి ప్రమాణం, ఉపమాన ప్రమాణం.

బి) ఆ వస్తువు ఇప్పుడు ప్రమేయం కాకపోయినా, అది కనీసం గతంలోనైనా ప్రమేయం అయివుండాలి; లేదా భవిష్యత్తులోనైనా ఏదో ఒక ప్రమాణానికి ప్రమేయం అయ్యే ఆస్కారం ఉండాలి.

సి) ఆ వస్తువు నాకు ప్రమేయం కాకపోయినా, వేరే ఎవరికైనా ప్రమేయంగా తెలిసివుండాలి.

ఇప్పుడు ఈ మూడు షరతులనూ కలిపితే, ఒక వస్తువు ఏదో ఒక ప్రమాణానికి ప్రమేయంగా అందాలి; ఏదో ఒక సమయంలో ప్రమేయం అవాలి; ఎవరో ఒక వ్యక్తికి ప్రమేయం అయివుండాలి.

సరే వాదనకోసం ఒక వస్తువు ఉందిగాని, దానికి ప్రమేయత్వ హోదా లేదు అనుకుందాము. అంటే పైన చెప్పిన ఏ షరతులకూ అది లోబడి లేదనుకుందాము. అలాంటప్పుడు, దాని ఉనికి గురించి మనం ఎప్పుడు మాట్లాడగలము? అలా ఉనికి ఉన్నట్టే తెలియని వస్తువును ఏమంటాము? అది లేనే లేదంటాము. లేదు, దానికి ఉనికి ఉందని ఒకవేళ మీరనేటట్టయితే, అది కేవలం ఊహాగానమే అవుతుంది కాని, దానికి ఉనికి లేనట్టే అవుతుంది. ఎవరికీ, ఎప్పుడూ, ఏ ప్రమాణం ద్వారా తెలియనిది ఎలా ఉంటుంది? అందువల్ల అది **అసత్** అవుతుంది.

**ప్రమేయత్వం ఉంటేనే ఒక వస్తువు సత్ కిందికి వస్తుంది**

2. **ప్రమేయానికి పరతంత్ర సత్తా** – ఒక వస్తువు ప్రమేయం హోదా పొందాలంటే, దాన్ని చూసే ప్రమాత ఒకరు ఉండాలి. ప్రమాతా అంటే ప్రమేయాన్ని చూసే సబ్జెక్టు, అంటే నేను. ప్రమాత అనే నేను, ప్రమేయం అనబడే వస్తువును చూస్తేనే దానికి ఉనికి ఉంటుంది. దాన్ని చూడకపోతే దాని గురించి ఎలా మాట్లాడతాను? ప్రమాత లేకపోతే ప్రమేయం ఉన్నా కూడా దాని గురించి మాట్లాడలేము.

**ప్రమాత ఉంటేనే ప్రమేయానికి ఉనికి**

3. **ప్రమాతకు పరతంత్ర సత్తా** – ప్రమేయం పరంగా నేను దాన్ని చూసే ప్రమాతను. కాని నేను ఎవరు? నేను ప్రమాతను కూడా కాదు. నేను సాక్షిచైతన్యాన్ని. సాక్షిచైతన్యమైన నేను, ఏదైనా చూడాలనుకుంటే ప్రమాతను అయి, ఒక ప్రమాణం ద్వారా, ఒక ప్రమేయాన్ని చూస్తాను. ఈ విషయం జాగ్రదావస్థను గమనిస్తే బాగా అర్థమవుతుంది. జాగ్రదావస్థలో సాక్షిచైతన్యమైన నేను, అనేక ప్రమాణాల ద్వారా అనేక ప్రమేయాల గురించి తెలుసుకుంటాను. అంటే అప్పుడు ప్రమాత వేషాన్ని వేసుకుంటాను.

స్వప్నప్రపంచంలో కూడా ఇదే పద్ధతి. నేను స్వప్నశరీరం ధరించి, స్వప్నప్రమాతగా, స్వప్నప్రమాణాలతో, స్వప్నవిషయవస్తువులను చూస్తాను. సుషుప్తిలో నేను ప్రమాణాలను వాడను కాబట్టి, అప్పుడు ప్రమాతను కూడా కాను.

అందువల్ల ప్రమాత అంటే తెలుసుకునే నేను. కాని ఆ తెలుసుకునే నేనుకి, సాక్షినైన నేను తెలుసుకోవాలనుకుంటేనే ఉనికి ఉంటుంది. లేకపోతే లేదు. అంటే ప్రమాత ఉనికి సాక్షిమీద ఆధారపడివుంది.

**ప్రమాతకు స్వతంత్ర సత్తా లేదు**

ఇంతవరకూ చూసిన మూడు అంశాలనూ క్రోడీకరించి చూస్తే – ప్రమేయానికీ, ప్రమాతకూ కూడా పరతంత్ర సత్తా మాత్రమే ఉంది. ప్రమేయం దాని ఉనికికి ప్రమాతమీద ఆధారపడితే, ప్రమాత సాక్షి లేదా ఆత్మమీద ఆధారపడుతుంది. ఈ రెండు వాక్యాలనూ కలిపితే, ప్రమేయం, ప్రమాత రెండూ సాక్షినైన నామీదనే వాటి ఉనికికి ఆధారపడతాయి. కాకపోతే వాటి మధ్య చిన్న భేదం ఉంది. ప్రమాత ప్రత్యక్షంగా నామీద ఆధారపడితే, ప్రమేయం పరోక్షంగా నామీద ఆధారపడింది.

నేను ఒక వ్యక్తికి 2 లక్షలు అప్పిచ్చాను; అప్పుతీసుకున్నతను అందులోంచి ఇంకొక వ్యక్తికి ఒక లక్ష అప్పిచ్చాడు అనుకుందాము. ఇద్దరూ నామీదే ఆధారపడినట్టే అర్థం. రెండవవ్యక్తి మొదటివ్యక్తిమీద ఆధారపడ్డాడు నిజమే, కాని ఆ మొదటివ్యక్తికి ఆ డబ్బు

ఎక్కడిది? నానుంచే వచ్చింది కదా! ఆ విధంగా ఇద్దరూ నామీదే ఆధారపడ్డారు. ఆ విధంగా తెలుసుకునే వ్యక్తి, తెలుసుకోబడే వస్తువు కూడా నామీదే, సాక్షిచైతన్యమైన నామీదే ఆధారపడ్డారు.

**ప్రమాత, ప్రమేయాలది పరతంత్ర సత్తా.**

4. **మిథ్యా నామరూపమ్** – ఇక్కడకు, మనం వేరే ఉపనిషత్తుల్లో నేర్చుకున్న కొన్ని కాన్సెప్ట్లను తెచ్చుకోవాలి. **దేనికైతే పరతంత్ర సత్తా ఉంటుందో అది మిథ్య**

మిథ్య అంటే దానికి విడిగా ఉనికి లేదు. ఈ సూత్రం ప్రకారం ప్రమాత, ప్రమేయం రెండూ మిథ్య అని చెప్పవచ్చు. రెండింటికీ విడిగా ఉనికి లేదు కాబట్టి.

తరువాత ఏదైతే మిథ్యో, అది కేవలం నామం, రూపం మాత్రమే అని చెప్పవచ్చు.

**నామరూపాత్మకమ్** – అవి సత్యవస్తువుమీద ఆధారపడతాయి. సత్యవస్తువును నేను, ఆత్మను, సాక్షిచైతన్యాన్ని.

దీన్నే తిరగేసి చెప్పాలంటే సత్య ఆత్మనైన నేనే ప్రమాతగా, ప్రమేయంగా మిథ్యా నామ రూపాలతో ప్రకటితమవుతున్నాను. నేను ప్రమాత, ప్రమేయాల వేషాలను ధరిస్తున్నాను.

5. **ఆత్మయొక్క వేషాలు** – ఇంకొక మెట్టు పైకి ఎక్కుదాము. కనిపిస్తున్న వీటిని మూడు తెగల కింద విభజించవచ్చు.

ఎ) స్థూలనామరూపం – జాగ్రదావస్థలో
బి) సూక్ష్మనామరూపం – స్వప్నావస్థలో
సి) కారణనామరూపం – సుషుప్తి అవస్థలో

జాగ్రదావస్థలో సాక్షినైన నేను స్థూల, మిథ్యా నామరూపాలలో, జాగ్రద్ ప్రమాత, జాగ్రద్ ప్రమేయంగా వేషాలు వేసుకుంటాను. అప్పుడు నా వేషం పేరు స్థూల ఆత్మా.

స్వప్నావస్థలో సూక్ష్మమిథ్యా నామరూపాలతో, స్వప్నప్రమాత, స్వప్నప్రమేయంగా వేషాలు వేసుకుంటాను. అప్పుడు నా వేషం పేరు సూక్ష్మ ఆత్మా.

సుషుప్తి అవస్థలో కారణమిథ్యా నామరూపాలతో, సుషుప్తి ప్రమాత, సుషుప్తి ప్రమేయంగా వేషాలు వేసుకుంటాను కాని అవి అవ్యక్తదశలో ఉంటాయి. అప్పుడు నా వేషం పేరు కారణ ఆత్మా. వీటిని మళ్ళీ చూద్దాము.

| | | | | |
|---|---|---|---|---|
| స్థూల ఆత్మా | = | జాగ్రత్ ప్రమాత | + | జాగ్రత్ ప్రమేయం |
| సూక్ష్మ ఆత్మా | = | స్వప్నప్రమాత | + | స్వప్న ప్రమేయం |
| సుషుప్తి ఆత్మా | = | సుప్తప్రమాత | + | సుషుప్తి ప్రమేయం |

అంటే ఆత్మనైన నేను వేసుకునే మూడు వేషాలు ఇవి. నేను, నా పరంగా చూస్తే, నేను **తురీయ ఆత్మా**. పైన చెప్పినవేవీ కాదు. అవి నా వేషాలు మాత్రమే.

**ప్రమాతృప్రమేయ విలక్షణ ఆత్మా అహమస్మి**

ఏదైనా వేషం వేస్తున్నప్పుడు ఆ వేషానికి తగ్గ ఆత్మను నేను. ఏ వేషమూ వేయనప్పుడు నేను తురీయ ఆత్మను. ఆ విధంగా నాకు నాలుగు అంశాలు లేదా లక్షణాలు ఉన్నాయి. వాటినే పాదాలు అంటున్నది ఉపనిషత్. ఆ నాలుగు అంశాలు – స్థూల ఆత్మా, సూక్ష్మ ఆత్మా, కారణ ఆత్మా, తురీయ ఆత్మా. అందువల్లనే ఆత్మను చతుష్పాత్ ఆత్మా అంది ఉపనిషత్.

**స్థూల ఆత్మా సూక్ష్మ ఆత్మా కారణ ఆత్మా తురీయ ఆత్మా రూపేణ అహం చతుష్పాత్ ఆత్మా భవామి**

నాలుగు పాదాలు ఉంటే వీటిలో ఏది సత్యం అని సందేహం రావచ్చు. మొదటి మూడూ మిథ్య. ఎందుకంటే అవి మిథ్యా నామరూపాలతో ఉన్నాయి. నాలుగవ పాదం ఒక్కటే శుద్ధచైతన్యం. అదే సత్యం. అంటే ఆత్మనైన నాకు ఒక సత్యపాదం, మూడు మిథ్యా పాదాలు ఉన్నాయి. అన్నీ కలిసి చతుష్పాద ఆత్మను అయ్యాను. **సోఽయమాత్మా చతుష్పాత్**.

3–7 మంత్రాల్లో వీటి గురించి వివరంగా చెప్పుకొస్తుంది ఉపనిషత్. మూడవ మంత్రం స్థూల ఆత్మ గురించి, నాలుగవ మంత్రం సూక్ష్మ ఆత్మ గురించి, ఐదు, ఆరు మంత్రాలు కారణ ఆత్మ గురించి చెబితే, ఏడవ మంత్రం తురీయ ఆత్మ గురించి బోధిస్తుంది. ఏడవ మంత్రం ఉపనిషత్తు మంత్రాలలోనే తలమానికమైన మంత్రం. ఈ ఆత్మల గురించి మూడు అవస్థల ద్వారా విచారణ చేస్తుంది కాబట్టి, ఈ చతుష్పాద ఆత్మ విచారణను అవస్థాత్రయ విచారణ అని కూడా అంటారు.

**అవస్థాత్రయ విచార రూప చతుష్పాత్ ఆత్మా విచారః**

ఈ స్థూల, సూక్ష్మ, కారణ ఆత్మలలో మళ్ళీ రెండు భాగాలు ఉన్నాయి. అవి ప్రమాత, ప్రమేయం. కాకపోతే సుషుప్తి అవస్థ అవ్యక్త అవస్థ కాబట్టి అందులో ఈ ప్రమాత, ప్రమేయం భేదం ప్రస్ఫుటంగా వ్యక్తమవదు.

ఈ మూడూ నేను వేసుకున్న వేషాలు. నేను ప్రమాతను కాను, ప్రమేయాన్ని కాను.

**ప్రమాతృ ప్రమేయ విలక్షణ కేవల చైతన్య రూపః తురీయ ఆత్మా అహమస్మి**

ఇదే మనం నేర్చుకునే వరుసక్రమం. ఇప్పుడు ఈ ఆత్మవిచారణలోకి అడుగు పెడదాము.

### మంత్రం 3

**జాగరితస్థానో బహిష్ప్రజ్ఞస్సప్తాంగ ఏకోనవింశతిముఖః స్థూలభుగ్వైశ్వానరః ప్రథమః పాదః ॥**

2. **చతుష్పాద ఆత్మ విచారణ – మంత్రాలు 3–7**

**సోఽయమాత్మా చతుష్పాత్** – అటువంటి ఆత్మ నాలుగు పాదాలు కలది. నిజానికి ఈ పదం రెండవ మంత్రంలోనే మొదలయింది. మూడవ మంత్రంనుంచి విచారణ కొనసాగుతుంది.

ఎ) **స్థూల ఆత్మా** – ముందే చూసినట్టుగా ఈ మూడవమంత్రం ఆత్మయొక్క మొదటి పాదాన్ని వివరిస్తుంది. దాని పేరు స్థూల ఆత్మా. కాకపోతే ఇక్కడ స్థూల ఆత్మా అనే పేరును ఉపనిషత్తు పెట్టలేదు, మనం తేలికగా అర్థం చేసుకోవటంకోసం పెట్టుకున్నాము. ఈ స్థూల ఆత్మా అనేది తురీయ ఆత్మ అయిన నేను వేసుకున్న మొదటి వేషం. ఈ స్థూల ఆత్మా జాగ్రదావస్థ ద్వారా చూస్తుంది. అందువల్ల ఉపనిషత్తు జాగరిత స్థానం పదాన్ని నిర్వచిస్తున్నది.

**జాగరితస్థానః** – జాగరితం అంటే మేలుకుని ఉన్న; స్థానం అంటే అవస్థ; అందువల్ల జాగరితస్థానః అంటే జాగ్రదావస్థలో ఉన్న స్థూల ఆత్మా. జాగరిత స్థానం అంటే జాగ్రదావస్థ పేరు కాదు; జాగ్రత్తావస్థలో అందుబాటులో ఉన్న చైతన్యం. జాగ్రదావస్థలో అందుబాటులో ఉండేది శుద్ధచైతన్యం కాదు. దీన్ని స్థూల ఆత్మా అంటారు. స్థూల ఆత్మాగా నేను రెండుగా విభజించుకుంటాను – జాగ్రత్ ప్రమాతగా, జాగ్రత్ ప్రమేయంగా. స్వప్నప్రపంచంలో నన్ను స్వాప్నికుడుగా, స్వప్నప్రపంచంగా ఎలా విభజించుకుంటానో, జాగ్రత్ ప్రపంచంలో కూడా అంతే.

నేను ప్రమాతను ఎప్పుడవుతాను? చైతన్యమైన నేను జాగ్రదావస్థలో వ్యష్టి స్థూల నామ రూపంతో వ్యవహరిస్తే ప్రమాతను అవుతాను; అదే నేను జాగ్రదావస్థలో సమష్టి ప్రపంచ స్థూలనామరూపంతో వ్యవహరిస్తే ప్రమేయం అవుతాను. ఈ రెండింటి గురించి ఈ మంత్రం వివరిస్తున్నది. ముందు ప్రమాత వివరణ చూద్దాము.

**బహిష్ప్రజ్ఞః** – జాగ్రదావస్థలోని ప్రమాతగా నేను బాహ్యాముఖంగా ఉంటాను. పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాల ద్వారా నేను బాహ్యాముఖంగా వ్యవహరిస్తాను.

నిజానికి, ఇదంతా ఒక గొప్ప ప్రణాళిక. ఈ అవస్థల గురించిన వివరాలనే ఒక జిగ్‌సా పజిల్‌లా కలిపితే, నేను సర్వం అని వస్తుంది. ప్రస్తుతం మొదటి పాదంలోనే ఉన్నాము. నేను బాహ్యాముఖంగా ఉంటాను అన్నాము కదా, ఎలా బాహ్యాప్రపంచంతో వ్యవహారం నడుపుతాను?

**ఏకోనవింశతిముఖః** – వింశతి అంటే ఇరవై. ఏకోన (ఏక+ఊన) అంటే ఒకటి తక్కువ. ముఖః అంటే అంగాలు. పందొమ్మిది అంగాల ద్వారా వ్యవహారం నడుపుతాను.

పంచజ్ఞానేంద్రియాణి – కన్ను, చెవి, ముక్కు, నాలుక, చర్మం
పంచకర్మేంద్రియాణి – వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ
పంచప్రాణాలు – ప్రాణ, అపాన, వ్యాన, సమాన, ఉదాన
చత్వారి అంతఃకరణాని – మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం

**జాగ్రదావస్థా కా? శ్రోత్ర అవయవాది జ్ఞానేంద్రియైః శబ్దాది విషయైశ్చ జ్ఞాయతే ఇతి సా జాగ్రదావస్థా** – తత్త్వబోధ

జాగ్రదావస్థ ఏమిటి అంటే జ్ఞానేంద్రియాలతో విషయవస్తువులను అనుభవించేది.

**స్థూలభుక్** – ఇది ప్రమాతయొక్క మూడవ వర్ణన. జాగ్రదావస్థలో స్థూలంగా ఉన్న బాహ్యప్రపంచాన్ని అనుభవిస్తాను. అది పంచస్థూలభూతాలవల్ల ఏర్పడింది కాబట్టి స్థూలప్రపంచం అయింది. స్వప్నావస్థలో ఈ స్థూలభూతాలు ఉండవు. స్వప్నప్రపంచాన్ని వాసనామయ ప్రపంచం అంటారు; జాగ్రత్ ప్రపంచాన్ని భౌతిక ప్రపంచం అని కూడా అంటారు. స్థూల అంటే స్థూలవస్తువులు; భుక్ అంటే అనుభవించే ప్రమాత – స్థూలప్రపంచం భుక్తే ఇతి స్థూలభూక్.

ఇంతవరకూ మనం చూసింది ప్రమాతయొక్క వర్ణనే. స్థూల ఆత్మకు రెండు అంశాలు ఉన్నాయి కాబట్టి, మనం ఇప్పుడు ప్రమేయం గురించి కూడా తెలుసుకోవాలి. ప్రమాతకు, చూసిన మూడు పదాలు ఒకసారి మళ్ళీ చూస్తే, అవి బహిష్ప్రజ్ఞః ఏకోనవింశతి ముఖః, స్థూలభుక్. ఇవికాక ఇంకొక వివరణను మనం కలుపుకోవాలి, ఉపనిషత్తు చెప్పకపోయినా కూడా. జాగ్రత్ ప్రమాతను విశ్వ అంటారు.

ఇప్పుడు ప్రమేయం గురించి వివరణను చూద్దాము. ఇప్పుడు శుద్ధచైతన్యమైన నేను జాగ్రత్ ప్రమేయాన్ని అవుతాను.

**వైశ్వానరః** – వైశ్వానరః పదాన్ని ముందు చూద్దాము. జాగ్రత్ ప్రమాతను విశ్వ అన్నట్టుగా, జాగ్రత్ ప్రమేయాన్ని విరాట్ అంటారు. ఇక్కడ విరాట్‌ను వైశ్వానరః అంటున్నది ఉపనిషత్తు. భగవద్గీతలో పదకొండవ అధ్యాయంలో విరాట్‌ను విశ్వరూప ఈశ్వరుడు అన్నాడు కృష్ణపరమాత్మ. ఛాందోగ్యోపనిషత్తు సప్తాంగ ఈశ్వరుడు అంటుంది.

**సప్తాంగః** – అంటే విరాట్‌కు ఏడు అంగాలు ఉన్నాయి. ఆ ఏడింటి పేర్లు ఛాందోగ్యోపనిషత్తులో వస్తాయి. అవి ఇక్కడకు తెచ్చుకుందాము.

1. తల – స్వర్గం
2. కన్ను – సూర్యుడు
3. శ్వాస – వాయువు
4. ముఖం – అగ్ని
5. శరీరం – ఆకాశం
6. మూత్రకోశం – సముద్రం
7. పాదాలు – పృథివి

ఇటువంటి వర్ణన విష్ణుసహస్రనామంలో కూడా చూస్తాము.

**భూః పాదౌయస్య నాభిర్వియ దసురనిలశ్చంద్రసూర్యౌ చ నేత్రే**

ఈ జాగ్రదావస్థలో నేను ప్రమాతగా, ప్రమేయంతో అద్భుతంగా ఆటాడుతాను, కాని వచ్చిన చిక్కేమిటంటే అది ఆట అని గ్రహించను. స్వప్నావస్థలో కూడా జరిగేది అదే కదా. నేను నా వాసనల ద్వారా స్వప్నప్రపంచాన్ని సృష్టించి, స్వాప్నికునిగా అందులోకి అడుగు పెడతాను. కాని అందులోకి అడుగుపెట్టగానే ఆ విషయం మర్చిపోతాను. అది నాకు ఒక పీడకలగా మారి, నన్ను హడలగొడుతుంది.

ఇప్పుడు ఈ మంత్రాన్ని టూకీగా చూస్తే –

ఎ) **స్థూల ఆత్మా – జాగ్రదావస్థ – బహిఃప్రజ్ఞ – విశ్వ – విరాట్ – ప్రథమపాదం.**

**మంత్రం 4**

**స్వప్నస్థానోఽ న్తః ప్రజ్ఞస్సప్తాంగ ఏకోనవింశతిముఖః ప్రవివిక్తభుక్తైజసో ద్వితీయః పాదః॥**

బి) **సూక్ష్మ ఆత్మా** – ఈ మంత్రం ఆత్మయొక్క రెండవ పాదాన్ని వివరిస్తుంది. దాని పేరు సూక్ష్మ ఆత్మా. ఈ సూక్ష్మ ఆత్మా అనేది, తురీయ ఆత్మా అయిన నేను వేసుకున్న రెండవ వేషం. ఈ సూక్ష్మ ఆత్మా స్వప్నావస్థ ద్వారా చూస్తుంది.

**స్వప్న స్థానః** – స్వప్న స్థానః అంటే స్వప్నావస్థలో ఉన్న సూక్ష్మ ఆత్మా. అంటే స్వప్నావస్థలో అందుబాటులో ఉన్న చైతన్యం. ఎందుకు అప్పుడు సూక్ష్మ ఆత్మా అంటారు? స్వప్నసమయం, స్వప్నప్రపంచం, స్వప్నంలోని వస్తువులు అన్నీ మనస్సు సృష్టించినవే.

సూక్ష్మ ఆత్మగా నేను రెండుగా విభజించుకుంటాను – స్వప్నప్రమాతగా, స్వప్నప్రమేయంగా. వ్యష్టిపరంగా చూస్తే ప్రమాత, సమష్టిపరంగా చూస్తే ప్రమేయం.

**వ్యష్టి సూక్ష్మ నామరూప దృష్ట్యా స్వప్నప్రమాతా భవతి**
**సమష్టి సూక్ష్మ నామరూప దృష్ట్యా స్వప్నప్రమేయ ప్రపంచః భవతి**

స్వప్న ప్రమాతాయొక్క సాంకేతిక పేరు తైజస; స్వప్న ప్రమేయంయొక్క సాంకేతిక పేరు హిరణ్యగర్భ.

**స్వప్నస్థానః ద్వితీయ పాదః** – నా రెండవ స్థానం స్వప్నావస్థ.

**అంతఃప్రజ్ఞః** – జాగ్రదావస్థలో నేను బహిర్ముఖంగా ఉన్నాను. కాని స్వప్నావస్థలో నేను బాహ్యప్రపంచాన్ని చూడలేను. ఎందుకంటే అప్పుడు నా శరీరం, ఇంద్రియాలు పడుకుంటాయి. అప్పుడు నేను చూసే ప్రపంచం నా మనస్సు సృష్టించిన వాసనామయ ప్రపంచం.

**యత్ దృష్టం యత్ శ్రుతం తజ్జనిత వాసనయా నిద్రాసమయే**
**యః ప్రపంచః ప్రతీయతే సా స్వప్నావస్థా** – తత్త్వబోధ

పగలు ఏవైతే చూస్తాడో, ఏవైతే వింటాడో, వాటి వాసనలనుంచి కనపడే ప్రపంచమే స్వప్నావస్థ అంటుంది తత్త్వబోధ. జాగ్రదావస్థలో నా మనస్సు వీడియో రికార్డర్‌లా పనిచేస్తుంది. అప్పుడు చూసినవన్నీ మనస్సులో రికార్డు అయివుంటాయి. అంటే పగలు చూసినవే రాత్రి కలలోకి వస్తాయి. నాకు తెలియనవి ఏవీ రావు. ఎలాగైతే టేప్‌రికార్డరులో రికార్డు చేయనిది ప్లే చేయలేమో, అలా మనస్సులో రికార్డు చేయనిది స్వప్నంగా రాదు. నేను ఎన్నడూ కనీవినీ ఎరగనివి చూస్తున్నానే అంటే, అది ఇప్పుడు కాకపోతే, పూర్వజన్మలో చూసి ఉండవచ్చు.

అలా వాసనలనుంచి వచ్చే ప్రపంచాన్ని చూస్తాను కాబట్టి ఈ ఇంద్రియాలు అవసరం లేదు. కాని తమాషా ఏమిటంటే అక్కడ విషయవస్తువులను అనుభవించటానికి స్వప్నశరీరం, స్వప్న ఇంద్రియాలు కావాలి. ఉదాహరణకు స్వప్నంలో సంగీతం, స్వప్నశరీరంయొక్క చెవులతో వింటాను.

**ఏకోనవింశతిముఖః** – ఇక్కడ కూడా పందొమ్మిది అంగాలతో చూస్తుంది సూక్ష్మశరీరం. కాకపోతే అవి అన్నీ మనస్సు సృష్టించినవే. స్వప్న అహంకారం స్వప్న పుత్రునిమీద, స్వప్నశరీరంమీద, స్వప్న ఇంటిమీద మమకారం పెంచుకుంటుంది.

**ప్రవివిక్త భుక్** – ఈ స్వప్న ఇంద్రియాల ద్వారా, స్వప్నవిషయవస్తువులు అనుభవించబడతాయి. స్థూలప్రపంచం పాంచభౌతికం అయితే, సూక్ష్మప్రపంచాన్ని వాసనామయ ప్రపంచం అంటారు. అందులో కనబడే పంచభూతాలు, రైలు, రైలు టికెట్టు, ప్రయాణం – అన్నీ నేను సృష్టించినవే. ఇక్కడ ప్రవివిక్త అంటే సూక్ష్మం; భుక్ అంటే ప్రమాత. అంటే సూక్ష్మప్రపంచ ప్రమాత. ఇంతవరకూ స్వప్నప్రమాత గురించి చూశాము.

**తైజసః** – స్వప్నప్రమాతను తైజస అంటారు.

ఇప్పుడు ప్రమేయం గురించి చూద్దాము. శుద్ధచైతన్యమైన నేను స్వప్నప్రమేయాన్ని అవుతాను.

**సప్తాంగః** – నేను స్వప్నప్రపంచంలో విరాట్‌ను. అంటే స్వప్నంలో సూర్యుడు విరాట్ కన్ను; స్వప్నంలో స్వర్గలోకం తల అలా వస్తుంది.

**హిరణ్యగర్భ** – సూక్ష్మప్రపంచ అధిష్ఠానాన్ని హిరణ్యగర్భ అంటారు. అది ఇక్కడ ఇవ్వలేదు. మనం కలుపుకోవాలి.

ఇప్పుడు ఈ మంత్రాన్ని టూకీగా చూస్తే –

బి) **సూక్ష్మ ఆత్మా – స్వప్నావస్థ – అంతఃప్రజ్ఞ – తైజస – హిరణ్యగర్భ – ద్వితీయపాదం**

## మంత్రం 5

**యత్ర సుప్తో న కంచన కామం కామయతే న కంచన స్వప్నం పశ్యతి తత్సుషుప్తమ్। సుషుప్తస్థాన ఏకీభూతః ప్రజ్ఞానఘన ఏవానందమయో హ్యానందభుక్చేతోముఖః ప్రాజ్ఞస్తృతీయః పాదః ॥**

సి) **కారణ ఆత్మా** – ఈ మంత్రం, తరువాత వచ్చే మంత్రం ఆత్మయొక్క మూడవ పాదాన్ని వివరిస్తాయి. దాని పేరు కారణ ఆత్మా. ఈ కారణ ఆత్మా అనేది తురీయ ఆత్మా అయిన నేను వేసుకున్న మూడవ వేషం.

**తృతీయపాద సుషుప్త స్థానః** – నా మూడవస్థానం సుషుప్తి అవస్థ. చైతన్యం అయిన నేను, జాగ్రదావస్థతో చేతులు కలిపితే, నేను జాగ్రద్‌పురుషుణ్ణి; స్వప్నావస్థతో చేతులు కలిపితే, నేను స్వప్నపురుషుణ్ణి; సుషుప్తి అవస్థతో చేతులు కలిపితే, నేను సుప్తపురుషుణ్ణి. కాని నా స్వరూపరీత్యా చూస్తే, నేను ఈ మూడింటిలో ఏదీ కాను. ఇవి నేను వేసుకున్న వేషాలు మాత్రమే.

ఉపనిషత్తు, జాగ్రదావస్థకూ, స్వప్నావస్థకూ నిర్వచనాలు ఇవ్వలేదు. ఎందుకంటే అవేమిటో మనకు తెలుసు. అయినా మనం తత్త్వబోధలోంచి వీటికి నిర్వచనాలను చూశాము. పంచజ్ఞానేంద్రియాలతో ప్రపంచాన్ని చూస్తే అది జాగ్రదావస్థ; మనస్సు సృష్టించిన వాసనామయ ప్రపంచాన్ని చూస్తే అది స్వప్నావస్థ.

**యత్ర సుప్తో న కంచన కామం కామయతే న కంచన స్వప్నం పశ్యతి తత్సుషుప్తమ్** – ఇది సుషుప్తియొక్క నిర్వచనం.

**యత్ర సుప్తః** – సుప్తః అంటే గాఢనిద్ర స్థితి. ఆ స్థితిలో, అంటే ఎక్కడైతే గాఢనిద్రస్థితి ఉంటుందో,

**న కంచన కామం కామయతే** – బాహ్యవస్తువులను వేటినీ కోరడు. ఎందుకు? అతను ముక్తి పొందాడా? ముక్తి పొందలేదు, అయినా కోరడు. అతను బాహ్యవస్తువులను కోరడు అంటే దాని అర్థం బాహ్యవస్తువులను అనుభవించడు. బాహ్యవస్తువులు అనుభవంలోకే రానప్పుడు, వాటిని కోరే అవకాశం ఎక్కడిది?

**న కంచన స్వప్నం పశ్యతి** – స్వప్నప్రపంచాన్ని కూడా అనుభవించడు. స్వప్నప్రపంచాన్ని వాసనామయ ప్రపంచం అన్నాము. అంటే అతను ఇటు బాహ్యప్రపంచాన్నీ అనుభవించడు, అటు వాసనామయ ప్రపంచాన్నీ అనుభవించడు. ఇటువంటి స్థితిని గాఢనిద్ర స్థితి అంటారు.

టూ–ఇన్–వన్‌లో మూడు బటన్లు ఉంటాయి. అవి టేప్‌రికార్డర్, రేడియో, స్లీప్‌మోడ్. అలాగే మీ శరీరమనే టూ–ఇన్–వన్‌లో కూడా అవస్థాత్రయం ఉంది; మీరు అవస్థాత్రయ సాక్షి, ఇప్పుడు మీ శరీరం స్లీప్‌మోడ్‌లో ఉంది.

**న కంచన కామం కామయతే** – జాగ్రదావస్థను త్రోసిపుచ్చటం

**న కంచన స్వప్నం పశ్యతి** – స్వప్నావస్థను త్రోసిపుచ్చటం.

**తత్ సుషుప్తమ్** – అటువంటి అవస్థను సుషుప్తి అంటారు. గాఢనిద్ర అంటారు. నిద్ర అనవచ్చు కదా, గాఢనిద్ర అని ప్రత్యేకించి విశేషణం వాడటం ఎందుకు? నిద్రలో స్వప్నం కంటాము; గాఢనిద్రలో స్వప్నం కూడా ఉండదు. ఈ సుషుప్తి అవస్థ నా మూడవ స్థానం. సుషుప్త స్థానః అంటే సుషుప్తి అవస్థలో ఉన్న కారణ ఆత్మా. అదెలా ఉంది?

**ఏకీభూతః** – భేదాలన్నీ లయమయిపోతాయి సుషుప్తిలో. పంచజ్ఞానేంద్రియాలతో ప్రపంచాన్ని ఐదుగా విభజించి చూస్తాము. అవి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు. ఉదాహరణకు కళ్ళు రూపాన్ని చూస్తాయి.

**తన్మాత్ర కరణోప సంహరణతః**

లయమవుతాయి అంటే భేదాలు అసలు ఉండవనికాదు అర్థం. భేదాలు అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయి. అందువల్లనే ఈ అవస్థను కారణ అవస్థ లేదా అవ్యక్త అవస్థ అంటారు.

వస్తువుల మధ్య భేదం లేకపోతే, వాటిని చూసే మన జ్ఞానంలో కూడా భేదం ఉండదు. ఉదాహరణకు రెండు భిన్నవస్తువులను తీసుకుందాము. పుస్తకం, కలం. ఆ భిన్నవస్తువులను చూస్తే, నా మనస్సులో కూడా వాటి గురించిన భిన్నజ్ఞానం ఉంటుంది. పుస్తకం గురించిన జ్ఞానం వేరు, కలం గురించిన జ్ఞానం వేరు. ఆ విధంగా బాహ్యప్రపంచంలోని భేదాలు, నా మనస్సులో కూడా జ్ఞానం రూపంలో భేదాలను కలుగజేస్తాయి. ఆ జ్ఞానాన్ని వృత్తిజ్ఞానం అంటారు. ఎన్ని బాహ్యవస్తువులను చూస్తే, అన్ని వృత్తిజ్ఞానాలు ఉంటాయి.

కాని సుషుప్తిలో ఈ విషయవస్తువుల భేదం లయమవుతుంది. విషయవస్తువులు లయమయితే, వాటిని చూసే వృత్తిజ్ఞానం కూడా లయమవుతుంది. వాటి గురించిన భిన్నజ్ఞానం కూడా ఉండదు. ఒక గదిలో ఐదుగురు మనుష్యులు గాఢనిద్ర పోతున్నారంటే, వారంతా సమానమే. అదెలా? అందరూ సమానంగా అజ్ఞానంలో ఉన్నారు. మెలకువగా ఉన్నప్పుడు ఒకరు ఫిజిక్స్‌లో దిట్టలై ఉండవచ్చు, మరొకరు కెమిస్ట్రీలో ఆరితేరి ఉండవచ్చు. కాని వారు గాఢంగా నిద్ర పోతున్నప్పుడు వారిలో వారి జ్ఞానం ఉండదు. కాని అదృష్టం ఏమిటంటే, వారు నిద్ర లేవగానే, వారి జ్ఞానం వారికి తిరిగి వస్తుంది.

**ప్రజ్ఞాన ఘనః** – వృత్తిజ్ఞానాల మధ్య భేదం ఉండదు. ప్రజ్ఞానం అంటే వృత్తిజ్ఞానం; ఘనం అంటే అన్నీ లయమయిపోతాయి.

ఏకీభూతః – వస్తువులు లయమవుతాయి

ప్రజ్ఞానఘనః – జ్ఞానం లయమవుతుంది.

లయమవటం అంటే మాయమవటం కాదు, అవ్యక్తంలోకి వెళ్ళటం అని మర్చిపోకూడదు. కారణావస్థలోని ప్రమాతకు సాంకేతిక పేరు ప్రాజ్ఞ, కారణ ప్రమేయానికి సాంకేతిక పేరు అంతర్యామి.

జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ ఈ ప్రమాత, ప్రమేయాల మధ్య భేదం స్పష్టంగా తెలుస్తుంది కాని సుషుప్తిలో తెలియదు కాని మనం అందులో కూడా ప్రమాతా, ప్రమేయాలు భిన్నంగానే ఉన్నట్టు తీసుకోవాలి. ప్రాజ్ఞ గురించి ఈ మంత్రంలో వస్తే, అంతర్యామి గురించి ఆరవ మంత్రంలో వస్తుంది.

**ఆనందమయః** – సుషుప్తి అవస్థ ఆనందంతో నిండివుంటుంది. ఎందుకు ప్రాజ్ఞ ఆనందంతో నిండివుంటుంది? దానికి రెండు కారణాలు చెప్పవచ్చు.

1. నా వ్యక్తిగతమైన నామరూపాలు నన్ను పరిచ్ఛిన్నం చేస్తాయి. నేను ఒక భర్తను, నా వయస్సు ఇంత, నేను ఫలానా, ఇలా నా గురించి వివరాలు నాకు పరిమితిని విధిస్తాయి. కాని సుషుప్తిలో ఈ నామరూపాలు లయమయిపోతాయి. నేను ఫలానా వ్యక్తిని అనే వివరణ ఉండదు. ఎప్పుడైతే నామ, రూపాలు లయమవుతాయో, అప్పుడే నామరూపాలను వెన్నంటి వచ్చే పరిధులు కూడా లయమవుతాయి. సుషుప్తిలో ఈ పరిచ్ఛిన్నత్వం లయమవుతుంది. అది పోదు, ఒకవేళ పోయినట్టయితే జ్ఞానం కలిగినట్టు అవుతుంది. అందువల్ల, సుషుప్తిలో అది అవ్యక్తంలో ఉంటుంది. అవ్యక్తంలో ఉన్నది, ఉన్నా లేనట్టే. అందువల్ల నేను అనంతం అవుతాను. అనంతం అంటే ఆనందం; పరిచ్ఛిన్నం దుఃఖం.

**యత్ అల్పం తత్ మర్త్యం తత్ దుఃఖం**
**యో వై భూమా తత్సుఖమ్** – ఛాందోగ్యమ్

పరిమితి ఉన్నది దుఃఖం; పరిమితి లేనిది ఆనందం. నాకు తాత్కాలికంగా పరిమితి లేదు. అందువల్ల నేను ఆనందమయః.

నిజానికి నా స్వరూపం ఆనందం. కాని ఇక్కడ ఉపనిషత్తు జాగ్రత్తగా పదం వేసింది. ఆనందస్వరూపం అనలేదు; ఆనందమయః అంది. ఎందుకు? ఆనందమయః అంటే తాత్కాలికంగా కలిగే కోశానందం, అనంతత్వం. కోశానందం అనుభవంలోకి వస్తుంది. అంటే సుషుప్తినుంచి లేచాక నేను చాలా హాయిగా నిద్రపోయాను అంటాను. కాని లేచిన మరుక్షణం ఈ ఆనందం మటుమాయమైపోతుంది. నిజానికి, లేస్తూనే ఏదో బెంగతో లేస్తాను. అందువల్ల ఇది నా స్వరూపం కాదు, ఇది ఒక అవస్థలో తాత్కాలికంగా కలిగిన ఆనందం.

2. వ్యక్తిగా నేనొక పరిమితి ఉన్న జీవిని అయినప్పుడు, అందులో ద్వైతం ఉంటుంది. జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ ప్రమాత, ప్రమేయం భేదం ఉంది. దాన్ని ద్వైతం అంటారు. ప్రమాతగా నేను ప్రమేయం గురించి తెలుసుకోవటానికి ఒక ప్రమాణాన్ని వాడతాను. అప్పుడు మూడవ వస్తువు వస్తుంది కాబట్టి దాన్ని త్రిపుటి అంటారు. అందువల్ల ఈ రెండు అవస్థలనూ సవికల్ప అవస్థ అంటారు. సవికల్ప అంటే వికల్పం ఉన్న అవస్థ.

ఎక్కడ భేదం ఉంటుందో అక్కడ సంసారం ఉండక తప్పదు. నాకు కొన్నింటిమీద రాగం ఏర్పడితే, మరికొన్నిటిమీద ద్వేషం ఏర్పడుతుంది. కాని సుషుప్తిలో ఈ రాగద్వేషాలు ఉండవు కాబట్టి, సుషుప్తిని ఆనందమయః అన్నది ఉపనిషత్తు.

సుషుప్తిని నిర్వికల్పక అవస్థ అంటారు. ఈ నిర్వికల్పక అవస్థను ప్రతి ఒక్కరూ అనుభవిస్తారు. ఎవరూ దీనికోసం ప్రత్యేకించి ప్రయత్నించనవసరం లేదు. ఇది నిర్వికల్ప సమాధిని పోలివుంటుంది. రెండింటిలోనూ ద్వైతం లేదు. అందువల్ల మనం నిర్వికల్ప సమాధి కోసం ప్రయత్నించనవసరం లేదు. అది ప్రతిరాత్రీ అనుభవిస్తూనే ఉన్నాము. నిర్వికల్ప అవస్థలో అంటే సుషుప్తిలో అనండి, సమాధి అనండి, సంసార నివృత్తి జరుగుతుంది కాని అది తాత్కాలికమే. అందువల్ల అప్పుడు కలిగే ఆనందం కూడా తాత్కాలికమే అవుతుంది. అందువల్లనే దాన్ని ఆనందస్వరూపం అనలేదు, ఆనందమయః అంది ఉపనిషత్తు అని చూశాము.

వేదాంతం ఈ నిర్వికల్ప అవస్థకోసం ప్రయత్నించమని కోరదు; నిర్వికల్పజ్ఞానం పొందండి అంటుంది. నిర్వికల్ప జ్ఞానం వేదాంత అధ్యయనం చేస్తే కలుగుతుంది. ఇలా జ్ఞానంవల్ల కలిగిన నిర్వికల్పం సదా ఉంటుంది. నిర్వికల్ప సమాధి, యోగం. ఈ రెండింటి మధ్యనున్న భేదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. యోగి అవస్థకోసం పాటుపడితే, వేదాంతి జ్ఞానం కోసం పాటుపడతాడు. జ్ఞానం – **అహం నిర్వికల్పః అస్మి**. ఎలా పొందాలి ఆ జ్ఞానం? అదే ముందు ముందు చూడబోతున్నాము.

**ఆనంద భుక్** – భుక్ అంటే ప్రమాతా; ఆనంద భుక్ అంటే ఆనందాన్ని అనుభవించే ప్రమాత. ప్రాజ్ఞ ఆనందంతో నిండివుండటం మాత్రమే కాదు, ఆ ఆనందాన్ని కారణశరీరంలో నిక్షిప్తం చేస్తుంది. జాగ్రదావస్థలో, మనం అనుభవించే అనుభవాలు మనస్సులో నిక్షిప్తం అవుతాయి. కాని సుషుప్తికి వచ్చేసరికి, మనస్సు కూడా పడుకుంటుంది. మనస్సు కారణశరీరంలో పడుకుంటుంది. ఆ కారణశరీరం సుషుప్తిలో కలిగే అనుభవాన్ని నిక్షిప్తం చేస్తుంది. జాగ్రదావస్థలోని అనుభవానికీ, సుషుప్తి అవస్థలోని అనుభవానికీ మధ్య భేదం ఏమిటి?

జాగ్రదావస్థలో మనస్సు ద్వారా అనుభవిస్తాను కాబట్టి, అనుభవిస్తున్నప్పుడే నాకు నేను ఫలానాది అనుభవిస్తున్నాను అని తెలుస్తుంది. ఉదాహరణకు నేనొక ప్రసంగం వింటుంటే, నేను ఆ ప్రసంగాన్ని వింటున్నాను అని నాకు అప్పుడే తెలుస్తుంది. సుషుప్తిలో మనస్సు పనిచేయదు కాబట్టి, నేను గాఢనిద్ర పోయినా, గాఢనిద్ర పోయినట్టు అప్పుడు తెలియదు; ఆనందం అనుభవిస్తున్నట్టు అప్పుడు తెలియదు. కాని ఆ అనుభవాన్ని కారణశరీరం నిక్షిప్తం చేస్తుంది.

కారణశరీరం నిక్షిప్తం చేస్తుందని మాత్రం ఎలా తెలుసు? నిద్ర పోయినప్పుడు తెలియక పోయినా, నిద్రనుంచి లేచాక, 'నేను హాయిగా నిద్రపోయాను,' అని చెప్పగలుగుతున్నాను. గాఢనిద్ర విషయంలో ఎప్పుడూ భూతకాలమే వాడగలము. జాగ్రదావస్థ గురించి చెప్పేటప్పుడు 'నేను మెలకువగా ఉన్నాను,' అని వర్తమానకాలం వాడవచ్చు. కాని 'నేను నిద్రపోతున్నాను,' అని వర్తమానకాలం వాడలేము. ఒక పజిల్ ఉంది. ఏ ప్రశ్నకు నువ్వు ఎప్పుడూ 'అవును' అని జవాబు చెప్పలేవు? ఆ ప్రశ్న 'నువ్వు గాఢనిద్ర పోతున్నావా?' ప్రాజ్ఞ, ఆ అనుభవాన్ని అప్పుడు నిక్షిప్తం చేస్తే, నేను నిద్రలేచాక, 'నేను గాఢనిద్ర పోయాను,' అని చెబుతాను.

**ప్రాజ్ఞః** – ప్రాజ్ఞఃకు రెండు అర్థాలు ఉన్నాయి.

1. అన్నింటి గురించిన పూర్తి అజ్ఞానంలో ఉన్నాడు. తనకున్న వ్యక్తిగత జ్ఞానం అంతా అవ్యక్తంలో ఉంది. **ప్రకర్షేణ అజ్ఞః ఇతి ప్రాజ్ఞః**

అతను పొందిన ఏ జ్ఞానం కూడా అప్పుడు అందుబాటులో ఉండదు. అందువల్ల వ్యష్టిగా నేను అజ్ఞాని.

2. ప్రాజ్ఞ అయిన నేను, అప్పుడు సమష్టి అంతర్యామిలో ఐక్యం అవుతాను. అంతర్యామి సర్వజ్ఞుడు. అందువల్ల నేను కూడా సర్వజ్ఞుణ్ణి అవుతాను. అందువల్ల ప్రాజ్ఞ అంటే సమష్టిపరంగా నేను సర్వజ్ఞుణ్ణి.

ఇక్కడ మనం వ్యష్టిపరంగా అజ్ఞాని అనే అర్థాన్నే తీసుకుందాము. ఎందుకంటే, ఈ మంత్రం ప్రమాతకు చెందినదైతే, వచ్చే మంత్రం సమష్టికి లేదా ప్రమేయానికి చెందినది.

**చేతోముఖః** – ఇది ఒక సాంకేతిక పదం. ఈ సాంకేతిక పదం ద్వారా ఒక సాంకేతిక సమాచారం ఇవ్వటం జరుగుతున్నది. దీనిద్వారా ఒక ముఖ్యమైన విషయం తెలుసుకో బోతున్నాము. జాగ్రద్‌పురుషుడు సరాసరి స్వప్నంలోకి జారుకోలేడు. అతను సుషుప్తిలోకి వెళ్ళి, గాఢనిద్ర ద్వారా స్వాప్నికుడు అవాలి. అలాగే స్వాప్నికుడు కూడా స్వప్నంనుంచి వెంటనే జాగ్రదావస్థకు రాలేడు. మధ్యలో సుషుప్తిలోకి వెళ్ళి, తర్వాత జాగ్రదావస్థలోకి వస్తాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే జాగ్రద్ పురుషునికీ, స్వప్నపురుషునికీ మధ్య ప్రత్యక్షంగా సంబంధం లేదు. అది సుప్తపురుషుని ద్వారానే వెళ్ళాలి.

అదే అవస్థాపరంగా చెబితే, జాగ్రదావస్థనుంచి సరాసరి స్వప్నావస్థలోకి వెళ్ళలేము; స్వప్నావస్థలోంచి సరాసరి జాగ్రదావస్థకు రాలేము. మధ్యలో సుషుప్తి అవస్థకు వెళ్ళితీరాలి. అలా ఎందుకు చేయాలో ఉపనిషత్తు తార్కికంగా చెప్పదు, కాని మనం ఊహించవచ్చు.

జాగ్రదావస్థలో మనం ఈ స్థూలశరీరంతో వ్యవహారం నడుపుతాము, కాని స్వప్నావస్థలో ఈ స్థూలశరీరం పనికిరాదు. అది మంచంమీద కదలిక లేకుండా పడుకుని ఉంటుంది. స్వప్నప్రపంచంలో వేరే స్వప్నశరీరాన్ని ధరించి, స్వప్నమనస్సును, స్వప్న ఇంద్రియాలను ఉపయోగిస్తాము. అంటే ఈ రెండు అవస్థల్లో ఉన్న శరీరాలు వేరు. ఒకేసారి, రెండు భిన్నశరీరాలను ధరించలేము కదా! స్వప్నంలోకి వెళ్ళాలంటే, ఈ స్థూలశరీరంనుంచి విడివడాలి. అలాగే స్వప్నంనుంచి బయటకు రావాలంటే, ఆ స్వప్నశరీరంనుంచి విడివడి, స్థూలశరీరాన్ని మళ్ళీ ధరించాల్సి ఉంటుంది.

ఇది చొక్కా మార్చటంవంటిది. ఒక కొత్త చొక్కా వేసుకోవాలంటే, వంటిమీద ఉన్న పాతచొక్కా విప్పి, కొత్తది వేసుకోవాలి. అదేవిధంగా, ఈ శరీరం మార్చి ఇంకొక శరీరం ధరించాలన్నా కూడా, మధ్యలో కొంత సమయం కావాలి. ఆ సమయాన్ని సుషుప్తి అంటున్నది ఉపనిషత్తు. కాకపోతే, ఈ మధ్యకాలం ఎంత వేగంగా జరుగుతుందంటే, మనకు ఆ విషయం తెలియటం లేదు. ఈ మధ్యకాలాన్ని చేతోముఖః అంటున్నది ఉపనిషత్తు.

ముఖః అంటే ముఖం లేదా ద్వారం. చేతః అంటే జాగ్రత్, స్వప్నావస్థలు. అంటే విశ్వ, తైజసల మధ్యనున్న ద్వారం.

ఇది మూడవపాదం, వ్యష్టిపరంగా. ఇదే పాదాన్ని సమష్టిపరంగా, అంటే ప్రమేయపరంగా వచ్చే మంత్రంలో చూస్తాము.

## మంత్రం 6

**ఏష సర్వేశ్వర ఏష సర్వజ్ఞ ఏషోఽంతర్యామ్యేష యోనిస్సర్వస్య ప్రభవాప్యయౌ హి భూతానామ్ ॥**

సుషుప్తి ప్రమాతను ప్రాజ్ఞ అనీ, ప్రమేయాన్ని అంతర్యామి అనీ అంటారని చూశాము.

**ఏషః** – శుద్ధచైతన్యమైన నేను ప్రళయంలో కాని, సుషుప్తిలో కాని అవ్యక్తంగా ఉన్న నామరూపాన్ని. అవ్యక్తంగా ఉన్నదేదైనా కారణం. విత్తనం కారణం. ఎందుకంటే అందులో చెట్టు అవ్యక్తంగా ఉంది.

**ఏష అంతర్యామీ** – అవ్యక్తంగా ఉన్న ఈ అంతర్యామినుంచి మొత్తం జగత్తు వచ్చింది. అంటే అంతర్యామి జగత్కారణం. మొత్తం సృష్టి అంటే స్థూలనామరూపాలతో ఉన్న జాగ్రత్ ప్రపంచం; సూక్ష్మనామరూపాలతో ఉన్న స్వప్నప్రపంచం. ఈ రెండూ సమష్టి కారణప్రపంచంనుంచి వచ్చాయి. అందువల్ల మూడవ పాదాన్ని కారణ ఆత్మా అంటారు.

**సర్వేశ్వరః** – చైతన్యం అయిన నేను, కారణప్రపంచంలో వేసుకున్న వేషం ఈశ్వరుడు. నీటికి సముద్రం అనే పేరు వచ్చినట్టుగా శుద్ధచైతన్యానికి కారణావస్థలో అంతర్యామి అనే పేరు వచ్చింది. అంతర్యామి, ఈశ్వరుడు పదాలు రెండూ వాడతారు. నీటిని సముద్రం అంటారు అంటే, ఏ నీరైనా సముద్రం కాదు; దానికొక ప్రత్యేకమైన నామరూపాలు ఉండాలి. అది సమష్టిరూపం అయివుండాలి. అలాగే ఇక్కడ చైతన్యానికి ఇచ్చిన నామం ఈశ్వరుడు. చైతన్యం లేకుండా, విడిగా ఏదీ లేదు.

ఈశ్వరుడు అంటే చైతన్యంయొక్క నామరూపం, అది కూడా సమష్టి నామరూపం, అది కూడా సమష్టి అవ్యక్త నామరూపం. సర్వేశ్వరుడు అంటే అన్నింటికి అధిపతి. అంటే సర్వశక్తిమంతుడు.

**ఏషః సర్వజ్ఞః** – ఈ ఈశ్వరుడు సర్వజ్ఞుడు. సూక్ష్మస్థూల ప్రపంచాలను సృష్టించాడు.

ఏషః అంతర్యామీ– ఈ ఈశ్వరుడు సర్వాంతర్యామి. ఎలా?

**ఏషః సర్వస్య యోనిః** – ఈ మొత్తం సృష్టికి ఉపాదానకారణం. అవ్యక్తంనుంచే అన్ని నామరూపాలూ వస్తాయి.

మట్టి ఉపాదానకారణంగా ఉన్నప్పుడు, దానినుంచి కుండ ప్రపంచం రాకముందు, మట్టి వృత్తాకారంలో ఉంది. జామెట్రీలో కూడా ఒక సర్కిల్‌లో అన్ని ఆకారాలు ఇమిడి ఉన్నాయని వస్తుంది. సర్కిల్‌లో ట్రైయాంగిల్, స్క్వేర్, రెక్టాంగిల్, అలా ఎన్నో ఆకారాలు దాగివున్నాయి. అలాగే వృత్తాకారంలో ఉన్న మట్టిలో కుండ, కూజా, పళ్ళెం, తులసికోట, అలా ఎన్నో ఆకారాలు దాగివున్నాయి. అందువల్లనే శివలింగానికి పూజ చేయటం ఇంకా

ఎక్కువస్థాయి పూజ అంటారు. ఎందుకంటే లింగాకారంలో అన్ని ఆకారాలూ ఇమిడివుంటాయి. అదే మానవాకారాలను తీసుకుంటే ఒక ఆకారానికి ఇంకొక ఆకారాన్ని ఆపాదించలేము. రామునిలో గణేష్‌ని చూడలేము; కృష్ణునిలో దుర్గాదేవిని చూడలేము. కాని శివలింగంలో అన్ని రూపాలు దాగివున్నాయి. ఆ విధంగా వృత్తాకారం, అన్ని నామరూపాలకు ఉపాదానకారణం. ఈ సూత్రం ప్రకారం ఈశ్వరుడు, మొత్తం ప్రపంచానికి సృష్టికారణం. ఈ సృష్టి ఈశ్వరునియొక్క అవ్యక్తరూపంనుంచి వచ్చింది. యోనిః అంటే ఉపాదానకారణం. ఉపాదానకారణం అంటే ఏమిటి? ఉపనిషత్తే వివరిస్తున్నది.

**ప్రభవాప్యయౌ హి భూతానామ్** – ఉపాదానకారణం సృష్టి, స్థితి, లయ కారణం. మట్టి ఉదాహరణ తీసుకుంటే, కుండలన్నీ మట్టినుంచే వచ్చి, మట్టివల్లనే స్థితి పొంది, మట్టిలోనే లయమైపోతాయి. అలాగే అలలన్నీ సముద్రంనుంచే పుట్టి, సముద్రంవల్లనే స్థితిపొంది, సముద్రంలోనే లయమైపోతాయి. ప్రభవః అంటే సృష్టికారణం; అప్యయః అంటే లయకారణం. సృష్టి, లయకారణం అంటే ఈ రెండింటి మధ్యలో ఉన్న స్థితికారణాన్ని కూడా కలుపుకుంటాము. భూతానాం అంటే అనేక జీవులు. ఆ విధంగా ఈశ్వరుడు ఉపాదానకారణంగా అనేక జీవులకు సృష్టి స్థితి లయ కారకుడు. మూడవ పాదం కారణం అయితే, కార్యం ఏమిటి? మొదటి పాదం, రెండవ పాదం కార్యం. అంటే ఈశ్వరుడు కారణం; స్థూలప్రపంచం, సూక్ష్మప్రపంచం కార్యం.

5, 6 మంత్రాలను టూకీగా చూస్తే –

సి) **కారణ ఆత్మా – సుషుప్తి అవస్థ – ప్రజ్ఞాన ఘనః – ప్రాజ్ఞ – అంతర్యామి/ఈశ్వరుడు – తృతీయపాదం.**

(ఈ మూడు పాదాలను **పట్టిక 1 – సత్య ఆత్మయైన నా వేషాలు**లో ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు.)

కారణం, కార్యం రెండూ అయిపోతే, మరి నాలుగవ పాదం ఏమిటి? నాలుగవ పాదం **కార్యకారణ విలక్షణం**; కారణానికీ, కార్యానికీ అతీతంగా ఉంది. కార్యకారణాలకు అతీతంగా ఉంటే, అది దేశ, కాలాలకు కూడా అతీతంగా ఉంటుంది. అది అనంతం అవుతుంది. అందువల్ల నాలుగవ పాదం అనంతం. దాన్ని తురీయం పేరుతో చూస్తాము ఇక్కడ. మన అంతిమగమ్యం ఈ తురీయానికి చేరుకుని, ఆ తురీయాన్ని నేనే అని అర్థం చేసుకోవటం. కారణం కూడా కాలంలోకే వస్తుంది. ఎందుకంటే కారణం కార్యంగా మారటానికి వికారం చెందుతుంది.

ముందుకు వెళ్ళే ముందు, ఇంకొక విషయాన్ని గమనించాలి. తృతీయపాదం ఉపాదానకారణం అయితే నిమిత్తకారణం ఏమిటి? కుండ విషయమే తీసుకుంటే మట్టి ఉపాదానకారణం, దాన్ని సృష్టించిన కుమ్మరి నిమిత్తకారణం; ఆభరణానికి బంగారం ఉపాదానకారణం, కంసాలి నిమిత్తకారణం. అలా ఉపాదాన కారణం వేరు, నిమిత్తకారణం వేరు ఉంటాయి. కాని కొన్ని అసాధారణ సందర్భాలు కూడా లేకపోలేదు. ముండకోపనిషత్తు ఆ అసాధారాణ సందర్భాన్ని పేర్కొంటుంది. **యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ** – ముండకమ్

సాలెపురుగే నిమిత్తకారణమూ, ఉపాదానకారణమూ కూడా. ఆ విధంగా భగవంతుడు నిమిత్తకారణమూ, ఉపాదానకారణమూ కూడా. ఎందుకంటే సృష్టికి ముందు భగవంతుడొక్కడే ఉన్నాడు.మళ్ళీ ఈశ్వరుడే నిమిత్తకారణం కూడా అంది. ఎలా చెప్పగలము? సర్వజ్ఞః పదం వేసింది. ఒక మామూలు కుండ చేయాలంటేనే దానికి తగ్గ ప్రజ్ఞాపాటవాలు ఉండాలి. కుమ్మరి చేస్తుండగా చూసి, 'ఓస్ ఇంతేనా, నేనూ చేస్తాను,' అని ప్రయత్నించి చూస్తే ఏమవుతుంది? కుండ మధ్యలోనే పగిలిపోతుంది. ఆకారమే రాదు. కాని భగవంతుడు జాగ్రద్ ప్రపంచాన్ని, స్వప్నప్రపంచాన్ని కూడా సృష్టించాడు. అందువల్ల ఈశ్వరుడు సర్వజ్ఞుడు.

జ్ఞానం ఉండగానే సరిపోదు. ప్రజ్ఞ కూడా కావాలి. దాన్ని సర్వేశ్వర పదంలో చూస్తాము. అందువల్ల అంతర్యామి సర్వశక్తిమంతుడు కూడా. జ్ఞానం + ప్రజ్ఞ = నిమిత్తకారణం.

సర్వేశ్వరః + సర్వజ్ఞః = నిమిత్తకారణం
భూతానాం సర్వస్య యోనిః = ఉపాదానకారణం

ఆ విధంగా ఈశ్వరుడు, **అభిన్న నిమిత్త ఉపాదానకారణం**. శుద్ధచైతన్యమైన నేను వేసుకున్న మూడవ వేషం పేరు కారణ ఆత్మా. కారణ ఆత్మగా నేను రెండు పాత్రలను ధరిస్తున్నాను అవి– కారణప్రమాతగా ప్రాజ్ఞః కారణప్రమేయంగా ఈశ్వరుడు అని బోధిస్తుంది మాండూక్యం.

మాండూక్యోపనిషత్తుకు రాకముందు మనం ఈ భగవంతుడు సృష్టించిన పరిచ్ఛిన్న జీవులం అనుకుంటూ వచ్చాము; కాని ఇప్పుడు శుద్ధచైతన్యం అయిన నేను ఆరు వేషాలు వేసుకుని, ఆయా అవస్థల్లో తిరుగుతున్నాను. తత్త్వబోధ పరిభాషలో చెప్పాలంటే బింబచైతన్యం ప్రతిబింబాలు ఆరు. వ్యష్టిగా మూడు, సమష్టిగా మూడు.

**నిర్గుణబ్రహ్మ (బింబచైతన్యం)**

| **వ్యష్టిపరంగా ప్రతిబింబాలు** | **సమష్టిపరంగా ప్రతిబింబాలు** |
|---|---|
| స్థూలశరీరం – విశ్వ | స్థూలప్రపంచం – విరాట్ |
| సూక్ష్మశరీరం – తైజస | సూక్ష్మప్రపంచం – హిరణ్యగర్భ |
| కారణశరీరం – ప్రాజ్ఞ | కారణప్రపంచం – ఈశ్వరుడు |

ఈ ఆరు ప్రతిబింబాలనే ఆరు వేషాలు అంటున్నది ఉపనిషత్తు. నేను ఎవరు? నేను వేషరహిత తురీయాన్ని. మనీషా పంచకంలో శంకరాచార్యులవారు మూడుజంటల సృష్టి, స్థితి, లయ కారణమైన శుద్ధచైతన్యాన్ని నేనే అని వర్ణిస్తారు. నా స్వరూపం ఏమిటి?

**అవస్థాత్రయ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి**

ఈ నిర్వచనానికి చేరుకుంటాము. తురీయం అయిన నేనే ఈ మూడు అవస్థల్లోనూ, జంటలుగా వ్యవహారం నడుపుతాను.

ఈ విషయాన్ని బంగారం ఉదాహరణ తీసుకుని చూద్దాము. ఒకటే బంగారం – గాజు, ఉంగరం, గొలుసుగా మారింది. గాజుని ప్రథమపాదంగా, ఉంగరాన్ని ద్వితీయ పాదంగా, గొలుసును తృతీయపాదంగా, బంగారాన్ని తురీయంగా ఊహించుకుందాము. బంగారమే గాజు అంతటా ఉంది; బంగారమే ఉంగరం అంతటా ఉంది; బంగారమే గొలుసు అంతటా ఉంది. కాని బంగారం లేకుండా, వీటిలో దేనికీ విడిగా ఉనికి లేదు. ఆ మూడూ ఎలాగైతే మూడు వేషాలు వేసుకున్నాయో, అలాగే తురీయం అయిన నేను స్థూల ఆత్మా, సూక్ష్మ ఆత్మా, కారణ ఆత్మాగా వేషాలు వేసుకున్నాను. ఈ విషయాన్ని మనం చాలాసార్లు చూస్తాము. అందుకని దీన్ని బాగా గుర్తుంచుకోవాలి. ఈ వేషాలు కాని తురీయమే నేను.

నేను ఏ వేషంతో మమేకం చెందినా అది సంసారమే. నేను ఇవేమీ కాదు. అవస్థాత్రయ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి అనే వివరణ ఏడవ మంత్రంలో వస్తుంది. కాని గౌడపాదాచార్యులవారు, ఈ వివరణలోకి వెళ్ళేముందు ఈ మూడుపాదాల గురించి కొన్ని అంశాలు చెప్పదలుచుకున్నారు.

అందువల్ల ఇప్పుడు మనం ఉపనిషత్తుయొక్క మంత్రాలనుంచి కారికల్లోకి అడుగు పెడుతున్నాము. ఇక్కడ తొమ్మిది కారికలు వస్తాయి. కారికలు అంటే పద్యరూపంలో వస్తాయి. ఇవి ఉపనిషత్తులోని మంత్రాలను ప్రతి ఒక్క పదమూ వివరించుకుంటూ రావు. మొదటి ఐదు కారికల్లో, మొదటి ఐదు మంత్రాల సారాంశాన్ని చెబుతారు. ఇంకో విధంగా చెప్పాలంటే, చతుష్పాద ఆత్మయొక్క మొదటి మూడు పాదాల వివరాలు తీసుకుని, వాటి సమగ్రదర్శనం చేయిస్తారు ఇంకో కోణంలోంచి. ఉపనిషత్తుయొక్క మంత్రాల్లో ఏ పాదానికి ఆ పాదం విడిగా చూశాము; ఇప్పుడు వాటిని కలిపి చూస్తాము. కారికల్లోకి వెళ్ళేముందు ఎలా చర్చిస్తారో, ఒక విహంగవీక్షణ చూద్దాము.

1. మూడు పాదాల వివరణ –కారికలు 1–9, మంత్రం 6 తరువాత

**పట్టిక 2 – కారికలు 1–4 – మూడు పాదాల కారికలు**

| కారిక | దృక్కోణం | అర్థం |
|---|---|---|
| 1 | పాదత్రయం | మూడు పాదాలు |
| 2 | స్థానత్రయం | ప్రమాత ఉండే స్థానాలు |
| 3 | భోగత్రయం | ప్రమాతయొక్క అనుభవాలు |
| 4 | తృప్తిత్రయం | ప్రమాతను తృప్తిపరిచే విషయాలు |

**కారిక 1.1**

**బహిష్ప్రజ్ఞో విభుర్విశ్వో హ్యంతః ప్రజ్ఞస్తు తైజసః ।**
**ఘనప్రజ్ఞస్తథా ప్రాజ్ఞ ఏక ఏవ త్రిధా స్మృతః ॥**

**పాదత్రయం – మూడు పాదాలు**

**విశ్వః బహిష్ప్రజ్ఞః** – మొదటి పాదానికి స్థూల ఆత్మా అని పేరు చూశాము. స్థూల ఆత్మా జాగ్రదావస్థలో, జాగ్రద్ పురుషునిగా, జాగ్రత్ ప్రపంచంతో వ్యవహారం నడుపుతుంది. అందువల్ల స్థూల ఆత్మాగా నేను బహిః ప్రజ్ఞను. నా పేరు విశ్వ.

**విభుః** – స్థూల ఆత్మాగా వేషం వేసుకున్న నేను సమష్టి ప్రపంచంతో మమేకం చెందితే నా పేరు విరాట్. ఒకదేశ అధినేత, వేరే రాజ్యంతో ఏదైనా ఒప్పందం కుదుర్చుకుని సంతకం పెడితే, అప్పుడు ఆయన ఒక వ్యక్తి కాదు, విరాట్; లక్షలాది ప్రజలతో కూడిన వ్యక్తి. అలా విరాట్ అంటే సమష్టి స్థూల ప్రపంచంయొక్క అధిష్ఠానదేవత. విభుః అంటే సర్వవ్యాపకమైన విరాట్.

**తైజసః** – రెండవ పాదానికి సూక్ష్మ ఆత్మా పేరు చూశాము. సూక్ష్మ ఆత్మా స్వప్నావస్థలో, స్వప్నపురుషునిగా, స్వప్నప్రపంచంతో వ్యవహారం నడుపుతుంది. అప్పుడు నా పేరు తైజస.

**అంతః ప్రజ్ఞః** – సూక్ష్మఆత్మగా నేను అంతర్ముఖుడవుతాను. అప్పుడు నా ఇంద్రియాలు, నా శరీరం పడుకుంటాయి. నాది వాసనామయ శరీరం. ఇక్కడ హిరణ్యగర్భ గురించి చెప్పలేదు, అది కలుపుకోవాలి. సమష్టి సూక్ష్మప్రపంచంయొక్క అధిష్ఠానదేవత హిరణ్యగర్భ.

**ప్రాజ్ఞ** – కారణఆత్మాగా వేషం వేసుకున్న నేను కారణ శరీరంతో మమేకం చెందితే నా పేరు ప్రాజ్ఞ. ఇక్కడ అంతర్యామి గురించి చెప్పలేదు, అది కలుపుకోవాలి. సమష్టి కారణ ప్రపంచంయొక్క అధిష్ఠానదేవత అంతర్యామి లేదా ఈశ్వరుడు.

**ఘనప్రజ్ఞః** – ఉపనిషత్తు ప్రజ్ఞానఘనః అంది; గౌడపాదాచార్యులవారు ఘనప్రజ్ఞః అంటున్నారు. రెండింటి అర్థం ఒకటే. నిజానికి ఇలా చెబితే, తేలిగ్గా గుర్తుంటుంది కూడా. మొదటి రెండింటికీ బహిష్ప్రజ్ఞః, అంతఃప్రజ్ఞః వచ్చాయి; ఇప్పుడు ఘనప్రజ్ఞః అంటే వాటితో సరిపోతుంది.

ఎందుకు ఘనప్రజ్ఞః అంటున్నాము? అప్పుడు నా జ్ఞానం అంతా భేదాలు చూపని ఒక ముద్దలాగా అయిపోతుంది కాబట్టి. జ్ఞానం ఘనీభవిస్తుంది. మనం ముందునుంచి, ఈ మూడు పాదాలు తురీయ ఆత్మా అయిన నేను వేసుకున్న వేషాలని చెప్పుకుంటూ వస్తున్నాము. ఈ విషయం ఉపనిషత్తు ముందే చెప్పలేదు. మనం అర్థం చేసుకోవటానికి వీలుగా ఉంటుందని అలా చూస్తున్నాము. ఇప్పుడు గౌడపాదాచార్యులవారు ఈ మూడు పాదాలూ ఒకే ఆత్మకు భిన్ననామరూపాలు అని చెబుతున్నారు.

**ఏక ఏవ త్రిధా స్మృతః** – ఒకే ఆత్మ మూడు విధాలుగా మహర్షులచేత చెప్పబడింది. ఒకే వ్యక్తి ఒకరికి తాత, మరొకరికి తండ్రి, ఇంకొకరికి పుత్రుడు. ఆ అనుబంధాలను తీసివేస్తే అతను ఒక మనిషి. ఆ మూడూ అతను ధరించే పాత్రలు.

అలాగే స్థూల ఆత్మా, సూక్ష్మ ఆత్మా, కారణ ఆత్మా, ఆత్మ వేసుకునే మూడు వేషాలు. ఆ మూడూ తీసివేస్తే మిగిలేది శుద్ధచైతన్యం లేదా ఆత్మా. తరువాత దశకు గౌడపాదాచార్యుల వారు కూడా ఇంకా రాలేదు. కాని మనం చూశాము. అది శుద్ధ ఆత్మ. ఇందులో తురీయం అంటారనీ, ఆ తురీయాన్ని నేనేననీ కూడా చూశాము. ఇది పాదత్రయం.

## కారిక 1.2

**దక్షిణాక్షిముఖే విశ్వో మనస్యంతస్తు తైజసః ।**
**ఆకాశే చ హృది ప్రాజ్ఞస్త్రిధా దేహే వ్యవస్థితః ॥**

**స్థానత్రయం – ప్రమాత ఉండే స్థానాలు** – ఈ భావనను గౌడపాదాచార్యులవారు ప్రవేశపెట్టారు. అది మాండూక్యోపనిషత్‌లో లేదు. అలాగని పూర్తిగా ఆయన స్వంతమూ కాదు. బృహదారణ్యకంలోను, ఛాందోగ్యంలోనూ చెప్పిన అంశాలను ఇక్కడకు తీసుకు వచ్చారు, అంతే.

ఆ ఉపనిషత్తుల్లో వ్యష్టి-సమష్టి ఐక్య ఉపాసనలు చెప్పబడ్డాయి. తైత్తిరీయోపనిషత్‌లో కూడా ఈ ఐక్య ఉపాసనను సూచిస్తూ పాంక్త బ్రహ్మఉపాసన, అంతర్హృదయ ఉపాసన, సంహితోపాసనలు వస్తాయి. ఇలాంటి ఐక్య ఉపాసన ద్వారా వ్యష్టిని సమష్టితో కలిపి చూడటం నేర్చుకుంటాము.

అలను, సముద్రాన్ని భిన్నంగా చూస్తే వాటి మధ్య చాలా భేదాలు కనిపిస్తాయి. కాని వాటి రెండింటిలోనూ సమానంగా ఉన్నది నీరే అని తెలిసి, వాటిని ఐక్యదృష్టితో చూస్తే, అల, సముద్రం నామరూపాలు మాత్రమే, వాటికి విడిగా ఉనికి లేదని అర్థం చేసుకుంటాము. ఈ ఐక్య ఉపాసన చాలా అవసరం. ఎందుకంటే మనం మన అహంకారంతో ఎంతగా మమేకం చెందుతామంటే, మనం సమష్టిలో ఒక భాగమనే విషయం పూర్తిగా మర్చిపోతాము.

ఈ అహంకారం మనలో రాజ్యమేలుతుంటే, వేదాంతాన్ని జీర్ణించుకోలేము. అహంకారాన్ని పారద్రోలాలంటే, వ్యష్టి–సమష్టి ఐక్య ఉపాసన నేర్చుకోవాలి.

ఇక్కడ అటువంటి మూడు ఐక్య ఉపాసనలు ఉన్నాయి. అవి విశ్వ–విరాట్ ఐక్య ఉపాసన, తైజస–హిరణ్యగర్భ ఐక్య ఉపాసన, ప్రాజ్ఞ–అంతర్యామి ఐక్య ఉపాసన. ఈ ఉపాసనలు చేయాలంటే, వాటిని ఆవాహన చేయటానికి ఒక వస్తువు కావాలి. ఉదాహరణకు ఒక దేశాన్ని గౌరవించాలంటే జాతీయజెండాను గౌరవిస్తాము; శివునికి ఉపాసన చేయాలంటే, శివలింగంమీద శివుణ్ణి ఆవాహన చేస్తాము; విష్ణుమూర్తికి ఉపాసన చేయాలంటే, సాలగ్రామంమీద విష్ణుమూర్తిని ఆవాహన చేస్తాము. అదేవిధంగా ఈ ఐక్య ఉపాసనకు మన శరీరంలో అంగాలమీద ఉపాసన చేయాలి. అవేమిటో చూద్దాము.

**దక్షిణాక్షి ముఖే విశ్వః** – విశ్వను కుడికన్నుమీద ఆవాహన చేయాలి. దక్షిణ అంటే కుడి; అక్షి అంటే కన్ను. దక్షిణాక్షి అంటే కుడికన్ను. కుడికన్నుమీదే ఎందుకు చేయాలి? ఇంద్రియాలన్నింటిలోకి కళ్ళు చాలా శక్తివంతమైనవి. కళ్ళ ద్వారానే మనం బాహ్యప్రపంచాన్ని చూడగలుగుతున్నాము. విజ్ఞానశాస్త్రం కూడా మనం చూపించే స్పందనల్లో కాని, నేర్చుకునే జ్ఞానంలో కాని 90 శాతం కళ్ళ ద్వారానే జరుగుతుంది అంటుంది. అందువల్ల కళ్ళు చాలా ముఖ్యం.

మన అనుభవం కూడా అదే చెబుతున్నది. మన పిల్లలను కూడా ముద్దుగా కన్నా అంటాము కాని, ముక్కా, నోరా అనము కదా. కళ్ళలో కూడా కుడికన్ను ఇంకా శక్తివంతమైనదని శాస్త్రం చెబుతున్నది. ఆ విధంగా జాగ్రదావస్థలో కళ్ళు, ముఖ్యంగా కుడికన్ను చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ఆ కుడికన్నుమీద విశ్వను ఆవాహన చేయాలి. మంత్రం విశ్వ గురించి మాత్రం చెప్పినా, విశ్వ–విరాట్ ఐక్యం చూడాలి.

**మనస్యంతస్తు తైజసః** – తైజసను మనస్సు లోపల ఆవాహన చేయాలి. ఎందుకంటే, మొత్తం స్వప్నం మన మనస్సులోని చిత్తంలో నిక్షిప్తమై ఉన్న ఆలోచనలవల్ల ఏర్పడుతుందని చూశాము. ఆలోచనలు చిత్తంలో వాసనల రూపంలో నిక్షిప్తమై ఉంటాయి. మనసి అంటే మనస్సు; అంతః అంటే సుప్తచేతన మనస్సు (సబ్‌కాన్షియస్ మైండ్). దాన్నే చిత్తం అంటాము. చిత్తంమీద తైజసను ఆవాహన చేయాలి అంటే తైజస–హిరణ్యగర్భ ఐక్యం చూడాలి. ఆ ఉపాసనల గురించి కూడా ఇప్పుడు రాదు.

**ఆకాశే చ హృది ప్రాజ్ఞే** – ప్రాజ్ఞను హృదయాకాశంమీద ఆవాహన చేయాలి. సుషుప్తిలో మన మనస్సు, ఇంద్రియాలు కూడా హృదయంలో పడుకుంటాయని శాస్త్రం చెబుతుంది. అందువల్లనే, గాఢనిద్రలో చెవులు తెరుచుకునే ఉన్నా టీవీ రొద వినబడదు; ముక్కు తెరుచుకునే

ఉన్నా ఏ వాసనా తెలియదు; చర్మంమీద దోమ స్వైరవిహారం చేస్తున్నా తెలియదు. అంటే బాహ్యంగా గోళకాలు ఉన్నాయి కాని వాటినుంచి ఇంద్రియశక్తి విడివడింది. ఆ విడివడిన శక్తి హృదయాకాశంలో పడుకుంది.

**త్రిధా దేహే వ్యవస్థితః** – ఈ విధంగా ఒకే ఆత్మ శరీరంలో మూడుచోట్ల ఉంది. విశ్వగా కన్నులో, తైజసగా మనస్సులో, ప్రాజ్ఞగా హృదయాకాశంలో. ఈ స్థానాలు చెప్పిన కారణం ఉపాసన సౌలభ్యంకోసం. ఇది స్థానత్రయం.

### కారిక 1.3

**విశ్వో హి స్థూలభుఙ్నిత్యం తైజసః ప్రవివిక్తభుక్ ।**
**ఆనందభుక్తథా ప్రాజ్ఞస్త్రిధా భోగం నిబోధత ॥**

### భోగత్రయం – ప్రమాతయొక్క అనుభవాలు

ఇందులో వచ్చిన పదాలను ఉపనిషత్తులో కూడా చూశాము. అవి వరుసగా స్థూలభుగ్వైశ్వానరః, ప్రవివిక్తభుక్తైజసః, ఆనందభుక్ ప్రాజ్ఞః. ఇప్పుడు ఈ మూడవ కారికలో కూడా ఇవే పదాలను వాడి, వాటిని వివరిస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**విశ్వో హి స్థూలభుఙ్నిత్యమ్** – విశ్వ జాగ్రదావస్థలో స్థూలంగా ఉన్న బాహ్యప్రపంచాన్ని అనుభవిస్తాడు. అది పంచస్థూలభూతాలవల్ల ఏర్పడింది కాబట్టి స్థూలప్రపంచం అయింది. స్థూల అంటే స్థూలవస్తువులు, అనుభవించే ప్రమాత. విశ్వ స్థూలప్రపంచాన్ని అనుభవిస్తాడు.

**ప్రవివిక్త భుక్ తైజసః** – ప్రవివిక్త అంటే సూక్ష్మం; ప్రవివిక్త భుక్ తైజస అంటే తైజస స్వప్నంలో సూక్ష్మప్రపంచ ప్రమాత. స్వప్నపురుషుడు భౌతికప్రపంచంతో వ్యవహారం నడపడు, అతను వ్యవహారం నడిపేది, రూపుదిద్దుకున్న తన ఆలోచనలతో. ఎంత మనస్సును అలోచింపజేసే అనుభవం! ఆలోచనలు సూక్ష్మం, కంటికి కనబడవు. కాని ఆ కంటికి కనబడని, సూక్ష్మమైన ఆలోచనలే శబ్దస్పర్శరూపరసగంధాలతో కూడిన విషయవస్తువుగా కనిపిస్తున్నాయి. ఎంత గొప్ప విషయం అది!

**ఆనందభుక్తథా ప్రాజ్ఞః** – ప్రాజ్ఞ సుషుప్తిలో ఆనందాన్ని అనుభవించే ప్రమాత. సుషుప్తిలో ఎందుకు ఆనందాన్ని అనుభవిస్తాడంటే, అక్కడ భేదాలన్నీ లయమయిపోతాయి. అతను పరిమితి ఉన్న జీవికాదు. ఆనందంగా నిద్ర పోవాలనే మన పడకగదిని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దుకుంటాము. అందమైన మంచం, మెత్తటి పరుపు, ఆకర్షణీయమైన అలంకరణ, ఏ.సీ. అమర్చుకుంటాము. మంచి నిద్రలోంచి ఎవరైనా నిద్రలేపితే, వారిమీద విసుక్కుంటాము కూడా. ఇవన్నీ కేవలం మీదీ, నాదీ అనుభవం మాత్రమే కాదు! ప్రపంచంలో ఎవరిని చూసినా, అందరికీ సమానంగా కలిగే ఆనందం. ఎందుకు అందరూ సమానంగా

ఆనందిస్తారు? అప్పుడు అద్వైతంలో ఉంటారు కాబట్టి. ఇంతకు మించిన నిదర్శనం ఏం కావాలి, అద్వైతం మాత్రమే ఆనందాన్ని ఇస్తుంది, ద్వైతం ఇవ్వదు అని నిరూపించటానికి? జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ ద్వైతం ఉంటుంది కాబట్టి దుఃఖం కూడా వెన్నంటే ఉంటుంది.

**ద్వితీయాద్వై భయం భవతి** – బృహదారణ్యకమ్

రెండోది ఉంటే, భయం వేస్తుంది. సుషుప్తిలో రెండోది లేదు కాబట్టి, మనం అద్వైత ఆనందాన్ని పొందుతాము.

ఉపోద్ఘాతంలో చూశాము – అద్వైత అనుభవం తెలీని వారెవరూ ఉండరు. అద్వైత అనుభవం పొందటంకోసం మనం ప్రత్యేకించి ప్రయత్నించనవసరం లేదు. కాని వచ్చిన చిక్కేమిటంటే – అదే మన స్వరూపం అని మనకు తెలియదు. అందువల్ల సమస్య అనుభవం లేకపోవటం కాదు, స్వరూపజ్ఞానం లేకపోవటం. అనుభవాన్ని ఆధారం చేసుకుని వచ్చిన పొరపాటు మన సమస్య. నేను జాగ్రదావస్థలో, స్వప్నావస్థలో, సుషుప్తి అవస్థలో తిరుగుతున్న విశ్వ, తైజస, ప్రాజ్ఞలను కాను. అవి నా ఆగంతుక స్వరూపం లేదా నేను వేసుకున్న వేషాలు. నా స్వస్వరూపం ఈ మూడు అవస్థల్లో తిరుగుతూ కూడా, వీటికి అతీతంగా ఉన్న తురీయ ఆత్మ, ఆనందస్వరూపం అని అర్థం చేసుకోవాలి.

**త్రిధా భోగం నిబోధత** – ఈ మూడు భోగత్రయం అని అర్థం చేసుకోవాలి. అవి వరుసగా స్థూలభోగం, సూక్ష్మభోగం, ఆనందభోగం (కారణభోగం అనకూడదు). ఇది భోగత్రయం.

### కారిక 1.4

**స్థూలం తర్పయతే విశ్వం ప్రవివిక్తం తు తైజసమ్ ।**
**ఆనందశ్చ తథా ప్రాజ్ఞం త్రిధా తృప్తిం నిబోధత ॥**

**తృప్తిత్రయం – ప్రమాతను తృప్తిపరిచే విషయాలు**

ఇప్పుడు మూడురకాల తర్పణాన్ని చూస్తాము. మామూలుగా తర్పణం పదాన్ని మరణించిన వారికి వదిలే తర్పణంగా వాడతాము. దాని అర్థం తృప్తిపరచటం.

**స్థూలం తర్పయతే విశ్వమ్** – స్థూలప్రపంచం, స్థూలవస్తువులు విశ్వను అంటే జాగ్రత్ పురుషుణ్ణి తృప్తిపరుస్తాయి. ప్రపంచం అంటే ఐదుగా ఉన్న జగత్తు. జగత్తులో శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు ఉంటాయి. విశ్వను జగత్తు తృప్తి పరుస్తుంది;. విశ్వ జగత్తును తృప్తి పరుస్తాడు అనకూడదు. ప్రమాత ప్రమేయాన్ని అనుభవిస్తాడు.

**ప్రవివిక్తం తు తైజసమ్ (తర్పయతే)** – ప్రవివిక్తం అంటే సూక్ష్మవస్తువులు అని చూశాము. అంటే మనస్సు సృష్టించిన వస్తువులు. నిద్రలో దాహం వేస్తే, మీ గదిలో మీరు మంచం పక్కన పెట్టుకున్న నీరు త్రాగలేరు; నిద్రలో ఉన్న నీరే తాగాలి. అంటే అక్కడ దాహాన్నీ మీరే సృష్టిస్తారు; దాహాన్ని తీర్చే నీటినీ మీరే సృష్టిస్తారు; అది త్రాగి మీరు తృప్తిపడతారు. తర్పయతే మనం కలుపుకోవాలి. స్వప్నవస్తువులు తైజసను తృప్తిపరుస్తాయి.

వేదాంతం నిజానికి జాగ్రదావస్థలో జరిగేది కూడా అంతే అంటున్నది. మీరే మీ జాగ్రత్ ప్రపంచాన్ని కూడా సృష్టించి, మీరే ఆ ప్రపంచాన్ని అనుభవిస్తున్నారు కాని ఆ విషయం తెలియక దాన్ని సీరియస్‌గా తీసుకుని అవస్థలు పడుతున్నారు అంటున్నది.

**ఆనందశ్చ తథా ప్రాజ్ఞమ్ (తర్పయతే)** – సుషుప్తిలో ప్రాజ్ఞ ఆనందాన్ని అనుభవిస్తాడు. అక్కడ భేదాలు లేవని మర్చిపోకూడదు. భేదం ఆనందం కలిగిస్తుందా? ఉదాహరణకు మీ ఎదురుగా మీకు చాలా ఇష్టమైన ఆహారం ఉంది. అది మీకు పూర్తి ఆనందాన్ని కలిగిస్తుందా? ఆ ఆహారాన్ని మీరు పూర్తిగా తిని, ఆస్వాదిస్తే, అప్పుడు అసలైన ఆనందం కలుగుతుంది. అంటే ఆహారానికీ, మీకూ మధ్య ద్వైతం లేదు, అద్వైతమే ఉంది. ఆ అద్వైత ఆనందాన్ని అనుభవిస్తాడు ప్రాజ్ఞ.

**త్రిధా తృప్తిం నిబోధత** – ఈ మూడూ తృప్తిత్రయం అని అర్థం చేసుకోవాలి.

ఇది తృప్తిత్రయం.

(ఈ మూడు పాదాలను **పట్టిక 3 – కారికలు: 1–4 విశ్లేషణలో** ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు)

**కారిక 1.5**

**త్రిషు ధామసు యద్భోజ్యం భోక్తా యశ్చ ప్రకీర్తితః ।**
**వేదైతదుభయం యస్తు స భుంజానో న లిప్యతే ॥**

మూడు అవస్థల జ్ఞానఫలం – గౌడపాదాచార్యులవారు, ఈ మూడు అవస్థల గురించి ఎవరైతే స్పష్టంగా తెలుసుకుంటారో, వారు దేనికీ చలించరు; అసంగంగా ఉంటారని చెబుతున్నారు.

**యః వేద** – ఎవరైతే స్పష్టంగా తెలుసుకుని, అర్థం చేసుకుంటారో,

**యద్భోజ్యం భోక్తా యశ్చ** – భోక్తా అంటే ప్రమాత, భోజ్యం అంటే ప్రమేయం. ఎవరైతే ఈ ప్రమాత–ప్రమేయం జంట గురించి తెలుసుకుంటారో,

**ప్రకీర్తితః** – ఇక్కడ చెప్పబడిన జంటలు –

జాగ్రదావస్థ – విశ్వ –విరాట్
స్వప్నావస్థ – తైజస –హిరణ్యగర్భ
సుషుప్తి అవస్థ – ప్రాజ్ఞ –ఈశ్వరుడు

**త్రిషు ధామసు** – ఈ మూడు అవస్థలలో

**ఏతదుభయమ్** – ఈ మూడు జంటల గురించి

అన్నీ కలిపితే, ఎవరైతే ఈ మూడు అవస్థలలో ఉన్న భోక్తా, భోగ్యం అయిన ఈ మూడు జంటల గురించి స్పష్టంగా తెలుసుకుని, అర్థం చేసుకుంటారో, వారికి కలిగే ఫలం గురించి చెబుతున్నారు గౌడపాదాచార్యులవారు. కాని ఈ మూడు అవస్థల గురించి ఎలా అర్థం చేసుకోవాలో శంకరాచార్యులవారు వివరిస్తున్నారు. ఈ మూడు భోక్తలు నేనే అని ఒక్కటిగా అనుసంధానం చేయాలి అంటున్నారు. అంటే ఏ నేను నిద్రించానో, ఆ నేనే కలగన్నాను, ఆ నేనే ఇప్పుడు తెలివిగా ఉన్నాను.

**భోక్తా ఏకః ఏవ**

ఇటునుంచి చెప్తే, జాగ్రదావస్థలో స్థూలశరీరం, ఇంద్రియాలు, మనస్సుతో నేనే వ్యవహారం నడుపుతాను. స్వప్నావస్థలో నేనే వేరే స్వప్నశరీరాన్ని, స్వప్న ఇంద్రియాలను, స్వప్నమనస్సును తీసుకుంటాను. అందువల్ల సహజంగానే అక్కడ నా పేరు మారుతుంది. సుషుప్తిలో మనస్సు కూడా పడుకుంటుంది.

అలాగే భోజ్యం కూడా నాకు భిన్నంగా లేదు. స్వప్నవృత్తాంతం చూస్తే ఆ విషయం అర్థమవుతుంది. స్వప్నంలో స్వప్నపురుషుణ్ణీ నేనే, నేను చూసే ప్రపంచాన్నీ నేనే. అంటే ప్రమాత, ప్రమేయం రెండూ నేనే. బయటనుంచి వస్తువులను తీసుకురాను. ఒక పులిని సృష్టించింది నేనే, ఆ పులిని చూసేది నేనే, నేను సృష్టించిన పులిని చూసి భయపడి పరుగులు తీసేది నేనే. అదే విధంగా మూడు అవస్థల్లోనూ భోజ్యం కూడా నేనే. ఇంతవరకూ మనం చూస్తూ వస్తున్న వివరణను గుర్తు తెచ్చుకుంటే, ఈ మూడు అవస్థల్లోనూ తిరుగుతున్న భోక్తా–భోజ్యం జంటలు నేను వేసుకున్న వేషాలు మాత్రమే అనీ, నేను వీటికి అతీతంగా ఉన్న తురీయ ఆత్మను అని అర్థం.

**ఇతి యః వేద** – ఎవరైతే ఇది ఆర్థం చేసుకుంటారో, అతనికి కలిగే ఫలం ఇది.

**స భుంజానో న లిప్యతే** – తను అనుభవిస్తున్న దానిలో దేనికీ చలించడు. భుంజానః అంటే అనుభవిస్తున్న వ్యక్తి; న లిప్యతే అంటే చలించడు. ఎందుకు చలించడు? మనం ముందే చూశాము. అతను ఈ వస్తువులను ప్రకాశింపజేస్తున్న చైతన్యం అనీ, ప్రకాశింపబడుతున్న వస్తువులకున్న మలినం చైతన్యానికి అంటదనీ అతనికి తెలుసు. ఈ పుస్తకంమీద కాంతి

పడుతున్నది, ఈ పుస్తకాన్ని ప్రకాశింపజేస్తున్నది, కాని పుస్తకంమీద దుమ్ము ఉంటే, దాన్ని ప్రకాశింపజేస్తున్న కాంతికి ఈ దుమ్ము అంటదు. అంటే కాంతి అసంగం. అదే విధంగా చైతన్యం అయిన నేను కూడా అసంగం.

ఎవరైతే ఈ మూడు పాదాల గురించీ, ఈ విధంగా అర్థం చేసుకుంటారో, అతను దేనికీ చలించడు. ఈ ఫలాన్ని ఉపనిషత్తు ఇవ్వలేదు కాని గౌడపాదాచార్యులవారు చెప్పారు.

**ఫలం – అసంగరూపేణ తిష్ఠతి**

**కారికలు 6–9: ఉపోద్ఘాతం**

కారికలు 6–9లో గౌడపాదాచార్యులవారు ఆరవమంత్రంయొక్క ప్రత్యేకతను వివరించబోతున్నారు. అది చాలా ముఖ్యమైన మంత్రం. దాన్ని ఇంకా వివరంగా, ముందుముందు చూస్తాము కాని ఇక్కడ కూడా, సందర్భం వచ్చింది కాబట్టి, గౌడపాదాచార్యులవారు ఆ మంత్రంలోని కొన్ని అంశాలను చర్చించదలుచుకున్నారు.

**మంత్రం 6**

**ఏష సర్వేశ్వర ఏష సర్వజ్ఞ ఏషోఽన్తర్యామ్యేష యోనిః సర్వస్య ప్రభవాప్యయౌ హి భూతానామ్॥**

ఆరవ మంత్రంలో సుషుప్తి అవస్థలో ఉన్న ఆత్మను కారణ ఆత్మా అన్నాము. కారణ ఆత్మా అని ఎందుకన్నాము? ఎందుకంటే అప్పుడు మన జ్ఞానం, మన భావోద్రేకాలు కూడా అవ్యక్తంలో ఉంటాయి. కారణం నిర్వచనమే అది. ఏదైతే అవ్యక్తదశలో ఉందో, అది కారణం. స్వప్న, జాగ్రదావస్థలో అవ్యక్తంలో ఉన్నవి వ్యక్తమవుతాయి; మళ్ళీ సుషుప్తి అవస్థలో వ్యక్తమయినవి, అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయి.

ఇదే సూత్రాన్ని జగత్తుకు అన్వయిస్తే, జగత్తులో నిద్ర అంటే ప్రళయం; వ్యష్టి నిద్ర లయం, సమష్టి నిద్ర ప్రళయం; వ్యష్టి నిద్రను నిద్ర అంటే, భగవంతుని నిద్రను యోగనిద్ర అంటారు. అంటే లయం, నిద్ర పర్యాయపదాలు; ప్రళయం–యోగనిద్ర పర్యాయపదాలు.

సమష్టిపరంగా ప్రళయంలో మొత్తం జగత్తు అవ్యక్తస్థితిలో ఉంటుంది. దాన్నే అంతర్యామి అంది ఉపనిషత్తు. అంతర్యామి అంటే, కారణ నామరూపాలు. అది వ్యష్టి కారణ నామరూపాలు కాదు, సమష్టి కారణ నామరూపాలు. ఈ అంతర్యామిని ఈశ్వరః అంటున్నది.

ఈశ్వరుడు అంటే చైతన్యం + అవ్యక్త జగత్తు. అంటే జగత్తు, ఈ ఈశ్వరుని నుంచే ప్రకటితమవుతున్నది. అందువల్ల ఈశ్వరుణ్ణి కారణం అనీ, జగత్తును కార్యం అనీ అంటారు. జగత్తు ఇలా ఈశ్వరుణ్ణుంచి వ్యక్తమవటాన్ని సృష్టి అంటారు. ఆ విధంగా ఆరవ మంత్రంలో సృష్టిప్రకరణం అంతర్లీనంగా ఉంది. **ప్రభవాప్యయౌ హి భూతానామ్** అంది. అంటే జీవులు ఈశ్వరుణ్ణుంచి వచ్చి, ఈశ్వరునిలో లయమవుతాయి అంది. అంటే సృష్టిప్రకరణం చెప్పకనే

చెప్పినట్టయింది. గౌడపాదాచార్యులవారు ఈ చెప్పీచెప్పక వదిలేసిన సృష్టిప్రకరణం గురించి మరికొంత లోతులను కొలుస్తున్నారు.

ఈ సృష్టి గురించిన చర్చ ప్రతి ఒక్క దర్శనంలోనూ వస్తుంది. దాన్ని **సృష్టివాదము** అంటారు. సైన్సులో కాస్మాలజీ అంటారు. ఇక్కడ గౌడపాదాచార్యులవారు సృష్టిప్రకరణం ఏం చెబుతుందో, అది తక్కిన దర్శనాలకు భిన్నంగా ఎలా ఉందో చర్చించదలుచుకున్నారు.

గౌడపాదాచార్యులవారు అసలు ఈ సృష్టిప్రకరణాన్ని కూకటివేళ్ళతో సహా పెకళించి వేస్తున్నారు. ఆయన నొక్కి వక్కాణించేది ఒకటే. **సృష్టి** అనే పదమే తప్పు లేదా పొరపాటు. ఈ పొరపాటుమీద అల్లిన సృష్టివాదాన్ని తీసుకుంటే సమస్యే మిగులుతుంది అంటున్నారు. ఏమిటా పొరపాటు? తార్కికంగా చూస్తే అసలు సృష్టి అనేదే జరగలేదు అంటున్నారు. సైన్సు కూడా సృష్టి జరగటం సాధ్యం కాదు అంటుంది. ఎందుకు? పదార్థాన్ని కొత్తగా పుట్టించలేము, నాశనం చేయలేము అంటుంది.

వడ్రంగి ఒక బల్లను సృష్టించాడు, అది ఒక కేజీ బరువు ఉంది. కాని అతను ఆ బల్లను ఎలా సృష్టించాడు? ముందే ఉన్న చెక్కను తీసుకుని, దాన్ని బల్ల ఆకారంలో చెక్కాడు. దానివల్ల దానికొక కొత్త నామం, రూపం వచ్చాయి. అతను చేసిందల్లా ఉన్న చెక్కకు కొత్త రూపం యిచ్చి, దానికొక 'బల్ల' అనే నామాన్ని తగిలించాడు. అతను ఇంతకూడా చెక్కను కొత్తగా సృష్టించలేదు. అదే విధంగా జగత్తు కూడా ఇంత కూడా, కొత్తగా సృష్టించబడలేదు. ఎవరూ కొత్తగా పదార్థాన్ని సృష్టించలేరు. ఆఖరికి భగవంతునితో సహా. భగవంతుడు కూడా కొత్తగా పదార్థాన్ని సృష్టించడు. మరి చైతన్యం మాటేమిటి? చైతన్యం అనంతం, నిత్యం; దాన్ని కొత్తగా సృష్టించనవసరం లేదు.

ఉన్నవి రెండే వస్తువులు. చైతన్యం, పదార్థం. చైతన్యాన్ని కొత్తగా సృష్టించనవసరం లేదు, పదార్థాన్ని కొత్తగా సృష్టించలేము. మరయితే ఏది సృష్టించబడింది? ఏదీ సృష్టించ బడలేదు. ఏదీ సృష్టించబడకపోతే, సృష్టి జరిగిందని ఎలా చెబుతాము? దీన్ని **అజాతివాదము** అంటారు. దీన్ని ముందు అధ్యాయాల్లో ఇంకా లోతుగా విశ్లేషిస్తారు గౌడపాదాచార్యులవారు.

మనం ఎప్పటినుంచో సృష్టి పదాన్ని మనకు తెలియకుండా వాడేస్తున్నాము. మన అభిప్రాయాన్ని మనం ఎన్నడూ ప్రశ్నించుకోలేదు. అందువల్ల మన ప్రాథమిక భావనే తప్పు. అసలు సృష్టి అన్నదే జరగలేదు, కాని ఈ తప్పుడు అవగాహనతో కొన్ని ప్రశ్నలు వేస్తాము. భగవంతుడు ఈ జగత్తును ఎప్పుడు సృష్టించాడు? ఎక్కడ సృష్టించాడు? ఎలా సృష్టించాడు? అక్కడితో ఊరుకోకుండా, చాలా అసహనంగా, అసలు భగవంతుడు తీరికూర్చుని ఎందుకు ఈ జగత్తును సృష్టించాడని అడుగుతాము. పైగా నన్నెందుకు పనిగట్టుకుని ఈ శరీరంతో సృష్టించాడు? ఇదొక అంతుపట్టని సమస్య.

నేను పుట్టినప్పటినుంచీ సమస్యలే, ఈ జగత్తు నన్ను నానా బాధలు పెడుతున్నది. భగవంతుడు తోలుబొమ్మలాటలాగా చేసి, ఆనందిస్తున్నాడు. తన ఆటకోసం నన్ను సృష్టించి, నాతో చెలగాటమాడే భగవంతుణ్ణి నేను ఎందుకు పూజించాలి అని వాదిస్తాము.

వేదాంతం ఈ ఎప్పుడు, ఎక్కడ, ఎలా, ఎందుకు ప్రశ్నలకు జవాబు ఇవ్వటానికి ఇష్టపడదు. వేదాంతానికి జవాబు తెలియక ఇవ్వటం లేదని అనేయకండి వెంటనే. ఈ ప్రశ్నలు వచ్చినవి మనం ఏర్పరచుకున్న తప్పుడు అవగాహనవల్ల. అవగాహనే తప్పయినప్పుడు, దాన్నుంచి వచ్చిన సందేహాలు ఎలా నిజమవుతాయి?

అంతగా సృష్టి గురించి మాట్లాడి తీరాలంటే, ఒక అంశం గురించి మాట్లాడవచ్చు. దాన్ని సూచనప్రాయంగా సృష్టి అనవచ్చు. అలాంటప్పుడు 'సృష్టి' పదాన్ని ఇలా ఇన్వర్టెడ్ కామాల్లో పెట్టాలి. ఏమిటా అంశం? పదార్థం ఎప్పుడూ ఉంటుంది. అది అవ్యక్తంలో ఉంటుంది. అవ్యక్తంలో ఎప్పుడూ ఉండకుండా, మధ్యలో వ్యక్తమవుతుంది. ఈ వ్యక్తమవటాన్నే లేదా ప్రకటితమవటాన్నే సృష్టి అని సూచనగా అనవచ్చు. నూనెను నూనెగింజలనుంచి తయారుచేశాము అంటాము. నూనెను మనం కొత్తగా ఉత్పత్తి చేయలేదు. ఆ నూనె ఆ గింజల్లో అవ్యక్తరూపంలో ఉంది. గింజలను నలగకొట్టటంవల్ల నూనె బయటకు వచ్చింది. అలాగే విత్తనంనుంచి చెట్టు వచ్చింది. చెట్టు కొత్తగా పుట్టలేదు. అది విత్తనంలో అవ్యక్తంగా ఉంది. ఇలా అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి మారటాన్నే సృష్టి అంటారు.

**అవ్యక్తాద్ వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే**
**రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్త సంజ్ఞకే**– గీత

అవ్యక్తంనుంచి వ్యక్తానికి, వ్యక్తంనుంచి అవ్యక్తానికి వెళతాయి.

మనం జంధ్యాల పౌర్ణమిరోజు అనాది అవిద్యా వాసనయా అని యాంత్రికంగా పఠిస్తాము. నేను ప్రళయంలో అవ్యక్తంలో ఉన్నాను; సృష్టి జరిగినప్పుడు వ్యక్తమయ్యాను. ఈ వృత్తం కొనసాగుతూనే ఉంటుంది. సృష్టి = అభివ్యక్తిః. అభివ్యక్తిః అంటే ప్రకటితమవటం.

ఈ విషయం తెలియక, అనేకమంది సృష్టి గురించి అనేక రకాలుగా నిర్వచిస్తారు. ఈ నేపథ్యంతో ఈ కారికలను చూద్దాము.

**కారిక 1.6**

**ప్రభవస్సర్వభావానాం సతామితి వినిశ్చయః ।**
**సర్వం జనయతి ప్రాణశ్చేతోఽంశూన్ పురుషః పృథక్ ॥**

**సర్వభావానాం సతామ్** – సతామ్ అంటే అవ్యక్తంగా ఉన్నాయి. సర్వభావానాం అంటే అన్ని వస్తువులు, జీవులు. మొత్తం చూస్తే అన్ని వస్తువులు, జీవులు అవ్యక్తంగా ఉన్నాయి.

**ప్రభవః** – అవే ఉత్పత్తి చెందుతున్నాయి. దాన్ని తప్పుగా సృష్టి అంటున్నారు. అంటే అవి అంతకుముందు లేవు, తర్వాత కొత్తగా పుట్టాయి అంటున్నారు.

ఎందుకు మనం ఇలా సృష్టి పదాన్ని పొరపాటుగా వాడుతున్నాము? ఎక్కడ పొరపాటు పడ్డాము? చదరంగం ఆటలో, ఆట ముగిశాక, అది ఆడినవారు ఆ ఆటను విశ్లేషించుకుంటారు. ఏ పావును కదిపినప్పుడు ఆట ఒక మలుపు తిరిగిందో విశ్లేషిస్తారు. ఎందుకు? మళ్ళీ అటువంటి పొరపాటు చేయకుండా ఉండటానికి.

అదే విధంగా మనం కూడా విశ్లేషిద్దాము. సృష్టి అనే పదాన్ని ఎందుకు వాడుతున్నాము? దానికి కారణం ఇది. ఏదైనా వస్తువు అవ్యక్తదశలో ఉంటే, దానివల్ల బొత్తిగా ప్రయోజనం లేదు. గింజలో ఉన్న నూనె కాని, పాలలో ఉన్న వెన్న కాని అవ్యక్తంలో ఉన్నప్పుడు వాటిని వాడలేము. పొరుగింటి పిన్నిగారు వచ్చి, 'పెళ్ళికి వెళ్ళాలి, ఏదైనా నగ అరువు ఇస్తావా?' అని అడిగితే, 'ముద్ద బంగారం ఉంది, అది వేసుకువెళ్ళండి,' అనగలరా? దానివల్ల ప్రయోజనం లేదు. ముద్దబంగారం ఉన్నా, లేకపోయినా ఒకటే. ఆభరణంగా దాన్ని వేసుకోలేరు కాబట్టి. ఆభరణం ఇందులో ఇమిడివుంది, ఇది వేసుకువెళ్ళండి అనలేము. అలాగే ఎవరైనా వెన్న అడిగితే, పాలు ఇచ్చి, ఇందులో వెన్న ఇమిడివుంది తీసుకువెళ్ళండి అనలేము. అందువల్ల వెన్నలేదు అని చెబుతాము.

ఆ విధంగా, ప్రళయ అవస్థలో ఉన్న సృష్టివల్ల లాభంలేదు. అది ఉన్నా లేనట్టే అంటాము. అది ఉత్పత్తి చెందాక, ప్రయోజనకరంగా మారినట్టుగా అనిపిస్తుంది. అందువల్ల అది కొత్తగా వెలుగులోకి వచ్చినట్టుగా భావిస్తాము.

ప్రభవః అంటే ఉత్పత్తి అని చూశాము. ఈ ఉత్పత్తి కారణ ఆత్మాలో అవ్యక్తంలో ఉన్న వస్తువుల ఉత్పత్తే తప్ప, కొత్త ఉత్పత్తి కాదు. ఈ ఈశ్వరుడు ఏం చేస్తాడు?

**సర్వం జనయతి ప్రాణః** – ఇక్కడ ప్రాణః అంటే ఈశ్వరుడు. సర్వం జనయతి అంటే మొత్తం భౌతికప్రపంచం. ఈశ్వరుడు మొత్తం భౌతికప్రపంచాన్ని సృష్టిస్తున్నాడు. సృష్టిస్తున్నాడు అంటే వ్యక్తంలోకి తీసుకువస్తున్నాడని అర్థం చేసుకోవాలని చూశాము. సుషుప్తిలో నా సమస్యలు, నా జ్ఞానం, నా వ్యక్తిత్వం అన్నీ లయమయిపోతాయి. కాని నేను నిద్ర లేవగానే, అవన్నీ వెంటనే బయటకు వస్తాయి.

**పురుషః** – పురుషః అన్నాకూడా ఈశ్వరుడు లేదా అంతర్యామి.

**చేతోఽంశూన్ (జనయతి)** – అన్ని జీవులను కూడా సృష్టిస్తాడు. సర్వం జనయతి, జడప్రపంచాన్ని సూచిస్తే, చేతోఽంశూన్ చేతనప్రపంచాన్ని సూచిస్తుంది.

**ఈశ్వరుడు చేతన జీవులను, అచేతనప్రపంచాన్ని సృష్టించాడు.**

**పృథక్** – వేర్వేరుగా. అనేక జీవులు సృష్టించబడ్డాయి. జీవులు అంటే స్థూలశరీరం, సూక్ష్మశరీరం. ప్రళయంలో అవి అవ్యక్తంలో ఉంటాయి. సృష్టి జరిగినప్పుడు ఇవన్నీ బయటకి విసిరివేయబడ్డాయి. ఈ శరీరాలను, మనస్సులను సృష్టించటమే కాదు; వాటిలో ప్రతిబింబ చైతన్యం కూడా ఏర్పడేలా చేశాడు. చైతన్యాన్ని బింబచైతన్యం అంటారు. మనస్సును ప్రతిబింబ మాధ్యమం అంటారు. మనస్సులో ఏర్పడిన ప్రతిబింబాన్ని ప్రతిబింబ చైతన్యం అంటారు. ఈ విధంగా చేతనజీవులు, అచేతనప్రపంచం ఈశ్వరుణ్ణుంచి వచ్చాయి.

అదెలా సాధ్యమని మీకేమైనా సందేహముంటే, దానికి జవాబు మీ స్వప్నప్రపంచమే. అందులోనూ చేతన, అచేతనప్రపంచాలు ఉంటాయి. మీరు అచేతనమైన కొండలనూ సృష్టిస్తారు; చేతనమైన మనుష్యులనూ సృష్టిస్తారు స్వప్నంలో.

**కారిక 1.7**

**విభూతిం ప్రసవం త్వన్యే మన్యంతే సృష్టిచింతకాః ।**
**స్వప్నమాయాసరూపేతి సృష్టిరన్యైర్వికల్పితా ॥**

**సృష్టి గురించిన వాదనలు: కారికలు 7-9** – ముందు కారికలో ఈశ్వరుణ్ణుంచి అవ్యక్త ప్రపంచం వ్యక్తంలోకి వచ్చిందని చూశాము. దాన్ని సృష్టి అనకూడదనీ, వ్యక్త నామరూపాలు అనాలనీ చూశాము.

ఇప్పుడు గౌడపాదాచార్యులవారు ఈ సృష్టి గురించిన భిన్నాభిప్రాయాలను పరిచయం చేస్తున్నారు. పరిచయం అని ఎందుకన్నామంటే, తరువాత రాబోయే అధ్యాయాల్లో ఇంకా లోతుగా ఈ అభిప్రాయాలను చర్చిస్తారు.

ఈ అవ్యక్తంలోంచి వ్యక్తంలోకి వచ్చిన ఈ జగత్తు సత్యమా, మిథ్యా? గౌడపాదాచార్యుల వారు అది సత్యం కాదు, మిథ్య అని నిరూపించబోతున్నారు. దానికి ఆయన చెప్పే ఉదాహరణ మన స్వప్నప్రపంచమే. స్వప్నప్రపంచంలో మన మనస్సే స్వప్నంలోని పులిగా, స్వప్నంలోని దొంగగా కనిపిస్తుంది. కాని నిద్రనుంచి లేస్తే, అది మిథ్య అని తెలుస్తుంది. అలాగే ఈ జాగ్రత్ ప్రపంచం కూడా స్వప్నమే. దీన్ని స్వప్నం-2 అంటారు. దీన్నించి లేస్తే ఇది కూడా మిథ్యే. ఆ వివరాలు తరువాత వస్తాయి, అప్పుడు చూద్దాము.

ఇక్కడ సృష్టి గురించిన కొన్ని భావాలు చూస్తాము. ఈ జగత్తు మిథ్య అని తెలియక చాలామంది అది నిజం అనుకుంటారు. అందులో మళ్ళీ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అవేమిటో చూద్దాము.

**సృష్టి చింతకా** – సృష్టిని గురించి విచారణ చేసేవారు,

ఎ) **భగవంతుని మహిమ – ప్రసవం విభూతిం మన్యే** – ప్రసవం అంటే సృష్టి; విభూతి అంటే భగవంతుని మహిమ; మన్యే అంటే భావిస్తున్నారు. అంటే కొంతమంది ఈ సృష్టిని భగవంతుని మహిమగా భావిస్తున్నారు. భగవంతునిలాగా సృష్టి కూడా సత్యం అంటారు వారు. భగవంతుడు సత్యం అయితే, ఆయన మహిమ కూడా సత్యం అయివుండాలి; అందువల్ల సృష్టి సత్యభగవానునియొక్క సత్యమహిమ అంటారు కొందరు.

బి) **భగవంతుని మాయ – సృష్టిరన్యైర్వికల్పితా** – మరికొంతమంది ఈ సృష్టిని ఇంద్రజాలంతో సమానమైనది అంటున్నారు. ఇంద్రజాలకుడు మాయాశక్తితో వస్తువులను సృష్టిస్తాడు. యోగి తన యోగశక్తితో సృష్టిస్తాడు. విశ్వామిత్రుడు త్రిశంకు స్వర్గాన్ని సృష్టించాడు. అదెలా సత్యమో, ఈశ్వరుని సృష్టి కూడా సత్యమే.

సి) **స్వప్నంలాగా సత్యం – స్వప్నమాయాసరూపేతి** – కొంతమంది ఈ సృష్టిని స్వప్నంతో పోలుస్తారు. కాని వారితో వచ్చిన చిక్కేమిటంటే, వారు స్వప్నం కూడా సత్యమంటారు. మనం ఎలాగైతే నిజం స్వప్నాన్ని సృష్టిస్తామో, అలా ఈశ్వరుడు నిజం జగత్తును సృష్టించాడు అంటారు వారు.

### కారిక 1.8

**ఇచ్ఛామాత్రం ప్రభోస్సృష్టిరితి సృష్టౌ వినిశ్చితాః ।**
**కాలాత్ప్రసూతిం భూతానాం మన్యంతే కాలచింతకాః ॥**

ఇంకా కొన్ని విచారణలు కొనసాగుతున్నాయి

డి) **భగవంతుని ఇచ్ఛ – ఇచ్ఛామాత్రం ప్రభోస్సృష్టిః** – కొంతమంది ఈ సృష్టి భగవంతుని సంకల్పంవల్ల వచ్చింది అంటారు. భగవంతుడు సత్యకాముడు, సత్యసంకల్పుడు. అందువల్ల ఇచ్ఛామాత్రంగా సృష్టి చేశాడు.

**ఇతి సృష్టౌ వినిశ్చితాః** – ఈ సృష్టి భగవంతుడెంత సత్యమో అంత సత్యం.

కొంతమంది భగవంతుని ఇచ్ఛ సిద్ధాంతాన్ని ఒప్పుకోరు. అంతా ఆయన ఇష్టప్రకారం జరుగుతుంది అంటే అందులో కొన్ని సమస్యలు ఉన్నాయి. దానికి వచ్చే జవాబులకన్నా సందేహాలు ఎక్కువ ఉంటాయి. అంతా భగవంతుని ఇచ్ఛ అయితే, నన్నెందుకు ఏడిపిస్తున్నాడు భగవంతుడు అనే ప్రశ్న వస్తుంది ముందు. అందువల్ల వారు భగవంతునిమీద భారం వేయరు.

ఇ) **కాలతత్త్వం – కాలాత్ప్రసూతిమ్** – అంతా కాలాన్నుంచి వచ్చింది అంటారు వారు. జ్యోతిష్యులు రాహుదశ, కేతుదశ, శనిదశ అంటూ చెబుతారు. నువ్వు ఫలానా సమయంలో పుట్టావు కాబట్టి, నీకీ దశ వచ్చింది అంటారు. అంటే అంతా కాలమహిమ.

**భూతానాం ప్రసూతిం మన్యంతే** – కాలంనుంచి సృష్టి జరిగింది అంటున్నారు. ఎవరు?

**కాలచింతకాః** – కాలం గురించి విచారం చేసేవారు.

**కారిక 1.9**

**భోగార్థం సృష్టిరిత్యన్యే క్రీడార్థమితి చాపరే ।**
**దేవస్యైష స్వభావోఽయమాప్తకామస్య కా స్పృహా ॥**

మరికొన్ని విచారణలు కొనసాగుతున్నాయి.

ఎఫ్) **భగవంతుని భోగంకోసం – భోగార్థం సృష్టిరిత్యన్యే** – సృష్టి భోగంకోసం అని కొందరు భావిస్తారు. భగవంతునికి ఏమీ తోచక, విసుగుపుట్టి, తనకు కాలక్షేపంకోసం ఈ జగత్తును సృష్టించాడు. **సోఽకామయత బహుస్యాం ప్రజాయేయేతి**

ఈ ప్రపంచాన్ని సృష్టించాలి అనుకుని సృష్టించాడు. కాని ఈ సిద్ధాంతంవల్ల కూడా సమస్యలు వస్తాయి.

జి) **భగవంతుని క్రీడకోసం – క్రీడార్థమితి చాపరే** – కొంతమంది భగవంతుడు దీన్ని ఒక ఆటలా సృష్టించాడు అంటారు.

గౌడపాదాచార్యులవారు, ఈ సిద్ధాంతాలన్నింటిలోనూ లొసుగులు ఉన్నాయి అంటారు.

**ఆప్తకామస్య కా స్పృహా** – కోరికలు తీరిన భగవంతునికి కోరిక ఏమిటి?

భగవంతుణ్ణి పరిపూర్ణుడు అంటారు. పరిపూర్ణుడికి ఏం కోరికలు ఉంటాయి? ఎవరికైనా, అసలు కోరికలు ఎప్పుడు ఉంటాయి? ఏదైనా అసంతృప్తి ఉన్నప్పుడు ఉంటాయి. ఆప్తకామస్య అంటే తన విషయంలో తను తృప్తి చెందిన భగవంతుడు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః** – గీత

అలా తృప్తిగా ఉన్న భగవంతుడు తన తృప్తికోసం ఎందుకు సృష్టిస్తాడు? భోగార్థం సృష్టి, కామార్థం సృష్టి, ఇచ్ఛార్థం సృష్టి, ఇవన్నీ అర్థంలేని వాదనలు. మరయితే, భగవంతుడు ఎందుకు సృష్టించాడు?

**దేవస్యైష స్వభావోఽయమ్** – ఏషః అంటే ఈ సృష్టి, దేవునియొక్క స్వభావం మాత్రమే అంటున్నారు గౌడపాదాచార్యులవారు. అంటే భగవంతుడు నిజానికి ఈ జగత్తును సృష్టించలేదు, కాని ఈ జగత్తు ఆయన స్వభావంగా ఎప్పటినుంచో ఉంది. స్వభావం అంటే ఆయనకు భిన్నంగా విడదీయలేము.

మళ్ళీ ఇంకొక సందేహం. సృష్టి కొత్తగా రాలేదు, ఎప్పటినుంచో అవ్యక్తంగానో, వ్యక్తంగానో ఉంది అంటున్నారు. అలా భగవంతునికి భిన్నంగా లేకపోతే, జగత్తులో ఉన్న బాధలు, కష్టాలు అన్నీ భగవంతుడు కూడా పడాలి కదా! నేను ఈ శరీరంతో సంసారిని అయితే, అన్ని శరీరాలు ఉన్న భగవంతుడు మహాసంసారి అవాలి.

దీనికి ఇక్కడ జవాబు రాదు; తరువాత గౌడపాదాచార్యులవారు చెబుతారు. మూడు సత్యాలు ఉన్నాయి. అవి పారమార్థిక సత్యం, వ్యావహారిక సత్యం, ప్రాతిభాసిక సత్యం. కిందనుంచీ వస్తే ప్రాతిభాసిక సత్యం స్వప్నప్రపంచం. అది స్వప్నం ఉన్నంతసేపే ఉంటుంది. దాన్నుంచి జాగ్రత్ ప్రపంచానికి లేస్తే, స్వప్నం మిథ్య, జాగ్రత్ ప్రపంచం సత్యం అవుతాయి. జాగ్రత్ ప్రపంచంలో వ్యవహారం నడుపుతాము కాబట్టి దాన్ని వ్యావహారిక సత్యం అంటారు. జాగ్రత్ ప్రపంచం ఉన్నంతసేపే అది ఉంటుంది. పారమార్థిక సత్యం అంటే పారమార్థిక ప్రపంచం అనకూడదు. అందులో అద్వైతం ఒక్కటే ఉంటుంది. ఆ పారమార్థిక సత్యానికి లేస్తే, ఈ జాగ్రత్ ప్రపంచం స్వప్నం–2 అవుతుంది.

ఇప్పుడు ఈ నేపథ్యంతో చూస్తే, జగత్తు వ్యావహారిక స్థాయికి చెందినది, భగవంతుడు పారమార్థిక సత్యం. ఒక స్థాయిలో ఉన్నది, ఇంకొక స్థాయిలో ఉన్నదాన్ని ఏమీ చేయలేదు. స్వప్నంలో మీకు దెబ్బ తగిలి, రక్తం కారితే, మీకు జాగ్రదావస్థలో ఏమీకాదు. అలాగే వ్యావహారిక జగత్తుకు ఏదైనా అయినా, పారమార్థిక భగవంతునికి ఏమీ అవదు. ఆ విధంగా మిథ్యాజగత్తు భగవంతునిలో ఎప్పుడూ ఉంటుంది, కాని భగవంతునికి ఏమీ అంటదు. బ్రహ్మసూత్రాల్లో ఈ విషయం గురించిన చర్చ చాలా విపులంగా వస్తుంది.

ఇక్కడితో గౌడపాదాచార్యులవారు తను మొదటి ఆరు మంత్రాలమీద చేసిన వ్యాఖ్యానాన్ని ముగిస్తున్నారు.

(మూడు పాదాల గురించిన వివరణ మళ్ళీ **పట్టిక 1 – సత్య ఆత్మయైన నా వేషాల్లో** ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు.)

ఇప్పుడు మూడు పాదాల గురించి అయింది కాబట్టి, నాలుగవ పాదం అయిన తురీయ ఆత్మా వివరణలోకి అడుగుపెట్టాలి. ఆ వర్ణన ఉపనిషత్తులోని ఏడవ మంత్రంలో వస్తుంది. ముందు ఆ మంత్రం చూశాక, దానిమీద గౌడపాదాచార్యులవారు చేసిన విశ్లేషణను చూస్తాము. అందువల్ల ఇప్పుడు మనం కారిక 9నుంచి ఉపనిషత్తుయొక్క మంత్రం 7లోకి అడుగుపెడుతున్నాము.

## తురీయ లక్షణం - ఉపోద్ఘాతం - మంత్రం 7

ఏడవ మంత్రం తురీయ ఆత్మను నిర్వచిస్తుంది. ఈ జ్ఞానం మాత్రమే సంసారంనుంచి విముక్తి కలిగిస్తుంది. మొదటి మూడు పాదాల వరకే తెలుసుకుని ఆపేస్తే, మోక్షం రాదు. మోక్షాన్నిచ్చేది తురీయజ్ఞానం మాత్రమే కాబట్టి, తురీయం గురించిన నిర్వచనం ఈ మంత్రంలో వచ్చింది కాబట్టి ఈ ఏడవమంత్రం మాండూక్యోపనిషత్తులో చాలా ముఖ్యమైన మంత్రం. అసలు ఆ మాటకొస్తే మొత్తం ఉపనిషత్తు సాహిత్యంలోనే తలమానికమైన మంత్రం.

ఈ మంత్రం లోతులు కొలిచినకొద్దీ, దీన్ని ఇంకా బాగా ఆస్వాదించగలము. గౌడపాదాచార్యులవారు దీనిమీద రెండువందల పై చిలుకు కారికలు రాశారంటేనే ఈ మంత్రం ఎంత ప్రత్యేకమైనదో చెప్పకనే చెప్పినట్టవుతుంది. ఈ కారికల్లో చాలా లోతుగా విశ్లేషించారు గౌడపాదాచార్యులవారు ఈ మంత్రాన్ని.

ఈ మంత్రం తురీయాన్ని నిర్వచిస్తుంది అన్నాము. నిజానికి ఈ మంత్రంలో ఎక్కడా ఈ పదం రాదు. గౌడపాదాచార్యులవారు పదవ కారికలో తుర్యః అన్నారు. అంటే తురీయః అంటే చతుర్థః. నాలుగవది, తురీయం పదాలు పర్యాయపదాలు. ఈ రెండింటి అర్థం ఆత్మయొక్క నాలుగవ పాదం లేదా ఆత్మయొక్క నాలుగవ అంశం.

తురీయ ఆత్మా గురించి ఒక పెద్ద అపోహ ఉంది. ముందు ఆ అపోహను తొలగించుకుని, ముందుకు వెళదాము.

**అపోహ - తురీయ అవస్థ ఉంది.**

ఆత్మకు నాలుగు పాదాలు ఉన్నాయని చెప్పి, మొదటి మూడు పాదాల గురించి చెప్పినప్పుడు ఏమన్నాము?

ప్రథమపాదం - జాగ్రదావస్థకు చెందింది
ద్వితీయపాదం - స్వప్నావస్థకు చెందింది
తృతీయపాదం - సుషుప్తి అవస్థకు చెందింది

దీన్నిబట్టి వచ్చే అర్థం ఏమిటి?

చతుర్థపాదం - చతుర్థ అవస్థకు చెందాలి. జాగ్రత్తగా చూడండి. చతుర్థ అవస్థకు చెందాలని పొరపాటు పడతారు కొందరు. అది నిజం కాదని ఇప్పుడు నిరూపించబోతున్నాము. మూడు పాదాలు, మూడు అవస్థల్లో జరిగే అనుభవాలను వర్ణిస్తే, సహజంగా నాలుగవ పాదం దేనికి చెందాలి? నాలుగవ అవస్థలో జరిగే అనుభవాలకు చెందాలి. ఆ అవస్థకు వారే నామకరణం కూడా చేసేశారు. దాన్ని తురీయ అవస్థ అనేశారు. అందువల్ల వారి సిద్ధాంతం ప్రకారం తురీయపాదం, తురీయ అవస్థలోనే ఉంటుంది. ఎందుకు?

జాగ్రదావస్థలో మొదటి పాదమే ఉంటుంది; స్వప్నావస్థలో రెండవ పాదం మాత్రమే ఉంటుంది; సుషుప్తి అవస్థలో మూడవ పాదం మాత్రమే ఉంటుంది. ఈ సూత్రం ప్రకారం తురీయ అవస్థలో నాలుగవ పాదం మాత్రమే ఉంటుంది.

ఈ అయోమయంలో పడ్డవారు, ఇంకా గొప్ప అయోమయంలో పడతారు. తురీయ పాదం గురించి ఎన్నడూ నేర్చుకోలేము అనేస్తారు. ఎందుకు? ఇందాక చూశాము కదా, జాగ్రదావస్థలో మొదటిపాదం మాత్రమే ఉంటుంది కాని మనం నేర్చుకునేదేమో జాగ్రదావస్థలో కదా. అందువల్ల తురీయం గురించి అప్పుడు నేర్చుకోలేము. దానికి వేరే అనుభవం పొందాలి. దానికి వారు సమాధిలోకి వెళ్ళాలి అని ఏవో సమాధుల పేర్లు కూడా చెబుతారు. ప్రజ్ఞాత సమాధి, అసంప్రజ్ఞాత సమాధి, సబీజ సమాధి, నిర్బీజ సమాధి అంటారు. ఆ విధంగా వారు నాలుగవ అవస్థను సృష్టించారు.

**జవాబు** – ఈ పొరపాటును మనం వెంటనే వదిలివేయాలి. మాండూక్యోపనిషత్తు ఎక్కడా తురీయ అవస్థ గురించి మాట్లాడదు. అవస్థల గురించి చెప్పేటప్పుడు జాగరితస్థానః, స్వప్నస్థానః, సుషుప్తస్థానః అంది కాని తురీయస్థానః అని ఎక్కడా అనలేదు. అంటే, తురీయ ఆత్మకు తురీయ అవస్థ అంటూ లేదు. ఇది చాలా స్పష్టంగా తెలుసుకోవాలి.

### తురీయం నాలుగవ అవస్థ కాదు, నాలుగవ పాదం మాత్రమే

మరయితే తురీయం అంటే ఏమిటి? తురీయం ఈ మూడు పాదాలయిన విశ్వ, తైజస, ప్రాజ్ఞలకు భిన్నంగా ఉంది, కాని అదే సమయంలో అనుస్యూతంగా (ఇన్ అండ్ త్రూ) వాటిలో అంతటా ఉంది. వాటికి భిన్నంగా ఉంది, అలాగని వాటికి దూరంగా లేదు. అంటే ఎక్కడ విశ్వ ఉంటే అక్కడ విశ్వ+తురీయం; ఎక్కడ తైజస ఉంటే అక్కడ తైజస+ తురీయం; ఎక్కడ ప్రాజ్ఞ ఉంటే అక్కడ ప్రాజ్ఞ+తురీయం అని వేసుకోవాలి. ఇప్పుడు చెప్పండి, తురీయం ఏ అవస్థలో ఉంది?

విశ్వతోపాటు ఉంది కాబట్టి జాగ్రదావస్థలో ఉంది; తైజసతో పాటు ఉంది కాబట్టి స్వప్నావస్థలో ఉంది; ప్రాజ్ఞతో పాటు ఉంది కాబట్టి సుషుప్తి అవస్థలో కూడా ఉంది. అంటే ఏదో ఒక అవస్థలో మాత్రమే కాదు, మూడు అవస్థల్లోనూ ఉంది. విశ్వ ఉంటే తురీయం ఉంది; విశ్వతో పాటు తైజస వచ్చినా తురీయం ఉంది; తైజస పోయి ప్రాజ్ఞ వచ్చినా తురీయం ఉంది.

ఈ మూడు తురీయ ఆత్మనైన నేను వేసుకున్న వేషాలు అని ముందే చూశాము. దాని వివరణ ఇప్పుడు వస్తున్నది. ఒక నటుడు ఒక సినిమాలో హీరోగా, ఇంకొక సినిమాలో తండ్రిగా, ఇంకొక సినిమాలో విలన్‌గా వేశాడనుకుందాం. అతను వీటిలో ఎందులో ఉన్నాడు

అంటే ఏం చెబుతారు? వీటిలో అన్నింటిలోనూ ఉన్నాడు. ఆ పాత్రలు ఉన్నా, లేకపోయినా అతను ఉన్నాడు. అతను ఒక్క పాత్రలోనే ఉన్నాడని చెప్పలేము. అదే విధంగా, తురీయం ఒక అవస్థలోనే ఉందని చెప్పలేము. అన్ని అవస్థల్లోనూ ఉంటుంది.

తురీయం మూడు అవస్థల్లోనూ అనుస్యూతంగా ఉంది, కాని వాటికి భిన్నంగా ఉంది అనే అంశాన్ని అర్థం చేసుకోవటానికి బంగారం, ఆభరణాల ఉదాహరణ చూద్దాము. బంగారంనుంచి వచ్చిన మూడు వస్తువులను తీసుకుందాము. అవి గాజు, ఉంగరం, గొలుసు. ముందు ముద్దబంగారాన్ని ఇచ్చి కంసాలిచేత గాజు చేయించుకున్నారు. అప్పుడు గాజు ఉంది కాని గొలుసు, ఉంగరాలు లేవు. తర్వాత గాజును కరిగించి గొలుసు చేయించుకున్నారు. అప్పుడు గాజు, ఉంగరాలు లేవు. దాని తర్వాత ఉంగరం చేయించుకున్నారు; గాజు, గొలుసు లేవు.

ఇప్పుడు ఎవరైనా బంగారం అంటే ఏమిటి, నాకు గాజు, గొలుసు, ఉంగరం గురించి తెలుసు. బంగారం వీటిలో ఉందా, వీటికి భిన్నంగా ఉందా అని అడిగితే ఏం చెబుతారు? ఏం జవాబు చెప్పినా సమస్యే. ఈ మూడింటికి భిన్నంగా ఉంది బంగారం అని చెబితే, వాటిని పక్కన పెట్టేసి, బంగారంకోసం వేరే ఎక్కడో వెతుకుతాడు అతను. అందువల్ల బంగారం వీటికి భిన్నంగా ఉందని చెప్పలేము.

సరే, పోనీ గాజులో ఉందని చెబితే, అయితే గొలుసు, ఉంగరంలో లేదన్నమాట అనుకుంటాడు. బంగారం అంటే గాజు అని పొరపాటు పడతాడు. అందువల్ల గాజు ఉన్నంతవరకూ అతనికి ఏ సమస్యా లేదు. కాని మీరు గాజుని కరిగించగానే అంటే గాజు మాయమవగానే, బంగారం కూడా వెళ్ళిపోయింది అనుకుంటాడు. కాని గాజే బంగారం అనలేరు. ఎందుకంటే గాజు వచ్చినా, రాకపోయినా బంగారం ఉంది; అలాగే గొలుసు వచ్చినా, రాకపోయినా బంగారం ఉంది; అలాగే ఉంగరం వచ్చినా, రాకపోయినా బంగారం ఉంది. అయితే, బంగారాన్ని ఎలా నిర్వచిస్తారు? బంగారం గాజు, గొలుసు, ఉంగరాలకు భిన్నంగా ఉంది; కాని ఈ మూడింటిలోనూ అనుస్యూతంగా ఉంది. అందువల్ల బంగారం కోసం బయట వెతకవద్దు అని చెబుతారు.

మీరలా చెప్పగానే అతను బంగారాన్ని ఎలా అర్థం చేసుకుంటాడు? గాజు+బంగారం; గొలుసు+బంగారం; ఉంగరం+బంగారం ఉన్నాయి. అంటే మూడింటిలోనూ సమానంగా ఉన్నదేమిటి? అతని బుద్ధి చెబుతుంది. మూడింటిలోనూ సమానంగా ఉన్నది బంగారం. దాన్నే అనుస్యూతంగా ఉంది అన్నారు. దానికి సాంకేతికపదం అధిష్ఠానం. గాజు, గొలుసు, ఉంగరాలు నామరూపాలు మాత్రమే. అవి ఉన్నా, లేకపోయినా బంగారం ఉంటుంది. అంటే బంగారం వాటిని భిన్నంగా ఉందని అర్థం. దానికి పదం విలక్షణం. ఇప్పుడు

చెప్పండి, బంగారం అంటే ఏమిటి? అధిష్ఠానం+విలక్షణం. గాజుని కరిగించినా బంగారం ఉంది, గొలుసుని కరిగించినా బంగారం ఉంది, ఉంగరాన్ని కరిగించినా బంగారం ఉంది. ఆ బంగారమే 'నాలుగవ' అంశంగా అర్థం చేసుకోవాలి. 'నాలుగవ' అని ఇన్‌వర్టెడ్ కామాలు ఎందుకు పెట్టామంటే, ఇది నిజంగా నాలుగవ అంశం కాదు. వాటికి అధిష్ఠానం+ విలక్షణంగా ఉంది.

ఇప్పుడు ఇదే సూత్రాన్ని ఆ పదాలు మార్చి, ఇక్కడ వేరే పదాలు పెట్టి చూద్దాము. విశ్వ+తురీయం; తైజస+తురీయం; ప్రాజ్ఞ+తురీయం అన్నాము. వీటన్నిటిలోనూ సమానంగా ఉన్నది ఏమిటి? తురీయం. వీటిలో ఏది ఉన్నా, లేకపోయినా తురీయం ఉంటుంది. ఇప్పుడు చెప్పండి, తురీయం అంటే ఏమిటి? అధిష్ఠానం+విలక్షణం.

అలా తురీయాన్ని 'నాలుగవ' అంశంగా అర్థం చేసుకోవాలి. అంటే అది నిజంగా నాలుగవ అంశం కాదు. వాటికి అధిష్ఠానం+విలక్షణంగా ఉంది. అక్కడితో ఆ జ్ఞానం పూర్తి అవదు. ఆ తురీయాన్ని నేనే అని అర్థం చేసుకోవాలి. ఇప్పుడు తురీయం తీసి, నేను పెడదాము.

నేను జాగ్రత్ పురుషుణ్ణి (విశ్వను); నేను స్వప్నపురుషుణ్ణి (తైజసను); నేను సుప్తపురుషుణ్ణి (ప్రాజ్ఞను) అని చెబితే, ఈ మూడు వాక్యాల్లోనూ సమానంగా ఉన్నది ఏమిటి? నేను, నేను, నేను. ఆ నేను **శుద్ధచైతన్యతత్త్వం**. ఇక్కడ దాన్ని **తురీయం** అంటున్నాము. నేను తర్వాత ఏ పదం కలిపినా అది ఆగంతుక లక్షణం అయిపోతుంది. నేను తండ్రిని, నేను బాధపడుతున్నాను, నేను లావుగా ఉన్నాను – ఇలా ఏది చెప్పుకొచ్చినా కూడా అవి నా స్వరూపలక్షణాలు కావు. అవి వచ్చిపోతాయి. అలాగే జాగ్రత్ పురుషుడు, స్వప్నపురుషుడు, సుప్తపురుషుడు – ఈ పదాల్లోని పురుషుడు చైతన్యతత్త్వం కాని జాగ్రత్, స్వప్న, సుషుప్తులు నా స్వస్వరూపం కాదు. ఇదంతా ఇప్పుడు ఈ ఏడవ మంత్రంలో చూడబోతున్నాము.

**తురీయలక్షణం = అధిష్ఠానం + విలక్షణం**

**ప్రమేయ విలక్షణం** – ఇంతవరకూ మనం ప్రమాత పరంగా చూశాము. తురీయం ప్రమాతకు అధిష్ఠానంగా ఉంది కాని, ప్రమాత విలక్షణం అని చూశాము. **తురీయం = ప్రమాతృ త్రయ వ్యతిరిక్తః**. ఇప్పుడు ప్రమేయంలో తురీయం గురించి చూద్దాము. ఒక్కొక్క పాదం గురించి చూసినప్పుడు, ప్రమాత–ప్రమేయం జంటలను చూస్తూవచ్చాము. ఇప్పుడు తురీయం, ఈ ప్రమేయాలకు కూడా భిన్నంగా ఉందని చూస్తాము.

**ప్రమేయత్రయ విలక్షణమ్**

ప్రమేయంలో మూడు ప్రపంచాలు వస్తాయి. అది జాగ్రత్ ప్రపంచం, స్వప్నప్రపంచం, కారణప్రపంచం. ఈ మూడింటికి భిన్నంగా ఉంది తురీయం. అందువల్ల ఇలా కూడా అనవచ్చు.

**ప్రపంచత్రయ విలక్షణమ్**

అంటే అంతకుముందు చూసిన నిర్వచనం ప్రమేయం పరంగా కూడా వస్తుంది. అది తురీయ లక్షణం = అధిష్ఠానం + విలక్షణం. దీన్ని అనుస్యూతం + అతీతం అనికూడా అనవచ్చు.

ఏడవమంత్రాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు.

ఎ) నాంతః ప్రజ్ఞం ... నా ప్రజ్ఞమ్ – తురీయం ప్రమాతృత్రయ విలక్షణమ్
బి) అదృష్టం ... అవ్యపదేశ్యమ్ – తురీయం ప్రమేయత్రయ విలక్షణమ్
సి) ఏకాత్మ ... స విజ్ఞేయ – తురీయం త్రయ అధిష్ఠానమ్

మొదటి రెండు నిర్వచనాలు వ్యతిరేక పద్ధతిలో వస్తాయి. వాటిని నిషేధరూపప్రమాణమ్ అంటారు. మూడవ నిర్వచనం సానుకూల పద్ధతిలో వస్తుంది. దాన్ని విధిరూపప్రమాణమ్ అంటారు.

ఇంతకుముందు కూడా చూశాము. ఈ తురీయజ్ఞానం పొందితే చాలదు; ఆ తురీయాన్ని నేను అని అర్థం చేసుకోవాలి.

**ప్రమాతృ ప్రమేయ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి**

ఈ జ్ఞానం రావాలి. ఈ జ్ఞానం పొందితే, సంసారబంధంనుండి విడివడి, ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందుతాము. దీన్నే జీవన్ముక్తి అంటారు. ఈ నేపథ్యంతో ఏడవ మంత్రాన్ని చూద్దాము.

**మంత్రం 7**

**నాంతః ప్రజ్ఞం న బహిష్ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞమ్।**
**అదృష్టమవ్యవహార్యమగ్రాహ్యమలక్షణమచింత్యమవ్యపదేశ్యమేకాత్మప్రత్యయసారం**
**ప్రపంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః॥**

ఎ) **ప్రమాతృ త్రయ విలక్షణమ్.**

**న బహిష్ప్రజమ్** – ముందు ఈ పదాన్ని చూద్దాము.

**జాగరితస్థానో బహిష్ప్రజ్ఞః** – 3

ఇది మూడవ మంత్రంలో చూశాము. జాగ్రత్ ప్రమాత బహిష్ప్రజ్ఞః. బాహ్యాముఖంగా చూస్తాడు. జాగ్రదావస్థలో జాగ్రత్ ప్రపంచాన్ని చూస్తాడు. కాని తురీయాన్ని న బహిష్ప్రజ్ఞమ్ అంటున్నది ఉపనిషత్, అంటే తురీయం జాగ్రత్ ప్రమాత కాదు.

**న అంతః ప్రజ్ఞమ్** – ఈ పదాన్ని నాలుగవ మంత్రంలో చూశాము.

**స్వప్నస్థానోఽ ంతః ప్రజ్ఞః** – 4

స్వప్నప్రమాత అంతః ప్రజ్ఞమ్. అతను తన మనస్సు ద్వారా స్వప్నప్రపంచాన్ని చూస్తాడు. మనస్సు నిండా భావోద్రేకాలు, భయం, ఆందోళన ఉంటాయి. న అంతః ప్రజ్ఞమ్ అంటున్నది ఉపనిషత్తు. తురీయం పదం మనం కలుపుకోవాలి. తురీయం అంతః ప్రజ్ఞ కాదు అంటే తురీయం స్వప్న ప్రమాత కాదు.

**న ప్రజ్ఞానఘనమ్** – ముందు ఇది చూద్దాము. దీన్ని ఐదవ మంత్రంలో చూశాము.

**సుషుప్తస్థాన ఏకీభూతః ప్రజ్ఞానఘనః** – 5

సుప్త ప్రమాతా ప్రజ్ఞానఘనః. అంటే సుషుప్తిలో వృత్తిజ్ఞానాలన్నీ లయమయిపోతాయి. న ప్రజ్ఞానఘనమ్ అంటున్నది ఉపనిషత్తు. అంటే తురీయం సుప్త ప్రమాత కాదు.

ఇంకో విధంగా చెప్పాలంటే తురీయం జాగ్రత్, స్వప్న, సుప్త ప్రమాతలకు భిన్నంగా ఉంది.

**న ఉభయతః ప్రజ్ఞమ్** – ఉభయతః ప్రజ్ఞమ్ అంటే రెండు అనుభవాల మధ్య కలిగే అనుభవం. ఇది చాలా అరుదుగా వస్తుంది. నిద్రపోయే ముందు కలిగే అవస్థ అని చెప్పవచ్చు. ఉదాహరణకు మీకు కళ్ళమీదకు నిద్ర ముంచుకువస్తున్నది కాని, మీరు నిద్రపోయే ముందు చేయాల్సిన చిన్నచిన్న పనులేవో ఉండిపోయాయి. అవి చేయటానికి మీరు కళ్ళు తెరచి ఉంచటానికి ప్రయత్నిస్తారు. అలాగే, పుస్తకం చదువుతుండగా మధ్యలో కళ్ళు భారంగా అయి, అక్షరాలు అలుముకుపోయినట్టు అవుతుంది. లేదా మీరు రాస్తూంటారు, మధ్యలో నిద్ర తోసుకువస్తుంది. కలం అక్షరాలను సరిగ్గా రాయకుండా ముందుకు తోసుకుపోతుంది. ఇలాంటి సందర్భాలలో మీరు మెలకువగానూ లేరు, నిద్రా పోవటం లేదు. దీన్నే మధ్యస్థితి అంటారు.

ఇటువంటి పరిస్థితి తెల్లవారుఝామున కూడా రావచ్చు. ఏదైనా పని ఉంటే, ఒకరోజు మీరు రోజుకన్నా ముందు లేస్తారు. కాని నిద్రమత్తు మిమ్మల్ని విడిచిపోదు. అప్పుడు ఏం చేస్తున్నారో మీకు సరిగ్గా స్పృహ ఉండదు. ఇటువంటి స్థితిని అసాధారణ స్థితి అంటారు. ఇక్కడ ఉపనిషత్తు ఉభయతః ప్రజ్ఞమ్ అంటున్నది. తురీయం న ఉభయతః ప్రజ్ఞమ్ అంటున్నది ఉపనిషత్తు. అంటే తురీయం ఆ ప్రమాత కూడా కాదు.

**న ప్రజ్ఞమ్** – ప్రజ్ఞ అంటే భగవంతునిలాగా, అన్నీ తెలిసినవాడు. భగవంతుణ్ణి సర్వజ్ఞుడు అంటారు. కాని ఉపనిషత్తు తురీయం న ప్రజ్ఞమ్ అంది. అంటే తురీయం సర్వజ్ఞుడు కూడా కాదు. ఎందుకంటే అది కూడా ప్రమాత లక్షణమే. అలా తురీయం జాగ్రత్ ప్రమాత కాదు, స్వప్న ప్రమాత కాదు, సుప్తప్రమాత కాదు, ఉభయత ప్రమాత కాదు, సర్వజ్ఞ ప్రమాత కాదు అని అన్నింటినీ కొట్టివేస్తే అసలు తురీయం జడం అనుకునే ప్రమాదం ఉంది. అంటే తురీయం జడం కాబట్టి ఏ ప్రమాత కూడా కాదు అంటున్నదా ఉపనిషత్తు? ఆ సందేహం రాకుండా, ఇంకొక పదం వేసింది.

**న అప్రజ్ఞమ్** – తురీయం జడం కూడా కాదు. అంటే తురీయం ప్రమాత కాదు,చైతన్యం. ప్రమాతయొక్క లక్షణాలన్నిటినీ ఖండించటమైనది.

**ప్రమాతృ త్రయ విలక్షణం తురీయమ్**

బి) **ప్రమేయ త్రయ విలక్షణమ్** – తురీయం, ప్రమాత అనుభవించే వస్తువు కూడా కాదు. అంటే తురీయం అప్రమేయం. తురీయం అప్రమేయం అని నిరూపించాలంటే, తురీయం ఏ ప్రమాణానికీ అందదని నిరూపించాలి. ఎందుకంటే ప్రమాణానికి అందే ఏ వస్తువైనా, అది ప్రమేయం అవుతుంది. తురీయం ప్రమాణాలకు అందదు.

**సర్వ ప్రమాణ అగోచరమ్**

ఏదైనా ప్రమాణానికి అందితే, అది ప్రమేయం అవుతుంది. కాని తురీయం ఐదు ప్రమాణాలకు అందదు.

**అదృష్టమ్** – తురీయం కంటికి కనబడే వస్తువు కాదు. కన్ను అంటే ప్రత్యక్షప్రమాణం కిందికి వచ్చే పంచజ్ఞానేంద్రియాలను తీసుకోవాలి. తురీయం ఏ ప్రత్యక్షప్రమాణానికీ అందదు.

**ప్రత్యక్షప్రమాణ అగోచరమ్**

ఎవరైనా, 'నేను బ్రహ్మను చూశాను. బ్రహ్మ దేదీప్యమైన కాంతితో మెరిసిపోతున్నాడు,' అంటే ఆ అనుభవాన్ని మనం కొట్టివేయటం లేదు; అది అయ్యే అవకాశం ఉంది, కాని అది అంతిమసత్యం కాదు అంటున్నాము.

**త్వమేవ తత్ విద్ధి నేదం యదిదముపాసతే** – కేన

నువ్వు ఉపాసన చేసే దేవుడు బ్రహ్మ కాదు; దేవుణ్ణి ఉపాసన చేసే నువ్వే బ్రహ్మవు అంటుంది కేనోపనిషత్తు.

పదాల వరుసక్రమాన్ని మార్చుకుంటున్నాము.

**అగ్రాహ్యమ్** – గ్రాహ్యమ్ అంటే పంచకర్మేంద్రియాలకు అందేది. అగ్రాహ్యమ్ అంటే పంచకర్మేంద్రియాలకు అందనిది. అంటే తురీయాన్ని ముట్టుకోలేము. లేదు, నాకు

భగవద్దర్శనం కలిగింది అంటే అది నిజమే కాని, తురీయం ప్రమేయం కాదు; ఆ అనుభవం అంతిమసత్యం కాదు అంటాము.

**అలక్షణమ్** – అనుమాన ప్రమాణానికి అందదు తురీయం. ప్రత్యక్ష ప్రమాణాన్ని ఆధారం చేసుకుని తార్కికంగా విశ్లేషించేది అనుమానప్రమాణం. దీనికి శాస్త్రం ఇచ్చే ఉదాహరణ–

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ యథా మహానసే**

పర్వతంమీద అగ్ని ఉంది. పొగ కనబడుతోంది కాబట్టి, అగ్ని ఉందని చెబుతాము. ఎందుకంటే పూర్వకాలపు వంటింటి అనుభవం ఎక్కడ పొగ ఉంటే, అక్కడ అగ్ని ఉంటుందని చెబుతుంది. పొగ లక్షణం కిందికి వస్తుంది. **లక్షయతి ఇతి లక్షణమ్.** పొగని చూసి అగ్ని ఉండి ఉంటుందని చెబుతున్నాము. కాని తురీయం అలక్షణమ్.

కొంతమందికి ధ్యానంలో కొన్ని రంగులు, కొన్ని ఆకారాలు కనిపిస్తాయి. కొంతమందికి శబ్దం వినిపిస్తుంది. దాన్ని అనాహత శబ్దం అంటారు. ఈ అనుభవాలు జరగటం నిజమే కావచ్చు కాని ఈ లక్షణాలేవీ తురీయ అనుభవం కాదు అంటుంది శాస్త్రం.

తురీయం అనుమాన ప్రమాణానికి అందదు. అలక్షణమ్ అంటే అనుమాన ప్రమాణ అగోచరమ్.

తురీయం ప్రత్యక్ష ప్రమాణానికీ అందక, అనుమాన ప్రమాణానికీ అందకపోతే, దాని సహజ పరిణామం ఏమిటి?

**అచింత్యమ్** – తురీయం మనోవృత్తికి అందదు. కంటికి కనబడని, తర్కానికి అందని తురీయాన్ని మనస్సు మాత్రం ఎలా ఊహిస్తుంది, ఎలా అర్థం చేసుకుంటుంది? అందువల్లనే చాలామంది బ్రహ్మను ఎలా చూడాలి, బ్రహ్మమీద ఎలా ఉపాసన చేయాలి అంటారు. కేనోపనిషత్, నువ్వు ఉపాసన చేసే దేవుడు బ్రహ్మ కాదు, దేవుణ్ణి ఉపాసన చేసే నువ్వే బ్రహ్మవు అంటుందని ముందే చూశాము. అయితే బ్రహ్మను ఎలా చూడాలి? బ్రహ్మ చూడబడే వస్తువు కాదు; వస్తువులను చూసేదే బ్రహ్మ. వస్తువులను సాక్షిగా చూసే సాక్షిచైతన్యం.

**అవ్యపదేశ్యమ్** – ప్రత్యక్ష ప్రమాణానికి అందని, మనస్సు ఊహించలేని తురీయాన్ని మాటలతో ఎలా వర్ణిస్తాము? వ్యపదేశ్యం అంటే వర్ణన. దేశ్యం అంటే వర్ణించబడేది; అవ్యపదేశ్యం అంటే వర్ణించబడలేనిది. అంటే తురీయం శబ్దానికందనిది.

తమాషా ఏమిటంటే, ఇలా మాటలకందని తురీయం గురించి అన్ని ఉపనిషత్తులు బోధిస్తాయి; గురువు కూడా వర్ణించబడలేని తురీయాన్ని సంవత్సరాల తరబడి వర్ణిస్తాడు. అదే వేదాంతంయొక్క గొప్పదనం. అది వర్ణించలేనిదాన్ని వర్ణిస్తుంది. ఆ వర్ణించలేనిదాన్ని

వర్ణిస్తూ, గురుశిష్యపరంపర విజయవంతం అయింది. గురువు, మాటలకందని విషయాన్ని ప్రత్యేక పద్ధతిలో బోధిస్తూ వస్తున్నాడు తరతరాలుగా.

ఈ విషయాన్ని ముందే ఉపోద్ఘాతంలో చూశాము. పదాలు దేన్నైనా వర్ణించాలంటే దానికి ఐదు లక్షణాలు ఉండాలనీ, తురీయానికి ఆ లక్షణాలు లేవు కాబట్టి తురీయాన్ని వర్ణించలేమనీ, అంటే ఉపనిషత్తు నాలుగు తెలివైన మార్గాల ద్వారా వివరిస్తుందని చూశాము. ఆ మార్గాలు - మిథ్యా లక్షణం, ఆగంతుక లక్షణం, లక్షణ అభావ, నేతి-నేతి పద్ధతి. దీన్నే చెప్పకనే చెప్పటం అంటారు లేదా మౌనవ్యాఖ్యానం అంటారు. అందువల్ల అవ్యపదేశ్యం అంటే **వాచామగోచరమ్**.

**అవ్యవహార్యమ్** - వ్యవహారం అంటే లావాదేవీలు చేయటం. అవ్యవహార్యమ్ అంటే లావాదేవీలు చేయకపోవటం. మనం చేసే పనులన్నీ జ్ఞానేంద్రియాల ద్వారానో, కర్మేంద్రియాల ద్వారానో, మనస్సు ద్వారానో చేస్తాము. జ్ఞానేంద్రియాల ద్వారా వ్యవహారం అంటే చూడటం, వినటం అవుతుంది. తురీయం అదృష్టం అంది. కర్మేంద్రియాల ద్వారా అంటే పట్టుకోవటం అవుతుంది. తురీయం అగ్రాహ్యం అంది. మనస్సు ద్వారా అంటే ఆలోచనలు చేయటం. తురీయం అచింత్యం అంది. వాక్కు ద్వారా అంటే వర్ణించటం. తురీయం అవ్యపదేశ్యం అంది. అదృష్టమ్, అగ్రాహ్యమ్, అచింత్యమ్, అవ్యపదేశ్యమ్ అయితే సహజంగానే అది అవ్యవహార్యమ్ కూడా అవుతుంది. వ్యవహారం నడపకపోతే దేశ, కాల పరిమితులు కూడా ఉండవు.

తురీయం ఈ విధంగా ప్రత్యక్ష ప్రమాణానికీ, అనుమాన ప్రమాణానికీ, శబ్దప్రమాణానికీ అందదు కాబట్టి, ఏ ప్రమాణానికీ అందనిది ప్రమేయం కాదు కాబట్టి, తురీయం అప్రమేయం.

**ప్రమేయత్రయ విలక్షణం తురీయమ్**

సి) **త్రయ అధిష్ఠానమ్** - ఇప్పుడు సానుకూలంగా నిర్వచనాలను ఇస్తున్నది ఉపనిషత్తు.

**ఏకాత్మప్రత్యయసారమ్** - సారం అంటే ఇక్కడ ప్రమాణం. ప్రత్యయ అంటే నా ఎరుక, నా అనుభవం.

నేను వింటున్నాను, నేను వస్తున్నాను - ఈ వాక్యాలలో ఉన్న నేను ఉత్తమపురుషుడు, ఏకవచనం. ఆత్మప్రత్యయంలో ఆత్మ అంటే నేను; ప్రత్యయం అంటే ఎరుక లేదా అనుభవం. ఎరుక వాడదాము. అంటే ఆత్మప్రత్యయం అంటే నా ఎరుక. తురీయాన్ని నా ఎరుక అనే ప్రమాణం ద్వారా తెలుసుకోవాలి. ఎటువంటి ఎరుక? ఏకమ్. ఒకటే నిరంతరంగా సాగే ఎరుక.

**దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారమ్** - గీత 2.13

అనుభవాలు మారుతాయి; ఎరుక మారుతుంది; బాల్యంలో, యవ్వనంలో, నడివయస్సులో,

వృద్ధాప్యంలో అనుభవాలు మారుతాయి. ఎరుక మారుతుంది. కాని వీటన్నిటిలోనూ నిరంతరం ఉంటూ కూడా, మారకుండా ఉన్నదొకటి ఉంది. అది నేను. మారే ఎరుకలతో పాటు మారని నేను ఉంటూనే ఉన్నాను. మారేదాన్ని వ్యావృత్తి అంటారు; మారని నన్ను అనువృత్తి అంటారు. అంటే వ్యావృత్తిలో అనువృత్తిగా నేను ఉన్నాను. ఈ మారని, నిరంతరంగా సాగుతున్న నేను ఎరుక ఏదైతే ఉందో, అది ఏకాత్మ ప్రత్యయసారం. దీన్ని అధ్యయనం చేయటం ద్వారా, మనం తురీయాన్ని అర్థం చేసుకోవాలి.

ఇప్పుడు మనం సాంకేతిక రంగంలోకి అడుగుపెడుతున్నాము. ఈ అనువృత్తి ద్వారా తురీయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఈ నేను ఎరుకలో ఏమిటి సమానంగా ఉంది? నేను చైతన్యాన్ని. నేను జడమైతే నాకు, నేను అనే ఎరుక ఉండదు. నా జీవితంలో వచ్చే అన్ని దశల్లోనూ నేను నిరంతరంగా కొనసాగుతున్నాను. ఈ నేనుకు కొన్ని గుణాలు కలుపుతూ వస్తాను. నేను అప్పుడు విచారంగా ఉన్నాను; ఇప్పుడు ఆనందంగా ఉన్నాను; నేను అప్పుడు కృంగిపోయాను; ఇప్పుడు తిప్పుకున్నాను అంటాను. అంటే ఒకప్పుడు ఉన్న భావోద్రేకం ఇప్పుడు లేదు. నాకు ఈ భావోద్రేకాలన్నీ తెలుస్తున్నాయి. నేను చైతన్యతత్త్వాన్ని, నేను దుఃఖంలోనూ ఉన్నాను, ఆనందంలోనూ ఉన్నాను. ఈ భావోద్రేకాలు మారుతూ ఉంటాయి కాబట్టి, అవి నా స్వరూపం కాదు.

ఇప్పుడు ఈ నిరంతరం నేను సంతోషంగా ఉండే నేనా, దుఃఖంతో ఉండే నేనా? సంతోషంగా ఉండే నేను నా స్వరూపం అయితే, నేను ఎప్పుడూ సంతోషంగా ఉండాలి; కాని దుఃఖంతో ఉండే నేను నా స్వరూపం అయితే నేను ఎప్పుడూ దుఃఖంతో ఉండాలి. అలాగే బాలుడు అయిన నేను నా స్వరూపం అయితే నేను ఎప్పుడూ బాలునిగానే ఉండాలి. అంటే 'నేను' పదం తర్వాత కలిపినవేవీ నేను కాదు. అవి నాకు ఆపాదించబడ్డ గుణాలు. అవేవీ నేను కాను.

| | | |
|---|---|---|
| నేను ఆనందంగా ఉన్నాను | = ఆనందం గుణం | + చైతన్యమైన నేను |
| నేను బాలునిగా ఉన్నాను | = బాలుని గుణం | + చైతన్యమైన నేను |

ఈ ఆనందం, బాలుడు అనే గుణాలకు రాకపోకలు ఉన్నాయి. అంటే అవి వచ్చిపోతాయి. ఈ వాక్యాల్లో సమానంగా ఉన్న లక్షణం, చైతన్యమైన నేను. ఆనందం ఉన్నా, లేకపోయినా చైతన్యమైన నేను ఉన్నాను. నేను బాల్యదశలో ఉన్నా, దాటిపోయినా కూడా నేను చైతన్యంగా ఉన్నాను. అంటే తురీయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? నేను తర్వాత కలిపిన గుణాన్ని వదిలివేయాలి. ముందు వాక్యాన్ని మళ్ళీ చూద్దాము.

నేను బాలునిగా ఉన్నాను = అనువృత్తి అయిన నేను + వ్యావృత్తి అయిన బాలుడు

వ్యావృత్తి తీసేస్తే మిగిలేది ఏమిటి? అనువృత్తి అయిన నేను.

| | | |
|---|---|---|
| నేను బాలునిగా ఉన్నాను | - బాలుడు | = నేను ఉన్నాను |
| నేను ఆనందంగా ఉన్నాను | - ఆనందం | = నేను ఉన్నాను |

ఈ వాక్యాలన్నింటిలోనూ సమానంగా ఉన్నది నేను. ఆ నేను శుద్ధచైతన్యం. ఉపనిషత్ దీన్నే ఏకాత్మ ప్రత్యయసారం అంటున్నది. ఈ సూత్రాన్ని బంగారం, ఆభరణాలకు అన్వయిస్తే తేలిగ్గా అర్థం చేసుకోగలము.

| | | |
|---|---|---|
| బంగారం గాజు | - గాజు | = బంగారం |
| బంగారం గొలుసు | - గొలుసు | = బంగారం |
| బంగారం ఉంగరం | - ఉంగరం | = బంగారం |

ఈ మూడు పదాల్లోనూ సమానంగా ఉన్న పదం బంగారం. గాజు, గొలుసు, ఉంగరం వచ్చి, పోతాయి. అవి నామరూపాలు మాత్రమే. నామరూపాలు ఆగమాపాయి, బంగారం అనాగమాపాయి. ఇప్పుడు ఇదే సూత్రాన్ని తురీయానికి అన్వయిద్దాము.

| | | |
|---|---|---|
| తురీయం | + విశ్వ - విశ్వ | = తురీయం |
| తురీయం | + తైజస - తైజస | = తురీయం |
| తురీయం | + ప్రాజ్ఞ - ప్రాజ్ఞ | = తురీయం |

ఈ మూడు పాదాల్లోనూ సమానంగా ఉన్న పదం ఏమిటి? తురీయం. తురీయం పక్కన ఏది కలిపినా, అది గుణం కింద వస్తుంది. తురీయం అంటే నేను అని చూశాము. ఇప్పుడు తురీయం తీసి, నేను వేద్దాము. నేను ఉన్నాను అని చెప్పి దాని పక్కన ఫుల్‌స్టాప్ పెడితే నేను తురీయం. కాని తరువాత ఏది కలిపినా నేను విశ్వనో, తైజసనో అవుతాను. నేను ప్రాజ్ఞ అని చెప్పలేము. ఆ విధంగా నేను పక్కన పెట్టిన గుణాలను తీసి, ఏదైతే మారని చైతన్యంగా వీటన్నిటిలోనూ ఉందో, అది ఏకాత్మప్రత్యయసారం.

ఏకాత్మప్రత్యయసారం అంటే ఒకే ఆత్మప్రత్యయ ప్రమాణంగా కలది.

**ప్రపంచోపశమమ్** - ప్రపంచం అంటే మూడు పాదాల్లోనూ చెప్పబడిన మూడు ప్రపంచాలు. మొదటిపాదంలో స్థూలప్రపంచం, రెండవపాదంలో సూక్ష్మప్రపంచం, మూడవపాదంలో కారణప్రపంచాలను చూశాము. ఉపనిషత్తు, తురీయం ఈ ప్రపంచాలనుంచి విముక్తి పొందింది అంటున్నది. ఉపశమం అంటే రహితం. అంటే చైతన్యంలో ప్రపంచం లేదు.

దీని అర్థం ఏమిటి? ఈ మంత్రంలో ప్రతి ఒక్క పదమూ చాలా ముఖ్యమైనది. ఈ పదం అంత ముఖ్యమైనది కాబట్టే, గౌడపాదాచార్యులవారు మొత్తం రెండవ అధ్యాయాన్ని ఈ **ప్రపంచోపశమమ్** పదవిశ్లేషణకు కేటాయించారు. దాన్ని వైతథ్య ప్రకరణం అంటారు.

వైతథ్యం అంటే మిథ్య. జగత్తు ఎలా మిథ్యో అక్కడ వివరంగా చెప్పుకొస్తారు. అప్పుడే ఆ వివరాలు చూద్దాము. ఇప్పుడు ఈ పదం అర్థం, తేలికగా చూద్దాము.

ప్రపంచోపశమమ్ అని ఉపనిషత్ అనటంలోని ఉద్దేశ్యం తురీయంలో ప్రపంచం లేదు. ప్రపంచం అంటే పైన మూడు పాదాల్లోనూ వచ్చిన మూడు ప్రపంచాలు అని చూశాము. ఇలా ప్రపంచాన్ని త్రోసిపుచ్చటంవల్ల ఏం తెలుస్తుంది? ఏం తెలుస్తుందో తెలుసుకునే ముందు, రెండు ప్రకృతిసూత్రాలను చూద్దాము.

1. దేనికైతే ఉనికి ఉందో, దాన్ని త్రోసిపుచ్చలేము. అంటే ఉనికి ఉన్నదాన్ని త్రోసిపుచ్చలేము. ఉనికి అంటే సత్.

**సత్ చేత్ బాధ్యేత**

2. దేనికైతే ఉనికి లేదో, దాన్ని త్రోసిపుచ్చనవసరం లేదు. ఉనికే లేనిదాన్ని లేదని కొత్తగా చెప్పేదేముంది? ఉనికి లేదు అంటే అసత్.

**అసత్ చేత్ న ప్రతీయేత**

అంటే లేనిది మనకు తెలియదు కాబట్టి దాన్ని త్రోసిపుచ్చనవసరం లేదు.

ఈ రెండు సూత్రాల ప్రకారం సత్‌ను కాని, అసత్‌ను కాని త్రోసిపుచ్చలేము. దేన్నైనా త్రోసిపుచ్చితే అది సత్, అసత్‌లలోకి రానిదై ఉండాలి.

ఈ ప్రపంచోపశమమ్ పదంలో ఉపనిషత్ ప్రపంచాన్ని త్రోసిపుచ్చుతున్నది. ప్రపంచాన్ని త్రోసిపుచ్చుతున్నది అంటే, అది అటు సత్‌లోకీ రాదు, ఇటు అసత్‌లోకీ రాదు అని అర్థం చేసుకోవాలి. అంటే **సదసత్ విలక్షణమ్**. అది మిథ్య.

ఇటువంటి ఒక వస్తువు ఉందా అని సందేహం వస్తుంది. మిథ్య అంటే అసలు లేదని కాదు అర్థం. ఏదైతే ఉన్నట్టుగా ఉంటుందో, కాని నిజంగా నిజం కాదో అది మిథ్య. ఇంకో విధంగా చెప్పాలంటే ఒక అవస్థలో ఉండి, ఇంకొక అవస్థలో లేనిది.

ఇది అర్థం చేసుకోవాలంటే, మన స్వప్నవృత్తాంతం తీసుకోవాలి. స్వప్నం సత్‌లోకి వస్తుందా, అసత్‌లోకి వస్తుందా? స్వప్నం లేదు అంటే స్వాప్నికుడు ఒప్పుకోడు. స్వాప్నికునికి స్వప్నంలో ఉన్నంతవరకూ అతని స్వప్నం, స్వప్నం అని తెలియదు. అది అతనికి మహా సత్యం. అక్కడ ఒక పులిని చూసి, ఖంగారు పడతాడు; పరుగులు పెడతాడు; చమటలు పడతాయి. అక్కడ కలలో గురువు కనబడి, ఇది నిజంకాదు అంటే అతను ఒప్పుకోడు. అయితే దీన్ని సత్ అందామా? అతను నిద్రనుంచి లేవగానే పులి మాయమై పోతుంది. పులి ఎక్కడికి వెళ్ళింది? మంచం కిందికి దూరిందా, జూలోకి పారిపోయిందా? అసలు నిజంగా ఉంటే కదా పారిపోవటానికి. అంటే నిద్రనుంచి లేవగానే అది అసత్ అయింది. అంటే స్వప్నం నిజంగా

ఉందా అంటే ఉంది అనలేము; లేదా అంటే పూర్తిగా లేదనీ అనలేము. అది స్వప్నకాలంలో మాత్రమే ఉంటుంది. దాన్నే ప్రాతిభాసిక సత్యం అంటారు. సదసత్ విలక్షణమ్.

ఇప్పుడు ఇదే విధంగా జాగ్రత్ ప్రపంచాన్ని చూద్దాము. అది సత్ కిందికి వస్తుందా, అసత్ కిందికి వస్తుందా? జాగ్రత్ పురుషునికి అది మహాసత్యం. ఈ ప్రపంచం కంటికి కనబడుతోంది, వ్యవహారం నడుపుతున్నాడు, బాధపడుతున్నాడు. అందువల్ల అప్పుడు అది సత్. కాని ఇదే జాగ్రత్ పురుషుడు పడుకుని నిద్రపోతే, స్వాప్నికునికి ఈ ప్రపంచం ఉన్నట్టే తెలియదు. స్వప్నపురుషునితో స్వప్నం మిథ్య, జాగ్రత్ ప్రపంచం అని ఇంకొకటి ఉంది అంటే అతను నమ్మలేడు. అంటే అప్పుడు జాగ్రత్ ప్రపంచం అసత్ అయింది. అంతేకాదు, అద్వైతం స్థాయికి ఎదిగితే అప్పుడు కూడా ఇది అసత్ అవుతుంది. అందువల్ల జాగ్రత్ ప్రపంచాన్ని వ్యావహారిక ప్రపంచం అంటారు. వ్యవహారం నడుపుతున్నంతసేపే అది సత్యం. దాన్నుంచి లేస్తే అది అసత్ అవుతుంది. అందువల్ల ఒక అవస్థలో ఉండి, ఇంకొక అవస్థలో లేనిదాన్ని మిథ్య అంటారు. ఈ విషయం అర్థమయితే, ప్రపంచోపశమం అంటే- మొదటి మూడు పాదాలూ మిథ్య; మూడు ప్రపంచాలూ మిథ్య. ఇది మనను తర్వాత వచ్చే పదానికి తీసుకువెళుతుంది.

**అద్వైతమ్** - ఆత్మకు నాలుగు పాదాలు ఉన్నాయని చెప్పి, మొదటి మూడు పాదాలను త్రోసిపుచ్చాలి అంటే మిగిలేది ఏమిటి? నాలుగవ పాదం మాత్రమే. అదే తురీయం. **ఏకమేవాద్వితీయమ్.** తురీయం అంటే రెండవది లేని చైతన్యతత్త్వం. చైతన్యం మాత్రమే సత్యం, పదార్థం మిథ్య. అందువల్ల పదార్థం ఉన్నా లేనట్టే. అందువల్ల రెండు వస్తువులు ఉన్నాయనకూడదు. చైతన్యం, పదార్థం ఉన్నాయనకూడదు. ఉన్నదొకటే చైతన్యం; రెండవది లేని అద్వైతం. ఈ పదం కూడా ఈ మంత్రంలో చాలా ముఖ్యమైనది. గౌడపాదాచార్యుల వారు ఈ పదాన్ని విశ్లేషిస్తూ, ఇదే పేరుతో (అద్వైత ప్రకరణమ్) మూడవ అధ్యాయంలో 48 కారికల్లో వివరిస్తారు.

**చతుర్థం మన్యంతే** - ఈ అద్వైతాన్ని నాలుగవ అంశం అని భావిస్తారు కొందరు. ఒకపక్క తురీయం అద్వైతం అంటూ, ఇంకొకపక్క అది నాలుగవది అని ఎలా అంటారు? అందువల్ల ఉపనిషత్తు తురీయం గురించి తెలియనివారు నాలుగవ అంశం అని భావిస్తారు అంటున్నది. వారు విశ్వ, తైజస, ప్రాజ్ఞులు కూడా తురీయం అంత సత్యం అనుకుంటారు. అందువల్ల వారికి తురీయం నాలుగవ అంశం. కాని జ్ఞానులకు తురీయం ఒక్కటే ఉంది, అది అద్వైతం, తక్కిన మూడూ మిథ్య.

టూకీగా చెప్పాలంటే, తురీయం జ్ఞానులకు అద్వైతం, అజ్ఞానులకు నాలుగవ అంశం.
**శాంతమ్** - తురీయం దృష్ట్యా ప్రపంచం మిథ్య కాబట్టి, ప్రపంచం తురీయాన్ని బాధపెట్టలేదు.

అందువల్ల తురీయం శాంతం. కలలో వాన కురిస్తే, జాగ్రత్ పురుషుడు తడవడు; కలలో రేగిన అగ్నిజ్వాలలు జాగ్రత్ పురుషుణ్ణి కాల్చలేవు; కలలో ఎవరైనా కత్తితో పొడిచినా, జాగ్రత్ పురుషునికి దెబ్బ తగలదు. ఎందుకు? ఏదైతే మిథ్యో, అది సత్యాన్ని చలింపజేయలేదు. అలాగే, తురీయపరంగా జాగ్రత్ ప్రపంచం మిథ్య కాబట్టి, అది తురీయాన్ని చలించజేయలేదు. అంటే మిథ్య. సత్యాన్ని బాధించలేదు. అందువల్ల తురీయం ఎప్పటికీ శాంతమ్.

**శివమ్** – శివం అంటే మంగళరూపం లేదా ఆనందస్వరూపం. శాంతం అంటే దుఃఖరహితం; శివం అంటే ఆనందస్వరూపం.

**స ఆత్మా** – ఈ తురీయమే అసలు ఆత్మా. నేను అంటే జాగ్రత్ పురుషుడైన విశ్వ కాదు; స్వప్నపురుషుడైన తైజస కాదు; సుప్తపురుషుడైన ప్రాజ్ఞ కాదు. నేను అంటే గుణాలు లేని తురీయాన్ని.

**స విజ్ఞేయః** – ఇది తెలుసుకోగాక! జీవితంలో తెలుసుకుని తీరాల్సింది ఏదైనా ఉందంటే, అది ఇదొక్కటే. నేను ప్రపంచంలో ఏమయినా దానివల్ల బాధింపబడని తురీయాన్ని.

### ప్రమాతృప్రమేయ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి

(ఇదంతా **పట్టిక 4 – చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయఃలో** ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు.)

ఇదీ తురీయంయొక్క నిర్వచనం. ఇది బాగా లోతైన జ్ఞానం; కాని గౌడపాదాచార్యుల వారు మనం దీన్ని తేలికగా అర్థం చేసుకోవటానికి తోడ్పడతారు.

నిజానికి ఈ తురీయాన్ని అర్థం చేసుకోవటానికి మనం ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. నేను అనుభవిస్తున్న మూడు అవస్థలను విశ్లేషిస్తేనే చాలు. నేను జాగ్రద్ పురుషునిగా, స్వప్నపురుషునిగా, సుప్తపురుషునిగా మూడు అవస్థల్లో తిరుగుతున్నాను. ఉపనిషత్తు ఈ మూడూ అశుద్ధంతో కలిసి ఉన్నాయనీ, వాటిలోని అశుద్ధాన్ని పారద్రోలి, శుద్ధమైన నేనుని చేరుకోవాలనీ అంటున్నది. ఎలా అశుద్ధాన్ని విడదీయాలి?

దేనికైనా రెండు స్వభావాలు ఉంటాయి. అవి ఆగంతుక లక్షణం, స్వరూపలక్షణం. ఆగంతుక లక్షణం తాత్కాలికం. దానికి రాకపోకలు ఉంటాయి. స్వరూపలక్షణం శాశ్వతం. దానికి రాకపోకలు ఉండవు. ఉదాహరణకు అగ్నిని తీసుకుంటే అగ్నికి వేడిగా ఉండటం దాని స్వరూపలక్షణం. శీతలదేశంలో కూడా అగ్ని వేడిగానే ఉంటుంది. కాని నీటి విషయం తీసుకుంటే, నీటిలో వేడి ఉంటే, అది దాని స్వరూపలక్షణం కాదు, ఆగంతుక లక్షణం. నీరు కాసేపే వేడిగా ఉంటుంది.

అదే విధంగా నేను జాగ్రత్ పురుషునిగా, స్వప్నపురుషునిగా, సుప్తపురుషునిగా నీటిలాగా ఉన్నాను. అంటే నాలో ఆగంతుక లక్షణం, స్వరూపలక్షణం రెండూ ఉన్నాయి. ఆ అవస్థల్లో వీటినుంచి స్వరూపలక్షణం ఏమిటో తెలుసుకోవటం ఎలా? మూడింటిలోనూ సమానంగా ఉన్నదేదో అది స్వరూపలక్షణం.

జాగ్రత్ పురుషునిగా నాకు జాగ్రత్ ప్రపంచం గురించి తెలుస్తున్నది
స్వప్నపురుషునిగా నాకు స్వప్నప్రపంచం గురించి తెలుస్తున్నది
సుప్తపురుషునిగా నాకు సుషుప్తి గురించి తెలుస్తున్నది

సుషుప్తి గురించి తెలుస్తున్నది అని ఎలా చెప్పగలము? సుషుప్తి గురించి తెలియకపోతే, సుషుప్తి గురించి మాట్లాడలేము. గాఢనిద్రలో ఉండగా నాకేమీ తెలియలేదు అని నాకు తెలుస్తున్నది. నిద్రలో చైతన్యం లేకపోతే, మన శరీరాన్ని శవంగా భావించి, దహనక్రియలు చేసేస్తారు దానికి ఇతరులు. అందువల్ల మూడు అవస్థల్లోనూ సమానంగా ఉన్నది చైతన్యం. ఈ చైతన్యంవల్లనే ఈ అవస్థలో ఆయా అనుభవాలను పొందగలుగుతున్నాను. బంగారం ఎలాగైతే గాజు, గొలుసు, ఉంగరాల అంతటా ఉందో, అలాగే చైతన్యం విశ్వ, తైజస, ప్రాజ్ఞల్లో అంతటా ఉంది. అందువల్ల చైతన్యం స్వాభావికధర్మం.

ఇప్పుడు ఆగంతుక ధర్మపరంగా ఈ అవస్థలను విశ్లేషిద్దాము. జాగ్రదావస్థలో నేను నాకు కోపంగా ఉంది అంటాను. కోపం నా స్వరూపం కాదు. ఒకవేళ అది నా స్వరూపలక్షణం అయితే నేను ఎప్పుడూ కోపంగానే ఉండాలి. ఒక్కోసారి ఆనందంలో తేలిపోతాను. అదే విధంగా నేను లావుగా ఉన్నాను అంటాను. అది నా స్వరూపం అయితే నేను ఎప్పటికీ లావుగా ఉండాలి. అసలు ఆ మాటకొస్తే నేను జాగ్రత్ పురుషుణ్ణి అనే ఈ మాటే నా ఆగంతుక లక్షణం. ఎందుకు? అది నా స్వరూపలక్షణం అయితే నేను ఎప్పటికీ మేలుకునే ఉండాలి. కాని అది ఒక అవస్థ మాత్రమే. నా మనస్సు బాహ్యముఖంగా ఉన్నప్పుడు, నేను జాగ్రత్ పురుషుణ్ణి అవుతున్నాను.

అలాగే నా మనస్సు అంతర్ముఖంగా అయినప్పుడు నేను స్వప్నపురుషుణ్ణి అవుతున్నాను. అదీ నా స్వరూపం కాదు. ఒకవేళ అది నా స్వరూపం అయితే నేను ఎప్పటికీ కలల్లో తేలిపోతూనే ఉంటాను. మాండూక్యోపనిషత్తును నేర్చుకోలేను. చైతన్యమైన నేను వేసుకున్న తాత్కాలికమైన వేషం అది. అప్పుడు నేను నా వాసనల్లోకి తొంగిచూస్తాను. అదీ అయిపోయాక, గాఢనిద్రలోకి జారుకుంటాను. అప్పుడు నా మనస్సు పనిచేయదు. అది కూడా పడుకుంటుంది.

ఈ మూడు అవస్థలను మళ్ళీ ఒకసారి బేరీజు వేస్తే, ఉపనిషత్తు చెప్పిన భాషలో చెబితే నేను జాగ్రదావస్థలో బహిష్ప్రజ్ఞః; స్వప్నావస్థలో అంతః ప్రజ్ఞః; సుషుప్తిలో ప్రజ్ఞానఘనః.

ఈ లక్షణాలన్నీ మనస్సుకు చెందినవి. నేనెవరు? నేను ఈ మూడు అవస్థల్లోనూ అధిష్ఠానంగా ఉన్న శుద్ధచైతన్యాన్ని.

ఈ శుద్ధచైతన్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఈ మూడు అవస్థలనూ తీసుకుని, వాటికున్న ఆగంతుక లక్షణాన్ని పిండి, వాటి స్వరూపలక్షణాన్ని పట్టుకోవాలి. ఆగంతుక లక్షణాన్ని పిండితే మిగిలేది స్వచ్ఛమైన స్వరూపలక్షణం.

దీన్ని శంకరాచార్యులవారు యుక్తి అవఘాతః అంటారు. అంటే వడ్లని దంచి ఎలా పొట్టు తీస్తారో, అలా బుద్ధిలో నేను విశ్వను కాను, నేను తైజసను కాను, నేను ప్రాజ్ఞను కాను అని దంచాలి. నేను వీటికి అధిష్ఠానంగా ఉండి, వీటికి విలక్షణంగా ఉన్న తురీయాన్ని అని అర్థం చేసుకోవాలి. దీన్ని తురీయజ్ఞానం అంటారు. వ్యవహారం నడుపుతున్నప్పుడు నేను జాగ్రత్ పురుషుణ్ణి అనవచ్చు కాని, స్వరూపరీత్యా నేను తురీయాన్ని అని మర్చిపోకూడదు.

**నేను** జాగ్రత్‌పురుషుణ్ణి, **నేను** స్వప్నపురుషుణ్ణి, **నేను** సుప్తపురుషుణ్ణి అనే ఈ వాక్యాల్లో సమానంగా ఉన్న నేను, నేను, నేను పదం నేను ఆత్మను అని నిరూపించే ప్రమాణం. దీన్ని ఏకాత్మప్రత్యయసారం అంది ఉపనిషత్తు. ఇదీ ఏడవమంత్రం సారం. ఇది ముఖ్యమైన మంత్రం కాబట్టి, ఈ మంత్రంమీద ప్రత్యేకించి వెంటనే కొన్ని కారికలు రాశారు గౌడపాదాచార్యులవారు. అందువల్ల ఇప్పుడు మళ్ళీ ఉపనిషత్తు మంత్రం 7నుంచి గౌడపాదాచార్యులవారి కారిక 10లోకి వెళతాము.

## 2. నాలుగు పాదాల సాధర్మ్యము–వైధర్మ్యము–కారికలు 10–18, మంత్రం 7 తరువాత

కారిక 10లో ఏడవ మంత్రం సారాంశం; 11–16 కారికల్లో నాలుగు పాదాల సాధర్మ్యం–వైధర్మ్యం చూస్తాము.

### కారిక 1.10

**నివృత్తేస్సర్వదుఃఖానామీశానః ప్రభురవ్యయః ।**
**అద్వైతస్సర్వభావానాం దేవస్తుర్యో విభుస్స్మృతః ॥**

### మంత్రం 7 సారాంశం

**తుర్యః విభుః స్మృతః** – మనం ఇంతవరకూ **తురీయం అంటూ వచ్చిన పేరు నిజానికి ఇక్కడ వస్తుంది**. ఉపనిషత్తు ఈ పేరును వాడలేదు, **చతుర్థం మన్యంతే** అంది. అజ్ఞానులు నాలుగవ అంశం అంటారు అంది. ఇక్కడ గౌడపాదాచార్యులవారు తుర్యః అన్నారు. తుర్యః అంటే తురీయః అంటే తురీయం. తురీయః అంటే చతుర్థః, నాలుగవది. గొప్ప ఆచార్యులు తురీయం గురించి ఈ విధంగా చెబుతున్నారు. ఈ కారికలోని తక్కిన పదాలన్నీ ఈ తురీయం గురించిన వర్ణనే.

**ప్రభుః ఈశానః** – ప్రభువు అంటే సర్వసమర్థుడు; ఈశానః అంటే సర్వాన్ని శాసించేది. తురీయం సర్వశక్తివంతమైనది. ఎందువల్ల?

**సర్వదుఃఖానాం నివృత్తేః** – తురీయమైన నాకు ప్రపంచంలోని సర్వదుఃఖాలు తొలగిపోతాయి. సర్వదుఃఖం అంటే అధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవిక దుఃఖాలు.

జన్మమృత్యుజరావ్యాధి దుఃఖాలు శరీరపరంగా వచ్చే దుఃఖాలు. కామక్రోధలోభమోహ మదమాత్సర్యాలు మనస్సుపరంగా వచ్చే దుఃఖాలు. నివృత్తేః – ఈ దోషాలన్నీ తొలగిపోతాయి. తురీయానికి జాగ్రత్ పురుషుడు అనుభవించే దుఃఖం కాని, స్వప్నపురుషుడు అనుభవించే దుఃఖం కాని అంటదు. సుప్తపురుషుని విషయం ఎత్తటం లేదు. ఎందుకంటే సుషుప్తిలో ఆనందం పొందుతాడు అని చూశాము. కాని అది తాత్కాలిక ఆనందమే. సుషుప్తిలో దుఃఖం అవ్యక్తంలో ఉంటుంది. ఎలా చెప్పగలము? సుషుప్తి నుంచి లేస్తూనే సమస్యలతో లేస్తాము. అందువల్ల సుషుప్తి కూడా అవస్థల్లోకే వచ్చింది. తురీయంలో వ్యక్త దుఃఖమూ లేదు, అవ్యక్త దుఃఖమూ లేదు. అందువల్ల అది శక్తివంతంగా, సమర్థవంతంగా ఉంది.

తురీయంలో దుఃఖం ఎందుకు లేదు? దీనికొక ప్రకృతి సూత్రం ఉంది. ఒక వస్తువును ప్రకాశింపజేసేదానికి, ప్రకాశింపబడే వస్తువులకున్న మలినం అంటదు. ఇది అద్వైత సిద్ధాంతంలో బాగా గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన సూత్రం.

చేయి–కాంతి ఉదాహరణ తీసుకోండి. కాంతి చేతిని ప్రకాశింపజేస్తుంది కాని చేతికి మట్టి ఉన్నా, కాంతికి ఆ మట్టి అంటదు. నా వేళ్ళను విడిగా పెడితే, వేళ్ళమధ్య ఖాళీ ఉన్నట్టు ఉంటుంది. కాని కాంతికి విభజన లేదు. శరీరంలో భాగాలు ఉన్నాయి, చైతన్యానికి భాగాలు లేవు; శరీరం అశుద్ధం అవుతుంది, చైతన్యం అశుద్ధం అవదు. అందువల్ల ఈ మూడు అవస్థలకూ ఉన్న లక్షణాలేవీ తురీయానికి అంటవు. నేను ఎప్పటికీ యజమానిని, ఎప్పటికీ కోపానికి బానిసను కాను. నేను అన్నప్పుడల్లా, ఆ నేను ఎవరో మర్చిపోకూడదు. తురీయం అయిన నేను. అందువల్ల నేను ఈశానప్రభుః.

**అవ్యయమ్** – తురీయమైన నాకు వినాశము లేదు. శరీరం షడ్వికారాలకు లోనవుతుంది. అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి. కాని తురీయానికి ఇవి అంటవు.

**సర్వభావానామ్ అద్వైతః** – విభజన ఉన్న వస్తువుల అంతటా ఉన్న విభజన లేని చైతన్యం. ఆకాశం అఖండం. విభజన ఉన్న వస్తువులలో విభజన లేకుండా ఉంటుంది ఆకాశం.

**దేవః** – ఇక్కడ దేవః అంటే దేవతగా తీసుకోకూడదు. అంటే ఇంద్రుడు, వరుణుడు, అగ్ని దేవతలు కాదు. దేవః అంటే స్వయంప్రకాశకం. ఆత్మను స్వయంజ్యోతి అనీ, జ్యోతిషామపి

జ్యోతిః అనీ తక్కిన ఉపనిషత్తులు వర్ణిస్తాయి. చైతన్యంవల్లనే తక్కినవన్నీ ప్రకాశింపబడుతాయి కాని చైతన్యాన్ని వేరొకటి ప్రకాశింపజేయలేదు.

**దృగేవ న తు దృశ్యతే** – దృగ్దృశ్యవివేకమ్

చైతన్యం ఉందని ఎలా తెలుస్తుంది? చైతన్యంవల్లనే తక్కినవన్నీ తెలుస్తాయి. చైతన్యాన్ని ఇంకొక చైతన్యం ప్రకాశింపజేయాలంటే, దాన్ని మరొక చైతన్యం ప్రకాశింపజేయాల్సి ఉంటుంది. ఇంక దానికి అంతూ పొంతూ ఉండదు. ఉదాహరణకు కాంతి సమక్షంలో వస్తువులను చూస్తాము కాని, కాంతిని చూడటానికి ఇంకొక కాంతి అవసరం లేదు.

నేను స్వయంప్రకాశక జ్యోతిని అంటే ఎప్పుడు స్వయంప్రకాశకమవుతాను అంటారు కొందరు. ఆ ప్రశ్నే తప్పు. స్వయంప్రకాశకం అంటే మూడు అవస్థల్లోనూ ఉంటుంది. బంగారం ఆభరణాల్లో ఎప్పుడు ఉంటుంది అంటే ఏం చెబుతారు? ఎప్పుడూ ఉంటుంది. కొంతమంది తురీయం నిర్వికల్పక సమాధిలోనే తెలుస్తుంది అనుకుంటారు. అది కూడా పొరపాటే. అది ఎప్పుడూ ఉంటుంది.

**విభుః** – విభుః అంటే సర్వవ్యాపకం. కొంతమంది చైతన్యం ప్రాణుల్లోనే ఉంటుంది; జడవస్తువుల్లో ఉండదు అనుకుంటారు. కాని చైతన్యం సర్వవ్యాపకం. కాంతి చేతిమీద ప్రకటితమవుతుంది; కాంతి బల్లమీద కూడా ప్రకటితమవుతుంది; కాని ఈ రెండింటి మధ్యా ఉన్న ఖాళీ ప్రదేశంలో ప్రకటితమవదు. అంతమాత్రాన అక్కడ కాంతి లేనట్టు కాదు. అదే విధంగా చైతన్యం శరీరంలోనే ఉంది అనుకోవటం పొరపాటు.

చైతన్యం గురించి నేర్చుకున్న ఐదు లక్షణాల్లో ఒక లక్షణం చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు; శరీరం బయట కూడా ఉంటుంది. దాన్ని ప్రతిబింబించే మాధ్యమం లేకపోతే తెలియదు. అంతే. అందువల్ల తురీయం సర్వవ్యాపకం.

ఈ విధంగా ఇక్కడ గౌడపాదాచార్యులవారు తురీయం గురించి ఇచ్చిన వివరణ– అది **తురీయం, సర్వాన్నీ శాసించేది, సర్వసమర్థం, దుఃఖాలు లేనిది, వినాశము లేనిది, స్వయంప్రకాశకం, అద్వైతం, సర్వవ్యాపకం.** ఏడవ మంత్రంలోని రెండు పదాలు – ప్రపంచోపశమమ్, అద్వైతమ్ – తీసుకుని రెండు, మూడు అధ్యాయాల్లో చర్చిస్తారని చూశాము. అందువల్ల ఇక్కడితో ఈ వివరణను ముగిస్తున్నారు.

## కారికలు 11-14: నాలుగు పాదాల సాధర్మ్యం-వైధర్మ్యం ఉపోద్ఘాతం

ఈ కారికల్లో గౌడపాదాచార్యులవారు ఈ నాలుగు పాదాల సాధర్మ్య వైధర్మ్య విచారణ చేస్తున్నారు. నాలుగు పాదాలు అంటే విశ్వ, తైజస, ప్రాజ్ఞ, తురీయం. సాధర్మ్యం అంటే పోలికలు; వైధర్మ్యం అంటే భేదాలు. రామలక్ష్మణుల మధ్య పోలికలు చెప్పాలంటే ఇద్దరూ దశరథ మహారాజు పుత్రులు, ఇద్దరూ త్రేతాయుగానికి చెందినవారు. భేదాలు చెప్పాలంటే రాముడు శాంతమూర్తి, లక్ష్మణునికి త్వరగా కోపం వస్తుంది.

తర్కశాస్త్రంలో ఈ సాధర్మ్య-వైధర్మ్య విచారణను వాడతారు. దీని ద్వారా ఒక విషయం గురించి స్పష్టంగా అర్థమవుతుంది. గౌడపాదాచార్యులవారు ఈ విచారణను ఈ నాలుగు పాదాల విశ్లేషణకు వాడుతున్నారు. ఆయన విచారణను అర్థం చేసుకునేముందు, ఆ పద్ధతి ఏమిటో అర్థం చేసుకోవాలి.

దానికి తాడు-పాము ఉదాహరణ తీసుకుందాము. వేదాంతాన్ని ఈ ఉదాహరణ చూడకుండా అర్థం చేసుకోలేము. గౌడపాదాచార్యులవారే తరువాత వాడతారు.

క్రీనీడలో ఒక తాడు ఉందనుకుందాము. కొంత వెలుతురు ఉంది కాబట్టి, అక్కడ ఏదో ఉందని తెలుస్తున్నది; కాని కొంత క్రీనీడ ఉంది కాబట్టి అదేమిటో తెలియదు.

అక్కడేదో ఉంది – సామాన్య అంశం. అది కప్పబడలేదు, కంటికి కనిపిస్తోంది. అది సత్య అంశం కాని చీకటిగా ఉండటంవల్ల అది తాడు అని తెలియటం లేదు. తాడుని విశేష అంశం అంటారు. అది కనబడటం లేదు కాబట్టి దాన్ని ఆవృత అంశం. అది నిజం కాదు కాబట్టి అది మిథ్య. ఇప్పుడు ఈ విషయాలను మళ్ళీ చూద్దాము.

అక్కడ ఉన్నది తాడు – వాక్యం
అక్కడ ఉన్నది – సామాన్య, అనావృత, సత్య అంశం
తాడు – విశేష, ఆవృత, మిథ్యా అంశం

పొరపాటు చేయాలంటే రెండు అంశాలు ఉండాలి. దాని గురించి పూర్తి అజ్ఞానమూ ఉండకూడదు, పూర్తి జ్ఞానమూ ఉండకూడదు. అంటే అక్కడ తాడు అజ్ఞానం ఉంది. అజ్ఞానం ఉంటే, దానితో సరిపెట్టుకుంటామా? అజ్ఞానంవల్ల పొరపాటు చేస్తాము. అంటే పొరపాటు ఎప్పుడు జరుగుతుంది? అజ్ఞానం ఉంటేనే!

ఈ రెండు పదాలను గుర్తుపెట్టుకోండి. అజ్ఞానం, పొరపాటు. అజ్ఞాన జనిత పొరపాటు. పొరపాటు చేయాలంటే అజ్ఞానం ఉండితీరాలి. అంటే అజ్ఞానం కారణం, పొరపాటు కార్యం. మన జీవితం మొత్తం అజ్ఞానం + పొరపాటుల మేలుకలయిక. అదెలా?

ఏడవమంత్రంలో ఉపనిషత్ ఏమంది? నేను తురీయం అంది. తురీయం ఆకారం ఎంత? విభుః – సర్వవ్యాపకం. అంటే అపరిమితం, కాని నేనేం చేస్తున్నాను? చిన్నప్పటి నుంచి ఈ విషయం నాకు తెలియదు. నేను అపరిమిత చైతన్యాన్ని అనే విషయంలో అజ్ఞానం ఉంది. అంటే మనందరికీ ఆత్మ అజ్ఞానం ఉంది.

ఆత్మ అజ్ఞానం నిర్వచనం ఏమిటి? నేను సర్వవ్యాపకమైన తురీయాన్ని అనే సత్యం విషయంలో అజ్ఞానం. తాడు–పాము లాగానే. తాడు విషయంలో అజ్ఞానం, పాము అనే పొరపాటుకు దారితీసింది. ఆత్మ విషయంలో నేను సర్వవ్యాపకం అజ్ఞానం, నేను పరిచ్ఛిన్న జీవిని అనే పొరపాటుకు దారితీసింది. అంటే నేను పరిచ్ఛిన్నజీవిని అనే పొరపాటు, నేను సర్వవ్యాపకం అని తెలియని అజ్ఞానంనుంచి పుట్టింది. ఇంకో విధంగా చెప్పాలంటే ఆత్మ అజ్ఞానం కారణం, పరిచ్ఛిన్నత్వం కార్యం. జాగ్రత్ పురుషునిగా, స్వప్నపురుషునిగా నన్ను నేను దేశ, కాల పరిమితులు ఉన్న జీవిగా పరిగణిస్తాను. సుషుప్తిలో ఈ దేశకాలపరిమితులు ఉండవు కాబట్టి, అజ్ఞానం ఉండదు. నేను పరిమితి ఉన్న జీవిని అనే అజ్ఞానం ఉండదు కాని, నేను అపరిచ్ఛిన్న తురీయాన్ని అనే జ్ఞానమూ లేదు. అంటే అజ్ఞానమూ లేదు, జ్ఞానమూ లేదు.

నేను అపరిచ్ఛిన్నతురీయాన్ని అనే జ్ఞానం ఉండి ఉంటే, నేను నిద్ర లేవగానే నేను అపరిచ్ఛిన్న తురీయాన్ని అని చెప్పి ఉండేవాడిని. అంటే ప్రాజ్ఞలో కూడా అజ్ఞానం ఉంది, కాని ఈ అజ్ఞానం పొరపాటుకు దారితీయదు. ఎందుకంటే నేను పరిచ్ఛిన్న జీవిని అనే అజ్ఞానమే పొరపాటుకు దారితీస్తుంది. ఈ అజ్ఞానం–పొరపాటును గౌడపాదాచార్యులవారు నాలుగు సాంకేతిక పదాలతో వివరిస్తున్నారు.

| **అజ్ఞానం** | **పొరపాటు** |
|---|---|
| అగ్రహణం–చూడకపోవటం | అన్యథాగ్రహణం–తప్పుగా చూడటం |
| నిద్రా–నిద్ర | స్వప్న–స్వప్నం |
| కారణం | కార్యం |
| బీజం–విత్తనం | అంకురం–మొలక |

ఈ నాలుగు జతల పదాలూ పెట్టుకుని, గౌడపాదాచార్యులవారు విశ్వ, తైజస, ప్రాజ్ఞ, తురీయాల సాధర్మ్యం–వైధర్మ్యం గురించి చెప్పబోతున్నారు.

అజ్ఞానాన్ని నిద్రతో పోలుస్తారు. లౌకికంగా కూడా ఇంట్లో జరుగుతున్న ఏదైనా విషయం తెలియకపోతే, 'ఏమిటి నిద్రపోతున్నావా?' అంటారు. నిద్రపోతే సహజంగా వచ్చేది స్వప్నం. అగ్రహణం అంటే ఒక విషయాన్ని చూడకపోవటం. తాడు అజ్ఞానం ఎలా ఏర్పడింది? ఉన్నదాన్ని ఉన్నట్టుగా చూడకపోవటంవల్ల. దాన్ని సరిగ్గా చూడకపోవటంవల్ల

అన్యథాగ్రహణం జరిగింది. అంటే తాడుని చూసి పాముగా పొరపాటు పడటం. అజ్ఞానాన్ని కారణం అని ఎందుకంటారంటే, అజ్ఞానం అనేది లేకపోతే పొరపాటు అనే కార్యానికి అక్కడ తావే లేదు. అజ్ఞానాన్ని బీజం అని ఎందుకన్నారంటే, బీజంనుంచి అంకురం మొలచినట్టుగా అజ్ఞానంనుంచి అనేక పొరపాట్లు పుట్టుకువస్తాయి. అంకురం పదం గౌడపాదాచార్యులవారు వాడలేదు. తాడును చూసి పాము అనుకుంటారు అంటున్నాము కాని, తాడుని చూసి దండగా, నేలలో చీలికగా, కర్రగా పొరపాటు పడే అవకాశం కూడా ఉంది. ఈ పదాలను గుర్తుపెట్టుకోండి. వీటిని ఉపయోగించి వివరించబోతున్నారు గౌడపాదాచార్యులవారు.

### కారిక 1.11

**కార్యకారణబద్ధౌ తావిష్యేతే విశ్వతైజసౌ ।**
**ప్రాజ్ఞః కారణబద్ధస్తు ద్వౌ తౌ తుర్యే న సిధ్యతః ॥**

**విశ్వతైజసౌ కార్యకారణ బద్ధౌ** – విశ్వ, తైజసలు ఇద్దరికీ కారణం, కార్యం రెండూ ఉన్నాయి. కారణం అంటే అజ్ఞానం అనీ, కార్యం అంటే పొరపాటు అనీ చూశాము. అంటే మొదటి రెండు పాదాలకూ అజ్ఞానం, పొరపాటు రెండూ ఉన్నాయి. ముందే చూసినట్టుగా అజ్ఞానం– నేను అపరిచ్ఛిన్న పరమాత్మను; పొరపాటు – నేను పరిచ్ఛిన్నజీవిని. అందువల్ల విశ్వసంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాడు. తైజస కూడా అంతే. అతను స్వప్నసంసారంలో పరుగులు తీస్తున్నాడు.

**ప్రాజ్ఞః కారణబద్ధః** – కాని ప్రాజ్ఞ దగ్గరకు వచ్చేసరికి, ప్రాజ్ఞకు అజ్ఞానం మాత్రమే ఉంది. అజ్ఞానం మాత్రమే ఉందంటే ఏమిటి అర్థం? పొరపాటు లేదు. దీన్ని శుద్ధ అజ్ఞానం అంటారు. అజ్ఞానమే అశుద్ధం; మళ్ళీ అందులో శుద్ధం ఎలా వస్తుంది? అంటే అక్కడ పొరపాటు అనే మలినం లేదు కాబట్టి. పొరపాటు ఎందుకు లేదు? అతని మనస్సు పడుకుంటుంది కాబట్టి. ప్రాజ్ఞకు కూడా అహం బ్రహ్మ అస్మి జ్ఞానం లేదు, అయినా అతను పొరపాటు చేయడు. ఎందుకంటే మనస్సు పనిచేయదు కాబట్టి.

పూర్తి అజ్ఞానం ఉన్నా ఆనందమే; పూర్తి జ్ఞానం ఉన్నా ఆనందమే. అజ్ఞానం పొరపాటుతో కలిస్తేనే సమస్య వస్తుంది. తాడు–పాము విషయమే మళ్ళీ తీసుకుంటే, అక్కడ కాంతి బాగా ఉండి, అక్కడ ఉన్నది తాడు అని స్పష్టంగా తెలిస్తే, అజ్ఞానం లేదు; ఆనందమే ఉంది. అలాగే అక్కడ పూర్తిగా చీకటిగా ఉంటే, అక్కడ తాడు ఉందనే తెలియదు. తాడు అజ్ఞానమే లేకపోతే, ఇంక పొరపాటుకు ఆస్కారం ఏది? మొదటి సందర్భంలో పూర్తి జ్ఞానం ఉంది, పొరపాటు లేదు; రెండవ సందర్భంలో పూర్తి అజ్ఞానం ఉంది, పొరపాటు లేదు. సగం తెలిసి, సగం తెలియకపోతేనే అజ్ఞానం, అజ్ఞానజనిత పొరపాటు వస్తాయి.

సంసారం కూడా అంతే. పూర్తి అజ్ఞానం ఉన్నా సంసారం బాధించదు; పూర్తి జ్ఞానం ఉన్నా సంసారం బాధించదు. సగం అజ్ఞానం, సగం జ్ఞానం ఉంటేనే పొరపాటు వస్తుంది. సుషుప్తిలో అటు జ్ఞానమూ లేదు, అజ్ఞానమూ లేదు కాబట్టి అతనికి పొరపాటూ లేదు, పొరపాటునుంచి వచ్చే సంసారమూ లేదు.

జ్ఞానిని సుప్తపురుషునితో పోలుస్తారు. ఇద్దరినీ సంసారం బాధించదు. జాగ్రత్ పురుషునికీ, స్వప్నపురుషునికే సమస్య అంతా. అందువల్ల సంసారం తొలగాలంటే రెండే మార్గాలు – అయితే ఎప్పుడూ గాఢనిద్ర పోవాలి, లేదా జ్ఞానం పొందాలి.

ఈ తాడు–పాము దృష్టాంతం తీసుకుని, దాని ద్వారా తురీయమైన మనం, లేని సంసారాన్ని మనమీద ఎలా ఆరోపించుకుంటున్నామో, చాలా విపులంగా చర్చిస్తారు శంకరాచార్యులవారు, బ్రహ్మసూత్రాలకు తను రాసిన **అధ్యాసభాష్యం**లో.

**ద్వౌ తౌ తుర్యే న సిధ్యతః** – తురీయంలో ఈ రెండూ కూడా లేవు. ఈ రెండూ అంటే ఇక్కడ వాడిన పదాలు కారణం–కార్యం అంటే అజ్ఞానం–పొరపాటు. అది ఈ రెండూ లేని శుద్ధచైతన్యం. అవి లేకపోగా, అజ్ఞానాన్ని, పొరపాటును చైతన్యమే ప్రకాశింపజేస్తుంది. ఎందువల్ల? అనేక కారణాలు చెప్పవచ్చు.

ఎ) **అసంగత్వాత్** – శుద్ధచైతన్యం అసంగం. అసంగం అంటే దేనితో సంబంధం లేదు. ఆకాశం అంతటా వ్యాపించి ఉన్నా కూడా, దానికి ఎలాగైతే దేనితోనూ సంగత్వం లేదో, అలా చైతన్యం అంతటా వ్యాపించి ఉన్నా, దానికి కూడా దేనితోనూ సంగత్వం లేదు. అజ్ఞానం, పొరపాటులతో సహా.

బి) **పారమార్థిక సత్యత్వాత్** – చైతన్యం ఉన్నతస్థాయికి చెందినది. దాన్ని పారమార్థిక సత్యం అంటారు. అజ్ఞానం, పొరపాటు తక్కువస్థాయికి చెందినవి. దాన్ని వ్యావహారికసత్యం అంటారు. ఉన్నతస్థాయికీ, తక్కువస్థాయికీ మధ్య సంబంధం ఉండే ఆస్కారం లేదు. ఉదాహరణకు జాగ్రత్ పురుషుడు స్వప్నంలోని అగ్నివల్ల కాల్చబడడు; స్వప్నంలోని నీరువల్ల తడుపబడడు. ఎందుకంటే జాగ్రద్ పురుషుడు వ్యావహారిక సత్యం అయితే, స్వప్నం ప్రాతిభాసిక సత్యం. రెండూ రెండు భిన్న సత్యాలు.

సి) **ప్రకాశకత్వాత్** – ఇది ప్రకృతిసూత్రం అని అంతకుముందు కూడా చూశాము. ఒక వస్తువును ప్రకాశింపజేసేదానికి, ప్రకాశింపబడే వస్తువులకున్న మలినం అంటదు. చేతిని ప్రకాశింపజేసే కాంతికి, ప్రకాశింపబడే చేయికి మట్టి ఉన్నా, అది కాంతికి అంటదు. అందువల్ల తురీయానికి అజ్ఞానం, పొరపాటు రెండూ లేవు. ఇక్కడ వాడబడిన పదాలు కారణం, కార్యం.

ఈ కారిక సారాంశం విశ్వ, తైజసలకు కారణం, కార్యం రెండూ ఉన్నాయి; ప్రాజ్ఞకు కారణం మాత్రమే ఉంది; తురీయానికి రెండూ లేవు.

**కారిక 1.12**

**నాత్మానం న పరాంశ్చైవ న సత్యం నాపి చానృతమ్ ।**
**ప్రాజ్ఞః కించన సంవేత్తి తుర్యం తత్సర్వదృక్ సదా ॥**

ఈ అజ్ఞానం, పొరపాటులను ఈ నాలుగు పాదాలలో వేటికి ఉన్నాయి, దేనికి లేవు అని చెప్పటానికి అనేక కోణాల్లోంచి చెబుతున్నారు గౌడపాదాచార్యులవారు. దీన్ని పర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్ అంటారు గణితశాస్త్రంలో. 12, 13 కారికల్లో ప్రాజ్ఞ, తురీయం మాత్రం తీసుకున్నారు.టూకీగా చెప్పాలంటే ప్రాజ్ఞలో అజ్ఞానం ఉంది. తురీయంలో అజ్ఞానం లేదు.

**ప్రాజ్ఞః న కించన సంవేత్తి** – 'న' మనం మొదటివాక్యంనుంచి కిందకు తెచ్చుకున్నాము. సంవేత్తి అంటే తెలుసు; న సంవేత్తి అంటే తెలియదు; కించన అంటే ఏదీ; అంటే న కించన సంవేత్తి అంటే ప్రాజ్ఞకు ఏదీ తెలియదు. అంటే ప్రాజ్ఞకు పూర్తిగా అజ్ఞానం ఉంది. అంటే పొరపాటు లేని, ఆనందంతో కూడిన అజ్ఞానం ఉంది. ఏమి తెలియదు ప్రాజ్ఞకు?

**ఆత్మానం న (సంవేత్తి)** – తన గురించి తెలియదు ప్రాజ్ఞకు. ప్రాజ్ఞకు నిద్రలో విషయవస్తువులు తెలియవు. తను పడుకున్నాడని తెలియదు. 'నేను మంచి నిద్రపోతున్నాను,' అని ఎవరూ చెప్పలేరు. అంతేకాదు, 'నేను తురీయాన్ని,' అని కూడా చెప్పలేరు. అందువల్ల తనేమిటో, తనకు తెలియదు.

**న పరాంశ్చైవ** – ఇతరుల గురించి కూడా తెలియదు. అంటే ఆత్మ అజ్ఞానం, అనాత్మ అజ్ఞానం రెండూ ఉన్నాయి.

**న సత్యం నాపి చానృతమ్** – తను సత్యమైన తురీయం అనీ తెలియదు, జగత్తు మిథ్య అనీ తెలియదు. అంటే ఏమీ తెలియదు. తురీయం సంగతి ఏమిటి?

**తుర్యం తత్సర్వదృక్** – ఆ తురీయం అన్నింటినీ ప్రకాశింపజేస్తుంది, అజ్ఞానంతో సహా.

ఒక్కోసారి, 'నాకు తెలియదు,' అంటాము. అప్పుడు 'నీకు తెలియదని నీకు తెలుసా?' అంటారు ఎవరో. 'ఆ, నాకు తెలియదని నాకు తెలుసు,' అంటాము. అంటే చైతన్యం అజ్ఞానాన్ని, పొరపాటుని ప్రకాశింపజేస్తుంది. సర్వదృక్ అంటే ఇక్కడ అజ్ఞానం, పొరపాటు.

ఇక్కడ చైతన్యం గురించి నేర్చుకున్న ఐదు సూత్రాల్లో మొదటి సూత్రాన్ని గుర్తు తెచ్చుకోవాలి. చైతన్యం శరీరంలో ఒక భాగం కాదు, దాన్నుంచి ఉత్పత్తి చెందలేదు, దాని లక్షణం కాదు. తురీయం అన్నా, చైతన్యం అన్నా ఒకటే. కాంతి నా శరీరంలో ఒక భాగం అయితే, నేను ఒకచోటునుంచి వెళితే, ఆ చోటు చీకటి అయిపోవాలి. అంతేకాదు, నేను ఎక్కడికి వెళ్ళినా,

నేను రేడియమ్ లైటులా మిలమిలా మెరిసిపోవాలి. అందువల్ల కాంతి శరీరంమీద పడుతుంది కాని, కాంతికి శరీరంతో సంబంధం లేదు. అదే విధంగా, తురీయం అజ్ఞానాన్ని ప్రకాశింపజేస్తుంది కాని, చైతన్యానికి అజ్ఞానం అంటదు. అందువల్ల తురీయానికి అజ్ఞానం లేదు. ఈ వాక్యం మనం కలుపుకోవాలి.

**సదా** – ఎప్పుడూ. తురీయానికి అజ్ఞానం, పొరపాటు ఎప్పుడూ లేవు.

ప్రాజ్ఞ అజ్ఞానసహితః, తురీయమ్ అజ్ఞానరహితః

### కారిక 1.13

**ద్వైతస్యాగ్రహణం తుల్యముభయోః ప్రాజ్ఞతుర్యయోః ।**
**బీజనిద్రాయుతః ప్రాజ్ఞస్సా చ తుర్యే న విద్యతే ॥**

ఇందులో కూడా ప్రాజ్ఞ, తురీయాల గురించిన విశ్లేషణే కొనసాగుతున్నది. ముందు దాంట్లో వాటి మధ్య భేదాన్ని చూపారు. ప్రాజ్ఞకు అజ్ఞానం ఉంది, తురీయానికి అజ్ఞానం లేదు. ఇప్పుడు వాటిమధ్య పోలికను, భేదాన్ని కూడా చెబుతున్నారు. అంటే సాధర్మ్యం, వైధర్మ్యం రెండూ చెబుతున్నారు. ముందు మంత్రంలో భేదం చూశాము కాబట్టి, ముందు భేదం చూద్దాము. అందువల్ల రెండవ వాక్యంలోకి ముందు వెళదాము.

**ప్రాజ్ఞః బీజనిద్రాయుతః** – ఈ బీజం, నిద్ర పదాలు అజ్ఞానాన్ని సూచిస్తాయి. యుతః అంటే కూడివుంది. ముందు కారికలో ప్రాజ్ఞకు అజ్ఞానం ఉందని చూశాము. ఇక్కడ అజ్ఞానానికి బీజం, నిద్ర పదాలను వాడుతున్నారు.

**సా చ తుర్యే న విద్యతే** – సా అంటే బీజం, నిద్ర. ఇవి తురీయంలో లేవు. అంటే తురీయంలో అజ్ఞానం లేదు.

ఇప్పుడు పోలికకు వెళదాము. రెండింటిలోనూ పొరపాటు లేదు. సుషుప్తిలో పరిచ్ఛిన్న భావన ఉండదు. నేను బాధాతప్తజీవిని, నేను అశాశ్వతుడను అనే భావన సుషుప్తిలో ఉండదు. జ్ఞానికి కూడా ఈ భావన ఉండదు. ఈ రెండు వాక్యాలనూ కలిపితే, సుప్తపురుషుణ్ణి జ్ఞానితో పోల్చవచ్చు. అందువల్లనే మోక్షం, గాఢనిద్ర సమానం అంటారు.

బృహదారణ్యకోపనిషత్తులో స్వయంజ్యోతి బ్రాహ్మణమ్ అని ఒక ఖండం ఉంది. అందులో యాజ్ఞవల్క్యుడు మోక్షాన్ని సుషుప్తితో పోలుస్తాడు. ఏదైనా సమస్య ఉంటే, గాఢనిద్ర పోతే, ఆ సమస్య ఉండదు కాని వచ్చిన సమస్య ఏమిటంటే, సమస్య ఉంటే నిద్ర పట్టదు.

**ద్వైతస్యాగ్రహణం తుల్యమ్** – ఇక్కడ ద్వైతం అంటే పొరపాటు. నేను పరిమితి ఉన్న జీవిని అని భావించటం పొరపాటు. అద్వైతం సత్యం కాబట్టి, ద్వైతాన్ని పొరపాటు అంటున్నారు. ఇక్కడ అగ్రహణం అంటే లేకపోవటం; తుల్యం అంటే సమానం. పొరపాటు అనేది

లేకపోవటం రెండింటికీ సమానం. ఏ రెండింటికీ?

**ఉభయోః ప్రాజ్ఞతుర్యయోః** – ప్రాజ్ఞకూ, తురీయానికీను. ప్రాజ్ఞకూ, తురీయానికీ పొరపాటు లేదు. ద్వైతం లేదు అంటే అద్వైతమే ఉంది.

**శాంతం శివమద్వైతం చతుర్థమ్** – మంత్రం 7

ప్రాజ్ఞకు అజ్ఞానం ఉంది, తురీయానికి లేదు; రెండింటికీ పొరపాటు లేదు.

### కారిక 1.14

**స్వప్ననిద్రాయుతావాద్యౌ ప్రాజ్ఞస్త్వస్వప్ననిద్రయా ।**
**న నిద్రాం నైవ చ స్వప్నం తుర్యే పశ్యంతి నిశ్చితాః ॥**

మళ్ళీ 11వ కారికలో లాగా, ఇందులో కూడా నాలుగు పాదాలనూ పోలుస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**ఆద్యౌ** – మొదటి రెండు పాదాలు. వాటికి ఏం ఉందో గౌడపాదాచార్యులవారే చెబుతున్నారు.

**స్వప్ననిద్రాయుతౌ** – స్వప్నం, నిద్ర ఉన్నాయి. స్వప్నం పదం పొరపాటును, నిద్ర పదం అజ్ఞానాన్ని సూచిస్తుందని చూశాము. ముందు కారికలో అజ్ఞానానికి బీజం, నిద్ర పదాలు వాడారు. అంతకుముందు కారణం వాడారు. ఇప్పుడు పొరపాటుకు స్వప్నం వాడుతున్నారు. అంతకుముందు కార్యం వాడారు.

**ప్రాజ్ఞః తు నిద్రయా** – ప్రాజ్ఞకు నిద్ర మాత్రమే ఉంది అంటే అజ్ఞానం మాత్రమే ఉంది.

**అస్వప్న** – పొరపాటు లేని అజ్ఞానం ఉంది.

**తుర్యే** – తురీయంలో

**న నిద్రాం నైవ చ స్వప్నమ్ పశ్యంతి** – అటు నిద్రా లేదు, ఇటు స్వప్నమూ లేదు. అంటే తురీయంలో అజ్ఞానమూ లేదు, పొరపాటూ లేదు.

**నిశ్చితాః** – జ్ఞానులు. జ్ఞానులు రెండూ చూడరు.

విశ్వ, తైజసలో అజ్ఞానం, పొరపాటు రెండూ ఉన్నాయి; ప్రాజ్ఞలో అజ్ఞానం ఉంది, పొరపాటు లేదు; తురీయంలో అజ్ఞానం, పొరపాటు రెండూ లేవు.

(ఈ అజ్ఞానం, పొరపాటు **పట్టిక 5: అజ్ఞానం, పొరపాటులో** ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు)

ఈ విధంగా గౌడపాదాచార్యులవారు ఈ నాలుగు పాదాలను పోల్చిచెప్పారు. మనకు మోక్షం కావాలంటే తురీయానికి రావాలి. మొదటి మూడు పాదాల్లో ఉన్నంతకాలం అజ్ఞానం,

పొరపాటు రెండూ ఉంటాయి, కనీసం అజ్ఞానం ఉంటుంది. మోక్షం కావాలంటే తురీయం నేను అని అర్థం చేసుకోవాలి.

### కారిక 1.15

**అన్యథా గృహ్ణతస్స్వప్నో నిద్రా తత్త్వమజానతః ।**
**విపర్యాసే తయోః క్షీణే తురీయం పదమశ్నుతే ॥**

ఈ నాలుగు పాదాల అధ్యయనాన్ని ఇందులో ముగిస్తున్నారు. తద్వారా ఒక ఉపసిద్ధాంతాన్ని ఏర్పరుస్తున్నారు. ఇక్కడ అజ్ఞానం, పొరపాటులకు ఇంకో జత పదాలను వాడుతున్నారు. అవి అగ్రహణం, అన్యథాగ్రహణం.

**స్వప్నః అన్యథా గృహ్ణతః** – స్వప్నం అంటే స్వప్నప్రపంచం కాదు; ఇక్కడ స్వప్నం పదాన్ని పొరపాటుకు సాంకేతికపదంగా చూస్తున్నాము. ఏ పాదానికైతే అన్యథాగ్రహణం ఉందో, ఆ పాదానికి స్వప్నం ఉంది. రెండింటి అర్థం ఒకటే – పొరపాటు. ఏమిటా పొరపాటు? నేను జీవాత్మ అనే భావన. ఎందుకు అది పొరపాటు అంటున్నాము? ఎందుకంటే అసలు సత్యం, నేను తురీయాన్ని. సత్యం తెలియకపోతే పొరపాటే చేస్తాము. దానికి స్వప్నం పదం వేశారు. ఎందుకంటే ఎవరికైనా సత్యం తెలియకపోతే, అతను కలలు కంటున్నట్టు అర్థం.

ఇప్పుడు స్వప్నం ఉన్న పాదానికి అన్యథాగ్రహణం ఉంది అంటే పొరపాటు విశ్వ, తైజస– పాదాలు రెండింటికీ ఉంది.

**నిద్రా** – నిద్ర ఏ పాదానికి చెందుతుందంటే,

**తత్త్వమజానతః** – తత్త్వాన్ని తెలియనివానికి చెందుతుంది. తత్త్వం అంటే ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానం నేను తురీయాన్ని అని బోధిస్తుంది. అజానతః అంటే అజ్ఞానం. నిద్ర, అజ్ఞానం ఉన్న పాదానికి చెందుతుంది. నిద్ర అంటే అసలు నిద్ర కాదు, అజ్ఞానానికి సాంకేతికపదం అని చూశాము. ఆ పాదం ప్రాజ్ఞ.

సిద్ధాంతపరంగా నిద్ర అంటే ఆత్మ అజ్ఞానం. ఆత్మ అజ్ఞానం ఒక ప్రాజ్ఞకే కాదు, విశ్వ, తైజసలకు కూడా ఉంది. కాని ఇక్కడ ఒక్క ప్రాజ్ఞకే ఎందుకు చెప్పాము అంటే ప్రాజ్ఞకు అజ్ఞానం మాత్రమే ఉంది. తురీయానికి రెండూ లేవు.

తురీయంలో అగ్రహణం, అన్యథా గ్రహణాలు లేవు
తురీయంలో నిద్ర, స్వప్నాలు లేవు
తురీయంలో కారణ, కార్యాలు లేవు
తురీయంలో బీజం, అంకురాలు లేవు.

అంటే తురీయంలో అజ్ఞానం, పొరపాటు లేవు. ఇటువంటి తురీయం నేను ఎలా అవగలను? చాలా తేలిక! అజ్ఞానం, పొరపాటులను పారద్రోలితే, నేను తురీయాన్ని అని చెప్పగలను. అజ్ఞానం, పొరపాటు రెండూ ఉంటే, నేను విశ్వను లేదా తైజసను. అజ్ఞానం మాత్రమే ఉంటే నేను ప్రాజ్ఞను. అజ్ఞానాన్ని కూడా పారద్రోలితేనే నేను తురీయాన్ని అని చెప్పగలను.

ఈ కారికలో ఒక ముఖ్యమైన ఉపసిద్ధాంతాన్ని సూచిస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**తురీయం పదమశ్నుతే** – సాధకుడు తురీయమనే స్థాయిని పొందగలడు. పదం అంటే హోదా లేదా స్థాయి. అశ్నుతే అంటే పొందగలడు. ఎప్పుడు?

**విపర్యాసే క్షీణే** – విపర్యాసే అంటే అజ్ఞానంతో కూడిన పొరపాటు. క్షీణే అంటే క్షీణించటం. అంటే ఈ రెండింటినీ పారద్రోలితే,

**తయోః** – ఈ రెండూ, మొదటి మూడు పాదాల్లోనూ ఉన్నాయి. విశ్వలోంచి అజ్ఞానం, పొరపాటు తీసేస్తే తురీయం; తైజసలోంచి అజ్ఞానం, పొరపాటు తీసేస్తే తురీయం; ప్రాజ్ఞలోంచి అజ్ఞానాన్ని తీసేస్తే తురీయం. ఈ రెండూ తీయమని చెప్పారు బాగానే ఉంది కాని వాటిని తీసేదెలా?

అజ్ఞానాన్ని ప్రత్యక్షంగా పారద్రోలలేము. చీకటిని ప్రత్యక్షంగా పారద్రోలలేము. చీకటి ఉన్న గదిలో లైటు వేస్తే, చీకటి దానంతట అదే వెళ్ళిపోతుంది. అలాగే జ్ఞానమనే దీపాన్ని వెలిగిస్తే, అజ్ఞానం కూడా దానంతట అదే వెళ్ళిపోతుంది. ఏమిటా జ్ఞానం? తురీయజ్ఞానం.

**తురీయ జ్ఞానేన అజ్ఞాన నివృత్తిః**

తురీయజ్ఞానంవల్ల అజ్ఞానం పోతుంది సరే, పొరపాటు ఎలా పోతుంది? ఈ ప్రశ్నే అనవసరం. పొరపాటుని ఏమన్నాం? అజ్ఞానజనిత పొరపాటు అన్నాము. అజ్ఞానం పోతే, దాన్ని అంటిపెట్టుకుని వచ్చిన పొరపాటు కూడా తోక ముడుచుకుని పోతుంది. జ్ఞానంవల్ల తాడు అజ్ఞానం పోతే, పాము పొరపాటు కూడా పోతుంది. మళ్ళీ ప్రత్యేకించి పామును పారద్రోలనవసరం లేదు.

**అగ్రహణనాశే అన్యథాగ్రహణ నాశః**
**కారణనాశే కార్యనాశః**
**నిద్రానాశే స్వప్ననాశః**
**బీజనాశే అంకురనాశః**
**అజ్ఞాననాశే అధ్యాస నాశః**

అందువల్ల జ్ఞానం పొందితే చాలు; జ్ఞానం పొందాక వేరే కర్మ ఏమీ చేయనవసరం లేదు. అప్పుడు తురీయాన్ని పొందుతారు.

అయితే జ్ఞానాన్ని ఎలా పొందాలి?

దీనికి గౌడపాదాచార్యులవారు ఇక్కడ జవాబు చెప్పరు. ఎందుకంటే, మాండూక్యోపనిషత్తు నేర్చుకునే శిష్యులు దానిముందు నాలుగైదు ఉపనిషత్తులు నేర్చుకుని ఉంటారు. ఆ ఉపనిషత్తుల్లో నేర్చుకున్న జ్ఞానాన్ని ఇక్కడకు తెచ్చుకోవాలి. నిజానికి ఉపనిషత్తుల్లోకన్నా భగవద్గీతలో ఒక సాధకుని ప్రయాణం చాలా స్పష్టంగా వస్తుంది.

కర్మయోగం + ఉపాసనయోగం + జ్ఞానయోగం = జ్ఞానప్రాప్తి

కర్మయోగం చేసి చిత్తశుద్ధి పొంది; ఉపాసనయోగం చేసి చిత్తఏకాగ్రత పొంది; జ్ఞానయోగానికి వచ్చి, వేదాంతశాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తే జ్ఞానం కలుగుతుంది. జ్ఞానం కలిగితే మోక్షం కలుగుతుంది. ఇవీ దశలు.

### కారిక 1.16

**అనాదిమాయయా సుప్తో యదా జీవః ప్రబుధ్యతే ।**
**అజమనిద్రమస్వప్నమద్వైతం బుధ్యతే తదా ॥**

సరే, నాకు ఇప్పుడు అర్థమయింది. అజ్ఞానం, పొరపాటు నాకూ, తురీయానికీ మధ్య అడ్డుగోడలా నిలుస్తున్నాయి. కాని అసలు అవి ఎలా ఏర్పడ్డాయి? అజ్ఞానం ఎందుకు వచ్చింది? భగవంతుడు అజ్ఞానాన్ని ఎందుకు సృష్టించాడు?

గౌడపాదాచార్యులవారు అసలు ఈ ప్రశ్నలే తప్పు అంటున్నారు. భగవంతుడు ఎందుకు, ఎలా, ఎప్పుడు అజ్ఞానాన్ని పుట్టించాడు అనే ప్రశ్నలే తప్పు. ఎందుకు? అజ్ఞానం అనాదిగా ఉంది. మనం పుట్టటమే ఈ అజ్ఞానం అనే పెట్టుబడితో పుట్టాము.

**జీవః అనాదిమాయయా సుప్తః** – జీవుడు మాయానిద్రలో ఉన్నాడు. మాయానిద్ర అంటే అజ్ఞానం; అనాది అంటే ఆది లేని అంటే ఆరంభం లేని. అంటే జీవుడు పుట్టటమే అజ్ఞానంతో పుట్టాడు. ఉదాహరణకు నాకు జర్మన్ భాష అజ్ఞానం ఎప్పుడొచ్చింది? నేను పుట్టినప్పటినుంచి ఉంది. అనాది అజ్ఞానంవల్ల పొరపాటు కూడా అనాదిగా ఉంది.

సాధారణంగా ఈ అనాది అజ్ఞానంవల్ల వచ్చిన పొరపాటును, అజ్ఞానం పారద్రోలి, పారద్రోలుదాము అని ఎవరూ అనుకోరు. అజ్ఞానం ఎలా పోతుందంటే, జ్ఞానం పొందాలనీ, దాని ముందు కర్మయోగం, ఉపాసనయోగం చేయాలనీ చూశాము. కాని ఈ సాధనలను చేసే ఓపిక చాలామందికి ఉండదు.

**యదా ప్రబుధ్యతే** - ఏ కొద్దిమంది జీవులలో వారి స్వస్వరూపానికి లేస్తారు. లేవటం అంటే జ్ఞానానికి లేవటం. అజ్ఞానాన్ని నిద్రతో పోల్చారు కాబట్టి, జ్ఞానం పొందటం అంటే నిద్రనుంచి లేవటం. ఎవరైతే ఈ మూడు పాదాల గురించిన జ్ఞానాన్ని పొందుతారో,

**తదా బుధ్యతే** - తను అజ్ఞానజనిత పొరపాటులో పడుతున్న జీవాత్మ కాదు అని అర్థం చేసుకుంటాడు. తను విశ్వ కాదు, తైజస కాదు, ప్రాజ్ఞ కాదు, తను తురీయం అని అర్థం చేసుకుంటాడు. తురీయం అంటే పరమాత్మ.

**అద్వైతమ్** - రెండవది లేనిది. తురీయ వర్ణన చేసినప్పుడు ఏడవమంత్రం అద్వైతం పదం వేసిందనీ, అది చాలా ముఖ్యమనీ చూశాము. **శాంతం శివమద్వైతమ్** - మంత్రం 7

**అజమ్** - అజం అంటే పుట్టుక లేనిది, జన్మరహితం. పుట్టుక గురించి మాట్లాడితే అది స్థూలశరీరానికి వర్తిస్తుంది. స్థూలశరీరం విశ్వకు చెందుతుంది. అందువల్ల నేను అజమ్ అంటే నేను ప్రథమ పాదానికి చెందిన విశ్వను కాను అని తెలుసుకుంటాడు.

**అస్వప్నమ్** - ఇక్కడ స్వప్నం అంటే స్వప్నపురుషుడు. స్వప్నపురుషుణ్ణి తైజస అంటారు. తైజస రెండవ పాదానికి చెందుతాడు. అస్వప్నమ్ అంటే నేను రెండవ పాదానికి చెందిన తైజసను కూడా కాదు అని తెలుసుకుంటాడు. అంటే అజ్ఞానం, పొరపాటు ఉన్న విశ్వ, తైజసలను కాదు అని అర్థం చేసుకుంటాడు.

**అనిద్రమ్** - నిద్ర అంటే సుప్తపురుషుడు. అది మూడవ పాదంయొక్క వర్ణన. నేను మూడవ పాదానికి చెందిన ప్రాజ్ఞను కాను. అంటే నాకు కేవలం అజ్ఞానం కూడా లేదు అని అర్థం చేసుకుంటాడు.

**అహమ్ విశ్వతైజసప్రాజ్ఞ విలక్షణః**

(ఇదంతా **పట్టిక 6 - కారికలు 11-16 నాలుగు పాదాల సాధర్మ్యం-వైధర్మ్యంలో** అధ్యాయం చివర్లో చూడవచ్చు.)

### కారిక 1.17

**ప్రపంచో యది విద్యేత నివర్తేత న సంశయః ।**
**మాయామాత్రమిదం ద్వైతమద్వైతం పరమార్థతః ॥**

ముందు కారికలో చెప్పిన అంశాన్ని బట్టి ఒక సందేహం రావచ్చు. ఆ సందేహాన్ని ముందే ఊహించి, దానికి జవాబు చెబుతున్నారు గౌడపాదాచార్యులవారు.

ముందు కారికలో ఎవరైతే తురీయజ్ఞానం పొందుతారో, వారికి ద్వైతం పోతుంది అని వచ్చింది. **జ్ఞానేన ద్వైత నివృత్తిః**

జ్ఞానం ద్వైతాన్ని పారద్రోలగలదా? ఆ మాటకొస్తే – జ్ఞానం దేన్నైనా అసలు పారద్రోలగలదా? ఇది ప్రాథమిక ప్రశ్న. జ్ఞానం పొందితే వస్తువులు పోతాయి అంటే నేను బల్ల జ్ఞానం పొందితే, బల్ల పోవాలి; రోగం గురించిన జ్ఞానం పొందితే, రోగం పోవాలి. కాని రోగం మందు వేసుకుంటేనే పోతుంది. ఈ సందేహాన్ని రెండు ప్రశ్నలుగా విభజించవచ్చు.

1. జ్ఞానం ద్వైతాన్ని పారద్రోలుతుందా?

2. ఒకవేళ ద్వైతజ్ఞానం పారద్రోలితే, ఆ జ్ఞానంవల్ల మోక్షం శాశ్వతమెలా అవుతుంది?

ద్వైతం పోయి, అద్వైతం వచ్చింది అంటే, ఒక సమస్య వస్తుంది. అద్వైతానికి ఒక ఆరంభం ఉంటే, దానికొక అంతం కూడా ఉంటుంది. ఇవాళ ద్వైతం పోయి, అద్వైతం వస్తే, తరువాత అద్వైతం పోయి, ద్వైతం వస్తుంది. అంటే అద్వైతంవల్ల వచ్చిన మోక్షం శాశ్వతం కాదు. ఈ ప్రశ్నలకు గౌడపాదాచార్యులవారు సాంకేతికంగా జవాబు చెబుతున్నారు. అందువల్ల కారికలు 17, 18 చాలా ముఖ్యమైనవి.

గౌడపాదాచార్యులవారు అసలు ప్రశ్నే తప్పు అంటున్నారు. అద్వైతం నేర్చుకుంటే, ద్వైతప్రపంచం పోతుందా అనేది ప్రశ్న. ద్వైతప్రపంచమంటూ ఉంటే, అది ఉంటుందా, పోతుందా అనే ప్రశ్నకు ఆస్కారం ఉంది. కాని అసలు ద్వైతప్రపంచం ఉంటేనే కదా, అది ఉంటుందా, పోతుందా అని మీరు అడగటానికి.

తాడు–పాము అధ్యాసలో తాడు జ్ఞానం పొందాక, పాము పోతుందా అని అడిగినట్టే ఉంది మీ ప్రశ్న అంటున్నారు. అసలు అక్కడ నిజం పాము ఉంటేనే కదా, అది ఉంటుందా, పోతుందా అనే ప్రశ్నకు ఆస్కారం ఉండేది. అక్కడ నిజంగా పాము లేదు. ఉందని పొరపాటు పడ్డారంతే. ద్వైతప్రపంచమూ నిజంగా లేదు.

**ప్రపంచో యది విద్యేత** – ఒకవేళ ద్వైతప్రపంచం ఉంటే,

**నివర్తేత** – అది తొలగిపోతుంది.

**న సంశయః** – అందులో ఏమాత్రం సందేహం లేదు.

ఇక్కడ ఈ వాక్యాన్ని అర్థం చేసుకోవటానికి మనం ఇంకో వాక్యాన్ని కలుపుకోవాలి. నిజంగా చెప్పాలంటే అక్కడ అసలు ద్వైతప్రపంచం లేనేలేదు. తాడు–పాము అధ్యాసలో ఎలాగైతే నిజంగా పాము లేదో, అలా ఇక్కడ ద్వైతప్రపంచం కూడా అధ్యాసే. ఉందనుకుని మనం పొరపాటు పడుతున్నాము.

మరయితే, జ్ఞానం పొందితే ఏం పోతుంది? గౌడపాదాచార్యులవారు ద్వైతభ్రమ పోతుంది అంటున్నారు. ద్వైతప్రపంచం పోదు, పోనవసరం లేదు, పోలేదు. నిజానికి ద్వైతప్రపంచం ఉంటేనే కదా పోవటానికి. అందువల్ల ద్వైతప్రపంచం ఉందనుకుని మనం పడుతున్న భ్రమ పోతుంది.

**ఇదం ద్వైతం మాయామాత్రమ్** – ఈ ద్వైతప్రపంచం ఒక మాయ మాత్రమే. మాయ అంటే భ్రమ. అందువల్ల ఏదైనా పోవాలంటే, భ్రమ మాత్రం పోతుంది.

**ద్వైతనివృత్తి = ద్వైతభ్రమనివృత్తిః**

ఉదాహరణకు మీరు మీ ఇంట్లో ఒక దొంగ పడ్డట్టు కలగంటారు. అతను మీ ఇల్లంతా వెతికి, మీ బీరువాలు తీసి చూస్తుండగా, మీకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. మీరీ విషయం మీ స్నేహితునితో చెబితే, అతను, 'ఏం ఎత్తుకుపోయాడు, నగలా, డబ్బులా?' అని అడిగాడనుకోండి. అసలా ప్రశ్నే అప్రస్తుతం. మీరు నిద్ర లేస్తే ఆ దొంగ ఉంటాడా? నిద్ర లేచాక, 'ఏం పోయింది?' అంటే దొంగ వచ్చాడు అనే భ్రమ పోయింది.

మరి ద్వైతం భ్రమ అయితే, ఏమిటి సత్యం?

**పరమార్థత అద్వైతమ్ (ఏవ)** – నిజానికి ఉన్నదొకటే సత్యం. అది అద్వైతం. అంతకు ముందు ఉన్నదీ అద్వైతమే, ఇప్పుడు ఉన్నదీ అద్వైతమే, తర్వాత ఉండేదీ అద్వైతమే. మధ్యలో మాత్రం వచ్చినది ద్వైతం ఉందనే భ్రమ. ఆ భ్రమను పోగొట్టుకోవాలి. ఎలా పోగొట్టుకోవాలి? జ్ఞానం ద్వారా. ఆ మాటకొస్తే ఏ భ్రమైనా తొలిగేది జ్ఞానంవల్లనే.

**కారిక 1.18**

**వికల్పో వినివర్తేత కల్పితో యది కేనచిత్ ।**
**ఉపదేశాదయం వాదో జ్ఞాతే ద్వైతం న విద్యతే ॥**

ముందు కారికలోని భావమే ఇక్కడ కూడా కొనసాగుతున్నది. ముందు కారికలో, జ్ఞానం పొందితే ద్వైతం పోదు, ద్వైతం గురించి భ్రమ పోతుంది అని చూశాము. ఇప్పుడు ఈ కారికలో గౌడపాదాచార్యులవారు మరో లోతైన సాంకేతిక విషయాన్ని కలుపుతున్నారు.

జ్ఞానంవల్ల ద్వైతం పోతుంది అంటే, జ్ఞానానికి ఆధారమైన ద్వైతం కూడా పోతుంది అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ద్వైతం అంటే రెండు. జ్ఞానం పొందటానికి రెండు ఉండి తీరాలి. సబ్జెక్టు–ఆబ్జెక్టు భేదం ఉండాలి. అంటే తెలుసుకునే నేను, తెలుసుకోబడే వస్తువు ఉండి తీరాలి. దీన్నే సాంకేతిక పరిభాషలో చెబితే, ప్రమాత–ప్రమేయం భేదం ఉండాలి.

ఇప్పుడు జ్ఞానంవల్ల ద్వైతం పోతుంది అంటే జ్ఞానానికి ఆధారమైన ప్రమాత–ప్రమేయం భేదం కూడా పోతుందా? ఇదీ ప్రశ్న. గౌడపాదాచార్యులవారు ద్వైతం పోతుంది అంటే దానికి ఆధారమైన ప్రమాతృ, ప్రమేయ భేదం కూడా పోతుంది అంటున్నారు. భేదాన్ని వికల్పం అంటున్నారు. కాని దీనికి కూడా జవాబు ముందు కారికలో లాగానే వస్తుంది. అంటే జ్ఞానం ప్రమాతృప్రమేయ వికల్పాన్ని పోగొడుతుందా? ఈ ప్రశ్నకు గౌడపాదాచార్యులవారి జవాబు, ప్రమాతృ, ప్రమేయ వికల్పం ఉంటేనే కదా పోవటానికి.

ఒకవేళ నిజంగా ఉంటే, అవును ఈ వికల్పం పోతుంది అని చెప్పవచ్చు. కాని నిజంగా లేదు. అందువల్ల ఈ ప్రశ్నే తప్పు. తాడు–పాము ఉదాహరణలో పాము పోతుందా అని ఎవరైనా అడిగితే, దానికి ఏమిటి జవాబు? పాము ఉంటేనే కదా, అది పోవటానికి.

**వికల్పో కల్పితో యది కేనచిత్** – వికల్పః అంటే భేదం; ప్రమాత–ప్రమేయం భేదం; కల్పితః– ఎవరివల్లనో కల్పించబడినది.

**వినివర్తేత** – తొలగిపోతుంది. ఈ వాక్యం అర్థం, ఒకవేళ భేదం నిజంగా ఉంటే అది తొలగిపోతుంది. ఇందాకటి కారికలో లాగా ఇక్కడ కూడా మనం ఒక వాక్యం కలుపుకోవాలి. నిజంగా చెప్పాలంటే అక్కడ అసలు ప్రమాత–ప్రమేయం భేదం అసలు లేనేలేదు. వికల్పః నాస్తి. మరయితే ఏం పోతుంది? వికల్ప భ్రమ పోతుంది. జ్ఞానం పొందితే ప్రమాత–ప్రమేయం భేదం ఉందనుకుంటున్న భ్రమ పోతుంది.

అందువల్ల జ్ఞానం పొందాక, నేను జ్ఞానిని అనికూడా చెప్పను. నేను జ్ఞానిని అనాలంటే ఈ భేదం ఉండితీరాలి. మరి నేను ఎవరు? నేను తురీయాన్ని. ప్రమాతృ ప్రమేయ విలక్షణాన్ని. ఈ భేదంలో ప్రమాణం పదాన్ని కూడా కలుపుకోవాలి. ప్రమాణం అంటే జ్ఞానం పొందటానికి వాడే పరికరం. ప్రమాత, ప్రమాణం ద్వారా ప్రమేయం గురించి నేర్చుకుంటాడు. ఈ మూడూ ఉండవు. ద్వైతం పోతుంది అంటే ముందు కారికలో చూసినట్టే ద్వైత భ్రమ పోతుంది. **వికల్ప నివృత్తి = వికల్ప భ్రమ నివృత్తి**

ఇంకా సందేహం తీరదు. అంతగా భేదం లేదని చెప్పేటట్టయితే, శాస్త్రం ఈ భేదం గురించి ఎందుకు మాట్లాడుతోంది?

**బ్రహ్మ విదాప్నోతి పరమ్** – తైత్తిరీయమ్

బ్రహ్మ గురించి జ్ఞానం పొందిన వ్యక్తి పరమమైన మోక్షాన్ని పొందుతాడు. అందులో ద్వైతం స్పష్టంగా ఉంది. దానికి జవాబు ఈ పదాల్లో వస్తుంది.

**ఉపదేశాద్ అయం వాదః** – బోధ చేయటానికి వీలుగా, తాత్కాలికంగా ఈ ప్రమాత– ప్రమేయం భేదాన్ని స్వీకరిస్తుంది శాస్త్రం.

**జ్ఞాతే** – ఉపదేశం విజయవంతంగా పూర్తయ్యాక,

**ద్వైతం న విద్యతే** – ద్వైతం (భేదం) ఉండదు. ప్రమాత–ప్రమేయం భేదం ఉండదు; గురువు–శిష్యుడు భేదం ఉండదు; మాండూక్యం–మాండూక్య శిష్యుడు భేదం ఉండదు. మిగిలేది అద్వైతం మాత్రమే.

ఈ విధంగా కారికలు 10-18, గౌడపాదాచార్యులవారు ఏడవమంత్రాన్ని విశ్లేషించారు. ఈ మంత్రం చాలా ముఖ్యమైన మంత్రం. నాలుగు పాదాలయొక్క సాధర్మ్యం, వైధర్మ్యాలను చూపిస్తూ, తురీయంయొక్క ప్రత్యేకతను ఎత్తి చూపించారు.

**స ఆత్మా స విజ్ఞేయః** - తురీయం గురించి చెబుతూ, ఉపనిషత్తు అది ఆత్మ, దాని గురించి నేర్చుకోండి అంది కాని, దానివల్ల కలిగే ఫలమేమిటో చెప్పలేదు.

తురీయజ్ఞానం పొందితే కలిగే ఫలమేమిటి? తక్షణఫలం అజ్ఞాననివృత్తి. ఆ మాటకొస్తే, ఏ జ్ఞానం పొందినా కూడా, మీకు ఇష్టమున్నా, లేకపోయినా, దానికి సంబంధించిన అజ్ఞానం పోతుంది. ఎలాగైతే కాంతి చీకటిని పారద్రోలుతుందో, అలాగే తురీయజ్ఞానం తురీయ అజ్ఞానాన్ని పారద్రోలుతుంది. ఎప్పుడైతే అజ్ఞానం పోతుందో, అజ్ఞానాన్ని ఆధారం చేసుకుని వచ్చిన పొరపాట్లు కూడా సహజంగానే మటుమాయమవుతాయి. అజ్ఞానం ఒకటే కాని పొరపాట్లు అనేకం. కాని దాని గొప్పతనం ఏమిటంటే - అజ్ఞానం తొలిగితే, పొరపాట్లు పోవటానికి మళ్ళీ మనం ప్రత్యేకించి ఏమీ కష్టపడనవసరం లేదు. అవి వాటంతటఅవే పోతాయి.

ఎప్పుడైతే అజ్ఞానం, పొరపాటు పోతాయో, చైతన్యమైన నేను అజ్ఞానం, పొరపాటు లేని శుద్ధతురీయాన్ని అని అర్థం చేసుకుంటాను. తురీయం నిర్వచనమే - అజ్ఞానం, పొరపాటు లేని శుద్ధచైతన్యం. అజ్ఞానం, పొరపాటు రెండూ ఉంటే నేను విశ్వను లేదా తైజసను; అజ్ఞానం మాత్రం ఉంటే నేను ప్రాజ్ఞను. రెండూ పోతే నేను తురీయాన్ని. నేను జ్ఞానిని. నేను అంతకుముందు తురీయం గురించి నేర్చుకున్న లక్షణాలన్నీ జ్ఞానిగా నాకు ఆపాదించుకుంటాను. అందులో ముఖ్యలక్షణం - **అద్వైతం**. నేను అద్వైత తురీయాన్ని.

జ్ఞానిగా నా దృష్టిలో ద్వైతం అసలు లేనేలేదు. నేను జ్ఞానిని అనికూడా చెప్పను. ఎందుకంటే నేను జ్ఞానిని అంటే నేను ప్రమాతను అవుతాను; నేను పొందినది ప్రమేయం గురించిన జ్ఞానం అవుతుంది. అందువల్ల ప్రమాత హోదా కూడా ఉండదు జ్ఞానిగా. అందువల్ల నేను ద్వైతప్రపంచాన్ని కాదు, జ్ఞానానికి ఆధారమైన ప్రమాతా-ప్రమేయం భేదాన్ని కూడా పారద్రోలుతాను. జ్ఞానేన ప్రమాతృత్వ నివృత్తి.

తమాషా చూశారా? నేను జ్ఞానం పొందాక, నేను జ్ఞానిని కూడా కాదు. జ్ఞానం నాకు జ్ఞాని అనే హోదాని ఇచ్చినట్టే ఇచ్చి, మళ్ళీ వెంటనే నానుంచి ఆ హోదాని కూడా తీసేసుకుంటుంది. మరయితే నేనెవరు?

**ప్రమాతృ ప్రమేయ ప్రమాణ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి**

ఇన్నిసార్లు ద్వైతాన్ని పారద్రోలుతాను అంటున్నాము కాని, ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. నేను అద్వైత తురీయాన్ని, ద్వైతప్రపంచం లేదు అని అంటే, అక్కడ నేను ద్వైత అనుభవాన్ని పారద్రోలటం లేదు. జ్ఞానికీ, అజ్ఞానికీ కూడా ద్వైత అనుభవం ఉంటుంది; కాకపోతే జ్ఞాని ఆ అనుభవాన్ని సత్యంగా స్వీకరించడు. అసలు ద్వైత అనుభవమే లేదు అని జ్ఞాని అంటే, అతను గురువు కూడా కాలేడు. గురువు కావాలంటే, శిష్యులు ఉండాలి. శిష్యులు ఉండాలంటే ద్వైతం ఉండాలి. అందువల్ల జ్ఞానికి ద్వైతప్రపంచం అనుభవం ఆగిపోదు, అది కొనసాగుతూనే ఉంటుంది.

ఆకాశానికి శబ్దగుణం మాత్రమే ఉంది. తక్కిన గుణాలు లేవని మనకు తెలుసు. కాని నీలాకాశం అంటాము; అలాగే నీటికి కూడా రంగు లేదు కాని కన్ను నీలిసముద్రాన్ని చూపిస్తుంది. సూర్యుడు ఉదయించడు, అస్తమించడు అని తెలుసు కాని సూర్యోదయం, సూర్యాస్తమయాలు చూస్తూనే ఉంటాము. భూమి స్థిరంగా ఉంటుంది అంటుంది కన్ను, కాని నిజానికి నిరంతరం తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ కూడా తిరుగుతుంది.

వేదాంతశాస్త్రంలోని ఒక సూత్రం – నువ్వు కళ్ళారా చూసినంత మాత్రాన అది సత్యం కాదు. ఈ సూత్రాన్ని బాగా అర్థం చేసుకుంటాడు జ్ఞాని. అందువల్ల అతను ద్వైతాన్ని కంటితో చూసినంత మాత్రాన అది సత్యం కాదు. ఇంకా మాండూక్యోపనిషత్తులో ఇంకొక అడుగు ముందుకువేస్తాము. కంటితో చూశావంటే అది సత్యం కాదు. అంటే ఒక వస్తువు ప్రమేయంగా తెలిస్తే అది సత్యం కాదు అని ఇక్కడ నేర్చుకోబోతున్నాము.

ఆ విధంగా ప్రత్యక్ష ప్రమాణాలైన జ్ఞానేంద్రియాలు మనకు ద్వైతప్రపంచాన్ని చూపిస్తాయి. అవి ప్రపంచాన్ని అర్థం చేసుకోవటానికి తోడ్పడతాయి నిజమే కాని, అది సత్యం కాదు అంటుంది వేదాంతం. వ్యవహారం నడపటానికి ద్వైతం పనికివస్తుంది కాని, అద్వైతంలో వ్యవహారమూ లేదు, ద్వైతమూ లేదు. అందువల్లనే ఈ జాగ్రదావస్థను వ్యావహారికసత్యం అంటుంది వేదాంతం. వ్యవహారం నడపటానికి మాత్రమే సత్యం కాని, అసలు సత్యం, శాశ్వతమైన సత్యం ఇంకొకటి ఉంది. దాన్నే పారమార్థిక సత్యం అంటారు. అద్వైతం లేదా తురీయం పారమార్థిక సత్యంలోకి వస్తుంది. **శాంతం శివమద్వైతమ్** – మంత్రం 7

ఆ అద్వైత తురీయాన్ని నేనే అని నేర్చుకుంటేనే ఈ జ్ఞానం పరిపూర్ణమైన జ్ఞానం అవుతుంది. ఇక్కడ దానికి బీజం వేశారు గౌడపాదాచార్యులవారు. ఆ వాక్యాన్ని గుర్తు పెట్టుకోవాలి.

**కంటితో చూసినంత మాత్రాన అది సత్యం కాదు**

ఈ భావనను రాబోయే అధ్యాయాల్లో వివరిస్తారు. అందువల్ల ఈ వాక్యాన్ని గుర్తుంచుకోవాలి. ఇప్పుడు మళ్ళీ కారికలనుంచి, ఉపనిషత్ మంత్రాలలోకి వస్తాము. అంటే 18వ కారికనుంచి, 8వ మంత్రంలోకి వస్తాము.

## 2. చతుర్మాత్ర ఓంకార విచారణ: మంత్రాలు 8-12 - ఉపోద్ఘాతం

మాండూక్యోపనిషత్తు ఉపోద్ఘాతంలో ఈ ఉపనిషత్తు రెండు రకాల విచారణలను చేస్తున్నదని చూశాము. అవి -

1. చతుర్మాత్ర ఓంకార విచారణ - అకార,ఉకార,మకార, అమాత్రల విచారణ
2. చతుష్పాద ఆత్మ విచారణ - విశ్వ, తైజస, ప్రాజ్ఞ, తురీయాల విచారణ

ఈ రెండింటినీ మొదటి రెండు మంత్రాల్లోనూ ప్రవేశపెట్టాక, ముందు రెండవ అంశాన్ని చర్చించింది ఉపనిషత్తు. ముందు చతుష్పాద ఆత్మ విచారణను చేసింది. దాని సారాంశం-

**అవస్థాత్రయ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి**

దీన్ని గౌడపాదాచార్యులవారు మరింత లోతుగా విశ్లేషించి, ఈ నాలుగు పాదాల వివరణ చేసి, వాటి సాధర్మ్యం-వైధర్మ్యం చూపించి, తురీయాన్ని వివరించారు. దాని సారాంశం -

**అజ్ఞానం, పొరపాటుల విలక్షణమైన తురీయాన్ని నేను**

ఇప్పుడు రెండవ విచారణలోకి అడుగుపెట్టబోతున్నాము. దీనిలో కూడా ప్రయాణం ఇలాగే సాగుతుంది. ఆత్మ విషయంలో ప్రయాణం ఒకసారి చూస్తే - విశ్వనుంచి తురీయానికి ప్రయాణం చేశాము.

విశ్వగా నేను జాగ్రత్ ప్రపంచాన్ని చూస్తాను; తైజసగా నేను సూక్ష్మప్రపంచాన్ని చూస్తాను; ప్రాజ్ఞగా నేను శూన్యాన్ని చూస్తాను. ఇక్కడ శూన్యాన్ని చూస్తాను అంటే ప్రపంచం అవ్యక్తంగా ఉంటుందని అర్థం. నేను తురీయానికి వచ్చేసరికి, నా దృష్టి చూడబడే ప్రపంచంనుంచి నా వైపుకు మళ్ళుతుంది. తక్కిన అవస్థల్లో నేను బాహ్యవస్తువులను సాక్షిగా చూస్తున్నాను. కాని తురీయానికి వచ్చేసరికి, ఆ సాక్షిని నేనే అని అర్థం చేసుకున్నాను. తక్కిన మూడు అవస్థల్లో కూడా నేను ఉన్నాను. అందువల్ల మొదటి మూడు మెట్లు ఎక్కి, తురీయం అనే అంతస్థుకు చేరుకున్నాను.

ఇప్పుడు ఇదే పద్ధతి ఓంకారంలో కూడా. అక్కడ పాదాలు అయితే, ఇక్కడ మాత్రలు. ఓంకారం యొక్క నాలుగు మాత్రలు అకార మాత్ర, ఉకార మాత్ర, మకార మాత్ర, అమాత్ర (నిశ్శబ్దం). మన ప్రయాణం క్రమేపీ అ నుంచి ఉ కు, ఉ నుంచి మ కు సాగి, మ నుంచి నిశ్శబ్దానికి సాగుతుంది. అక్కడ కూడా ఆగిపోకూడదు. ఆ నిశ్శబ్దాన్ని చూసేది ఒకటి ఉంది. నిశ్శబ్దం ఉందని ఎలా తెలుస్తున్నది? దాన్ని చూసేది ఒకటి ఉంది కాబట్టి. అంటే నిశ్శబ్దాన్ని చూసే సాక్షి చైతన్యానికి, ఈ ప్రయాణం ద్వారా చేరుకోవాలి. తర్వాత దీన్ని ఆత్మవిచారణతో కలిపి ఎలా చేయాలో కూడా చేస్తాము.

ప్రస్తుతం ఓంకారం గురించి చూద్దాము. మన ప్రయాణం మూడు దశల్లో సాగుతుంది. శబ్దంనుంచి నిశ్శబ్దానికి; నిశ్శబ్దంనుంచి దాన్ని చూసే సాక్షిచైతన్యానికి.

**శబ్దం → నిశ్శబ్దం → సాక్షిచైతన్యం**

సాక్షిచైతన్యం శబ్దాన్ని సాక్షిగా చూస్తుంది; నిశ్శబ్దాన్ని సాక్షిగా చూస్తుంది; కాని సాక్షి ఇవేవీ కావు, వీటికి భిన్నంగా ఉంది.

శబ్దం ఉంటే నిశ్శబ్దం ఉండదు; నిశ్శబ్దం ఉంటే శబ్దం ఉండదు; కాని రెండింటిలోనూ సాక్షి ఉంది. రెండింటినీ సాక్షిగా చూస్తుంది సాక్షిచైతన్యం. నా దృష్టిని ఈ సాక్షి వైపుకు మరల్చాలి. అంటే ఓంకారవిచారణ ద్వారా శబ్దంనుంచి నిశ్శబ్దానికి, నిశ్శబ్దంనుంచి సాక్షికి చేరుకోవాలి. ఈ ప్రజ్ఞను పెంచుకోవాలంటే ఆత్మయొక్క నాలుగు పాదాలతో, ఓంకారంయొక్క నాలుగు మాత్రలను పోల్చిచూడాలి.

ఇప్పుడు ఓంకార విచారణ ఉపోద్ఘాతం చూద్దాము. విచారణ అంటే విశ్లేషణ. కారం అంటే 'ఓం' అనే పదం. ఈ విచారణను ఉపనిషత్ 8–12 మంత్రాల్లో చేస్తున్నది.

'ఓం' అనే పదం ఏకాక్షరం. ఏకాక్షరం అంటే ఒకటే శబ్దం ఉంటుంది. కాని ఆత్మలో నాలుగు భాగాలు ఉన్నట్టుగా, ఓంకారంలో నాలుగు భాగాలు ఉన్నాయి. ఆత్మ విషయంలో పాదాలు అంటే, ఓంకారం విషయంలో మాత్రలు అంటాము.

**ఓంకారంయొక్క నాలుగు మాత్రలు**

ఎ) **అకార మాత్ర** – మొదటి మాత్ర 'అ' అక్షరం. తమాషా ఏమిటంటే ఇంగ్లీషులో 'ఎ' అనే అక్షరం ఉంది కాని దాని శబ్దం 'అ' కాదు. దానికి అనేక శబ్దాలు వస్తాయి; ఒక శబ్దం సగం 'అ' పలుకుతాము. కాని మన భారతీయ భాషలు తీసుకుంటే, 'అ' అక్షరం చాలా ముఖ్యమైన అక్షరం. అందువల్ల చాలా భాషల్లో అదే మొదటి అక్షరం కూడా . ఎందుకంటే చిన్నపిల్లవాడు కూడా పలకగలిగిన ప్రాథమిక అక్షరం 'అ'. పిల్లవాడు నోరు తెరిస్తే 'అ' శబ్దం వెలువడుతుంది. అందువల్ల తల్లి అతనికి అన్నం పెట్టేటప్పుడు 'అ' అను అంటుంది. ఇది ఓంకారంలోని మొదటి మాత్ర.

బి) **ఉకార మాత్ర** – రెండవ మాత్ర 'ఉ' అక్షరం. ఆశ్చర్యకరంగా ఇంగ్లీషులో ఈ 'ఉ' శబ్దం కూడా లేదు. యు అక్షరం ఉంది కాని దాని శబ్దం 'ఉ' కాదు, 'యు'.

ఓంకారంలో అ + ఉ ఎలా వచ్చింది?

సంస్కృతసంధుల్లో గుణసంధిని నేర్చుకున్నాము మనము చిన్నప్పుడు. గుణసంధి సూత్రం ప్రకారం అకారానికి ఉకారం కలిస్తే అది 'ఓ' అవుతుంది.

**అ + ఉ = ఓ; మహ + ఉన్నతి = మహోన్నతి**

ఈ విషయం తెలియక కొందరు ఓంకారాన్ని ఇంగ్లీషులో రాసేటప్పుడు aum అని రాస్తారు. ఔమ్ అని పలుకుతారు. అది నిజం కాదు.

అంతేకాదు, ఈ వరుసక్రమాన్ని కూడా మార్చకూడదు. ఉ+అ అనకూడదు.

ఉ + అ = వ; గురు + అష్టకం = గుర్వష్టకం

సి) **మకార మాత్ర** – మూడవ మాత్ర సగం మ (మ్); మ అక్షరం పలికినప్పుడు పెదవులు రెండూ కలుస్తాయి. అంటే అన్ని అక్షరాలనూ తనలో కలిపేసుకుంటుంది. అ+ఉ+మ్=ఓమ్.

డి) **అమాత్ర** – నాలుగవ మాత్ర నిశ్శబ్దం. ఒకసారి ఓంకారం పలికాక, దాని తర్వాత వచ్చే నిశ్శబ్దాన్ని అమాత్ర అంటారు. మొదటిది అకార మాత్ర, చివరిది అమాత్ర.

ఇప్పుడు ఓంకారంయొక్క నాలుగు మాత్రలను ఆత్మయొక్క నాలుగు పాదాలతో పోల్చవచ్చు. ఇందులో మొదటి మాత్ర అందులో మొదటి పాదం పోలుస్తాము. ఉదాహరణకు అకార మాత్ర = విశ్వ. ఇలా రెండింటినీ పోల్చటంవల్ల కలిగే లాభమేమిటి? ఇలా ఓంకారాన్నీ, ఆత్మనూ పోల్చటంవల్ల ఓంకారధ్యానం చేసినప్పుడు, వీటి రెండింటి మధ్యా ఉన్న పోలికవల్ల, ఆత్మయొక్క నాలుగు పాదాలూ స్ఫురణకు వస్తాయి. మొదటి మూడు మాత్రలు, ఆత్మయొక్క మూడు పాదాలు అని చూశాము. అక్కడ ఈ పాదాలను తురీయం సాక్షిగా చూస్తుందని చూశాము. ఇక్కడ కూడా నాలుగవ మాత్ర అయిన నిశ్శబ్దాన్ని ఒకటి సాక్షిగా చూస్తుందని చూశాము. అదే తురీయం. ఆ విధంగా,

చతుర్మాత్ర ఓంకార విచారణ = చతుష్పాద ఆత్మ విచారణ

ఆత్మ విచారణ శుద్ధచైతన్యానికి దారితీస్తుంది. ఓంకార విచారణ శుద్ధనిశ్శబ్దానికి దారితీస్తుంది. ఈ నిశ్శబ్దతురీయంలో నిలబడవచ్చు. అది మీ అసలు స్వరూపం. ఇదీ ఓంకార విచారణ.

## మంత్రం 8

**సోఽ యమాత్మాఽ ధ్యక్షరమోంకారోఽ ధిమాత్రం పాదా మాత్రా మాత్రాశ్చ**
**పాదా అకార ఉకారో మకార ఇతి ॥**

ఈ మంత్రం ఈ ఓంకార విచారణను, ఆత్మవిచారణతో కలిపి ఎలా చేయవచ్చో పరిచయం చేస్తుంది.

**సోఽ యమాత్మా ఓంకారః** – ఈ ఆత్మ. ఈ ఆత్మ అంటే ఇంతవరకూ విచారణ చేయబడిన ఆత్మ ఓంకారం.

**అధ్యక్షరమ్** – అంటే భాగాలుగా కాకుండా, పూర్తి ఆత్మను, పూర్తి ఓంకారాన్ని సమానంగా తీసుకోవాలి.

**అధిమాత్రమ్** – ఇప్పుడు రెండింటినీ, వాటి భాగాలుగా విడదీయాలి. అంటే ఆత్మను నాలుగు పాదాలుగా, ఓంకారాన్ని నాలుగు మాత్రలుగా చేసి వాటిని పోల్చాలి.

**పాదా మాత్రాః** – ఒక్కొక్క పాదాన్ని ఒక్కొక్క మాత్రతో పోల్చవచ్చు.

**మాత్రాశ్చ పాదాః** – అలాగే ఒక్కొక్క మాత్రను, ఒక్కొక్క పాదంతో పోల్చవచ్చు. అంటే అటునుంచి ఇటయినా, ఇటునుంచి అటయినా, ఒకటే. ఎందుకంటే రెండింటికీ సంఖ్య సమానంగా ఉంది.

**అకార ఉకారో మకార ఇతి** – ఓంకారంలోని నాలుగు మాత్రలు అకారం, ఉకారం, మకారం, అమాత్ర. అమాత్ర గురించి ఇక్కడ చెప్పలేదు ఉపనిషత్తు. అది పన్నెండవ మంత్రంలో వస్తుంది. కాని ఇక్కడ మనం అది కూడా కలుపుకోవచ్చు.

ఇతి – ఇవి నాలుగు పాదాలు.

అదేమిటి నాలుగు మాత్రల గురించే చెప్పావు, ఆత్మయొక్క నాలుగు పాదాల గురించి చెప్పలేదేమని మనం ఉపనిషత్తును అడిగామనుకోండి. ఉపనిషత్తు నివ్వెరపోతుంది. ఇంతవరకూ చెప్పినదేమనుకున్నావు అంటుంది. ఆ నాలుగు పాదాలు వ్యష్టిపరంగా విశ్వ, తైజస, ప్రాజ్ఞ, తురీయం అయితే; సమష్టిపరంగా విరాట్, హిరణ్యగర్భ, అంతర్యామి, బ్రహ్మ.

| | | | | | |
|---|---|---|---|---|---|
| చతుర్మాత్ర ఓంకారం | ఓం – | అ | ఉ | మ | అమాత్ర |
| చతుష్పాద ఆత్మ | ఆత్మ – | విశ్వ | తైజస | ప్రాజ్ఞ | తురీయం |

## మంత్రం 9

**జాగరితస్థానో వైశ్వానరోఽకారః ప్రథమా మాత్రాఽఽప్తేరాదిమత్త్వాద్వాఽఽప్నోతి హ వై సర్వాన్ కామానాదిశ్చ భవతి య ఏవం వేద ॥**

ఎ) **అకార – విశ్వ/విరాట్ ఐక్య ఉపాసన** – ఇప్పుడు ఉపనిషత్తు అకార మాత్రని, విశ్వ/ విరాట్ జంటతో పోలుస్తున్నది.

**అకారః ప్రథమా మాత్రా** – 'ఓం' శబ్దాన్ని పలికినప్పుడు, అకార శబ్దం రాదు కాని ముందే చూసినట్టుగా ఓ=అ+ఉ. అకారం ఓంకారంయొక్క మొదటి మాత్ర. ఉ ని మొదటి మాత్రగా తీసుకోకూడదు. ఉ+అ కలిపితే ఓ రాదు; వ వస్తుంది. అందుకని క్రమం కూడా సరిగ్గా చూసుకోవాలి. అంతేకాదు, ముందే చూసినట్టుగా అకార మాత్ర వేరు, అమాత్ర వేరు.

అకార మాత్ర మొదటి మాత్ర (అ అక్షరం), అమాత్ర ఓం పలికి ఆగాక, వచ్చే నిశ్శబ్దం.

**జాగరితస్థానః** – జాగరిత స్థానః అంటే ఆత్మయొక్క మొదటి పాదం. దీని అర్థం జాగ్రత్ పురుషుడు, విశ్వ.

**వైశ్వానరః** – వైశ్వానరః అంటే విరాట్ అని మూడవ మంత్రంలో చూశాము.

**జాగరితస్థానో బహిష్ప్రజ్ఞస్సప్తాంగ ఏకోనవింశతిముఖః స్థూలభుగ్వైశ్వానరః ప్రథమః పాదః ॥** – మంత్రం 3

ఉపనిషత్తు 'అ' కారాన్ని విశ్వ/విరాట్‌ని ఎందుకు పోలుస్తున్నది? ఇలా పోలిక చెప్పాలంటే, శాస్త్రంలో దానికొక నియమం ఉంది. దేన్నైనా దేనికైనా ప్రతీకగా వాడాలంటే, ఆ రెండింటి మధ్య కొన్నైనా పోలికలు ఉండాలి. అప్పుడు ఒకటి చూడగానే, రెండవది దానంతట అదే గుర్తుకు వస్తుంది.

ఉదాహరణకు పచ్చదనాన్ని ఐశ్వర్యం గురించి చెప్పటానికి ఉపయోగిస్తారు. ఎందుకు? ఐశ్వర్యం అంటే చాలా ధనం. ధనాన్ని పచ్చనోట్లు అనికూడా అంటారు. అంతేకాదు, పొలాలు పచ్చరంగుతో మెరిసిపోతుంటాయి. మనదేశంలో పంటలు ఐశ్వర్యాన్నిస్తాయి.

ఇక్కడ ఉపనిషత్తే రెండు పోలికలను చెబుతున్నది.

**ఆప్తేరాదిమత్త్వాత్ వా** – అవి ఆప్తి, ఆది.

ఆప్తేః అంటే సర్వవ్యాపకత్వం. అకారానికీ, విరాట్‌కీ మధ్య పోలిక సర్వవ్యాపకత్వం. విరాట్ సర్వవ్యాపకం అని మనకు తెలుసు. విరాట్ అంటే విశ్వరూప ఈశ్వరుడు. విశ్వరూప ఈశ్వరుడు విశ్వమంతా వ్యాపించి ఉంటాడు కాబట్టి సర్వవ్యాపకుడు. విశ్వరూపదర్శనాన్ని భగవద్గీతలో చూస్తాము.

అకారం కూడా సర్వవ్యాపకం. శబ్దాలను బోధించే శాస్త్రాన్ని శీక్షాశాస్త్రం అంటారు. దీన్ని ఇంగ్లీషులో ఫొనెటిక్స్ అంటారు. శీక్షాశాస్త్రం అకారం ప్రాథమిక శబ్దం అంటుంది. మనం నోరు తెరిస్తేనే చాలు. మన ప్రమేయం లేకుండానే వచ్చే శబ్దం అది. తక్కిన అక్షరాలు అయిన ఇ, ఉ వంటి వాటి మాటేమిటి? నోరు తెరిస్తే 'అ' అన్నాము; నోరును కొంచెం వెడల్పు చేస్తే 'ఇ'; నోరును కొంచెంగా మారిస్తే 'ఉ'. అందువల్ల శీక్షాశాస్త్రం తక్కిన అక్షరాలన్నిటికీ 'అ' అక్షరం ఉపాదాన కారణం అంటున్నది. ఎలాగైతే బంగారం ఆభరణాలకు ఉపాదానకారణమో, అలా 'అ' అక్షరం తక్కిన అక్షరాలన్నింటికీ ఉపాదానకారణం.

ప్రకృతిసూత్రం – ఉపాదానకారణం, కార్యమంతటా ఉంటుంది. బంగారం ఆభరణాలంతటా ఉంటుంది; చెక్క కుర్చీ అంతటా ఉంటుంది; 'అ' అక్షరం తక్కిన అక్షరాలంతటా ఉంటుంది.

శీక్షాశాస్త్రం ప్రకారం ప్రతి ఒక్క అక్షరానికి ఒక అధిష్ఠానదేవత ఉంటుంది. 'అ' అక్షరానికి అధిష్ఠానదేవత బ్రహ్మ. బ్రహ్మ ఈ జగత్ సృష్టికి కారణం అయితే, 'అ' అక్షరం తక్కిన అక్షరాలకు కారణం. ఆ విధంగా 'అ' అక్షరం, విశ్వ/విరాట్ సర్వవ్యాపకం. ఇది మొదటి పోలిక.

ఆదిమత్వాత్ – అంటే మొదట పుట్టినవి రెండూ.

**తస్మాత్ విరాడజాయత**

విరాట్ మొట్టమొదట పుట్టాడు. 'అ' అక్షరం కూడా మొట్టమొదట పుట్టింది. అప్పుడే ఈలోకంలోకి వచ్చిన పసికందు నోరు విప్పి ఏడిస్తే అది 'అ'కార శబ్దమే. అందువల్ల రెండూ మొదట పుట్టాయి.

ఉపనిషత్తు అకారంమీద విరాట్‌ను ఆవాహన చేసి, అకార విరాట్ ఐక్యఉపాసన చేయమంటున్నది. అలా చేస్తే కలిగే ఫలమేమిటి?

**య ఏవం వేద** – ఎవరైతే ఈ ఉపాసన చేస్తారో, అతనికి రెండు ఫలాలు కలుగుతాయి. సకామ ఉపాసన చేస్తే లౌకికఫలాలు కలుగుతాయి. ఇక్కడ ఏవం వేద అంటే ఉపాసన చేస్తే అని అర్థం. ఏ ఉపాసన? అకార విరాట్ ఐక్య ఉపాసన.

**ఆప్నోతి హ వై సర్వాన్ కామాన్** – అతని కోరికలన్నీ తీరుతాయి. అతని బంధుకోటి, అతని ఆస్తిపాస్తులు దిగదిగంతాలకు వ్యాపిస్తాయి. అతను సర్వాధారమైన అకారంమీద, సర్వవ్యాపకమైన విరాట్ ఉపాసన చేస్తాడు కాబట్టి అతను కూడా లౌకికంగా సర్వవ్యాపకుడు అవుతాడు. అంటే అతని పిల్లలు, మనవళ్ళు దేశవిదేశాలలో ఉంటారు; అనేక దేశాల్లో ఆస్తులు ఉంటాయి.

**ఆదిశ్చ భవతి** – మొదటి అక్షరమైన అకారంమీద మొదట పుట్టిన విరాట్ ఉపాసన అతను చేస్తాడు కాబట్టి, అతను కూడా ఏ రంగంలో కాలుపెట్టినా, మొట్టమొదటి వ్యక్తి అవుతాడు. అంటే ఎక్కడికెళ్ళినా ప్రథమశ్రేణిలో ఉంటాడు. ఇది సకామ ఉపాసన ఫలం.

**నిష్కామ ఉపాసన ఫలం** – కోరిక కోరకుండా చేస్తే, అతను ఆధ్యాత్మికంగా ఎదుగుతాడు. అకారాన్ని, విరాట్‌తో పోల్చిచూసే శక్తిని పెంపొందించుకుంటాడు. ఆ శక్తి అతను తర్వాత జ్ఞానమార్గానికి వచ్చి, శ్రవణ, మననాల ద్వారా జ్ఞానం పొంది, తను పొందిన జ్ఞానంమీద నిదిధ్యాసనం చేయాల్సి వచ్చినప్పుడు తోడ్పడుతుంది.

ఓంకార ధ్యానం చేస్తే అతని మనస్సు విరాట్, హిరణ్యగర్భ, అంతర్యామిల గురించి ఆలోచించి, నిశ్శబ్దానికి వచ్చినప్పుడు, అనుకోకుండా చైతన్య అధిష్ఠానానికి వస్తుంది. ఈ విచారణ చేయకముందు, నిశ్శబ్దం అంటే శూన్యంగా అనిపించేది, ఇప్పుడు నిశ్శబ్దం శూన్యం కాదు; నిశ్శబ్దం వెనకనున్న చైతన్యాన్ని సూచిస్తుంది.

ఇది అకార విరాట్ ఐక్యఉపాసన. టూకీగా చూస్తే -

| | | | | | |
|---|---|---|---|---|---|
| అ-విశ్వ/విరాట్ | ఆప్తి | అ | - సర్వాధారం | ఆప్నోతి సర్వాన్ - | కోరికలన్నీ |
| | | విరాట్ | - సర్వవ్యాపకం | కామాన్ | తీరుతాయి |
| | ఆది | అ | - మొదటి అక్షరం | ఆదిశ్చ భవతి - | ప్రథమశ్రేణిలో |
| | | విరాట్ | - మొదట పుట్టాడు | | ఉంటాడు |

## మంత్రం 10

**స్వప్నస్థానస్తైజస ఉకారో ద్వితీయా మాత్రోత్కర్షాదుభయత్వాద్వోత్కర్షతి హ వై జ్ఞానసంతతిం సమానశ్చ భవతి నాస్యాబ్రహ్మవిత్కులే భవతి య ఏవం వేద ॥**

బి) **ఉకార - తైజస/హిరణ్యగర్భ ఐక్య ఉపాసన** - ఇప్పుడు ఉపనిషత్తు ఉకార మాత్రని, తైజస/హిరణ్యగర్భ జంటతో పోలుస్తున్నది. అంటే రెండవ మాత్రను, రెండవ పాదంతో పోలుస్తున్నది.

**ఉకారో ద్వితీయా మాత్రా** - ఓం శబ్దాన్ని పలికినప్పుడు ఉకార శబ్దం రాదు, కాని ముందే చూసినట్టుగా ఓ=అ+ఉ. దీనికి సంధి సూత్రాన్ని గుర్తు పెట్టుకోవాలి. అది కూడా అ+ఉ చేయాలి కాని, ఉ+అ అనకూడదు అనికూడా చూశాము. అందువల్ల 'ఉ' అక్షరం రెండవ మాత్ర.

**స్వప్నస్థానః తైజసో** - స్వప్నస్థానః అంటే ఆత్మయొక్క రెండవ పాదం. దీని అర్థం స్వప్నపురుషుడు, తైజస. హిరణ్యగర్భ గురించి చెప్పలేదు. అది మనం కలుపుకోవాలి.

**స్వప్నస్థానోఽన్తః ప్రజ్ఞః సప్తాంగ ఏకోనవింశతిముఖః ప్రవివిక్తభుక్తైజసో ద్వితీయః పాదః॥**
- మంత్రం 4

ఇలా ఐక్య ఉపాసన చెప్పాలంటే, రెండింటి మధ్యా కొన్నైనా పోలికలు ఉండాలి. ఇక్కడ రెండు పోలికలు చెబుతున్నది ఉపనిషత్తు.

**ఉత్కర్షాదుభయత్వాద్ వా** - అవి ఉత్కర్షః, ఉభయత్వమ్.

ఉత్కర్షః - ఉత్కర్ష అంటే దానికన్నా గొప్పది అని అర్థం. అకారంకన్నా, ఉకారం గొప్పది. ఎందుకు? సృష్టి జరిగినప్పుడు అకారంనుంచి తక్కిన అక్షరాలు వచ్చాయి అన్నాము. ఇప్పుడు లయ జరిగేటప్పుడు వ్యతిరేక పద్ధతిలో జరుగుతుంది. అంటే అకారం, ఉకారంలో లయమవుతుంది. తర్వాత ఉకారం కూడా మకారంలో లయమవుతుంది కాని ఇప్పటికి అకారం, ఉకారంలో లయమవుతుంది వరకే తీసుకోవాలి. 'ఉ'లో 'అ' లయమవుతుంది కాబట్టి 'ఉ', 'అ' కన్నా ఎక్కువ.

హిరణ్యగర్భ, విరాట్‌కన్నా ఎలా ఎక్కువ? హిరణ్యగర్భ సమష్టి సూక్ష్మప్రపంచ అధిష్ఠానదేవత; విరాట్ సమష్టి స్థూలప్రపంచ అధిష్ఠానదేవత. సూక్ష్మం ఎప్పుడూ స్థూలంకన్నా శ్రేష్ఠం. సూక్ష్మం కారణమైతే, స్థూలం కార్యం అవుతుంది.

అంతేకాదు, స్థూలభూతాలు, సూక్ష్మభూతాలనుంచి ఉత్పత్తి చెందుతాయని తత్త్వబోధలో నేర్చుకుంటాము. ఆ నిర్వచనం ప్రకారం హిరణ్యగర్భనుంచి విరాట్ ఉద్భవించాడు. ప్రళయం జరిగేటప్పుడు విరాట్, హిరణ్యగర్భలో లయమవుతాడు. విరాట్, హిరణ్యగర్భలో లయమవుతాడు కాబట్టి, విరాట్‌కన్నా, హిరణ్యగర్భ ఎక్కువ.

**సూక్ష్మత్వాత్ కారణత్వాత్ ఉత్పత్తిస్థానత్వాత్ లయస్థానత్వాత్ ఉత్కర్షః**

ఆ విధంగా ఉకారం, హిరణ్యగర్భలకు పోలిక ఉత్కర్షః.

ఉభయత్వాద్ వా – రెండూ మధ్యలో ఉన్నాయి. అ, ఉ, మ అక్షరాలను తీసుకుంటే ఉ అక్షరం, అ కీ, మ కీ మధ్యలో ఉంది. అలాగే విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరులను తీసుకుంటే హిరణ్యగర్భ మధ్యలో ఉన్నాడు. ఒక్క ఉకారంలో మొత్తం ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి ఇమిడి ఉన్నాయి; కంప్యూటర్‌లోని ఒక చిన్న చిప్‌లో ఎంతో సమాచారం ఇమిడి ఉన్నట్టుగా.

**య ఏవం వేద** – ఎవరైతే ఉకార హిరణ్యగర్భ ఐక్య ఉపాసన చేస్తారో అతనికి రెండు ఫలాలు కలుగుతాయి. రెండు పోలికలమీద చేస్తాడు కాబట్టి అతనికి కూడా రెండు ఫలాలు కలుగుతాయి. ఇదంతా సకామ ఉపాసన చేస్తే కలిగే ఫలం.

**జ్ఞానసంతతిం ఉత్కర్షతి** – ఉకారాన్ని హిరణ్యగర్భమీద ఆవాహన చేస్తాడు కాబట్టి, హిరణ్యగర్భ సమష్టిబుద్ధి కాబట్టి, ఈ ఉపాసన సరస్వతీ ఉపాసనతో సమానం. సరస్వతీ దేవి సమష్టిబుద్ధికి ప్రతీక. ఈ ఉపాసన ఫలంగా ఈ సాధకుడు చాలా జ్ఞానం పొందుతాడు. జ్ఞానసంతతిం అంటే అతని జ్ఞానంయొక్క పరిధి; ఉత్కర్షతి అంటే ఎక్కువవుతుంది. అంటే అతనికి తెలియని విద్య అంటూ ఉండదు. అతని పేరు చివర అనేక డిగ్రీలు వచ్చి చేరతాయి.

**సమానశ్చ భవతి** – ఉకారం, హిరణ్యగర్భ రెండూ మధ్యలో ఉండటంవల్ల రెండు వైపుల వారికీ కావాల్సిన వ్యక్తి అవుతాడు. విభేదించుకునే రెండు సముదాయాలు కూడా, అతన్నే మధ్యవర్తిత్వం నడపమంటాయి. అంటే అతను అందరికీ ఆత్మీయుడు అవుతాడు.

**అస్య కులే అబ్రహ్మవిత్ న భవతి** – అతని కులంలో జ్ఞానికాని వ్యక్తి ఉండదు. అతని జ్ఞానం అతని కుటుంబసభ్యులను ఎంతగా ప్రభావితం చేస్తుందంటే, అతని ప్రభావంవల్ల అందరూ జ్ఞానం పొందుతారు. ఈ విషయాన్ని నొక్కి చెప్పటానికి రెండు వ్యతిరేక పదాలను వేసింది

ఉపనిషత్తు. అతని కుటుంబంలో జ్ఞానికాని వ్యక్తి ఉండడు వాక్యాన్ని సానుకూలంగా చెబితే, అతని కుటుంబంలో ప్రతి ఒక్కరూ జ్ఞాని అవుతారు.

నిష్కామఫలం గురించి చెప్పకపోయినా, ఇందాక చూసిన నిష్కామఫలాన్ని ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవచ్చు. ఓంకార ధ్యానం చేస్తే అతని మనస్సులోకి మొత్తం విశ్వం వస్తుంది; నిశ్శబ్దంలోకి వెళితే, నిశ్శబ్దం చైతన్యంలో లయమవుతుంది. ఆ విధంగా ఇది నిదిధ్యాసనానికి తోడ్పడుతుంది.

ఇది ఉకార హిరణ్యగర్భ ఐక్యఉపాసన. టూకీగా చూస్తే –

| | | | |
|---|---|---|---|
| ఉ–తైజస / హిరణ్యగర్భ | ఉత్కర్షః | ఉ – అకన్నా ఎక్కువ<br>హిరణ్యగర్భ – విరాట్‌కన్నా ఎక్కువ | ఉత్కర్షతి – అందరికన్నా<br>శ్రేష్ఠుడు అవుతాడు |
| | ఉభయత్వమ్ | ఉ – అ, మ ల మధ్య ఉంది<br>హిరణ్యగర్భ – విరాట్, ఈశ్వరుల మధ్యలో ఉన్నాడు | సమానశ్చ భవతి – అందరికీ<br>ఆత్మీయుడు అవుతాడు |

## మంత్రం 11

**సుషుప్తస్థానః ప్రాజ్ఞో మకారస్తృతీయా మాత్రా మితేరపీతేర్వా మినోతి హ వా ఇదం సర్వమపీతిశ్చ భవతి య ఏవం వేద ॥**

సి) **మకార –ప్రాజ్ఞ/ఈశ్వర ఐక్య ఉపాసన** – ఇప్పుడు ఉపనిషత్తు మకార మాత్రని, ప్రాజ్ఞ/ ఈశ్వర జంటతో పోలుస్తున్నది. అంటే మూడవ మాత్రను, మూడవ పాదంతో పోలుస్తున్నది.

**మకారస్తృతీయా మాత్రా** – మకారం మూడవ మాత్ర.

**సుషుప్తస్థానః ప్రాజ్ఞో** – సుషుప్త స్థానః అంటే ఆత్మయొక్క మూడవ పాదం. దీని అర్థం సుప్తపురుషుడు ప్రాజ్ఞ. ఈశ్వరుని గురించి చెప్పలేదు, మనం కలుపుకోవాలి. వ్యష్టిపరంగా సుషుప్తిని లయ అంటే, సమష్టిపరంగా ప్రళయం అంటాము.

**యత్రసుప్తో న కఞ్చన కామం కామయతే న కఞ్చన స్వప్నం పశ్యతి తత్సుషుప్తమ్। సుషుప్తస్థాన ఏకీభూతః ప్రజ్ఞానఘన ఏవానన్దమయో హ్యానన్దభుక్చేతోముఖః ప్రాజ్ఞస్తృతీయః పాదః ॥** – మంత్రం 5

ఇలా ఐక్యఉపాసన చెప్పాలంటే, రెండింటి మధ్యా కొన్నైనా పోలికలు ఉండాలి. ఇక్కడ రెండు పోలికలు చెబుతున్నది ఉపనిషత్తు.

**మితేరపీతేః వా** – మితిః అంటే కొలమానం; అపీతిః అంటే లయస్థానం.

మితిః – మితిః అంటే కొలమానం. ఇప్పుడంటే బరువులను కొలవటానికి ఒక కిలో కొలతరాయి, రెండు కిలోల కొలతరాళ్ళు వచ్చాయి కాని, అప్పట్లో ధాన్యాన్ని వేరే కొలతలతో కొలిచేవారు. వాటిలో ఒకదాని పేరు కుంచము.

ఇక్కడ ఉపనిషత్తు చెబుతున్న పోలిక చాలా ఊహాజనితమైన పోలిక. ఒకవ్యక్తి ధాన్యం తెచ్చి రాశులుగా పోశాడనుకుందాము. ఎవరికైనా అతని దగ్గరకు ధాన్యాన్ని కొనటానికి వస్తే, ఎంతకావాలి అంటాడు. వచ్చిన వ్యక్తి పది కుంచాలు అన్నాడనుకుందాము. అప్పుడు ఆ రైతు, తన కుంచాన్ని తీసి, దానిలో ధాన్యాన్ని నింపి, ఇంకొక పక్కన పోస్తాడు.

ఇప్పుడు అతను కొలుస్తున్న ఈ చర్యను వచ్చిన వ్యక్తి దూరంనుంచి గమనిస్తున్నాడు అనుకుందాము. అది ఈ విధంగా అతనికి తెలుస్తుంది. ఆ రాశిలో ఉన్నప్పుడు ధాన్యం తెలుస్తున్నది; కుంచంలో పోసినప్పుడు కనబడటం లేదు. మళ్ళీ అందులోంచి ఒక పక్కకు పోసినప్పుడు తెలుస్తున్నది. అంటే కుంచంలో ఉండగా అవ్యక్తం అవుతున్నది; బయటకు వచ్చినప్పుడు వ్యక్తం అవుతున్నది. ఇంకా చెప్పాలంటే రాశిలోంచి కుంచంలో పోసినప్పుడు వ్యక్తంనుంచి అవ్యక్తంలోకి వెళుతున్నది; కుంచంలోంచి బయటకు పోసినప్పుడు అవ్యక్తం నుంచి మళ్ళీ వ్యక్తమవుతున్నది. ఆ విధంగా ధాన్యం అవ్యక్తం, వ్యక్తం అవుతూ వస్తున్నది.

ఇదే సూత్రాన్ని మకారానికి కూడా వర్తింపజేయవచ్చు. మనం మాట్లాడుతున్నంతసేపూ శబ్దాలు వినిపిస్తూ ఉంటాయి. కాని ఎప్పుడైతే మనం నోరు మూస్తామో, అప్పుడే శబ్దాలన్నీ లయమవుతాయి. అంటే మనం ఆ పదాలను మింగుతాము అన్నమాట. నిజానికి మనం ఆ పదప్రయోగం చేస్తాము కూడా. నాకు అతనిమీద చాలా కోపం వచ్చింది, బాగా తిడదామనుకున్నాను కాని, ఆ మాటలను మింగేశాను అంటాము. ఆ విధంగా శబ్దాలన్నీ 'మ'లోకి, అవ్యక్తంలోకి వెళ్ళిపోయి, మళ్ళీ నోరు తెరవగానే వ్యక్తమవుతాయి. ఆ విధంగా 'మ' కూడా ఒక కొలమానం.

ప్రాజ్ఞ కూడా ఒక కొలమానం. అదెలా? మనం గాఢనిద్ర పోయినప్పుడు బాహ్యప్రపంచం అవ్యక్తంలో ప్రాజ్ఞలోకి వెళ్ళిపోతుంది. మళ్ళీ మనం పొద్దున్న నిద్ర లేచినప్పుడు అవ్యక్తంలోకి వెళ్ళిపోయిన బాహ్యప్రపంచం వ్యక్తంలోకి వస్తుంది. అంటే ప్రపంచం వ్యక్తంలోంచి అవ్యక్తంలోకి, అవ్యక్తంలోంచి వ్యక్తంలోకి వెళుతున్నది. ఇది ప్రతిరోజూ జరుగుతున్నది. ఇది మొదటి పోలిక. ఇవి కొలమానం వంటివి.

అపీతిః – మకారాన్ని లయస్థానం అంటున్నది ఉపనిషత్తు. అదెలా? మనం మాటలు ఆపేయాలనుకుంటే నోరు మూసుకుంటాము. నోరు మూసేటప్పుడు వచ్చే శబ్దం 'మ్'. తల్లి పిల్లవానికి అన్నం పెట్టేటప్పుడు నోరు తెరువు అనటానికి 'అ' అను అంటుంది. పిల్లవాడు ఆ ముద్దను నోట్లో పెట్టుకుని మింగడు. 'మ్' అను అంటుంది. ఆ విధంగా తల్లి, పిల్లవానికి ఓంకారం నేర్పిస్తున్నది. అందువల్లనే పిల్లవాడు తినే అన్నానికి **మమ్మమ్** అనే పేరు వచ్చింది. అ, మ శబ్దాలను కలిపి గబగబా నాలుగుసార్లు అనండి, మమ్మమ్ శబ్దం వస్తుంది.

మన సాంప్రదాయం ఎంతగా ఉపనిషత్తుల్లో నిండివుందో చూడండి. చిన్న పిల్లవాడు తినే అన్నంలో మాండూక్యోపనిషత్తు బోధ ఉంది కాని తమాషా ఏమిటంటే, అటు తల్లికీ ఆ విషయం తెలియదు; ఇటు పిల్లవానికీ ఆ విషయం తెలియదు. ఆ విధంగా మకారం అన్ని అక్షరాలకూ లయస్థానం. అంటే శబ్దప్రపంచ లయస్థానం లేదా నామప్రపంచ లయస్థానం.

అదే విధంగా ప్రాజ్ఞ లయస్థానం. వ్యష్టిపరంగా నిద్రను లయ అంటారని, సమష్టిపరంగా నిద్రను ప్రళయం అంటారని చూశాము. వ్యష్టి నిద్రలో చూస్తే మొత్తం జాగ్రత్, స్వప్న శరీరాలు కారణ శరీరంలో లయమవుతాయి. నా బెంగలు, నా జ్ఞానం, నా అజ్ఞానం – అన్నీ లయమవుతాయి. సమష్టి స్థాయిలో మొత్తం జగత్తు ఈశ్వరునిలో లయమవుతుంది. ఆ విధంగా ఈశ్వరుడు జగత్తుకు లయస్థానం అంటే అర్థప్రపంచ లయస్థానం లేదా రూపప్రపంచ లయస్థానం. లయ రెండవ పోలిక.

ఈ రెండు పోలికలనూ దృష్టిలో పెట్టుకుని ఉపాసన చేయాలి. ఒక్క అక్షరంలో ఎంత అర్థం నిబిఢీకృతమై ఉందో చూడండి!

**య ఏవం వేద** – ఎవరైతే మకార ఈశ్వర ఐక్య ఉపాసన చేస్తారో, అతనికి రెండు ఫలాలు కలుగుతాయి. రెండు పోలికలమీద చేస్తాడు కాబట్టి, అతనికి కూడా రెండు ఫలాలు కలుగుతాయి. ఇదంతా సకామ ఉపాసన చేస్తే కలిగే ఫలం.

**మినోతి హ వా ఇదం సర్వమ్** – అతను కొలమానంమీద ఉపాసన చేస్తాడు కాబట్టి, అందరినీ బాగా అంచనా వేయగలడు. నిజానికి జీవితంలో విజయం సాధించాలంటే, అన్నింటినీ సరిగ్గా బేరీజు వేయగలిగి ఉండాలి.

**అపీతిశ్చ భవతి** – అతనిలో అన్నీ లయమవుతాయి అంటే అతను ఈశ్వరునిలో లయమవుతాడు అని ఒక అర్థం; అతని సమస్యలన్నీ అతనిలో లయమవుతాయి అని ఇంకొక అర్థం.

అదే నిష్కామ ఉపాసన చేస్తే అతను నిదిధ్యాసనం తేలిగ్గా చేయగలుగుతాడు.

ఇది మకార ప్రాజ్ఞ/ఈశ్వర ఐక్యఉపాసన. టూకీగా చూస్తే –

| | | | | |
|---|---|---|---|---|
| మ–ప్రాజ్ఞ/ఈశ్వర | మితిః<br>(కొలమానం) | మ – పదాలు అవ్యక్తం,<br>వ్యక్తం అవుతాయి | మినోతి<br>ఇదగ్ం సర్వమ్ | అందరినీ బాగా<br>అంచనా<br>వేయగలడు |
| | | ఈశ్వర–జగత్ అవ్యక్తం,<br>వ్యక్తం అవుతుంది | | |
| | అపీతిః<br>(లయ) | మ–శబ్దప్రపంచ లయస్థానం<br>ఈశ్వర–అర్థప్రపంచ లయస్థానం | అపీతిశ్చ<br>భవతి | ఈశ్వరునిలో<br>లయం అవుతాడు |

**(ఇదంతా పట్టిక 8 – మంత్రాలు 9–12 ఓంకార ఆత్మ ఐక్య ఉపాసన–ఫలములో** ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు)

ఈ విధంగా మొదటి పాదంనుంచి మూడవ పాదం వరకూ ఉపనిషత్తు ఒక క్రమపద్ధతిలో చెప్పుకువచ్చింది. ఆ వరుసక్రమంలో మూడు ఉపాసనలను కూడా నిర్దేశించింది. నిజానికి ఉపనిషత్తు అంతిమలక్ష్యం ఆత్మబోధ చేయటమే. కాని దానికి సిద్ధంగా లేని సాధకునికి తోడ్పడతాయి ఈ ఉపాసనలు. శంకరాచార్యులవారు ఈ మంత్రాలను ఉపాసనలకు మాత్రమే తీసుకోకూడదు అంటారు.

ఈ ఉపాసనలను కొన్నాళ్ళు శ్రద్ధగా చేస్తే, అతని మనస్సు ఆత్మజ్ఞానానికి సంసిద్ధం అవుతుంది. ఇప్పుడు మనం నాలుగవ పాదం – నాలుగవ మాత్ర పోలికలను చూడాలి, కాని మధ్యలో గౌడపాదాచార్యులవారు ఇంతమేరకు వచ్చినవాటిమీద అంటే ఈ ఐక్య ఉపాసనలమీద కొంత విశ్లేషణ చేశారు. వాటిని కారికలు 19–23లో చూస్తాము. అందువల్ల మనమిప్పుడు మంత్రం 11 నుంచి కారిక 19లోకి అడుగుపెడతాము.

3. **ఓంకారం– ఆత్మ ఐక్య ఉపాసన – కారికలు 19–24, మంత్రం 11 తర్వాత**

**కారిక 1.19**

**విశ్వస్యాత్వవివక్షాయామాదిసామాన్యముత్కటమ్ ।**
**మాత్రాసంప్రతిపత్తౌ స్యాదాప్తిసామాన్యమేవ చ ॥**

ఎ) **అకార – విశ్వ/విరాట్ ఐక్య ఉపాసన** – ఉపనిషత్తుయొక్క తొమ్మిదవ మంత్రంలో చూసిన అకార, విరాట్ ఐక్య ఉపాసననే తనదైన బాణీలో చెబుతున్నారు గౌడపాదాచార్యుల వారు.

**మాత్రాసంప్రతిపత్తౌ** – సంప్రతిపత్తి అంటే అభిన్నం; మాత్రా అంటే మాత్ర, పాదానికి అభిన్నం. అంటే మాత్ర పాద అభేద ధ్యానం చేయటం. ఏ రెండూ?

**విశ్వస్యాత్వవివక్షాయామ్** – విశ్వను అకారంతో పోల్చింది ఉపనిషత్తు అని చూశాము. విశ్వస్య అంటే విశ్వ; అత్వ అంటే అకారం; వివక్షాయామ్ అంటే పోలిక ఉంది. అంటే విశ్వకూ, అకారానికీ పోలిక ఉంది. విశ్వ అంటే దానితో విరాట్‌ను కూడా కలుపుకోవాలి. ప్రథమపాదం అంటే విశ్వ–విరాట్ జంటను తీసుకోవాలి. మొత్తం జాగ్రత్ ప్రపంచాన్ని ఒక చిన్న అకారంలో ఊహించుకోవాలి. తొమ్మిదవ మంత్రంలో ఈ రెండింటి మధ్య చెప్పిన పోలికలను ముందు గుర్తు తెచ్చుకోవాలి.

**ఆప్తేరాదిమత్త్వాత్ వా – ఆప్తిః ఆదిః**

ఇవే పోలికలను గౌడపాదాచార్యులవారు వేరే వరుసక్రమంలో చెబుతున్నారు.

**ఆదిసామాన్యమ్** – సామాన్యం అంటే సమాన ధర్మం. ఆది అంటే మొట్టమొదటిది. అకారం మొదటి అక్షరం. విరాట్ మొదట పుట్టాడు.

**ఉత్కటమ్** – ఈ సమానధర్మాన్ని గుర్తు తెచ్చుకోవాలి ఉపాసకుడు.

**ఆప్తిసామాన్యమేవ చ** – రెండవ సమానధర్మం ఆప్తి అ అక్షరం సర్వాధారం, విరాట్ సర్వవ్యాపకం.

ఫలం తర్వాత వస్తుంది.

### కారిక 1.20

**తైజసస్యోత్వవిజ్ఞాన ఉత్కర్షో దృశ్యతే స్ఫుటమ్ ।**
**మాత్రాసంప్రతిపత్తౌ స్యాదుభయత్వం తథావిధమ్ ॥**

బి) **ఉకార – తైజస/హిరణ్యగర్భ ఐక్య ఉపాసన** – ఉపనిషత్తుయొక్క పదవ మంత్రంలో చూసిన ఉకార, హిరణ్యగర్భ ఐక్య ఉపాసనే ఇక్కడ గౌడపాదాచార్యులవారు వివరిస్తున్నారు.

**మాత్రాసంప్రతిపత్తౌ** – మాత్ర, పాద ఐక్య ఉపాసన చేస్తే.

**తైజసస్య ఉత్వవిజ్ఞానే** – తైజసను ఉకారంతో పోల్చింది ఉపనిషత్తు. విజ్ఞానే అంటే ఉపాసన. తైజస అంటే తైజస–హిరణ్యగర్భ జంటను తీసుకోవాలి. ఉకారం అంటే అక్షరమాలలో వచ్చే మామూలు 'ఉ' కాదు, ఓంకారంలోని ఉకార మాత్ర.

పదవ మంత్రంలో ఈ రెండింటి మధ్య చెప్పిన పోలికలను ముందు గుర్తు తెచ్చుకోవాలి.

ఉత్కర్షాదుభయత్వాద్ వా – ఉత్కర్షః, ఉభయత్వమ్. ఇంచుమించు ఇవే పదాలను వాడుతున్నారు గౌడపాదాచార్యులవారు.

**ఉత్కర్షో దృశ్యతే స్ఫుటమ్** – ఉకారం, అకారంకన్నా ఎక్కువ. ఓమ్ పదాన్ని ఉచ్చరించేటప్పుడు అకారం, ఉకారంతో లయమవుతుంది. అలాగే హిరణ్యగర్భ విరాట్‌కన్నా ఎక్కువ. దానికి రెండు కారణాలు చూశాము. సూక్ష్మం ఎప్పుడూ స్థూలంకన్నా శ్రేష్ఠం. సూక్ష్మం కారణమైతే, స్థూలం కార్యం అవుతుంది. అంతేకాదు విరాట్ హిరణ్యగర్భనుంచి ఉద్భవించాడు, ప్రళయంలో హిరణ్యగర్భలోనే లయమవుతాడు. ఈ విధంగా శ్రేష్ఠత్వం ఒక పోలిక అని స్పష్టంగా తెలుస్తున్నది.

**ఉభయత్వం తథావిధమ్** – అదే విధంగా ఉభయత్వం అనే పోలిక కూడా స్పష్టంగా తెలుస్తున్నది. ఉ అక్షరం అ, మ ల మధ్యలో ఉంది. హిరణ్యగర్భ విరాట్, ఈశ్వరుల మధ్యలో ఉన్నాడు. వీటిమీద ఉపాసన చేయాలి.

ఫలం తర్వాత వస్తుంది.

**కారిక 1.21**

**మకారభావే ప్రాజ్ఞస్య మానసామాన్యముత్కటమ్ ।**
**మాత్రాసంప్రతిపత్తౌ తు లయసామాన్యమేవ చ ॥**

సి) **మకార – ప్రాజ్ఞ/ఈశ్వర ఐక్య ఉపాసన** – ఉపనిషత్తుయొక్క పదకొండవ మంత్రంలో చూసిన మకార ఈశ్వర ఐక్య ఉపాసనని ఇక్కడ గౌడపాదాచార్యులవారు వివరిస్తున్నారు.

**మాత్రాసంప్రతిపత్తౌ** – మాత్ర, పాద ఐక్య ఉపాసన చేస్తే.

**మకారభావే ప్రాజ్ఞస్య** – ప్రాజ్ఞను మకారంతో పోల్చింది ఉపనిషత్తు. ప్రాజ్ఞ అంటే ప్రాజ్ఞ–ఈశ్వర జంటను తీసుకోవాలి. అంటే మొత్తం కారణప్రపంచం వస్తుంది. ఉపనిషత్తు పదకొండవ మంత్రంలో చెప్పిన పోలికలను ముందు గుర్తు తెచ్చుకోవాలి.

మితేరపీతేః వా – మితిః, అపీతిః

ఇక్కడ కూడా గౌడపాదాచార్యులవారు అవే పోలికలను తీసుకున్నారు కాని వాడిన పదాలు వేరే.

**మానసామాన్యముత్కటమ్** – మానం అంటే కొలమానం. అక్కడ దీన్నే మితిః అని చూశాము. మానం అన్నా, మితి అన్నా కుంచం అనే అర్థం. మనం మాట్లాడినప్పుడు పదాలు వ్యక్తమయితే, నోరు మూసినప్పుడు పదాలు అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయి. అలాగే ఈశ్వరుణ్ణుంచి జగత్తు వ్యక్తమవుతుంది, మళ్ళీ అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది; మళ్ళీ సృష్టి జరిగినప్పుడు వ్యక్తమవుతుంది. సామాన్యం అంటే సమానలక్షణం; ఉత్కటం అంటే స్పష్టంగా తెలుస్తుంది. ఈ పోలిక చాలా స్పష్టంగా ఉంది.

**లయసామాన్యమేవ చ** – అలాగే రెండింటిలోను సమానంగా ఉన్న ధర్మం లయ. ఉపనిషత్తు అపీతిః అని వాడింది. దాని అర్థం లయ. మకారంలో పదాలన్నీ లయమవుతాయి. ఈశ్వరునిలో ప్రపంచాలన్నీ లయమవుతాయి. అంటే మకారంలో శబ్దప్రపంచం లయమయితే, ఈశ్వరునిలో అర్థప్రపంచం లయమవుతుంది.

అన్నీ చాలా ముఖ్యమైన అంశాలు – సైన్సు పదార్థాన్ని కొత్తగా సృష్టించలేము, నాశనం చేయలేము అని చెబుతుంది. ఇదే సూత్రాన్ని మాండూక్యోపనిషత్తు చాలా సునాయాసంగా చెబుతున్నది. స్థూల, సూక్ష్మ ప్రపంచాలు నాశనమవవు; అవి అవ్యక్తంలోకి వెళతాయి అంటున్నది ఉపనిషత్తు. కారణప్రపంచం వాటికి లయస్థానం. ఫలం ఇక్కడ చెప్పలేదు.

***గమనిక*** – ఇక్కడొక విషయాన్ని గమనించాలి. అకార మాత్ర గురించి చెప్పినప్పుడు, అకారం తక్కిన అక్షరాలకు ఉపాదానకారణం అని చూశాము. ఉపాదానకారణమే సృష్టి

కారణమూ, లయకారణమూ కూడా అవాలి. కుండ మట్టినుంచి వచ్చి, మట్టిలోనే లయమవుతుంది. అలా అక్షరాలన్నీ అ నుంచి వచ్చి అ లోనే లయమవాలి.

ఇక్కడేమో మ లయస్థానం అంటున్నాము. అది పరస్పర విరుద్ధంగా లేదా? నిజానికి లోతుగా విశ్లేషిస్తే లేదు. సాంకేతికంగా చూస్తే అ లయస్థానం కూడా. కాని అక్షరాలు పలికేతీరు చూస్తే, మ అక్షరం పలికినప్పుడు నోరు మూస్తాము. అంటే మ అక్షరం లయస్థానం అయినట్టు అవుతుంది. అంతేకాదు, ఇక్కడ మనం చూస్తున్న సందర్భం కూడా చూడాలి. ఓంకార విచారణ చేస్తున్నాము. ఓం పదంలో అ+ఉ+మ మాత్రలు ఉన్నాయి. ఓం పలికేటప్పుడు అ, ఉ లోనూ, ఉ, మ లోనూ లయమవుతాయి. ఈ సూక్ష్మభేదాన్ని గమనించాలి.

## కారిక 1.22

**త్రిషు ధామసు యస్తుల్యం సామాన్యం వేత్తి నిశ్చితః ।**
**స పూజ్యస్సర్వభూతానాం వంద్యశ్చైవ మహామునిః ॥**

ఉపాసనలు జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇస్తాయి, దాని తర్వాత జ్ఞానం పొందాలని శాస్త్రంలో పదేపదే వస్తుంది. అందువల్ల ఉపాసన మంద, మధ్యమ అధికారులకు అనీ, ఓంకార విచారణ ఉత్తమ అధికారులకు అనీ చూశాము. కాని ఉపాసకుడు ఆ మాట వింటే చిన్నబుచ్చుకోవచ్చు. అందువల్ల ఇక్కడ గౌడపాదాచార్యులవారు ఉపాసకునియొక్క ఆత్మగౌరవాన్ని పెంచుతున్నారు. ఈ కారికల్లో ఉపాసకుణ్ణి కీర్తిస్తున్నారు.

**యః నిశ్చితః వేత్తి** – ఏ ఉపాసకుడైతే ఈ మూడు ఉపాసనలయొక్క సమానధర్మాన్ని నిశ్చయంగా తెలుసుకుంటాడో,

**తుల్యం సామాన్యం వేత్తి** – ప్రతి ఒక్క ఉపాసనలోనూ ఉన్న రెండేసి సమానధర్మాలను తెలుసుకుంటాడో,

**త్రిషు ధామసు** – ధామః అంటే అవస్థ. మూడు ఉపాసనలు మూడు అవస్థలకు చెందినవని తెలుసుకుంటాడో,

| | | |
|---|---|---|
| అకార | – విశ్వ/విరాట్ ఐక్య ఉపాసన | – జాగ్రదావస్థ |
| ఉకార | – తైజస/ హిరణ్యగర్భ ఐక్య ఉపాసన | – స్వప్నావస్థ |
| మకార | – ప్రాజ్ఞ/ఈశ్వర ఐక్య ఉపాసన | – సుషుప్తి అవస్థ |

**స పూజ్యస్సర్వభూతానాం (భవతి)** – ఈ ఉపాసకుడు అందరిచేత పూజింపబడతాడు అంటే మన్ననలు అందుకుంటాడు. ఉపాసకుడే అంత మన్ననలు అందుకుంటే, ఇంక జ్ఞాని గురించి వేరే చెప్పాలా?

**వంద్యశ్చైవ** – నమస్కారాలు పొందుతాడు. అందువల్లనే మన సాంప్రదాయంలో ఉపాసకులను గౌరవిస్తారు.

**మహామునిః** – ముని అంటే ఉపాసకుడు. మననాత్ మునిః ఇతి ఉచ్యతే.

టూకీగా చూస్తే – ఈ మూడు ఐక్య ఉపాసనలు చేసిన ఉపాసకుడు పూజ్యనీయుడు, గొప్ప ముని.

**కారిక 1.23**

**అకారో నయతే విశ్వముకారశ్చాపి తైజసమ్ ।**
**మకారశ్చ పునః ప్రాజ్ఞం నామాత్రే విద్యతే గతిః ॥**

ఇంతకముందే చూసినట్టుగా, ఈ ఉపాసనలను రెండురకాలుగా చేయవచ్చు. సకామ ఉపాసన, నిష్కామ ఉపాసన. నిష్కామ ఉపాసనలో ఫలం – సాధకుడు ఓంకార విచారణకు సిద్ధం అయి, జ్ఞానం పొంది, నేను తురీయాన్ని అని నేర్చుకుంటాడు. జ్ఞానానికీ, తద్వారా మోక్షానికీ రావటం ఇష్టం లేని వ్యక్తి సకామ ఉపాసకునిగా ఉపాసన చేయవచ్చు.

సకామ ఉపాసనకు మళ్ళీ రెండు రకాల ఫలం వస్తుంది. ఇహలోక ఫలం, పరలోక ఫలం. ఉపనిషత్తు ఇహలోక ఫలం ఇస్తే, గౌడపాదాచార్యులవారు ఈ కారికలో పరలోక ఫలాన్ని గురించి చెబుతున్నారు. పరలోక ఫలం అంటే మరణించాక పొందే ఫలం అని మర్చిపోకూడదు.

**అకారో నయతే విశ్వమ్** – అకారః అంటే అకార –విశ్వ/విరాట్ ఐక్య ఉపాసన. అకారం అంటే విడిగా అ అక్షరం అని తీసుకోకూడదు. ఇది చతుర్మాత్రా ఓంకారంలోని అకార మాత్ర. అందువల్ల అకారం అంటే అకార ప్రధాన ఓంకార ఉపాసన అని అర్థం. శంకరాచార్యులవారు ఈ ఉపాసన ఎలా చేయాలో చెప్పరు. ఎందుకంటే ఆయనకు మనం ఇక్కడే ఆగిపోవటం ఇష్టంలేదు. మనం జ్ఞానానికి రావాలని ఆయన తపన.

విశ్వం నయతే అంటే ఈ ఉపాసన చేసిన వ్యక్తి విశ్వంలో లయమవుతాడు. విశ్వంలో లయమవుతాడు అంటే విరాట్‌లో ఐక్యమవుతాడు. ఎలాగైతే అల సముద్రంలో లయం అవుతుందో, అలా వ్యష్టి ఉపాసకుడు మరణానంతరం విరాట్‌లో ఐక్యం అవుతాడు. తాత్కాలికంగా వ్యష్టి హోదా పోతుంది. ఎన్నాళ్ళు? పుణ్యఫలం ముగిసేదాక, విరాట్‌లో ఐక్యాన్ని అనుభవిస్తాడు. విరాట్‌తో ఐక్యం పరలోక ఫలం.

**ఉకారః** – మళ్ళీ విడిగా ఉకార అక్షరంమీద కాదు, ఉకార ప్రధాన ఓంకార ఉపాసన అని అర్థం చేసుకోవాలి. అది కూడా ఉకార – తైజస/హిరణ్యగర్భ ఐక్యఉపాసన చేసిన వ్యక్తి, మరణానంతరం పొందే ఫలం,

**తైజసమ్ (నయతే)** - తైజసం అంటే హిరణ్యగర్భతో ఐక్యం. అది కూడా మరణించాక.
**మకారః -** మళ్ళీ విడిగా మకార అక్షరంమీద కాదు, మకార ప్రధాన ఓంకార ఉపాసన అని అర్థం చేసుకోవాలి. అది కూడా మకార - ప్రాజ్ఞ/ఈశ్వర ఐక్యఉపాసన చేసిన వ్యక్తి, మరణానంతరం పొందే ఫలం,

**ప్రాజ్ఞమ్ (నయతే)** - ప్రాజ్ఞ అంటే ఈశ్వరునితో ఐక్యం. దీని ఫలం ఈశ్వరునితో ఐక్యం. అది కూడా మరణించాక.

జ్ఞాని కూడా ఈశ్వరునిలో లయమవుతాడు, ఉపాసకుడు కూడా ఈశ్వరునిలో లయమవుతాడు, కాని ఈ రెండింటి మధ్య సూక్ష్మభేదం ఉంది. జ్ఞాని లయం శాశ్వతం. అతనికి పునర్జన్మ లేదు. విదేహముక్తి పొందుతాడు. కాని ఉపాసకుని లయం పుణ్యం ఉన్నంతవరకే. అది క్షీణించిపోగానే మళ్ళీ తిరిగివస్తాడు.

నాలుగవ మాత్ర, నాలుగవ పాదంయొక్క ఐక్యం గురించి మనం ఉపనిషత్తు చెప్పింది చూడలేదు, గౌడపాదాచార్యులవారు కూడా చెప్పలేదు. కాని ఇక్కడ వరుస ఫలాల్లో భాగంగా ఈ ఐక్యంయొక్క ఫలం గురించి కూడా చెబుతున్నారు. ఆ ఫలం చెప్పటంవల్ల ఇంకొక ప్రయోజనం, దీనికీ తక్కిన మూడు ఫలాలకూ మధ్య భేదం తెలుస్తుంది.

**నామాత్రే విద్యతే గతిః** - ఈ జ్ఞానికి మరణం తర్వాత ప్రయాణం లేదు. అతని సూక్ష్మ, కారణ శరీరాలు సూక్ష్మ కారణ ప్రపంచాలలో కలిసిపోతాయి. నామాత్రే పదాన్ని న+ అమాత్ర అని విడదీయాలి. అమాత్ర ఐక్య జ్ఞానికి ప్రయాణం లేదు.

ఇప్పుడు ఉపనిషత్తు చెప్పిన ఫలాలను, గౌడపాదాచార్యులవారు చెప్పిన ఫలాలను టూకీగా చూద్దాము.

| | | |
|---|---|---|
| అ-విశ్వ/విరాట్ | ఆప్నోతి సర్వాన్ కామాన్ ఆదిశ్చ భవతి | నయతే విశ్వమ్ |
| ఉ-తైజస/హిరణ్యగర్భ | ఉత్కర్షతి సమానశ్చ భవతి | (నయతే) తైజసమ్ |
| మ-ప్రాజ్ఞ/ఈశ్వర | అపీతిశ్చ భవతి మినోతి ఇదం సర్వమ్ | (నయతే) ప్రాజ్ఞమ్ |

(ఇదంతా **పట్టిక 9 - మంత్రాలు 9-12, కారికలు 19-24 ఓంకార ఆత్మ ఐక్య ఉపాసన- ఫలములో** ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు)

## విచారణ చేయటమెలా?

ఎవరైనా ఈ మూడు ఉపాసనలనో, లేదా వేరే ఏదైనా ఉపాసననో చాలాకాలం పాటు చేసి, చిత్తఏకాగ్రత పొంది, జ్ఞానయోగ్యతాప్రాప్తిని పొందారనుకుందాము. కాని ఆత్మవిచారణ ఎలా చేయాలో తెలియకపోతే ఎలా? అందువల్ల ఇప్పుడు విచారణ ఎలా చేయాలో చూద్దాము. దీన్ని నాలుగు దశల్లో చూద్దాము.

**దశ 1** – సాధారణంగా ప్రతి పదార్థానికీ ఒక పేరు ఉంటుంది. పేరును పదం అంటారు. ప్రతి పేరూ, ఒక పదార్థాన్ని సూచిస్తుంది. అందువల్ల ఎన్ని పదార్థాలుంటే, అన్ని పేర్లు ఉంటాయి. మనకు తెలిసిన పద్ధతి ఇది. కాని ఇక్కడ వేదాంతం ఈ సత్యాన్ని కొంచెం లోతుగా విశ్లేషించమంటున్నది.

ఇప్పుడు మనం మూడు పదాలను తీసుకుందాము. అవి గాజు, గొలుసు, ఉంగరము. మనకు తెలిసినదాన్నిబట్టి, ఒక్కొక్క పదానికీ ఒక్కొక్క పదార్థం ఉండాలి కదా! కుడివైపు మూడు పదార్థాలను తీసుకుందాము. అవి గాజు పదార్థం, గొలుసు పదార్థం, ఉంగరం పదార్థం.

**బంగారము – ఆభరణముల విశ్లేషణ**

| **పదం** | **పదార్థం** |
|---|---|
| గాజు | గాజు |
| గొలుసు | గొలుసు |
| ఉంగరం | ఉంగరం |

**దశ 2** – ఇప్పుడు ఈ ఉన్న పదాలు – పదార్థాలకు బంగారం అనే పదం కలుపుదాము. ఇటు నాలుగు పదాలు వచ్చాయి కాని అటు మూడే పదార్థాలు ఉన్నాయి. బంగారానికి పదార్థమేదో వెతకాలి.

| **పదం** | **పదార్థం** |
|---|---|
| గాజు | గాజు |
| గొలుసు | గొలుసు |
| ఉంగరం | ఉంగరం |
| బంగారం | ? |

ఇది దశ 2.

**దశ 3** – లోతుగా విశ్లేషిస్తే గాజు దేనితో చేయబడింది? బంగారంతో! గొలుసు దేనితో చేయబడింది? బంగారంతో! ఉంగరం దేనితో చేయబడింది? బంగారంతో! ఈ బంగారాన్ని

తీసి, గొలుసు ఇవ్వండి అనగలమా? అనలేము. అంటే బంగారం లేకుండా గాజుకు కాని, గొలుసుకు కాని, ఉంగరానికి కాని విడిగా ఉనికి లేదు. విడిగా ఉనికి లేనిదాన్ని మిథ్య అంటారు. అది ఉన్నా లేనట్టే. ఇప్పుడు వీటిని మళ్ళీ చూద్దాము.

| **పదం** | **పదార్థం** |
|---|---|
| గాజు | బంగారం (గాజు ×) |
| గొలుసు | బంగారం (గొలుసు ×) |
| ఉంగరం | బంగారం (ఉంగరం ×) |
| బంగారం | |

పదార్థత్రయ నిషేధః. అంటే పదార్థాలను నిషేధించాము.

ఇది దశ 3.

**దశ 4** – మళ్ళీ పదాలు, పదార్థాలను చూస్తే, అక్కడ మనకు మూడు పదార్థాలు లేవు. ఉన్నదొక్కటే పదార్థం. అది బంగారం. ఎప్పుడైతే పదార్థాలను నిషేధించామో, అప్పుడే వాటిని పేర్కొనే పదాలకు విలువ లేదు. అంటే వాటికి కూడా ఉనికి లేదు.

| **పదం** | **పదార్థం** |
|---|---|
| గాజు × | × |
| గొలుసు × | × |
| ఉంగరం × | × |
| బంగారం ✓ | బంగారం ✓ |

పదత్రయ నిషేధః. ఇప్పుడు పదాలను కూడా నిషేధించాము.

ఇది దశ 4.

**దశ 5** – ముందు పదార్థాలను నిషేధించాము. పదార్థాలు లేకపోతే పదాలకు కూడా ఉనికి లేదు కాబట్టి తరువాత పదాలను కూడా నిషేధించాము. ఇంక మిగిలింది ఏమిటి? మిగిలింది ఒకటే. అధిష్ఠానమైన బంగారం. ఇది దశ 5.

ఇప్పుడు ఇదే సూత్రాన్ని తీసుకుని, పదం స్థానంలో మాత్ర, పదార్థం స్థానంలో ప్రపంచం పెడదాము.

| **మాత్ర** | **ప్రపంచం** |
|---|---|
| అకార మాత్ర | స్థూల ప్రపంచం |
| ఉకార మాత్ర | సూక్ష్మ ప్రపంచం |
| మకార మాత్ర | కారణ ప్రపంచం |

ఇది దశ 1. ఇప్పుడు దశ 2లో తురీయాన్ని పరిచయం చేస్తాము. తురీయాన్ని ఎక్కడ పెట్టాలి?

దశ 3లో తురీయం లేకుండా ప్రపంచాలకు విడిగా ఉనికి లేదు. అందువల్ల ప్రపంచాలను నిషేధిస్తాము. ప్రపంచత్రయ నిషేధః. అంటే మూడు ప్రపంచాలను నిషేధిస్తాము. దశ 4లో ప్రపంచాలు లేకపోతే వాటిని సూచించే అ, ఉ, మ లకు ఉనికి లేదు. వాటిని కూడా నిషేధిస్తాము. మాత్రత్రయ నిషేధః అంటే మూడు మాత్రలను నిషేధిస్తాము. మూడు మాత్రలను నిషేధిస్తే మిగిలేది ఏమిటి? అమాత్ర. అమాత్ర = తురీయం. ఇది దశ 5.

ఈ విధంగా మూడు మాత్రలయొక్క సత్యం అమాత్ర మాత్రమే అని, దానికి చేరుకోవాలి. అది మంత్రం 12లో చూస్తాము.

ఇప్పుడు మళ్ళీ కారిక 23 నుంచి ఉపనిషత్‌యొక్క మంత్రం 12కి వెళతాము.

## మంత్రం 12

**అమాత్రశ్చతుర్థో౽ వ్యవహార్యః ప్రపంచోపశమశ్శివో౽ ద్వైత ఏవమోంకార**
**ఆత్మైవ సంవిశత్యాత్మనా౽ ౽ త్మానం య ఏవం వేద ॥**

చతుష్పాద ఆత్మవిచారణలో (మంత్రాలు 3–7) ప్రపంచత్రయాన్ని నిషేధించటం ద్వారా, ప్రపంచత్రయ అధిష్ఠానం తురీయం అని తెలుసుకున్నాము. అలాగే, ఇప్పుడు మాత్రత్రయాన్ని నిషేధించటంవల్ల అమాత్రను చేరుకున్నాము. అమాత్ర అంటే ఓంకారం పలికాక, వచ్చే నిశ్శబ్దం. ఈ నిశ్శబ్దాన్ని అమాత్ర అని ఎందుకంటారంటే, దీనికి సరిహద్దులు లేవు. అకార, ఉకార, మకారానికి సరిహద్దులు ఉన్నాయి. అమాత్రకు ఈ మంత్రంలో వచ్చిన నిర్వచనం, ఇంచుమించు తురీయానికి ఏడవ మంత్రంలో వచ్చిన నిర్వచనంతో సరిపోలుతుంది.

**అదృష్టమవ్యవహార్యమగ్రాహ్యమలక్షణమచింత్యమవ్యపదేశ్యమేకాత్మప్రత్యయసారం**
**ప్రప్రంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః॥**

– మంత్రం 7

అంటే ఓంకారంయొక్క సత్యమైన అమాత్ర, జగత్తుయొక్క సత్యమైన తురీయమే.

**అమాత్రశ్చతుర్థః** – తురీయం ఎలాగైతే చతుష్పాద ఆత్మయొక్క నాలుగవ పాదమో, అలా అమాత్ర చతుర్మాత్ర ఓంకారంయొక్క నాలుగవ మాత్ర.

**అవ్యవహార్యః** – అవ్యవహార్యః అంటే వ్యవహారాలకు అతీతం. తురీయం గురించి ఎలా మాట్లాడలేమో, అలాగే నిశ్శబ్దం గురించి కూడా మాట్లాడలేము. నిశ్శబ్దం గురించి మాట్లాడటం అనేదే పరస్పర విరోధంగా ఉంది. ఒక వ్యక్తి నోరువిప్పి మాట్లాడితే, అతను ఏ భాష మాట్లాడుతున్నాడో చెప్పవచ్చు. ఒక గదిలో నలుగురు కూర్చుని నాలుగు దక్షిణ భారతీయ

భాషలు మాట్లాడుతుంటే, ఇదిగో ఇతను మాట్లాడుతున్నది తెలుగు, ఇతను మాట్లాడుతున్నది తమిళం అని చెప్పవచ్చు. కాని వారు మాటలు ఆపేసి నిశ్శబ్దంగా కూర్చుంటే, ఇది తమిళ నిశ్శబ్దం, ఇది తెలుగు నిశ్శబ్దం అని భేదాలు చూపించగలరా? అందువల్ల నిశ్శబ్దం అవ్యవహార్యం.

**ప్రపంచోపశమమ్** – ప్రపంచరహితం. తురీయంలో పదార్థప్రపంచాన్ని నిషేధిస్తే, అమాత్రలో పదప్రపంచాన్ని నిషేధిస్తాము. పదార్థప్రపంచం అంటే వస్తువులతో కూడిన ప్రపంచం లేదా రూపప్రపంచం; పదప్రపంచం అంటే పేర్లతో కూడిన ప్రపంచం లేదా నామప్రపంచం. రూపప్రపంచం లేకపోతే, నామప్రపంచానికి చోటేది? పదార్థాలు లేకపోతే, వాటిని చూపించే పదాలు అవసరం లేదు. నిఘంటువు అవసరమే లేదు.

**శివః** – అందువల్ల మంగళకరం. ఏదైనా మాట్లాడితేనే, సమస్య వస్తుంది. అందువల్లనే ఇంగ్లీషులో స్పీచ్ ఈజ్ సిల్వర్, సైలెన్స్ ఈజ్ గోల్డెన్ అంటారు. వాక్కు వెండి, నిశ్శబ్దం బంగారం. అందువల్ల నిశ్శబ్దం ఎప్పటికీ ఆనందస్వరూపం.

**అద్వైతః** – రెండవది లేనిది.

ఈ పదాలన్నీ ఇలాగే తురీయ నిర్వచనంలో చూశాము.

**ఏవమోంకార ఆత్మైవ** – ఈ విధంగా ఓంకారం, ఆత్మ నూటికి నూరుపాళ్ళు ఒకటే. ఓంకారంయొక్క నాలుగు మాత్రలు, ఆత్మయొక్క నాలుగు పాదాలకు అతికినట్లుగా సరిపోతాయి.

**చతుర్మాత్రా ఓంకార చతుష్పాత్ ఆత్మైవ**

**సంవిశత్యాత్మనా౽౽త్మానం య ఏవం వేద** – ఎవరైతే ఈ విధంగా తెలుసుకుంటాడో, అతను తన స్వరూపంలో ప్రవేశిస్తాడు.

ఎవరైతే తను విశ్వ కాదు, తైజస కాదు, ప్రాజ్ఞ కాదు, తను తురీయం అని అర్థం చేసుకుంటాడో, అతను తురీయంలో ఐక్యమవుతాడు.

**తురీయజ్ఞానేన తురీయః భవతి**

తన స్వరూపం గురించి ఏడు, పన్నెండు మంత్రాల్లో చూసిన నిర్వచనాలు అర్థం చేసుకుంటే, తన స్వరూపంలో నిలుస్తాడు.

ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. అమాత్ర అంటే నిశ్శబ్దం అన్నాము. నిశ్శబ్దం అంటే శబ్దం లేకపోవటం అనే మామూలు అర్థం కాదు. శబ్దం లేకపోతే, దానికి ఉనికి కూడా ఉండదు. అప్పుడు సత్యం అంటే అసత్ అయిపోతుంది. అందువల్ల ఈ నిశ్శబ్దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. నిశ్శబ్దం అంటే శబ్దం లేదని తెలియజెప్పే చైతన్యం. ఓంకారం

అంటే శబ్దం లేకపోవటం కాదు, చైతన్యస్వరూపం. ఆ చైతన్యంవల్లనే శబ్దం లేదని చెప్పగలుగుతున్నాము. ఈ నిశ్శబ్దచైతన్యమే నాలుగవ మాత్ర.

అమాత్రయొక్క ఇంకొక ప్రత్యేకత – అది శబ్దంలోనూ ఉంటుంది. కేవల నిశ్శబ్దం అ, ఉ, మ లలో ఉండదు. ఎందుకంటే శబ్దం ఉన్నచోట నిశ్శబ్దం ఉండలేదు. కాని దీని ప్రత్యేకత, ఈ నిశ్శబ్దం అ, ఉ, మ లలో కూడా ఉంటుంది. అందువల్ల అమాత్ర అంటే చైతన్యతత్త్వంగా అర్థం చేసుకోవాలి. ఆ చైతన్య అమాత్ర వేరే ఏదో కాదు, ఏడవ మంత్రంలో నేర్చుకున్న తురీయమే. తురీయం అంటే చైతన్యరూప నిశ్శబ్దం. ఇది అర్థం చేసుకోవాలి. ఈ ఫలశ్రుతిలో ఉపనిషత్తు చతుర్మాత్ర ఓంకార విచారణను కూడా ముగిస్తున్నది.

ఇంతవరకూ ఉపనిషత్తు సారాంశం టూకీగా చూస్తే –

| | |
|---|---|
| 3–7 చతుష్పాద ఆత్మవిచారణ | – అధిష్ఠాన తురీయజ్ఞానం |
| 8–12 చతుర్మాత్ర ఓంకార విచారణ | – అధిష్ఠాన అమాత్ర జ్ఞానం |
| అధిష్ఠాన తురీయం | = అధిష్ఠాన అమాత్ర |

రెండు విచారణలు చేసినట్టు ఉన్నా, రెండూ చేరేది ఒక లక్ష్యానికే. అది తురీయచైతన్యానికి. ఆ తురీయం నేను అనే జ్ఞానానికి.

(ఇదంతా **పట్టిక 8 – మంత్రాలు 9–12 ఓంకార ఆత్మ ఐక్య ఉపాసనలో** ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు)

ఈ చైతన్యతత్త్వమే ప్రపంచం ఉన్నా, లేకపోయినా సాక్షిగా చూస్తుంది. ఈ చైతన్యమే ఓంకార శబ్దమున్నా లేకపోయినా సాక్షిగా చూస్తుంది. రెండు చైతన్యాలు లేవు. ఉన్నదొకటే చైతన్యం.

ఇక్కడితో ఉపనిషత్ భాగం అయిపోయింది. ఈ మంత్రం 12 విశ్లేషణను గౌడపాదాచార్యులవారు కారికలు 24–29లో చేస్తున్నారు. అందువల్ల ఇప్పుడు మనం మళ్ళీ ఉపనిషత్ మంత్రం 12నుంచి కారిక 24లోకి అడుగుపెడుతున్నాము.

## కారిక 1.24

**ఓంకారం పాదశో విద్యాత్పాదా మాత్రా న సంశయః ।**
**ఓంకారం పాదశో జ్ఞాత్వా న కించిదపి చింతయేత్ ॥**

ఈ కారికలో గౌడపాదాచార్యులవారు మొత్తం ఓంకార విచారణ సారాంశం చెప్పి, దాని ఫలం చెబుతున్నారు.

**ఓంకారం పాదశో విద్యాత్** – ఓంకారాన్ని ఈ విధంగా నాలుగు పాదాల ఆత్మతో కలిపి వివరంగా తెలుసుకోవాలి. ఎందుకు?

**పాదా మాత్రా న సంశయః** – ఆత్మయొక్క ప్రతి ఒక్క పాదమూ, ఓంకారంయొక్క ప్రతి ఒక్క మాత్రతో సమానం. ఇందులో ఏమీ సందేహం లేదు.

**ఓంకారం పాదశో జ్ఞాత్వా** – ఈ విధంగా ఎవరైతే చతుష్పాద ఆత్మ – చతుర్మాత్ర ఓంకారం గురించి స్పష్టంగా తెలుసుకుంటారో, అతను,

**న కించిదపి చింతయేత్** – ఇంక వేరే ఏ విషయం గురించీ ఆలోచించకూడదు. తన స్వస్వరూపంలోనే నిలవాలి. ఆత్మవిచారణ ద్వారా తను తురీయచైతన్యం అని అర్థం చేసుకుని; ఓంకారవిచారణ ద్వారా నిశ్శబ్దం చైతన్యం అని తెలుసుకుని, ఈ చైతన్యమే తురీయం అని, తన స్వస్వరూపం తురీయచైతన్యం అని అర్థం చేసుకుని అందులో నెలకొని ఉండాలి.

(ఇదంతా **పట్టిక 9 – మంత్రాలు 9–12, కారికలు 19–24 ఓంకార ఆత్మ ఐక్య ఉపాసన– ఫలములో** ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు)

దయానందస్వామీజీ ఒకే మంత్రాన్ని ఉపాసనకూ, నిదిధ్యాసనకూ ఎలా వాడవచ్చో చాలా చక్కగా వివరిస్తారు. గృహస్థు 'ఓం' ఒక్కటే చేయకూడదు, దానితోపాటు ఏదైనా మంత్రం కలుపుకోవాలి అంటారు. ఉదాహరణకు **ఓం నమో నారాయణాయ** తీసుకున్నారు పూజ్య స్వామీజీ.

**ఓం నమో నారాయణాయ** జపిస్తూ పోతే అది ఉపాసన అవుతుంది. అక్కడ మంత్రంమీద మీరు శ్రద్ధ చూపుతున్నారు.

ఇప్పుడు ఈ మాండూక్యోపనిషత్తు, ఈ కారికలూ అయ్యాక మీరు ఉపాసన కాకుండా, విచారణకు రండి. అదెలా చేయాలి? ఓం నమో నారాయణాయ ఉపాసనగా చేస్తే వెంట వెంటనే జపిస్తూ పోతారు. అదే విచారణకు వస్తే, నామం మొదటిసారి జపించి, మళ్ళీ రెండవసారి జపించే ముందు వచ్చే నిశ్శబ్దాన్ని గమనించాలి. ఆ నిశ్శబ్దాన్ని గమనించటానికి రెండింటి మధ్య దూరం పెంచుకుంటూ పోవాలి. ఆ నిశ్శబ్దాన్ని గమనిస్తున్నది ఒకటి ఉందని తెలుసుకోండి. ఆ గమనిస్తున్నదే చైతన్యం. అక్కడితో ఆగకూడదు. ఆ చైతన్యమే ఆత్మ విచారణలో నేర్చుకున్న తురీయం అని గుర్తు తెచ్చుకోండి. అలా చైతన్యాన్ని, తురీయంతో కలపకపోతే రెండు చైతన్యాలు ఉన్నాయనుకునే ప్రమాదం ఉంది. తురీయం అంటే అద్వైతం, ఉన్నదొక్కటే. తురీయానికి వచ్చాక –

**ప్రపంచోపశమమ్ శాంతం శివమద్వైతమ్** – మంత్రం 7

పదాలను గుర్తు తెచ్చుకోవాలి.

శబ్దం → నిశ్శబ్దం → చైతన్యం → తురీయం → అహమస్మి

అలా అవస్థాత్రయ తురీయ ఆత్మా అహమస్మి అనే జ్ఞానంలో నెలకొనివుంటే అది నిదిధ్యాసనం.

**కారిక 1.25**

**యుంజీత ప్రణవే చేతః ప్రణవో బ్రహ్మ నిర్భయమ్ ।**
**ప్రణవే నిత్యయుక్తస్య న భయం విద్యతే క్వచిత్ ॥**

4. **నిదిధ్యాసనం, ఫలం– కారికలు 25–29, మంత్రం 12 తర్వాత**

మాండూక్యోపనిషత్తును అధ్యయనం చేశాక, ఓంకారానికీ, ఆత్మకూ ఉన్న పోలికలమీద శిష్యుడు సాధన చేయాలి. ఇప్పుడు వచ్చే కారికలన్నీ ఓంకార ధ్యానకారికలు. ఇవి ఓంకారధ్యానంయొక్క ప్రాముఖ్యత గురించి చెబుతాయి.

**యుంజీత ప్రణవే చేతః** – మనస్సును ప్రణవంమీద ఏకాగ్రత చూపేలా చేయాలి. ఇప్పుడు ఓంకారాన్ని, ఆత్మను పోలుస్తూ నిదిధ్యాసనం చేయాలి. ఆత్మయొక్క మూడు పాదాలమీద బాగా దృష్టిపెట్టాలి ముందు. ప్రథమపాదం అనగానే, స్థూలప్రపంచం దృష్టిలోకి రావాలి. లేకపోతే అవి కేవలం అర్థంలేని పదాలు, పదార్థాలు అవుతాయి. అకారం అనగానే దానికి జోడీ అయిన జాగ్రత్ ప్రపంచం గుర్తుకురావాలి.

అదే విధంగా ఉకారం అనగానే మొత్తం సూక్ష్మప్రపంచం మీ దృష్టిలోకి రావాలి; మకారం పలకగానే మొత్తం కారణప్రపంచం మీ దృష్టిలోకి రావాలి. తురీయానికి వచ్చేసరికి ప్రపంచోపశమం జరగాలి.

ఇంతకుముందు బంగారం, ఆభరణాల ఉదాహరణ చూశాము. గాజు, గొలుసు, ఉంగరం పదార్థాలు అనుకుంటాము ముందు కాని, వాటిలో ఉన్నది బంగారం మాత్రమే అని అర్థమయ్యాక ఈ మూడు పదార్థాలూ ఎలా నిషేధిస్తామో, అలాగే తురీయాన్ని అర్థం చేసుకున్నాక, ఈ మూడు ప్రపంచాలను కూడా నిషేధిస్తాము. అది దశలవారీగా సాగుతుంది.

స్థూలప్రపంచంనుంచి సూక్ష్మప్రపంచానికి వస్తే, స్థూలప్రపంచాన్ని నిషేధిస్తాము; అప్పుడు దానికి జోడీ అయిన అకారానికి ఉనికి లేదు. పదార్థం లేకపోతే పదం లేదని చూశాము. అలా సూక్ష్మప్రపంచాన్ని–ఉకారాన్ని నిషేధించి కారణప్రపంచానికి రావాలి. కారణప్రపంచాన్ని–మకారాన్ని నిషేధించి తురీయం–అమాత్రలకు రావాలి.

తురీయం = అమాత్ర అని అర్థం చేసుకోవాలి. అప్పుడు పదార్థాలు ఉండవు, పదాలు ఉండవు. పదార్థాలకూ, పదాలకూ విలక్షణమైన తురీయచైతన్యమే ఉంటుంది. ఇదంతా

శ్రవణంలో నేర్చుకుని, అర్థం చేసుకున్నాక, నిదిధ్యాసనంలో ఈ దశలవారీగా మనస్సులో నిషేధించుకుంటూ వచ్చి, తురీయ చైతన్యంలో నిలబడాలి.

యుంజీత అంటే నిదిధ్యాసనం చేయుగాక.

**ప్రణవో బ్రహ్మ నిర్భయమ్** – ప్రణవం అంటే వేరే ఏదో కాదు. అది నిర్భయం బ్రహ్మ, నిర్గుణంబ్రహ్మ. నిర్భయం అంటే అభద్రతా భావనను పోగోట్టేది.

చతుర్మాత్ర ఓంకారంలోని అ,ఉ,మ మాత్రలు సగుణబ్రహ్మను సూచిస్తే, అమాత్ర నిర్గుణబ్రహ్మను సూచిస్తుంది. ఇంకోవిధంగా చెప్పాలంటే, ఓంకార శబ్దం సగుణబ్రహ్మ, నిశ్శబ్దం నిర్గుణబ్రహ్మ.

**ప్రణవే నిత్యయుక్తస్య** – ఇవన్నీ నిదిధ్యాసన శ్లోకాలు అని చూశాము. మాండూక్యోపనిషత్తును అర్థం చేసుకోవాలంటే నిదిధ్యాసనం పదేపదే చేయాలి. వేరే మార్గం లేదు.

ఎవరైతే ఓంకారంమీద ఎప్పుడూ ఏకాగ్రచిత్తంతో ఉంటాడో, అతను నిశ్శబ్దచైతన్యానికి రాగలుగుతాడు. అంటే ఓంకారశబ్దంనుంచి నిశ్శబ్దచైతన్యానికి రావాలి.

**న భయం విద్యతే క్వచిత్** – ఎప్పుడైతే అతను నిశ్శబ్దచైతన్యాన్ని అని అర్థం చేసుకుంటాడో, అప్పుడే అతనికి మృత్యుభయం కొంచెం కూడా ఉండదు. తను విశ్వ కాదు, తైజస కాదు, ప్రాజ్ఞ కాదు, వాటికి రాకపోకలు ఉన్నాయి కాని తను తురీయచైతన్యం. తనకు చావు, పుట్టుకలు లేవు. అందువల్ల ఈ నిదిధ్యాసనం చేస్తే మృత్యుభయం ఉండదు.

### కారిక 1.26

**ప్రణవో హ్యపరం బ్రహ్మ ప్రణవశ్చ పరస్స్మృతః ।**
**అపూర్వోఽనంతరోఽబాహ్యోఽనపరః ప్రణవోఽవ్యయః ॥**

**ప్రణవో హ్యపరం బ్రహ్మ** – ప్రణవమే సగుణబ్రహ్మ. అపరంబ్రహ్మ అంటే సగుణబ్రహ్మ.

**ప్రణవశ్చ పరస్స్మృతః** – ఓంకారం నిర్గుణబ్రహ్మ కూడా. ఒక్క ఓంకారం సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ ఎలా అవుతుంది? దానికి జవాబు ముందే చూశాము. ఓంకారంలోని అ,ఉ,మ మాత్రలు విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరులను సూచిస్తాయి. ఈ మూడు జంటలూ సగుణం. అమాత్ర–తురీయం నిర్గుణం. ఈ నిర్గుణబ్రహ్మ విశేషాలు ఏమిటి?

**ప్రణవః**– ప్రణవః అంటే అమాత్రరూప ప్రణవం. ఇంకో విధంగా చెప్పాలంటే నిశ్శబ్దచైతన్యం. అది,

**అనంతరోఽబాహ్యః** – అది లోపలా లేదు, బయటా లేదు. అంటే ఇంకొక చైతన్యం లేదు.

గొలుసు బంగారం లోపల ఉందా, బంగారం బయట ఉందా? అసలు గొలుసు ఉంటేనే కదా, లోపల ఉందా, బయట ఉందా అనే ప్రసక్తి వచ్చేది? ఏదో పదం వాడి, మనకు తెలియకుండా ఆ పదంలో ఇరుక్కుపోతాము.

ప్రపంచం బ్రహ్మలో బయట ఉందా, లోపల ఉందా? అసలు ప్రపంచం ఉంటేనే కదా, బయట ఉందా, లోపల ఉందా అనే ప్రసక్తి వచ్చేది అంటున్నది మాండూక్యోపనిషత్తు. గొలుసువంటిది ప్రపంచం కూడా. గొలుసు ఎలా లేదో, ప్రపంచం కూడా అలా నిజంగా లేదు.

అనంతరం అంటే చైతన్యం లోపల ఏ పదార్థం లేదు. అబాహ్యం అంటే చైతన్యం బయట ఏ పదార్థమూ లేదు. వేదాంతం ప్రకారం అసలు పదార్థమే లేదు. మరయితే ఏం ఉంది? చైతన్యం మాత్రమే ఉంది. మరయితే పదార్థం ఏమిటి? పదార్థం ఒక పదం మాత్రమే. మనకు తెలియకుండానే, ఆ పదం వాడి, ఆ పదంలో ఇరుక్కుపోతాము.

**అపూర్వః అనపరః** – పూర్వం అంటే కారణం; పరం అంటే కార్యం; అపూర్వం అంటే కారణం కాదు; అనపరం అంటే కార్యమూ కాదు. తురీయం కార్య, కారణ విలక్షణం. ఉనిపనిషత్ మొదటి ఐదు మంత్రాల్లో ఆత్మయొక్క మొదటి రెండు పాదాలు కార్యమనీ (విరాట్, హిరణ్యగర్భ); మూడవ పాదం కారణమనీ (ఈశ్వరుడు); నాలుగవ పాదం (తురీయం) కార్యకారణ విలక్షణమనీ చూశాము.

**కార్యకారణబద్ధౌ తావిష్యేతే విశ్వతైజసౌ**
**ప్రాజ్ఞఃకారణబద్ధస్తు ద్వౌ తౌ తుర్యే న సిద్ధ్యతః** – కారిక 11

ఇదే విషయాన్ని ఇందులో మళ్ళీ చూశాము. తురీయం కార్యకారణ విలక్షణం. ఎప్పుడైతే కార్యకారణ విలక్షణం అంటామో, అప్పుడే అది దేశకాలాతీతం కూడా.

**ప్రణవోఽ వ్యయః** – వికారాలు లేనిది, నిర్వికారం. అపక్షీయ రహితం అసలు అర్థం. అంటే అది కాలాతీతం అని అర్థం. ఈ కారిక అర్థం ప్రణవం సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ కూడా. నిర్గుణబ్రహ్మ కార్యకారణ విలక్షణం.

### కారిక 1.27

**సర్వస్య ప్రణవో హ్యాదిర్మధ్యమంతస్తథైవ చ ।**
**ఏవం హి ప్రణవం జ్ఞాత్వా వ్యశ్నుతే తదనంతరమ్ ॥**

మళ్ళీ ఒకసారి బంగారం దృష్టాంతానికి వెళదాము. ఆభరణం అంతటా ఉన్నది బంగారం మాత్రమే. నిజానికి బంగారం అందులో ఉండటంవల్లనే ఆభరణానికి ఉనికి వచ్చింది.

ఇప్పుడు చెప్పండి, బంగారం ఆభరణంలో ఎక్కడ ఉంది? దాని మొదట్లో ఉందా, మధ్యలో ఉందా, లేదా చివర్లో ఉందా? బంగారం మొదట్లోనూ ఉంది, మధ్యలోనూ ఉంది, చివర్లోనూ ఉంది. నిజానికి ఉన్నదంతా బంగారమే. బంగారమే గాజుకి కాని, గొలుసుకు కాని, ఉంగరానికి కాని ఉనికిని అరువు ఇస్తున్నది.

అదే విధంగా తురీయం స్థూలప్రపంచం, సూక్ష్మప్రపంచం, కారణప్రపంచం అంతటా ఉంది. నిజానికి ఉన్నదంతా తురీయమే. తురీయమే స్థూలప్రపంచానికి కాని, సూక్ష్మప్రపంచానికి కాని, కారణప్రపంచానికి కాని ఉనికిని అరువు ఇస్తున్నది.

**ప్రణవః** – ఇక్కడ ప్రణవః అంటే ప్రణవంలోని నిశ్శబ్దచైతన్యం.

**సర్వస్య ఆదిః** – అన్నింటికీ ఆరంభం;

**మధ్యమ్** – మధ్యభాగం;

**అంతః** – అంతభాగం కూడా.

ప్రణవమే ఆది, మధ్య, అంతాలు అని అంటే అది కాలానికి సంబంధించినదిగానూ తీసుకోవచ్చు; దేశానికి సంబంధించినదిగానూ తీసుకోవచ్చు. గది పరంగా చెబితే దేశం; వయస్సు పరంగా చెబితే కాలం. ఎలా చూసినా అంతటా ఉన్నది తురీయచైతన్యం మాత్రమే.

**ఏవం హి ప్రణవం జ్ఞాత్వా** – ఈ విధంగా ఎవరైతే ప్రణవం గురించి తెలుసుకుంటారో. ఈ విధంగా అంటే ప్రణవమే నిశ్శబ్దచైతన్యం అనీ; ఆ నిశ్శబ్దచైతన్యం తురీయచైతన్యం అయిన తనే అనీ తెలుసుకోవాలి. మనస్సు శూన్యంగా అయినప్పుడు కూడా, నేను దాన్ని సాక్షిగా చూసే సాక్షిచైతన్యంగా ఉన్నాను. నేను ఆ చైతన్యాన్ని అని తెలుసుకుంటే; హి అంటే నిశ్చయంగా;

**తదనంతరం** – వెనువెంటనే;

**వ్యశ్నుతే** – తురీయ చైతన్యంలో ఐక్యం పొందుతాడు. తురీయజ్ఞానం పొందితే, తురీయంలో ఐక్యం పొందుతాడు.

ఇక్కడ ఒక సందేహం రావచ్చు. ఉన్నదొక్కటే అద్వైతం అంటున్నారు కదా, మాయ ఉంటే ద్వైతం కాదా? దీనికి రెండు జవాబులు చెప్పవచ్చు.

మాయ ఈశ్వరునికి భిన్నంగా లేదు. మాయాశక్తివల్ల ఈశ్వరుడు జగత్ సృష్టి చేస్తాడు. దానికి దృష్టాంతం మన స్వప్నప్రపంచమే. మనం నిద్రాశక్తివల్ల స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తే, ఈశ్వరుడు తన మాయాశక్తివల్ల జాగ్రత్ ప్రపంచాన్ని సృష్టిస్తాడు.

మాయాశక్తికి, నిర్గుణబ్రహ్మకూ స్థాయీభేదాలు ఉన్నాయి. మాయతో కలిస్తే సగుణబ్రహ్మ అవుతాడు; ఈశ్వరుడు వ్యావహారిక సత్యం అయితే నిర్గుణబ్రహ్మ పారమార్థిక సత్యం. నిదిధ్యాసనంలో నేను నిర్గుణబ్రహ్మను అని ధ్యానం చేయాలి.

**కారిక 1.28**

**ప్రణవం హీశ్వరం విద్యాత్సర్వస్య హృది సంస్థితమ్ ।**
**సర్వవ్యాపినమోంకారం మత్వా ధీరో న శోచతి ॥**

ఓంకారానికి రెండు అర్థాలు ఉన్నాయి. ముఖ్య అర్థం ఓంకారశబ్దం; లక్ష్యార్థం ఆ శబ్దం తర్వాత వచ్చే నిశ్శబ్దం. నిశ్శబ్దం అంటే ఏమిటి? నిశ్శబ్దం అంటే శూన్యం కాదనీ, ఆ నిశ్శబ్దాన్ని ప్రకాశింపజేసే చైతన్యం అనీ చూస్తూనే ఉన్నాము. ప్రకాశింపజేసేది అంటే నిశ్శబ్దాన్ని తెలియజేసేది అని అర్థం. ఆ విధంగా ఓంకారం అంటే నిశ్శబ్దాన్ని తెలియజేసే చైతన్యం.

**ప్రణవమ్ హి** – ఓంకారం, చైతన్యమే.

**ఈశ్వరం విద్యాత్** – పరమాత్మ లేదా ఈశ్వరుడు. ఓంకారాన్ని ఈశ్వరునిగా అర్థం చేసుకోవాలి. ఆ ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడు?

**సర్వస్య హృది సంస్థితమ్** – ఆ ఈశ్వరుడు అందరి హృదయాలలో ఉన్నాడు. ఓంకారం అంటే ఓంకారశబ్దం కాదు, చైతన్యం అని చూశాము. ఆ చైతన్యమే అందరి మనస్సుల్లో (మనస్సు హృదయంలో ఉంటుందని శాస్త్రంలో నేర్చుకుంటాము) ఉంటుంది. ఈ చైతన్యం ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూస్తుంది. ఓంకారశబ్దం అందరిలో ఉండదు. అందువల్ల ఓం అంటే చైతన్యాన్ని తీసుకోవాలి.

**సర్వవ్యాపినమ్** – ఈ ఓంకారం, ఈ చైతన్యం సర్వవ్యాపకం;

**(ఇతి) మత్వా** – ఇది తెలుసుకున్న

**ధీరా** – ఉపనిషత్తుల్లో ధీరా అంటే ధీరుడు కాదు; వివేకి, జ్ఞాని. ఏ జ్ఞాని అయితే ఈ పన్నెండు మంత్రాలను అర్థం చేసుకుని, ఓం అంటే తురీయచైతన్యం అని అర్థం చేసుకుంటాడో,

**న శోచతి** – అతను శోకాన్ని పొందదు. శోకం సంసారాన్ని సూచిస్తుంది. జ్ఞానికి సంసారం ఉండదు. ఒక్కముక్కలో చెప్పాలంటే అతను సంసారబంధంనుంచి విముక్తి పొందుతాడు. అంటే మోక్షం పొందుతాడు.

ఈ కారిక అర్థం దేశకాలాతీత తురీయజ్ఞానం పొందితే, వెంటనే తురీయంలో ఐక్యం.

## కారిక 1.29

**అమాత్రోఽనంతమాత్రశ్చ ద్వైతస్యోపశమశ్శివః ।**
**ఓంకారో విదితో యేన స మునిర్నేతరో జనః ॥**

ఈ కారికతో గౌడపాదాచార్యులవారు తన విచారణను ముగిస్తున్నారు. దాన్ని ముగించేముందు అమాత్ర గురించి ఉపనిషత్తు చెప్పిన నిర్వచనాన్ని మళ్ళీ ఒకసారి మనకు గుర్తుచేస్తున్నారు. ఇంతవరకూ వచ్చినవి (25-28) నిదిధ్యాసన కారికలు. ఇది పన్నెండవ మంత్రాన్ని గుర్తుచేస్తుంది.

**అమాత్రోఽనంతమాత్రశ్చ** – ఈ అమాత్రకు ఎటువంటి పరిమితులు లేవు. దేశపరిమితి కాని, కాలపరిమితి కాని లేవు. అ,ఉ,మ లకు పరిమితులు ఉంటాయి కాని అమాత్రకు పరిమితులు లేవు.

ధ్యానం చేసేటప్పుడు తాత్కాలిక నిశ్శబ్దంకోసం ప్రయత్నించకూడదు. అది శూన్యం అవుతుంది. దానికి పరిమితులు ఉంటాయి. ఆ నిశ్శబ్దం బాగానే ఉంటుంది, ఆనందం పొందుతారు కాని అది కాసేపే ఉంటుంది; ఆపేక్షిక నిశ్శబ్దంలోకి వస్తుంది. ఎందుకు? మీరు ధ్యానంనుంచి బయటకు రాగానే శబ్దం వస్తుంది; శబ్దం వస్తే నిశ్శబ్దం పారిపోతుంది. అందువల్లనే ధ్యానం చేసేవారు ఏ కాస్త శబ్దం వచ్చినా చిరాకు పడిపోతారు. డోర్‌బెల్ మోగినా, సెల్‌ఫోన్ మోగినా ఏకాగ్రత చెదురుతుంది.

వేదాంతం ఇటువంటి ఆపేక్షిక నిశ్శబ్దంకోసం ప్రయత్నించవద్దంటుంది. వేదాంతం చెప్పే నిశ్శబ్దం కాలాతీత నిశ్శబ్దం. మీరు ధ్యానంలో ఉన్నా, లేకపోయినా తెలిసే నిశ్శబ్దం. అందువల్ల అనంతమాత్ర అంటే అనంతమైన, పరిమితులు లేని నిశ్శబ్దం. అది,

**ద్వైతస్యోపశమః** – ద్వైతానికి అతీతంగా ఉంది. అద్వైతంలో ఉన్నదొక్కటే తురీయం, ఇంకొక పదార్థం లేదని చూశాము. బంగారం-ఆభరణాల దృష్టాంతంలో గాజు, గొలుసు, ఉంగరం అని భిన్నంగా ఇన్ని పదార్థాలు లేవు. ఉన్నదొకటే బంగారం అని చూశాము. అదే విధంగా స్థూల, సూక్ష్మ, కారణ ప్రపంచాలు లేవు, ఉన్నదొకటే తురీయం. అందువల్ల ద్వైతస్యోపశమమ్= ప్రపంచోపశమమ్.

**శివః** – మంగళకరం. శబ్దానికి చెదిరిపోని, అనంతమైన, శాశ్వతమైన నిశ్శబ్దచైతన్యం. కలలో ఎంత శబ్దం అవుతున్నా జాగ్రత్ పురుషుని నిశ్శబ్దానికి ఏమీ భంగం కలుగదు. అదే విధంగా అనంతనిశ్శబ్దం ఎన్నడూ అనంతశబ్దంవల్ల ఏమీ చెదరదు.

**ఓంకారో విదితో యేన** – ఎవరైతే ఓంకారాన్ని ఈ విధంగా అర్థం చేసుకుంటారో,

**స మునిః** – అతనే అసలైన జ్ఞాని.

**న ఇతరో జనః** – వేరే ఎవరూ ముని కాదు. అంటే ముని అంటే గడ్డాలతో ఉన్న ముని కాదు, జ్ఞాని అని అర్థం.

ఇక్కడితో అమాత్రను వివరించే కారికలు (25–29) అయిపోయాయి. దీనితో మాండూక్యోపనిషత్తు అయిపోయింది; మొదటి అధ్యాయం అయిన ఆగమ ప్రకరణం కూడా అయిపోయింది.

# అధ్యాయం 1 - ఆగమ ప్రకరణం - సారాంశం

మాండూక్యోపనిషత్తులో నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. ఇందులో అధ్యాయాన్ని ప్రకరణం అంటారు. వాటి పేర్లు – ఆగమ ప్రకరణం, వైతథ్య ప్రకరణం, అద్వైత ప్రకరణం, అలాతశాంతి ప్రకరణం.

మొదటి అధ్యాయాన్ని ఆగమ ప్రకరణం అంటారు. ఇందులో ఉపనిషత్ మంత్రాలు 12+ గౌడపాదాచార్యులవారి కారికలు 29 ఉన్నాయి, వెరసి 41 ఉన్నాయి. ఉపనిషత్ అథర్వణ వేదానికి చెందినది, అందువల్ల మాండూక్యోపనిషత్ అపౌరుషేయం, సాక్షాత్తూ ఆ భగవంతుని నుంచే వచ్చింది. కారికల భాగాన్ని గౌడపాదాచార్యులవారు రచించారు. ఆయన శంకరాచార్యులవారి గురువులకు గురువు. గౌడపాదాచార్యులవారు రచించారు కాబట్టి వీటిని గౌడపాద కారికలు అంటారు. ఈ ఉపనిషత్తు ఈ కారికలవల్ల ప్రాముఖ్యతను సంతరించుకుంది.

కారిక అంటే భాష్యం లేదా విచారణ. ఇది మామూలు భాష్యంలా ఉపనిషత్తులోని ప్రతి పదానికి విశ్లేషణ కాదు. దానిలోని సారాంశాన్ని గౌడపాదాచార్యులవారు లోతుగా విశ్లేషించారు. ఇది పద్యరూపంలో ఉంది. మొదటి అధ్యాయంలో ఉపనిషత్తుకు ప్రాముఖ్యతను ఇవ్వాలి కాబట్టి, కారికలు ద్వితీయస్థానంలోకి వెళ్ళిపోయాయి. ఉపనిషత్తుకు ప్రాముఖ్యతను ఇవ్వాలి కాబట్టి, వేదాలను ఆగమశాస్త్రం అని కూడా అంటారు కాబట్టి, ఈ అధ్యాయానికి ఆగమ ప్రకరణం అని పేరు వచ్చింది. ఉపనిషత్ మంత్రాలు ఈ అధ్యాయంతో అయిపోతాయి కాబట్టి, రెండవ అధ్యాయంనుంచి కారికలు మాత్రమే ఉంటాయి.

ఈ అధ్యాయంలో రెండూ ఉన్నాయి కాబట్టి, ఈ అధ్యాయం సారాంశాన్ని విడివిడిగా చూద్దాము. అంటే ముందు ఉపనిషత్ మంత్రాల సారాంశాన్ని చూశాక, కారికల సారాంశాన్ని చూద్దాము.మండూక ఋషి దర్శించాడు కాబట్టి దీనికి మాండూక్యోపనిషత్ అనే పేరు వచ్చింది.

## ఉపనిషత్ మంత్రాల విహంగ వీక్షణ

| | | |
|---|---|---|
| 1. ఉపోద్ఘాతం | - | ఓంకార విచారణ - మంత్రం 1<br>ఆత్మ విచారణ - మంత్రం 2 |
| 2. చతుష్పాద ఆత్మ విచారణ | - | మంత్రాలు 3–7 |
| 3. చతుర్మాత్ర ఓంకార విచారణ | - | మంత్రాలు 8–12 |

1. **ఉపోద్ఘాతం – ఓంకార విచారణ: మంత్రం 1**

ఈ మంత్రం చతుర్మాత్ర ఓంకారాన్ని పరిచయం చేస్తుంది. ఈ సృష్టి మొత్తం ఓంకారమే. ఇది కాలాతీతం. ఒక్కముక్కలో చెప్పాలంటే ఓం = సర్వం.

అందువల్ల ఓంకార విచారణ చేస్తే అన్నింటి గురించిన విచారణ చేసినట్టు అర్థం.

ఓంకార విచారణ = సృష్టి విచారణ

అందువల్ల ఓంకార విచారణ చేయబోతున్నాము.

**ఆత్మ విచారణ: మంత్రం 2**

ఈ జగత్తు మొత్తం బ్రహ్మ. ఈ బ్రహ్మ కాలాతీతం. ఒక్కముక్కలో చెప్పాలంటే సర్వం= బ్రహ్మ.

అయమాత్మా బ్రహ్మ. ఇదొక మహావాక్యం. బ్రహ్మ అంటే వేరే ఏమిటో కాదు, ఈ ఆత్మే. ఈ మంత్రంలోనే రెండు ఈక్వేషన్లు వచ్చాయి.

సర్వం = బ్రహ్మ; బ్రహ్మ = ఆత్మ; అందువల్ల సర్వం = ఆత్మ.

చూడటానికి రెండు భిన్న విచారణలుగా కనిపిస్తున్నా రెండింటి గమ్యం ఒకటే. అందువల్ల ఓంకార విచారణను, ఆత్మ విచారణతో పోల్చి చేస్తాము. అందువల్ల ముందు ఆత్మ విచారణను పరిచయం చేస్తున్నది ఉపనిషత్తు.

2. **చతుష్పాద ఆత్మ విచారణ: మంత్రాలు 3–7**

ఐదు మంత్రాలు ఆత్మయొక్క నాలుగు పాదాల గురించి వివరిస్తాయి. ఆత్మ అంటే ఎవరో కాదు, నేను.

ఎ) **మంత్రం 3** – ఈ మంత్రం స్థూల ఆత్మను వివరిస్తుంది. ఈ ఆత్మ జాగ్రదావస్థలో, జాగ్రత్ ప్రపంచంలో వ్యవహారం నడుపుతుంది. అందువల్ల అది బహిష్ప్రజ్ఞః. ఈ జంట పేరు విశ్వ–విరాట్.

బి) **మంత్రం 4** – ఈ మంత్రం సూక్ష్మ ఆత్మను వివరిస్తుంది. ఈ ఆత్మ స్వప్నావస్థలో, స్వప్నప్రపంచాన్ని చూస్తుంది. అందువల్ల అది అంతఃప్రజ్ఞ. ఈ జంట పేరు తైజస– హిరణ్యగర్భ.

సి) **మంత్రాలు 5, 6** – ఈ మంత్రాలు కారణ ఆత్మను వివరిస్తాయి. ఈ ఆత్మ సుషుప్తి అవస్థలో, కారణ శరీరంలో లయమవుతుంది. ఏమీ కార్యక్రమాలు ఉండవు కాబట్టి ప్రజ్ఞానఘనః. ఈ జంట పేరు ప్రాజ్ఞ–ఈశ్వర.

ఈ విధంగా ఈ మూడు పాదాలు గుణాలున్న ఆత్మను వివరిస్తాయి.

డి) **మంత్రం 7** – అసలు ఆత్మయొక్క నిర్వచనంలోకి అడుగుపెడుతుంది ఉపనిషత్ ఈ మంత్రంలో. అందువల్ల ఇది చాలా ముఖ్యమైన మంత్రం. అసలు నేను ఎవరు? నా స్వరూపం ఏమిటి? అది మూడు భాగాలుగా వివరిస్తుంది.

**ప్రమాతృత్రయ విలక్షణమ్ –**

**నాంతః ప్రజ్ఞం న బహిష్ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞమ్।**

తురీయమైన నేను బహిష్ప్రజ్ఞ కాదు, అంతఃప్రజ్ఞ కాదు, ఘనఃప్రజ్ఞ కాదు అంటే ఈ విశ్వ, తైజస, ప్రాజ్ఞలను కాదు. అవి నేను వేసుకున్న వేషాలు. ఆ విధంగా ప్రమాతృత్రయ విలక్షణమ్.

**ప్రమేయత్రయ విలక్షణమ్ –**

**అదృష్టమవ్యవహార్యమగ్రాహ్యమలక్షణమచింత్యమవ్యపదేశ్యమ్**

పంచజ్ఞానేంద్రియాలకు, పంచకర్మేంద్రియాలకు, అనుమాన ప్రమాణానికి, మనోవృత్తికి, వాక్కుకి అందదు. అంటే సర్వప్రమాణ అగోచరమ్. ఆ విధంగా ప్రమేయత్రయ విలక్షణమ్.

**త్రయ అధిష్ఠానమ్ –**

**ఏకాత్మప్రత్యయసారం ప్రపంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః॥**

ఒకే ఆత్మ ప్రత్యయ ప్రమాణంగా కలది. ప్రపంచం మిథ్య, తురీయం సత్యం. ఈ అద్వైత తురీయాన్ని నాలుగవ అవస్థ అని అజ్ఞానులు పొరపాటు పడతారు. తురీయం నాలుగవ పాదం, మూడు అవస్థల్లోనూ అధిష్ఠానంగా ఉంటుంది. అది శాంతం, శివం. అదే ఆత్మ, దాన్ని తెలుసుకో.

నేను తురీయాన్ని అని తెలుసుకోవటమెలా? నాకు జాగ్రదావస్థలో ఉన్న విశ్వ తెలుసు; స్వప్నావస్థలో ఉన్న తైజస తెలుసు, సుషుప్తి అవస్థలో ఉన్న ప్రాజ్ఞ తెలుసు; ఈ తురీయం, తురీయ అవస్థలో దొరుకుతుందా? నిర్వికల్ప సమాధిలో దొరుకుతుందా? అలాంటి నాలుగవ అవస్థ లేనేలేదు; నిర్వికల్ప సమాధిలోనూ దొరకదు. దానికి ఒకటే మాట వేసింది ఉపనిషత్– ఏకాత్మప్రత్యయసారమ్. నిర్గుణ చైతన్యం సగుణ చైతన్యం అంతటా ఉంటుంది. తురీయం విశ్వ, తైజస, ప్రాజ్ఞ – మూడింటిలోనూ ఉంది. తురీయాన్ని తెలుసుకోవటంకోసం నాలుగవ

అవస్థకోసం వెతకకూడదు. జాగ్రదావస్థలో ఉంటూ, విశ్వ ద్వారా తురీయానికి వెళ్ళాలి. అదెలా?

సగుణ నేను – (మైనస్) గుణం = నిర్గుణ నేను

తండ్రి నేను – (మైనస్) తండ్రి హోదా = శుద్ధ నేను

అలా నేను తర్వాత ఏ పదం వేసినా అది ఒక గుణం అవుతుంది. నేను టీచర్‌ను, నేను భర్తను – ఈ వాక్యాల్లో సమానంగా ఉన్నది నేను, నేను. అలాగే –

విశ్వ అయిన నేను – (మైనస్) విశ్వ = తురీయం నేను

ఏకాత్మప్రత్యయసారం అర్థం ఇదీ. ఈ గుణాలను విడదీయటం ఎలా? గుణాలను విడదీయనవసరం లేదు. ఎందుకంటే తురీయానికి గుణాలు అంటవు. చేతిని ప్రకాశింపజేసే కాంతికి చేతికి ఉన్న మలినం అంటదు. అలాగే శరీరంలో ఉన్న శరీరికి శరీరంయొక్క మలినాలు అంటవు. తురీయం అయిన నేను అసంగం.

మరయితే ఏమిటి సమస్య? నాకు గుణాలు ఉన్నాయి అనుకుంటున్నాను. నాకు గుణాలు ఉన్నాయి అనే భావన అజ్ఞానంవల్ల పుట్టింది. నేను ఎప్పుడూ నిర్గుణ చైతన్యాన్నే అని తెలుసుకోవాలి. తెరమీద నేను సినిమా చూస్తున్నాను. ఆ సినిమాలో మురికినీరు తెర అంతటా ప్రవహిస్తోంది. ఆ తెరను శుద్ధి చేయటానికి ఏం చేయాలి? ఏమీ చేయనవసరం లేదు. ఆ ఘట్టం జరుగుతున్నా కూడా, తెరకు మలినం అంటదు. తెరమీద అగ్నిజ్వాలలు ఎగసిపడుతున్నా కూడా, తెర కొంచెం కూడా కాలదు. తెర అసంగం.

అలాగే తురీయం అయిన నేను అసంగం. శరీరం బాధపడుతున్నా, మనస్సులో రాగద్వేషాలు రాజ్యమేలుతున్నా, నాకేమీ అంటదు. ఈ విషయం ఆత్మజ్ఞానం పొందితే తెలుస్తుంది. లేకపోతే ఈ గుణాలతో మమేకం చెందుతాను. నేను లావుగా ఉన్నాను! నాకు బాధగా ఉంది అనుకుంటే నేను విశ్వను; నా శరీరం లావుగా ఉంది; నా మనస్సుకు బాధగా ఉంది, నాకేమీ లేదు అని అర్థం చేసుకుంటే (అనుకుంటే కాదు) నేను తురీయాన్ని. అందువల్ల ఆత్మయొక్క మొదటిపాదంనుంచి నాలుగవ పాదానికి ప్రయాణం, బుద్ధిలో చేయాలి.

విశ్వ, తైజస, ప్రాజ్ఞలను తీసుకుని వాటిని విశ్లేషించాలి.

విశ్వ నేను – బహిష్ప్రజ్ఞః; తురీయం నేను – న బహిష్ప్రజ్ఞః

తైజస నేను – అంతః ప్రజ్ఞః; తురీయం నేను – న అంతః ప్రజ్ఞః

ప్రాజ్ఞ నేను – ప్రజ్ఞానఘనః; తురీయం నేను – న ఘనప్రజ్ఞః

మరి ఇవేవీ కాకపోతే నేనెవరు?

శాంతం శివమద్వైతమ్.

చిదానందరూపః శివోఽహం శివోఽహమ్.

3. **చతుర్మాత్ర ఓంకార విచారణ: మంత్రాలు 8-12**

ఆత్మకు నాలుగు పాదాలు ఉన్నట్టుగా, ఓంకారానికి నాలుగు మాత్రలు ఉన్నాయి. అవి అకార మాత్ర, ఉకార మాత్ర, మకార మాత్ర, అమాత్ర. అమాత్ర అంటే ఓంకారం పలికాక వచ్చే నిశ్శబ్దం.

**మంత్రం 8** – ఓంకారాన్ని పూర్తిగా ఆత్మతో పోల్చి, ఒక్కొక్క మాత్రను ఒక్కొక్క పాదంతో పోల్చింది. (ఇక్కడ నాలుగవ మాత్ర – నాలుగవ పాదం జంట రాలేదు)

అ = విశ్వ/విరాట్; ఉ = తైజస/హిరణ్యగర్భ, మ = ప్రాజ్ఞ/ఈశ్వర;
అమాత్ర = తురీయ ఆత్మ

**మంత్రాలు 9-11** – ఒక్కొక్క జంటయొక్క ఐక్యఉపాసన, పోలిక, ఫలం చెబుతూ వచ్చింది.

| | | | |
|---|---|---|---|
| అకార – విశ్వ/విరాట్ | – | ఆప్తి | – ఆప్నోతి సర్వాన్ కామాన్, |
| ఐక్య ఉపాసన | | ఆది | – ఆదిశ్చ భవతి |
| ఉకార – తైజస/ హిరణ్యగర్భ | – | ఉత్కర్షః | – ఉత్కర్షతి |
| ఐక్య ఉపాసన | | ఉభయత్వమ్ | – సమానశ్చ భవతి |
| మకార – ప్రాజ్ఞ/ఈశ్వర | – | మితిః | – మినోతి ఇదం సర్వమ్ |
| ఐక్య ఉపాసన | | అపీతిః | – అపీతిశ్చ భవతి |

ఈ ఫలాలు సకామ ఉపాసనకు. నిష్కామ ఉపాసన చేస్తే నిదిధ్యాసనానికి మనస్సు సిద్ధం అవుతుంది. ఉపనిషత్ ముఖ్యోద్దేశం ఉపాసన కాని, ఈ ఫలాలు కాని కాదు; ఓంకార విచారణకు రమ్మంటుంది. అది మంత్రం 12లో చూస్తాము.

**మంత్రం 12** – చతుష్పాద ఆత్మవిచారణలో ప్రపంచత్రయాన్ని నిషేధించటం ద్వారా ప్రపంచత్రయ అధిష్ఠానం తురీయం అని తెలుసుకున్నాము. అలాగే ఓంకారంలో మాత్రాత్రయాన్ని నిషేధించటం ద్వారా మాత్రాత్రయ అధిష్ఠానం అమాత్ర అని తెలుసుకుంటాము. అంటే ఓంకారం పలికి, ఆ శబ్దంనుంచి నిశ్శబ్దానికి రావాలి.

ఆ నిశ్శబ్దాన్ని సాక్షిగా చూసే చైతన్యం ఒకటి ఉందని, అదే తురీయ చైతన్యం అనీ, ఆ తురీయాన్ని నేనే అనీ, ఈ దశలన్నీ దాటుకుంటూ రావాలి.

శబ్దం → నిశ్శబ్దం → చైతన్యం → తురీయం → అహమస్మి

అమాత్రకూ, తురీయానికీ ఉపనిషత్తు సమానంగా వాడిన పదాలు – **చతుర్థః, అవ్యవహార్యః ప్రపంచోపశమమ్, శివమ్, అద్వైతమ్**. ఇవన్నీ చెప్పి ఓంకార ఆత్మైవ అంది. ఓంకారమే ఆత్మ అంది. ఈ విధంగా ఎవరు తెలుసుకుంటారో, అతను తన స్వస్వరూపంలో ప్రవేశిస్తాడు అంది.

ఈ విచారణ ఎలా చేయాలి? బంగారం–ఆభరణాల ఉదాహరణ తీసుకుందాం. గాజు, గొలుసు, ఉంగరాలను ఓంకారం మాత్రలతోనూ, ఆత్మ పాదాలతోనూ పోల్చుదాము.

| | | |
|---|---|---|
| గాజు | = అ | – విరాట్ |
| గొలుసు | = ఉ | – హిరణ్యగర్భ |
| ఉంగరం | = మ | – ఈశ్వర |
| బంగారం | = అమాత్ర | – తురీయం |

ముందు గాజు తీసుకుందాము. గాజుని చూస్తే, లోతుగా విశ్లేషిస్తే, ఆశ్చర్యకరమైన విషయం తెలుస్తుంది. నిజానికి గాజు అనే పదార్థమే లేదు. బంగారం మాత్రమే ఉంది. కంటికి ఎదురుగా గాజే ఉంది, కాని మీ బుద్ధి మాత్రం అది గాజు కాదు, బంగారం అని చెబుతున్నది. అందువల్ల మీరు గాజు అనే పదార్థాన్ని నిషేధించారు. గాజు అనే పదార్థం లేకపోతే, ఆ పదార్థాన్ని సూచించే పదం దేన్ని సూచిస్తుంది? దానికి ఉనికి లేదు. పదార్థ నిషేధం పదనిషేధానికి దారితీస్తుంది. ఆ నియమం ప్రకారం విరాట్‌ని నిషేధిస్తే, పదార్థం లేకపోతే, దాన్ని సూచించే అకారానికి ఉనికి లేదు.

తర్వాత గొలుసు. గొలుసు అనే పదార్థమూ లేదు, దాన్ని సూచించే పదమూ లేదు. ఇక్కడ హిరణ్యగర్భ అనే పదార్థం లేదు, దాన్ని సూచించే ఉ పదం లేదు. అదే సూత్రం ప్రకారం ఉంగరం అనే పదార్థం, పదం ఎలా లేవో, అలా ఈశ్వర అనే పదార్థం, దాన్ని సూచించే మ పదం లేవు.

మనం ఇంత వివరంగా చెప్పినదాన్ని శంకరాచార్యులవారు ఒక్కవాక్యంలో చెప్పారు.

**అభిదాన అభిదేయ నిషేధేన తదధిష్ఠాన ప్రాప్తిః ఏవ లక్ష్యమ్**

ఇంకా తేలిగ్గా చెప్పాలంటే ప్రపంచాన్ని, నన్ను నిషేధించాలి.

అభిదేయం అంటే పదార్థం; అభిదానం అంటే పదం. పదార్థం లేకపోతే పదం లేదు. వీటిని నిషేధిస్తే మిగిలేది ఏదో అదే అధిష్ఠానం.

అ-విరాట్, ఉ-హిరణ్యగర్భ, మ-ఈశ్వర అన్నీ సగుణరూపాలు. పద-పదార్థ విభజన సగుణ రంగంలోనే సాధ్యం. ఇది వ్యావహారిక స్థాయిలోనే సాధ్యం. అందులోనే గుణాలు, దేశం, కాలం వస్తాయి. ఇవేవీ లేకపోతే, ఏం మిగులుతుంది? శూన్యం అనుకుంటారు కాని మాండూక్యం అది శూన్యం కాదు అంటుంది. ఎందుకు?

శూన్యం మిగిలింది అని చెప్పటానికి, ఆ శూన్యాన్ని సాక్షిగా చూసేది ఒకటి ఉండాలి. ఈ గదిలో ఎవరూ లేరు అంటే ఎవరూ లేరని చూసినవారు ఒకరు ఉండాలి. అలా శూన్యాన్ని సాక్షిగా చూసినదాన్నే సాక్షిచైతన్యం అంటారు. ఈ నిశ్శబ్దచైతన్యాన్నే తురీయం అంటారు. ఇదీ ఓంకార విచారణ.

ఈ విచారణ చేస్తే కలిగే ఫలం, తన స్వస్వరూపమైన తురీయాన్ని పొందుతాడు.

ఇంతవరకూ ఉపనిషత్ భాగాన్ని చూశాము. ఇప్పుడు కారికల భాగాన్ని చూద్దాము.

**కారికల విహంగ వీక్షణ**

1. మూడు పాదాల వివరణ -కారికలు 1-9, మంత్రం 6 తరువాత
2. నాలుగు పాదాల సాధర్మ్యము-వైధర్మ్యము - కారికలు 10-18, మంత్రం 7 తరువాత
3. ఓంకారం- ఆత్మ ఐక్య ఉపాసన - కారికలు 19-24, మంత్రం 11 తరువాత
4. నిదిధ్యాసనం, ఫలం - కారికలు 25-29, మంత్రం 12 తరువాత

వీటిని వివరంగా చూద్దాము.

1. **మూడు పాదాల వివరణ: కారికలు 1-9, మంత్రం 6 తరువాత**

ఈ మూడు పాదాల గురించి ఉపనిషత్ విడివిడిగా చెబితే, గౌడపాదాచార్యులవారు వాటిని కలిపి వాటి స్థానం, అవి అనుభవించే అంశాలు, అవి తృప్తి చెందే విషయాల గురించి వరుసగా చెప్పారు.

స్థానత్రయం - కుడికన్నులో, మనస్సులో, హృదయంలో ఉన్నారు.

భోగత్రయం - స్థూలప్రపంచం, స్వప్నప్రపంచం, ఆనంద అనుభవం

తృప్తిత్రయం - స్థూలవస్తువులు, సూక్ష్మవస్తువులు, ఆనందం

**2. నాలుగు పాదాల సాధర్మ్యము–వైధర్మ్యము: కారికలు 10–18, మంత్రం 7 తరువాత**

అజ్ఞానం, పొరపాటు అనే రెండు పదాలను తీసుకుని, గౌడపాదాచార్యులవారు ఈ నాలుగు పాదాల మధ్యనున్న పోలికలను, భేదాలను అనేక కోణాల్లోంచి చెప్పుకొచ్చారు. అజ్ఞానం అంటే నేను తురీయం అనే జ్ఞానం లేకపోవటం. అజ్ఞానం ఉంటే, దానివల్ల పొరపాటు ఏర్పడుతుంది. పొరపాటు నేను పరిమితి ఉన్న జీవిని అనుకోవటం. తాడు గురించిన అజ్ఞానం, పాము ఉంది అనే పొరపాటుకు దారితీస్తుంది. పొరపాటు ఉండాలంటే అజ్ఞానం ఉండితీరాలి. ఏ పాదాలకు ఏం ఉన్నాయో ఈ పట్టికలో చూద్దాము.

| | విశ్వ | తైజస | ప్రాజ్ఞ | తురీయం |
|---|---|---|---|---|
| అజ్ఞానం | ✓ | ✓ | ✓ | × |
| పొరపాటు | ✓ | ✓ | × | × |

గౌడపాదాచార్యులవారు అనేక కోణాల్లో ఈ విషయాన్నే నాలుగు జంట పదాలతో వివరించారు. అవి

అజ్ఞానం – అగ్రహణం, కారణం, బీజం, నిద్ర

పొరపాటు – అన్యథాగ్రహణం, కార్యం, అంకురం, స్వప్నం

**3. ఓంకార – ఆత్మ ఐక్య ఉపాసన: కారికలు 19–24, మంత్రం 11 తరువాత**

ఉపనిషత్ 9–11 మంత్రాల్లో మూడు పాదాలనూ, వాటికి తగ్గ మూడు మాత్రలతో ఐక్యఉపాసన ఎలా చేయాలో వివరించింది. ఆ ఐక్యఉపాసన చెప్పినప్పుడు రెండేసి సమాన ధర్మాలను చెప్పింది. ఉపాసన నియమం ప్రకారం ఏ గుణంమీద ధ్యానం చేస్తే ఆ గుణం పొందుతాడు సాధకుడు. తదనుగుణమైన ఫలం చెబుతూ వచ్చింది ఉపనిషత్. గౌడపాదాచార్యులవారు కూడా అవే గుణాలను, అవే పదాలతో లేదా ఆ అర్థం వచ్చే పదాలతో కారికలు 19–24లో చెప్పారు. ఆయన పరలోక ఫలాలను అదనంగా చెప్పారు. ఏ సగుణఈశ్వరునిమీద ధ్యానం చేస్తే ఆ సగుణ ఈశ్వరునితో ఐక్యం అవుతారు. అవి టూకీగా ఈ విధంగా చూద్దాము.

| | | |
|---|---|---|
| అ - విశ్వ/విరాట్ | ఆప్తి | ఆప్తి |
| | ఆది | ఆది |
| ఉ-తైజస/హిరణ్యగర్భ | ఉత్కర్షః | ఉత్కర్షః |
| | ఉభయత్వమ్ | ఉభయత్వమ్ |
| మ-ప్రాజ్ఞ/ఈశ్వర | మితిః | మానం |
| | అపీతిః | లయ |

4. **నిదిధ్యాసనం - ఫలం: కారికలు 25-29, మంత్రం 12 తరువాత**

ఆత్మకూ, ఓంకారానికీ మధ్య ఉన్న పోలికలను మళ్ళీ గుర్తుచేస్తూ దీనిమీద నిదిధ్యాసనం ఎలా చేయాలో చెప్పారు గౌడపాదాచార్యులవారు.

ఇక్కడ ఓంకారాన్ని ప్రణవం అంటున్నారు గౌడపాదాచార్యులవారు. నవః అంటే పేరు. ప్ర అంటే ఆదర్శవంతమైన! సరియైన, అనువైన, చక్కటి అని అర్థం. అందువల్ల ప్రణవం అంటే ఆదర్శవంతమైన పేరు. ఎందుకు ప్రణవం బ్రహ్మకు ఆదర్శవంతమైన పేరు? బ్రహ్మకు వేరే ఏ పదం వాడినా కూడా అది సగుణబ్రహ్మనో లేదా నిర్గుణబ్రహ్మనో మాత్రమే సూచిస్తుంది. ఓం ఒక్కటే సగుణబ్రహ్మకు, నిర్గుణబ్రహ్మకూ కూడా సరిపోతుంది. అదెలా? ఓంకారశబ్దం సగుణబ్రహ్మను సూచిస్తే, రెండు ఓంకార శబ్దాల మధ్య వచ్చే నిశ్శబ్దం నిర్గుణబ్రహ్మను సూచిస్తుంది.

ఇంకొక ప్రత్యేకత కూడా ఉంది. సగుణబ్రహ్మకు మూడు పాదాలు ఉన్నాయి - విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వర. అలాగే ఓం శబ్దానికి మూడు మాత్రలు ఉన్నాయి - అ,ఉ,మ. ఆ విధంగా ఓం అన్ని విధాలా బ్రహ్మకు సరిపోతుంది. అందువల్ల ఓంకార విచారణ ద్వారా బ్రహ్మవిచారణ చేయవచ్చు.

గౌడపాదాచార్యులవారు ఈ ఓంకారధ్యానం సాధన చేయాలంటున్నారు. ఓంకారం సగుణబ్రహ్మ + నిర్గుణబ్రహ్మ అని చూశాము. గౌడపాదాచార్యులవారు సగుణబ్రహ్మను అపరం బ్రహ్మ అనీ, నిర్గుణబ్రహ్మను పరబ్రహ్మ అనీ అన్నారు.

ముందు ఓంకార ధ్యానం చేసేటప్పుడు శబ్దంమీద దృష్టి పెట్టాలి. తర్వాత నెమ్మదిగా రెండు శబ్దాల మధ్య వచ్చే నిశ్శబ్దాన్ని గమనించాలి. నిశ్శబ్దాన్ని గమనించటానికి ఆ రెండు శబ్దాల మధ్య ఉన్న నిశ్శబ్దాన్ని పెంచుతూ పోవాలి. ఆ నిశ్శబ్దం గురించి ఉపనిషత్తులో

నేర్చుకున్న అంశాన్ని గుర్తు తెచ్చుకోవాలి. ఓంకారం అంటే శబ్దం మాత్రమే కాదనీ, దాని తర్వాత వచ్చే నిశ్శబ్దం కూడా అనీ, ఆ నిశ్శబ్దాన్ని అమాత్ర అంటారనీ నేర్చుకున్నాము.

నిశ్శబ్దం అంటే శూన్యం కాదు; నిశ్శబ్దం అంటే ఏమీ లేకపోవటం, దాన్ని చూసే చైతన్యం తప్ప. నిశ్శబ్దాన్ని సాక్షిగా చూసేది ఒకటి ఉంది. అదే సాక్షిచైతన్యం, తురీయం. ఆ తురీయం ఆబ్జెక్టు కాదు. అది నేనే. నేను అసంగం, నిర్గుణం, ఆనందం.

**ఓంకారశబ్దం → నిశ్శబ్దం → సాక్షి → తురీయం → నేను → శాంతం శివమద్వైతమ్**

ఓంకార ధ్యానం అంటే స్వరూపధ్యానం. స్వరూపధ్యానం జ్ఞాననిష్ఠను కలుగజేస్తుంది. జ్ఞాననిష్ఠ మోక్షాన్ని ఇస్తుంది. దాన్నే జీవన్ముక్తి అంటారు.

దీనితో ఉపనిషత్ మంత్రాలు, వాటిమీద గౌడపాదాచార్యులవారు టూకీగా చేసిన విశ్లేషణ అయిపోయింది.

ఈ ఆగమ ప్రకరణంలోని ముఖ్యాంశాలను, సారాంశంలో చూసిన అంశాలను అనేక పట్టికలలో ముఖ్యాంశాల పేరిట చూడవచ్చు.

# అధ్యాయము 1 - ఆగమ ప్రకరణం - ముఖ్యాంశాలు

**మంత్రం 1 - ఓంకార విచారణ ఉపోద్ఘాతం**
**మంత్రం 2 - ఆత్మవిచారణ ఉపోద్ఘాతం**

**సత్య ఆత్మయైన నా వేషాలు పట్టిక 1 - మంత్రాలు 3-6**

| మంత్రం | ఆత్మపేరు | అవస్థ | లక్షణం | ప్రమాతా | ప్రమేయం | పాదం |
|---|---|---|---|---|---|---|
| 3 | స్థూల ఆత్మా | జాగ్రదావస్థ | బహిః ప్రజ్ఞ | విశ్వ | విరాట్ | ప్రథమపాదం |
| 4 | సూక్ష్మ ఆత్మా | స్వప్నావస్థ | అంతః ప్రజ్ఞ | తైజస | హిరణ్యగర్భ | ద్వితీయపాదం |
| 5, 6 | కారణ ఆత్మా | సుషుప్తి అవస్థ | ప్రజ్ఞానఘనః | ప్రాజ్ఞ | అంతర్యామి | తృతీయపాదం |

**పట్టిక 2 - కారికలు 1-4**

| కారిక | దృక్కోణం | అర్థం |
|---|---|---|
| 1 | పాదత్రయం | మూడు పాదాలు |
| 2 | స్థానత్రయం | ప్రమాత ఉండే స్థానాలు |
| 3 | భోగత్రయం | ప్రమాత యొక్క అనుభవాలు |
| 4 | తృప్తిత్రయం | ప్రమాతను తృప్తిపరిచే విషయాలు |

**పట్టిక 3 – కారికలు 1–4 విశ్లేషణ**

| కారిక | దృక్కోణం | విశ్వ | తైజస | ప్రాజ్ఞ | విశ్లేషణ |
|---|---|---|---|---|---|
| 1 | పాదత్రయం | బహిః ప్రజ్ఞ | అంతః ప్రజ్ఞ | ఘనప్రజ్ఞ | ఏక ఏవ త్రిధా స్మృతః |
| 2 | స్థానత్రయం | దక్షిణాక్షిముఖే | మనసి అంతః | ఆకాశే చ హృది | త్రిధా దేహే వ్యవస్థితః |
| 3 | భోగత్రయం | స్థూలభుక్ | ప్రవివిక్తభుక్ | ఆనందభుక్ | త్రిధాభోగం నిబోధత |
| 4 | తృప్తిత్రయం | స్థూల వస్తువులు | సూక్ష్మవస్తువులు | ఆనందం | త్రిధా తృప్తిం నిబోధత |

**కారికలు 5,6**

5 ఫలం - అసంగరూపేణ తిష్ఠతి.

6 సృష్టి - ఈశ్వరుడు చేతనజీవులను , అచేతన ప్రపంచాన్ని సృష్టించాడు.
కాని సృష్టి పదం తప్పు. వ్యక్తమయింది అనాలి.

**కారికలు 7-9**

7-9 సృష్టి గురించిన వాదనలు

7. ఎ) భగవంతుని మహిమ
బి) భగవంతుని మాయ
సి) స్వప్నంలాగా సత్యం

8. డి) భగవంతుని ఇచ్ఛ
ఇ) కాలతత్త్వం

9. ఎఫ్) భగవంతుని భోగంకోసం
జి) భగవంతుని క్రీడకోసం

**చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః**

**పట్టిక 4 మంత్రాలు 3–7**

| మంత్రం | పాదం | పాదం పేరు | అవస్థ | లక్షణం | ప్రమాతా | ప్రమేయం | ఉదాహరణ | విశ్లేషణ |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | మొదటిపాదం | స్థూల ఆత్మ | జాగ్రదావస్థ | బహిః ప్రజ్ఞ | విశ్వ | విరాట్ | గాజు+బంగారం | విశ్వ+తురీయం |
| 4 | రెండవపాదం | సూక్ష్మ ఆత్మ | స్వప్నావస్థ | అంతః ప్రజ్ఞ | తైజస | హిరణ్యగర్భ | గొలుసు+బంగారం | తైజస+తురీయం |
| 5, 6 | మూడవపాదం | కారణ ఆత్మ | సుషుప్తి అవస్థ | ప్రజ్ఞానఘనః | ప్రాజ్ఞ | అంతర్యామి | ఉంగరం+బంగారం | ప్రాజ్ఞ+తురీయం |
| 7 | నాలుగవ పాదం | తురీయ ఆత్మ | విడిగా నాలుగవ అవస్థ లేదు | అవస్థాత్రయ అధిష్ఠానం | ప్రమాతృత్రయ విలక్షణం | ప్రమేయత్రయ విలక్షణం | బంగారం అధిష్ఠానం + విలక్షణం | తురీయం అధిష్ఠానం + విలక్షణం |

**తురీయం = ఆత్మ**

**మంత్రం 7 సారం**

ఎ) ప్రమాతృత్రయ విలక్షణం - నాన్తః ప్రజ్ఞం ... నా ప్రజ్ఞమ్
బి) ప్రమేయత్రయ విలక్షణం - అదృష్టమ్ ... అవ్యపదేశ్యమ్
సి) త్రయ అధిష్ఠానం - ఏకాత్మ ... స విజ్ఞేయః

తురీయం నాలుగవ పాదం. అది నాలుగవ అవస్థ కాదు. అన్ని అవస్థలకూ అధిష్ఠానంగా ఉంది.

**కారికలు 10-18**

10 - ఇందులో తురీయం పేరు వస్తుంది
తురీయ లక్షణాలు - తురీయం, సర్వాన్నీ శాసించేది, సర్వసమర్థం, దుఃఖాలు లేనిది, వినాశము లేనిది, స్వయంప్రకాశకం, అద్వైతం, సర్వవ్యాపకం.

| **నాలుగు పదాలు -అజ్ఞానం** | **పొరపాటు** |
|---|---|
| అగ్రహణం-చూడకపోవటం | అన్యథాగ్రహణం-తప్పుగా చూడటం |
| నిద్రా-నిద్ర | స్వప్న-స్వప్నం |
| కారణం | కార్యం |
| బీజం-విత్తనం | అంకురం-మొలక |

**పట్టిక - 5 అజ్ఞానం - పొరపాటు**

| | **విశ్వ** | **తైజస** | **ప్రాజ్ఞ** | **తురీయం** |
|---|---|---|---|---|
| అజ్ఞానం | ✓ | ✓ | ✓ | × |
| పొరపాటు | ✓ | ✓ | × | × |

**నాలుగు పాదాల సాధర్మ్యము – వైధర్మ్యము**

**పట్టిక 6 – కారికలు 11-16**

| కారిక | సాంకేతిక పదాలు | విశ్వ | తైజస | ప్రాజ్ఞ | తురీయం | తురీయ విశ్లేషణ |
|---|---|---|---|---|---|---|
| 11 | కార్యం, కారణం (పొరపాటు, అజ్ఞానం) | కార్యం, కారణం | కార్యం, కారణం | కారణం | ద్వౌ తౌ న సిధ్యత | రెండూ లేవు |
| 12 | అజ్ఞానం, పొరపాటు | – | – | న కించన సంవేత్తి పొరపాటులేని అజ్ఞానం | త త్ తుర్యం సర్వ దృక్ | పొరపాటును అజ్ఞానాన్ని చూస్తుంది |
| 13 | బీజం, నిద్రా (అజ్ఞానం) ద్వైతం (పొరపాటు) | – | – | బీజం, నిద్రా ద్వైతస్య అగ్రహణమ్ | సా చ న విద్యతే – ద్వైతస్య అగ్రహణమ్ | అజ్ఞానం లేదు – భేదం పొరపాటు లేదు – పోలిక |
| 14 | స్వప్నం, నిద్రా (పొరపాటు, అజ్ఞానం) | స్వప్నం, నిద్రా | స్వప్నం, నిద్రా | అస్స్వప్న నిద్రయా పొరపాటులేని అజ్ఞానం | న నిద్రాం నైవ చ స్వప్నం | అజ్ఞానం లేదు, పొరపాటు లేదు |
| 15 | స్వప్నం, అన్యథా గ్రహణం (పొరపాటు) నిద్రా (అజ్ఞానం) | స్వప్నం, అన్యథా గ్రహణం నిద్రా | స్వప్నం, అన్యథా గ్రహణం నిద్రా | నిద్రా | తురీయం పదమశ్నుతే | రెండూ పోతే తురీయం పొందవచ్చు |
| 16 | అనాది మాయ (అజ్ఞానం) | జన్మ | స్వప్నం | నిద్రా | అజం, అస్వప్నం, అనిద్రం | అద్వైతం – శరీరత్రయ విలక్షణం |

17. అద్వైతజ్ఞానం పొందితే ద్వైత నివృత్తి అవుతుందా?
ద్వైతం ఉంటేనే కదా పోవటానికి!
ద్వైత నివృత్తి అవదు, ద్వైత భ్రమ నివృత్తి అవుతుంది

18. జ్ఞానం ప్రమాతృ ప్రమేయ వికల్పాన్ని పోగొడుతుందా?
వికల్పం ఉంటేనే కదా పోవటానికి.
ప్రమాతృ ప్రమేయ వికల్పం పోదు; ప్రమాతృ ప్రమేయ వికల్ప భ్రమ పోతుంది.
**ప్రమాతృ ప్రమేయ ప్రమాణ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి**
ద్వైతం లేకపోతే ద్వైతం గురించిన బోధ ఎందుకు? ఉపదేశాత్ అయం వాదః అద్వైతం అర్థమవటానికి
జ్ఞాతే ద్వైతం న విద్యతే

**పట్టిక - 7**

**మంత్రం 8 - ఓంకార ఆత్మ ఐక్య ఉపాసన**

| మంత్రం | అంశం | విషయం | 2 | 2 | 3 | 4 |
|---|---|---|---|---|---|---|
| 8 | చతుష్పాద ఓంకారం<br>చతుష్పాద ఆత్మ | ఓం<br>ఆత్మ | అ<br>విశ్వ | ఉ<br>తైజస | మ<br>ప్రాజ్ఞ | అమాత్ర<br>తురీయం |

**పట్టిక 8** **మంత్రాలు 9–12: ఓంకార ఆత్మ ఐక్య ఉపాసన – ఫలము**

| మంత్రాలు | జంట | పోలిక | వివరణ | ఉపాసన | ఫలము | వివరణ |
|---|---|---|---|---|---|---|
| 9 | అ – విశ్వ / విరాట్ | ఆప్తి<br><br>ఆది | అ – సర్వాధారం<br>విరాట్ – సర్వవ్యాపకం<br>అ – మొదటి అక్షరం<br>విరాట్ – మొదట పుట్టాడు | అకార విరాట్ ఐక్య ఉపాసన | ఆప్నోతి సర్వాన్ కామాన్<br><br>ఆదిశ్చ భవతి | కోరికలన్నీ తీరుతాయి<br><br>ప్రథమశ్రేణిలో ఉంటాడు |
| 10 | ఉ – తైజస / హిరణ్యగర్భ | ఉత్కర్షః<br><br>ఉభయత్వమ్ | ఉ – అ కన్నా ఎక్కువ<br>హిరణ్యగర్భ – విరాట్ కన్నా ఎక్కువ<br>ఉ – అ, మల మధ్యలో ఉంది<br>హిరణ్యగర్భ – విరాట్, ఈశ్వరుల మధ్యలో ఉన్నాడు | ఉకార హిరణ్యగర్భ ఐక్య ఉపాసన | ఉత్కర్షతి<br><br>సమానశ్చ భవతి | అందరికన్నా శ్రేష్ఠుడు అవుతాడు<br><br>అందరికీ ఆత్మీయుడు అవుతాడు |
| 11 | మ – ప్రాజ్ఞ / ఈశ్వర | అపీతిః (లయ)<br><br>మితిః (కొలమానం) | మ – శబ్దప్రపంచ లయస్థానం<br>ఈశ్వర – అర్థప్రపంచ లయస్థానం<br>మ – పదాలు అవ్యక్తం, వ్యక్తం అవుతాయి<br>ఈశ్వర – జగత్తు అవ్యక్తం, వ్యక్తం అవుతుంది | మకార ఈశ్వర ఐక్య ఉపాసన | అపీతిశ్చ భవతి<br><br>మినోతి ఇదగ్ం సర్వమ్ | ఈశ్వరునిలో లయం అవుతాడు<br><br>అందరినీ బాగా అంచనా వేయగలడు |
| 12 | అమాత్ర – తురీయం | అవ్యవహార్యః<br><br>ప్రపంచోపశమః<br><br>శివః<br><br>అద్వైతః | అమాత్ర – నిశ్శబ్దం<br>తురీయం – అసంగం<br>అమాత్ర – పదప్రపంచ లయం<br>తురీయం – పదార్థ ప్రపంచ లయం<br>అమాత్ర – ఆనంద స్వరూపం<br>తురీయం – ఆనంద స్వరూపం<br>అమాత్ర – శబ్దప్రపంచ సాక్షి<br>తురీయం – అర్థప్రపంచ సాక్షి | అమాత్ర తురీయ ఐక్యజ్ఞానం | సంవిశతి ఆత్మ ఆత్మానామ్ | తురీయంలో ఐక్యం |

**పట్టిక 9**

**మంత్రాలు 9–12, కారికలు19–24 : ఓంకార ఆత్మ ఐక్య ఉపాసన – ఫలము**

| మంత్రం | జంట | పోలిక | కారిక | పోలిక | మంత్రంలో ఫలము | కారిక | కారికల్లో ఫలము |
|---|---|---|---|---|---|---|---|
| 9 | అ – విశ్వ/విరాట్ | ఆప్తి<br>ఆది | 19 | ఆప్తి<br>ఆది | ఆప్నోతి సర్వాన్ కామాన్<br>ఆదిశ్చ భవతి | 23 | నయతే విశ్వమ్ –<br>విరాట్‌తో ఐక్యం |
| 10 | ఉ – తైజస/హిరణ్యగర్భ | ఉత్కర్షః<br>ఉభయత్వమ్ | 20 | ఉత్కర్షః<br>ఉభయత్వమ్ | ఉత్కర్షతి<br>సమానశ్చ భవతి | 23 | తైజసమ్ –<br>హిరణ్యగర్భతో ఐక్యం |
| 11 | మ – ప్రాజ్ఞ/ఈశ్వర | అపీతిః<br>మితిః | 21 | లయ మానం<br>(కొలమానం) | అపీతిశ్చ భవతి<br>మినోతి ఇదగ్ం సర్వమ్ | 23<br>23 | ప్రాజ్ఞమ్ – ఈశ్వరునితో ఐక్యం<br>గతిః న విద్యతే –<br>ప్రయాణం లేదు |
| – | – | – | 22 | – | – | | వంద్యః – పూజ్యనీయుడు<br>మహామునిః – గొప్ప ముని |
| 12 | అమాత్ర – తురీయం | అవ్యవహార్యః<br>ప్రపంచోపశమమ్ | 29 | అనంతమాత్రశ్చ<br>ద్వైతస్యోపశమః | సంవిశతి ఆత్మ<br>ఆత్మానమ్ | 24 | న కించదపి చింతయేత్<br>స్వస్వరూపంలో నిలుస్తాడు |

**25–29 కారికలు, నిదిధ్యాసనం – ఫలం**

| | | |
|---|---|---|
| 25 ప్రణవం = | నిర్గుణబ్రహ్మ | – భయం ఉండదు |
| 26 ప్రణవం = | సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ<br>కార్యకారణ విలక్షణం<br>సర్వవ్యాపకం, నిర్వికారం | |
| 27 ప్రణవం = | దేశకాలాతీతం | – వెంటనే తురీయంలో ఐక్యం అవుతాడు |
| 28 ప్రణవం = | హృదయంలో ఉన్న ఈశ్వరుడు | – ముక్తి పొందుతాడు |
| 29 ప్రణవం = | అనంతం, ప్రపంచోపశమం<br>శివం | – జ్ఞానం పొందిన వ్యక్తే<br>ముని అవుతాడు |